
# ఫ్రెడ్రిక్ నీషే

# సూపర్ మాన్

- The Man who needs to kill the God



Ramana Gandi
Reddy Amarnath

# సూపర్ మాన్

*The Man who needs to kill the GOD*

(Guide to understand
'**THUS SPOKE ZARATHUSTRA**')

**RAMANA GANDI**
**REDDY AMARNATH**

సూపర్ మాన్ (Super man)
రమణ గండి (Ramana Gandi)
రెడ్డి అమర్‌నాథ్ (Reddy Amarnath)

*First Edition:* March, 2020

© Author

*For Copies:*
Ph: 95812 38935,
90005 22882,
63044 23040

*Copies:* 1000

*Book Price :* Rs. 325.00

*Type Setting:*
**K. Ravi Prabha**

*Printed at:*
**Himalaya Printers,**
RTC X Roads, Hyderabad.
Ph: 040-6555 2357

Special Thanks to

**Charan Gandi**

**N. Aditya**

**B. Bhavani**



Dedicated to

# Ramgopal Varma

Cover Page Designer:

**Hema Cnu**

7036256703

# ఇందులో...

❖ లేని మాట.. ఉన్న మాట.. 9
❖ జరతూస్త్ర పరిచయం 13
❖ జరతూస్త్ర ప్రయాణం 15

**మొదటి భాగం**

❖ వ్యక్తిత్వం యొక్క మూడు రూపాంతర దశలు 39
❖ స్వర్గ నరకాలు 43
❖ దేహాన్ని త్యజించమని చెప్పేవారు 44
❖ నీ సొంతధర్మం 48
❖ అసూయ 49
❖ యుద్ధవీరులారా! 51
❖ రాజ్యం 55
❖ షో మాన్ 58
❖ స్నేహం 60
❖ వెయ్యిన్నొక్క లక్ష్యాలు 65
❖ పొరుగువారిపట్ల ప్రేమ 69
❖ సృజనాత్మకమైన వ్యక్తి యొక్క మార్గం 73
❖ కొంటె నిజం 78
❖ న్యాయం 81
❖ సరైన సమయంలో మరణించండి 87
❖ వీడ్కోలు 91

**రెండవ భాగం**


- రాక్షస ప్రతిబింబం 95
- సృష్టికర్తల లక్షణం 96
- జాలి 99
- మతాచార్యులు 100
- సామాన్య జనం 104
- తత్వవేత్తలు 105
- ఇవ్వడంలో ఉన్న వెలితి.. తీసుకోవడంలో ఉన్న ఆనందం 109
- జీవితం.. జరతూస్త్ర.. జ్ఞానం 110
- సమాధి కాబడిన కలలు 112
- నిన్ను నువ్వు అధిగమించు 112
- ఆధునిక ఆలోచనాపరులు 117
- పండితులు 118
- కవులు 121
- భవిష్యవాణి 124
- విముక్తి 127
- ముందు జాగ్రత్తలు 129
- నా ప్రేయసి 135


**మూడవ భాగం**


- అన్వేషకుడు 143
- పొదుపు కథ 147
- అప్రమేయమైన ఆనందం 152
- సూర్యోదయానికి ముందు 157
- చిన్నదిగా చేసే ధర్మం 160
- జరతూస్త్ర యొక్క కోతి 165

- ❖ మతప్రబోధకులు 166
- ❖ స్వగృహానికి రాక 171
- ❖ అర్థం చేసుకోవలసిన మూడు గుణాలు 175
- ❖ ఆత్మ యొక్క గురుత్వాకర్షణ శక్తి 178
- ❖ పాత విలువలు.. కొత్త విలువలు 185
- ❖ స్వస్థత పొందడం 197
- ❖ తనకు తాను ఇచ్చుకున్న బహుమతులు 201
- ❖ జీవితంతో మచ్చిక 202
- ❖ ఏడు ముద్రలు 204

- ❖ ఫ్రెడ్రిక్ నీషే పరిచయం 209
- ❖ ముఖ్య పదబంధాలు 214
- ❖ అయాన్ రాండ్ యొక్క ఫౌంటైన్ హెడ్‌పై నీషే ప్రభావం 220
- ❖ హిట్లర్‌పై నీషే ప్రభావం 223
- ❖ Quotations 226

# లేనిమాట.. ఉన్నమాట...

ప్రతి పుస్తకానికి ముందుమాట ఉంటుంది. ఈ పేరు చూసి చూసి విసుగెత్తి దీనికి ముందుమాటని 'ఉన్నమాట.. లేనిమాట'గా రాయాలని నిర్ణయించుకున్నాను. ఎందుకంటే ఏ పుస్తకానికి చెందిన ముందుమాటలో అయినా ఉండేవి అసలు ఆ పుస్తకంలో ఏముంది అనే ఉన్నమాట, ఆ పుస్తక ప్రాధాన్యతను వివరిస్తూ, ఆ పుస్తకాన్ని ఎందుకు చదవాలో, ఎలా చదవాలో వివరించే లేనిమాట.

**ముందుగా లేనిమాట..**

Western philosophyలో ఆధునిక పాఠకులకు సైతం చదవడానికి, అర్థం చేసుకోవడానికి చాలా కష్టమైన రచన, ఈజీగా అపార్థం చేసుకోవడానికి ఎక్కువ ఆస్కారం ఉన్న రచన ఏదైనా ఉందంటే అది 'Thus spoke Zarathustra'నే అని చెప్పడంలో ఎటువంటి సందేహం లేదు. దానికి కారణాలు చాలానే ఉన్నాయి. ఇది సంక్లిష్టమైన కవితా రూపంలో నిగూఢమైన వ్యంగ్యాలతో నిండి ఉన్న ఒక తాత్వికగ్రంథం. నీషే తాను చెప్పాలనుకున్న ఫిలాసఫీని సులభంగా చెప్పకుండా కవితాత్మకంగా, ఎటువంటి హేతుబద్ధత లేకుండా, విప్పలేని కఠినాత్మక చిక్కుప్రశ్నల రూపంలో, పెక్కు ఉపమానాలతో, అంతర్లీనంగా అధ్యాయాలన్నీ కలిపి ఒక కథ రూపంలో ఉండేలా జరతూస్త్ర అనే ఒక ప్రవక్త పాత్ర ద్వారా చెప్పించాడు. కథ రూపంలో సాగే ఈ కవితలో సంఘటనలు కూడా ఎక్కడ ఎలా మొదలయ్యి ఎందుకు ముగిసిందనే విషయాలు కూడా క్లిష్టంగానే ఉంటాయి. ఒక విధంగా ఇది నీషే తనకోసం తాను రాసుకున్న తాత్వికగ్రంథం. వందలాది కవుల్ని, తత్వవేత్తలని, చారిత్రక వ్యక్తులని, సంఘటనలని, ప్రదేశాలని నీషే ఈ పుస్తకంలో తన సంక్లిష్టమైన కవితారూపాలతో విమర్శించాడు. కానీ ఆ కవులెవరు? ఆ తత్వవేత్తలు ఎవరు? ఆ చారిత్రక వ్యక్తులు ఎవరు అనేది అర్థం చేసుకోవడం కూడా కష్టతరమే. ఒక్క మాటలో చెప్పాలంటే దీనిని ఏ జానర్ కిందా చేర్చలేం. ఇది ఫిక్షన్ కాదు. అలా అని నాన్ ఫిక్షన్ కాదు. దీన్ని ఎలా చదవాలో ఎటువంటి నియమాలు కూడా లేవు.

కొంచెం ప్రయత్నిస్తే నీషే ఫిలాసఫీని అర్థం చేసుకోవచ్చు. కానీ నీషే 'Thus Spoke Zarathustra'లో వాడిన రూపకాలను, నిరంతరం అతను తన రచనా శైలి మీద చేసిన ప్రయోగాలను అర్థం చేసుకోవడం చాలా కష్టతరం. ఇంగ్లీష్‌లో బైబిల్ రచనాశైలి తెలిసినవారికి నీషే Zarathustra శైలి కొంతవరకు అర్థం కావొచ్చు. జరతూస్త్ర యొక్క బోధనలు కొంచెం బైబిల్లోని సువార్తలను గుర్తుచేసే శైలిలో ఉంటాయి. ఈ పుస్తకం 'సూపర్ మాన్'కి సంబంధించిన తన బోధనలను మానవాళికి బోధించడానికి వచ్చిన జరతూస్త్ర ప్రయాణానికి సంబంధించినది.

నీషే 'Thus Spoke Zarathustra'ని తన ముఖ్యమైన రచనలలో ఒకటిగా భావించాడు. ప్రస్తుతకాలంలో అత్యంత ప్రజాదరణ పొందిన రచనల్లో ఇది కూడా ఒకటి. ఇది మొదటిసారి ప్రచురించబడినప్పుడు చాలా తక్కువ ప్రశంసలు అందుకున్నప్పటికీ, నీషే మరణం తరువాత ఇది అత్యంత ప్రజాదరణ పొంది, ఆధునికకాలంలో అత్యధికంగా అమ్ముడైన రచనగా కొనసాగుతోంది.

'A Book for None and All' అనేది ఈ రచన యొక్క క్యాప్షన్. అంటే ఈ రచన ఎవ్వరికోసం కాదు మరియు అందరిదీ అని అర్థం.

నీషే తన జీవితాన్ని చాలావరకు ఒంటరిగానే జీవించాడు. అతని సమకాలీనులలో అతన్ని మేధోపరంగా అర్థం చేసుకున్నవారెవరూ లేరు. తన రచనలు తప్పుగా అర్థం చేసుకోబడతాయని, అవి మూర్ఖుల చేతిలో పడతాయని ముందుగానే ఊహించాడు నీషే. అతని రచనలు తమ శక్తి సామర్థ్యాలను గుర్తించకుండా, జీవితంలో ఎలాంటి అలజడులు లేకుండా మనుగడ సాగిస్తున్న సామాన్యులను తీవ్రంగా ఖండించే విధంగా ఉంటాయి. అందుకే ఈ కోణంలో ఈ రచన ఎవరికోసం కాదని అనుకోవచ్చు. తన జరతూస్త్ర మానవాళి తమని తాము అధిగమించుకుంటూ, పరిణామక్రమంలో ఇక్కడే ఆగిపోకుండా చేరుకోవాల్సిన అత్యున్నతస్థాయి అయిన సూపర్ మాన్‌కి సంబంధించిన బోధనలు కాబట్టి ఈ రచన అందరి కోసం అయి ఉండొచ్చు.

అందుకే ఇంత చదవడానికి, అర్థం చేసుకోవడానికి అంత కష్టమైన ఈ రచనను అర్థం చేసుకున్న వారికంటే అపార్థం చేసుకున్నవారే ఎక్కువ. ముఖ్యంగా నాజీలు. నాజీల చేత అత్యంత వక్రీకరించబడ్డ రచనగా ఇది ప్రసిద్ధికెక్కింది. నాజీల మీద కూడా దీని ప్రభావం ఎంతలా ఉందంటే.. రెండవ ప్రపంచ యుద్ధంలో

'Thus spoke Zarathustra'ని లక్ష కాపీలను ముద్రించి, సైన్యానికి పంపిణీ చెయ్యవలసిందని హిట్లర్ ఆదేశించే అంతగా.

జాక్వెస్ మారిటైన్ అనే ఫ్రెంచ్ కాథలిక్ ఫిలాసఫర్ 'Thus Spoke Zarathustra' గురించి మాట్లాడుతూ 'ఒకవేళ దుర్వినియోగం ద్వారా రచనలు జడ్జ్ చేయబడితే నాకు తెలిసి బైబిల్ కంటే ఏదీ ఎక్కువ దుర్వినియోగం చేయబడ లేదు' అన్నాడు.

**ఉన్న మాట:**

'Thus Spoke Zarathustra' గురించి పక్కన పెడితే అసలు ఈ సూపర్ మాన్‌లో ఉన్నదేంటో మాట్లాడుకుందాం.

ఈ సూపర్ మాన్ Concept యొక్క మూలాలు ఇప్పటికే చాలా పుస్తకాల్లో వాడడం కూడా జరిగింది.

నిన్ను నువ్వు అధిగమించి పోవాలి అని చెప్పే జరతూస్త్ర ముందుగా తనని తాను ఎలా అధిగమించి సూపర్ మాన్ అయ్యాడు అనేదే ఈ పుస్తకం యొక్క ఆత్మ. అందుకే 'Thus Spoke Zarathustra' నుండి మొదటి మూడు భాగాలని తీసుకోవడం జరిగింది.

నీషే 'Thus Spoke Zarathustra'లో ఏ రూపకాలు ఎందుకు వాడాడు అని చెప్పడం కంటే అసలు ఆ రచనలలో ఏముందని తెలియజేసి 'Thus Spoke Zarathustra'ని చదవడానికి ఒక నిచ్చెనగా మాత్రమే భావించగలరనే ఉద్దేశంతో, ఎక్కువమందికి తత్వశాస్త్రంపై మరింత అభిరుచి కలగాలని రమణ, అమర్‌నాథ్ చేసిన చిన్న ప్రయత్నం ఇది. కేవలం పుస్తకాలకు మాత్రమే పరిమితమైన ఈ పదాలను అలాగే ఉంచడం కన్నా దాన్ని సరళీకరించి సులభతరమైన భాషలో చెప్పడం కోసం రచయితలు కొంచెం ఎక్కువగా స్వేచ్ఛ తీసుకోవడం జరిగింది. ఈ పుస్తకం మూలానికి దూరంగా ఉందని ఎవరికైనా అనిపిస్తే దానికి కారణం ఇదే. కానీ ఈ పుస్తకం యొక్క ఆత్మ మాత్రం చెడిపోకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. తత్వశాస్త్రాన్ని తెలుగులోకి అనువదించడమే కష్టమైన తరుణంలో నీషే తత్వాన్ని సాధారణ భాషలో అనువదించడం అనేది ఇంకా పెద్ద ఛాలెంజ్. ఈ ప్రయత్నంలో రచయితలు సఫలమయ్యారనే అనుకుంటున్నాను. తెలుగులో మొదటిసారిగా ఇంత

విపులంగా, సులభంగా సాధారణ భాషలో నీషే తత్వాన్ని పరిచయం చేసిన పుస్తకం ఇదే కానుందని బలంగా చెప్పగలను.

సమగ్రంగా చెప్పాలంటే సూపర్ మాన్ తనపై తాను పూర్తి శక్తిని సాధించిన మహోన్నతుడు. సూపర్ మాన్ అంటే తన సొంత సంకల్పం యొక్క సృష్టి. అతని వ్యక్తిత్వం, అతని విలువలన్నీ అతని అధీనంలోనే ఉంటాయి. అవి అతను చెప్పినట్టు, కోరుకున్నట్లు నడుచుకుంటాయి. సూపర్ మాన్ అనేక సంకల్పాల యొక్క సమాహారం. అందుకే అతను పూర్తి స్వతంత్రుడు. ఉనికిలోనే అత్యంత శక్తివంతమైనవాడు. అన్ని శృంఖలాల నుండి విముక్తి చెయ్యడానికి సూపర్ మాన్ మీకోసం తెలుగులో వచ్చాడు. సిద్ధంగా ఉండండి.

**- Narendra Kumar** (Author of అహం)

# జరతూస్త్ర పరిచయం

**జ**రతూస్త్ర ప్రాచీన పర్షియన్ మతమైన జొరాస్ట్రినియన్ అనే మతానికి సంబంధించిన ప్రవక్త మరియు వ్యవస్థాపకుడు. అతను క్రీస్తుపూర్వం 628-551 కాలానికి చెందినవాడు. జంతుబలిని, బహుదేవత ఆరాధనని వ్యతిరేకించాడు. 30 ఏళ్ళ వయసులో మానవాళికి జ్ఞానబోధ చేద్దామని బయలుదేరిన అతనికి అక్కడి స్థానికుల నుండి విమర్శలే ఎదురయ్యాయి. తనకెవ్వరూ అనుచరులు కానీ, శిష్యులు కానీ లేరు. స్థానిక ప్రవక్తగా 12 సంవత్సరాల వైఫల్యాల తరువాత పక్క రాజ్యానికి వెళ్లి తన బోధనలు బోధించడం మొదలుపెట్టాడు. అక్కడి రాజు అతని బోధనలకు ఆకర్షితుడు అవ్వడంతో అతనికి తన ఆస్థానంలో చోటిచ్చాడు.

క్రీస్తుపూర్వం 600 నుండి 650 వరకు పర్షియా (ఆధునిక ఇరాన్) యొక్క అధికారిక మతం ఇదే. ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా అత్యంత శక్తివంతమైన మతాల్లో ఇదొకటి. కానీ 2006 నాటికి ప్రపంచం మొత్తం మీద ఈ మతస్థుల సంఖ్య రెండు లక్షలమంది కన్నా తక్కువే.

ఈ మతస్థులు 'అహురా మాజ్డే'ని ప్రపంచాన్ని సృష్టించిన దేవుడిగా కొలుస్తారు. జొరాస్ట్రినియిజంది ద్వంద్వవాదం, అంటే రెండు వ్యతిరేకశక్తులు ఉన్నాయని నమ్ముతుంది. అహురా మాజ్డేకు వ్యతిరేకశక్తిని 'అంగ్రా మెయిన్యు' అని పిలుస్తారు. ఇది చెడుకి ప్రతీక. వారి పవిత్ర ప్రార్థనాస్థలాన్ని అగ్నిఆలయంగా (అజియరీ) పిలుస్తారు. అక్కడ అగ్నిని పవిత్రంగా కొలుస్తారు. అది ఎప్పుడూ చల్లారకుండా ప్రజ్వలిస్తూనే ఉంటుంది. 'అగ్ని' అహురా మాజ్డే యొక్క దైవిక కాంతికి చిహ్నం. జొరాస్ట్రినియిజం యొక్క పవిత్ర గ్రంథాన్ని 'అవెస్టా' అంటారు. ఇది రెండు భాగాలుగా ఉంటుంది. మొదటిది 'గాథలు' (జోరాస్టర్ ప్రవక్త రాసిన 17 శ్లోకాలు). రెండవ విభాగంలో పురాణగాథలు మరియు ఆచారాలకు సంబంధించిన సమాచారం ఉంటుంది.

జరతూస్త్ర మొట్టమొదటిసారిగా ఈ మొత్తం విశ్వాన్ని మంచి, చెడు అనే దేవుళ్ళ మధ్య సంఘర్షణగా నిర్వచించాడు. తీర్పు అంతిమ రోజున మంచివారికి శాశ్వతమైన జీవితం బహుమతిగా లభిస్తుందని జరతూస్త్ర బోధించాడు.

నీషే Thus Spoke Zarathustraకి సంబంధించిన ఎక్కువ అంశాలు జొరాస్ట్రినియిజం నుండి తీసుకోబడ్డవే. ముఖ్యంగా తీర్పు యొక్క చివరి రోజు... యుగాంతం చివరలో అందరు లోతైన అగాధం గుండా, ఇరుకైన వంతెన మీదుగా వెళ్ళాలని.. చెడుని అనుసరించినవారు అగాధంలో పడిపోతారని.. మంచిని అనుసరించినవారు దానిని దాటి నిత్యజీవము పొందుతారనే అంశాలు నీషే Thus Spoke Zarathustraలో తాను చెప్పాలనుకున్న 'సూపర్ మాన్' గురించి తనకి అనుకూలంగా మార్చుకున్నాడు.

# జరతూస్త్ర ప్రయాణం

**జ**రతూస్త్ర తన ముప్ఫై సంవత్సరాల వయస్సులో ఇంటిని వదిలి ఒంటరిగా అడవుల్లోకి వెళ్ళాడు. అతనక్కడే పదేళ్లపాటు ఏకాంతంగా, శాంతియుతంగా, అమితానందంతో జీవించాడు. కానీ ఒక రోజు ఉదయాన్నే ప్రకాశిస్తున్న సూర్యుని వైపు చూస్తుండగా జరతూస్త్రకి ఒక ఆలోచన తట్టింది.

'ఓ సూర్యుడా...!

నువ్వు ప్రకాశిస్తున్నందునే పక్షులు సంతోషంగా ఉన్నాయి. పువ్వులు పుష్పిస్తున్నాయి. పరిమళిస్తున్నాయి. నీవల్లనే సమస్త మానవాళి జీవశక్తితో నిండి ఉంది. మరల రేపు ఉదయిస్తావనే నమ్మకంతోనే సంతోషంగా, ప్రశాంతంగా జీవరాశి నిద్రపోతుంది. నువ్వు ఎవరి కోసం అయితే ప్రకాశిస్తున్నావో వారే లేకపోతే నీకు ఆనందం అనేది ఉంటుందా? పదేళ్ళుగా నువ్వు ఈ పర్వతం పైకి ఎగబాకి అలసిపోతూ కాంతిని వెదజల్లేది నాకోసం అయితే కాదు.

అవును... ఇది నిజం.

నువ్వు వెదజల్లుతున్న ఈ కాంతి, ఈ జీవశక్తి నీలో నిండుగా ఉంది. నీలో నిండుగా ఉన్న కాంతిని, జీవశక్తిని బరువుగా భావించి దానిని మానవాళికి పంచుకోవాలని కోరుకున్నావు. ఆ మితిమీరి పొంగిపొర్లుతున్న కాంతిని, జీవశక్తిని మేము తీసుకున్నాము. అది స్వీకరించినందుకు గాను నిన్ను మేము ఆశీర్వదించాము.

నీలాగే నేను కూడా జ్ఞానంతో బరువెక్కి ఉన్నాను, ఎంతలా అంటే చాలా తేనెను సేకరించిన తేనెటీగలాగా.

నిజమైన జ్ఞాని ఎప్పుడూ కోపంగా ఉండడు. అతను ఉల్లాసభరితంగా ఉంటాడు. ఎందుకంటే ఉనికి మొత్తం ఉల్లాసభరితమైనదని అతను అర్థం చేసుకోగలడు. నిజమైన జ్ఞాని కొంత మూర్ఖత్వంతో కూడా కనిపిస్తాడు. కానీ సాధారణ మానవాళికి జ్ఞాని అంటే ఎప్పుడూ కోపంగా ఉంటూ ముఖం మీద

చిరునవ్వు ఛాయలు లేకుండా, నృత్యం అంటే ఏంటో తెలియకుండా ఉంటాడనే అపోహ ఉంది. మనుష్యులలో జ్ఞానులు మహాజ్ఞానులు అయ్యేంతవరకు మరియు సాధారణ మనిషిలో ఉండే మూర్ఖత్వాన్ని కూడా ఈ జ్ఞానులు అంగీకరించేంత వరకు నేను నా జ్ఞానాన్ని పంచుతాను. జ్ఞానులంతా మహాజ్ఞానులు అయినప్పుడు మూర్ఖత్వం కూడా ఉల్లాసభరితంగా మారుతుంది.

సూర్యాస్తమయం అప్పుడు వెనక్కి వెళ్లి మిగతా ప్రాంతాలకు కాంతిని ఎలా ఐతే వెదజల్లుతావో నీవలె నేను కూడా కిందకు వెళ్లి నా జ్ఞానాన్ని పంచాలను కుంటున్నాను. కాబట్టి ఎటువంటి అసూయ లేకుండా మంచి మనస్సుతో నాలో పొంగి ప్రవహిస్తున్న నా ఈ జ్ఞానప్రవాహాన్ని ఆశీర్వదించు. నా నుండి పొర్లే జ్ఞానం చాలా స్వచ్ఛమైనది మరియు బంగారపు వర్ణంతో ధగ ధగా మెరిసే గుణముతో ప్రతి చోటుకి ప్రవహించాలని కోరుకునే గుణం కలది. ఈ జరతూస్త్ర మరల మనుష్యుల మధ్యలోకి వెళ్లాలని కోరుకుంటున్నాడు' అని చెప్పి జరతూస్త్ర కిందకు నడిచాడు.

(కిందకు ప్రయాణించడాన్ని మానవాళి ఖండిస్తుంది. పైకి వెళ్తున్నవారిని గొప్ప సాధువుగా భావిస్తుంది. కానీ తిరిగి క్రిందికి వస్తున్నప్పుడు ప్రజలు వారు తమ స్థాయికి పడిపోయారని అనుకుంటారు. అంతిమ ఎత్తులను తాకిన తరువాత, మరల కిందకి రావడానికి ఖచ్చితంగా ఎక్కువ ధైర్యం అవసరం. జరతూస్త్ర అలా కిందకి రావడం అతని ధైర్యాన్ని తెలియజేస్తుంది. ప్రజలు అతని గురించి ఏమైనా అనుకుంటారనిగానీ, శిక్షిస్తారనిగానీ, ఎత్తుల నుండి పడిపోయాడనిగానీ, అతనిక సాధువు కాదని అనుకుంటారన్న ఆందోళనగానీ జరతూస్త్రకి అస్సలు లేదు.)

❖ ❖ ❖

జరతూస్త్ర పర్వతాల నుండి కిందకి దిగి దట్టమైన అడవిగుండా వస్తున్నాడు. అతనికి ఎవ్వరూ తారసపడలేదు. కానీ ఒక ముసలి సాధువు తన పవిత్ర కుటీరాన్ని వదిలి తినడానికి దుంపల కోసం అటూ ఇటూ తిరుగుతూ వచ్చి జరతూస్త్ర ముందు నిల్చున్నాడు..

ఆ సాధువు జరతూస్త్రతో ఇలా అన్నాడు.

"ఓ బాటసారీ! నువ్వు నాకేం కొత్త కాదులే. చాలా సంవత్సరాల క్రితం నువ్వు ఈ దిశగా వెళ్లడం నేను చూసాను. ఒకప్పుడు ఈ దారిగుండా ఒక అజ్ఞానిలా

వెళ్లిన నువ్వు ఇప్పుడు పూర్తిగా పరివర్తన చెంది నూతన శక్తితో, నూతన ఆనందంతో తిరిగొచ్చావు. నీ నడక కూడా నృత్యంలా ఉంది. ఇప్పటివరకు నువ్వు ఆర్జించిన ఈ జ్ఞానాన్ని కిందకి తీసుకెళుతున్నావా..! కళ్లుండి చూడలేని గుడ్డివారికి జ్ఞానబోధ చెయ్యడానికి బయల్దేరావా..? నీకిది ప్రమాదంగా తోచడం లేదా? దానికి నువ్వు మూల్యం చెల్లించుకోక తప్పదు. వాళ్ళు నిన్ను ఏ మాత్రం క్షమించరు. దుఃఖితులు ఎప్పుడూ రాళ్లతో కొట్టి చంపబడలేదు. అలాంటివారి మధ్య ఆనందంగా ఉండటం, వారికీ జ్ఞానాన్ని పంచాలనుకోవడం చాలా ప్రమాదకరం జరతూస్త్ర! ఎందుకంటే వారందరికంటే చాలా ఎత్తులో ఉన్నావు. వారు నీకంటే కింద ఉన్నారు. వాళ్ళు దాన్ని ఏమాత్రం భరించలేరు. వాళ్ళ చేతిలో నువ్వు బూడిద అవ్వక తప్పదు. నువ్వు కావాలని మృత్యువుని కౌగిలించుకోవడానికి సిద్ధం అవుతున్నావు. నీ కళ్ళలోని స్వచ్ఛతను నేను చూడగలుగుతున్నాను. నీ మాటల్లోని తియ్యదనాన్ని వినగలుగుతున్నాను. నీ నడకలో నృత్యాన్ని చూడగలుగుతున్నాను. జరతూస్త్ర ఇప్పుడు స్వచ్ఛమైన బాలుడిలా పరివర్తన చెందాడు. నువ్విప్పుడు జ్ఞానోదయం పొందిన వ్యక్తివి. అయినా ఇప్పుడు వారి గురించి నీకెందుకు? వారికి నువ్విప్పుడు పూర్తిగా అపరిచితుడివి. నీ ఉనికి వాళ్ళ గాఢనిద్రని, అంధత్వాన్ని పోగొడుతుంది కాబట్టి వాళ్ళు నిన్ను ఏమాత్రం క్షమించరు, చంపవచ్చు కూడా. తిరిగి వెనక్కి వెళ్ళిపో."

ఆ సాధువు మాటలకి వెంటనే జరతూస్త్ర "నేను మానవాళిని ప్రేమిస్తున్నాను" అని సమాధానం ఇచ్చాడు.

"ఎందుకు..?" అని అడిగాడు సాధువు.

"ఎందుకంటే నేను జీవించడాన్ని ప్రేమిస్తున్నాను. నేను ప్రపంచాన్ని త్యజించలేదు. జీవితాన్ని జీవించలేక పారిపోయి ఇక్కడికి రాలేదు. నన్ను నేను తెలుసుకోవడానికి వచ్చాను.. జీవించడాన్ని తెలుసుకున్నాను.. ఇప్పుడు, ఇక్కడే ఈ అడవుల్లో ఉండాల్సిన అవసరం లేదు నాకు. ప్రస్తుతం నేను జ్ఞానంతో బరువెక్కి ఉన్నాను. దాన్ని సమస్త మానవాళితో పంచుకోవాలనుకుంటున్నాను" అన్నాడు జరతూస్త్ర.

దానికి సాధువు "నేను కూడా పర్వతాలలోకి, అడవిలోకి వెళ్లినవాడినే. ఒకప్పుడు నేను కూడా మానవాళిని నీ కంటే ఎక్కువగా ప్రేమించినవాడినే. కానీ

ప్రస్తుతం మనిషి నాకు చాలా అసంపూర్ణమైన విషయం. మానవులపట్ల నేను పెంచుకున్న ప్రేమ కష్టాలను తప్ప ఇంకేం తెచ్చిపెట్టలేదు. అందుకే ఇప్పుడు నేను దేవుణ్ణి ప్రేమిస్తున్నాను" అన్నాడు.

(గమనిస్తే అన్ని మతాల యొక్క వైఖరికి సంబంధించిన మూలార్థం సాధువు యొక్క మాటల్లో కనపడుతుంది. మీరు నిజంగా మానవాళిని ప్రేమిస్తే దేవుణ్ణి ప్రేమించలేరు. పాత నిబంధనలో దేవుడు ఇలా అంటాడు:

'నేను చాలా రోషముగల దేవుడ్ని.. మీరు నన్ను ప్రేమిస్తే ఇంకెవరినీ ప్రేమించలేరు.'

కానీ దాదాపు అన్ని మతాల వైఖరి ఇదే. ప్రేమిస్తే మీరు ఈ ప్రపంచాన్ని ప్రేమించాలి లేదా త్యజించాలి. మీరు మనిషిని ప్రేమిస్తే దేవుణ్ణి మరిచిపోతారు. దేవుణ్ణి ప్రేమిస్తే మనిషిని ప్రేమించడం ఉపసంహరించుకోవాలి. ఎవర్ని ప్రేమించాలి అనేది మీ ఇష్టం. ఒకవేళ మీరు దేవుడ్ని ప్రేమించవలసి వస్తే జీవితాన్ని, జీవితంలోని అన్ని ఆనందాలను ద్వేషించవలసి ఉంటుంది. కానీ మనిషిని ప్రేమించడం, అతనితో సత్సంబంధాలు కొనసాగించడం అనేది కొత్త అనుభవం. ఒక విధంగా అది నీ మంచితనానికి, నువ్వు వాళ్ళమీద చూపే ప్రేమకు అగ్నిపరీక్ష లాంటిది. అదే దేవుణ్ణి ప్రేమించడం ఐతే చాలా సులభం. మనిషిని ప్రేమించడం చాలా కష్టం. దేవుణ్ణి ప్రేమించటానికి పెద్దగా ఖర్చేమీ కాదు. కానీ మనిషిని ప్రేమించటానికి, అతనితో బంధాలు కొనసాగించడానికి లోతైన అవగాహన అవసరం. ఈ అడవుల్లోకి, పర్వతాలలోకి పారిపోయి, మానవాళి నుండి తప్పించుకొని, దేవుని గురించి ఒక ఆలోచనను సృష్టించి దేవుణ్ణి ప్రేమిస్తున్నాము అనే భావనతో జీవితంలో ఎలాంటి సవాళ్లు లేకుండా చాలా సులభతరమైన జీవితాన్ని జీవిస్తారు.. అటువంటి వారిలో ఈ సాధువు ఒకడు.)

దానికి జరతూస్త్ర "నేను మానవాళికి ప్రేమను బహుమతిగా తెచ్చాను" అని అన్నాడు.

"ఆగండి... జరతూస్త్ర.. వారికేమీ ఇవ్వకండి.. బదులుగా వారి బరువుని కొంతవరకు ఎత్తుకోండి. దానిని భరించడానికి కొంత సహాయపడండి. అది మీకూ మంచిది, వారికీ మంచిది. ఒకవేళ మీరు వారికేదైనా ఇవ్వాలనుకున్న

భిక్ష కంటే ఎక్కువ ఇవ్వకండి.. అవసరం అయితే వారిని ఆ భిక్ష కోసం వేడుకోనివ్వండి" అన్నాడు సాధువు.

"లేదు... నేను వారికి భిక్షగా ఇవ్వదలుచుకోవడం లేదు. అయినా నేనంత నిరుపేదను కాను" అన్నాడు జరతూస్త్ర.

సాధువు జరతూస్త్ర మాటలకు నవ్వుతూ...

"చూడు... నువ్వు ఇచ్చేవాటిని వారు తీసుకోకుండా ఉండరు.. వాళ్లెప్పుడూ విలువైనవాటిని తిరస్కరిస్తూనే ఉంటారు.. కానీ లోలోపల వాటిని కావాలనే కోరుకుంటుంటారు.. కానీ ఎవరైనా వాటిని ఇవ్వడానికి వచ్చినప్పుడు మాత్రం వారు వాటిని తిరస్కరిస్తారు. అలా తిరస్కరించడంలో వారికి ఆనందం ఉంటుంది. మీ దగ్గర గొప్ప నిధి ఉండవచ్చు. కానీ దానిని తీసుకునేంత పేదరికంలో మేము లేము... నువ్వు ఆ సంపద కలిగి ఉండటంలో గొప్ప కావచ్చు. కానీ దానిని వద్దని తిరస్కరించడంలో మేము నీ కంటే ధనవంతులం అనే మాటలు వారి దగ్గర నుండి నువ్వు వింటావు. అయినా వాళ్ళని బిచ్చగాళ్ళని చేసే వ్యక్తిని వారెలా క్షమించగలరు? అయినా నువ్వు బహుమతులతో వాళ్ళ దగ్గరికి వెళ్ళావంటే ఎవ్వరూ నమ్మరు. వారు నిన్నొక దొంగలాగా లెక్కకట్టొచ్చు. నువ్వసలు మనుషుల దగ్గరకు వెళ్లొద్దు. ఈ అడవిలో నాలాగా జంతువులతో జంతువులాగా, పక్షుల మధ్యలో పక్షిలాగా ఉండొచ్చు కదా..!" అన్నాడు.

"అయినా నువ్వు ఇక్కడుండి ఏం చేస్తావు?" అని అడిగాడు జరతూస్త్ర.

"పాటలు పాడతాను.. అలా పాటలు పాడేటప్పుడు నవ్వుతూ, ఏడుస్తూ దేవుణ్ణి స్తుతిస్తుంటాను. అయితే ఇంతకీ నాకోసం బహుమతిగా ఏం తెచ్చావు..?" అని అడిగాడు సాధువు.

జరతూస్త్ర ఈ మాటలు విన్నాక, "నేను మీకేమి ఇవ్వలేను. మీరిక్కడ మీకు ఉన్నదానితో చాలా ఆనందంగా ఉన్నారు.. అది కాక మీ దగ్గరనుండి ప్రస్తుతం నేనేదీ తీసుకోలేను కూడా.. ఎందుకంటే ఉన్నదానితోనే నేను చాలా బరువెక్కాను.. నన్ను త్వరగా వెళ్ళనివ్వండి" అంటూ సాధువుకి వీడ్కోలు చెప్తూ జరతూస్త్ర దూరంగా వెళ్ళిపోయాడు.

అలా వారిద్దరూ ఒకరికొకరు కనపడని దూరం వెళ్ళాక సాధువు మరియు జరతూస్త్ర కుర్రాళ్ళ వలె నవ్వుకున్నారు. జరతూస్త్ర కొంతదూరం వెళ్ళాక తన

మనస్సులో 'అసలీ ముసలి సాధువుకి 'దేవుడు మరణించాడు' అనే వార్త ఇంకా తెలియదు అనుకుంటా' అని మనస్సులో అనుకుంటూ ముందుకు సాగాడు.

❖ ❖ ❖

జరతూస్త్ర అడవిగుండా బయలుదేరి ఒక పట్టణంలోకి అడుగుపెట్టాడు.

అక్కడ సంతలో చాలామంది గుమిగూడి ఉండడం చూసాడు. ఇక్కడ మరి కొద్ది సమయంలో ఒక వ్యక్తి రెండు భవంతుల మధ్య కట్టిన తాడుమీద నడుస్తూ ఇవతలి భవంతి నుండి అవతలి భవంతివైపుకి చేరుకుంటాడనే ప్రకటన వెలువడింది. జరతూస్త్ర ఇప్పుడు జ్ఞానభారంతో బాగా నిండి వర్షించడానికి సిద్ధంగా ఉన్న నల్లని మేఘము వంటివాడు. ప్రస్తుతం ఎక్కడ వర్షించాలి? రాళ్ళురప్పలపైనా లేక చిగురించడానికి సిద్ధంగా ఉన్న విత్తనాలపైనా అనేది అతనికి అనవసరం. ఎందుకంటే వర్షించబోయే మేఘానికి, జరతూస్త్రకి వివక్షత చూపించడం తెలియదు.

జరతూస్త్ర అక్కడ గుమిగూడిన ప్రజలను ఉద్దేశించి మాట్లాడ్డం మొదలు పెట్టాడు. నేనిప్పుడు మీకు 'సూపర్ మాన్' గురించి చెప్పబోతున్నాను. 'మానవుడు' అనేవాడు అధిగమించాల్సిన అంశం. అసలు అధిగమించడానికి ఇప్పటివరకు మీరేం చేసారు? పరిణామక్రమంలో భాగంగా ప్రతి జీవి తనకు మించినది ఉత్పత్తి చేస్తూనే ఉంది. కోతి నుండి మనిషి పరిణామక్రమం చెందాడు. కానీ అకస్మాత్తుగా మనిషి వద్దకు రాగానే మొత్తం పరిణామక్రమం ఆగిపోయింది. ఇప్పుడు మనిషి కేవలం మరొక మనిషికి జన్మని ఇవ్వగలుగుతున్నాడు అంతే. మీరంతా ఇప్పుడు పరిమాణక్రమ ప్రవాహంలో వెనక్కి వెళ్ళాలి అనుకుంటున్నారా? లేక మానవుడ్ని అధిగమించి ఒక సూపర్ మాన్‌లాగా మిమ్మల్ని మీరు మలుచుకుందాం అనుకుంటున్నారా? ఒక్కసారి వెనక్కి తిరిగి చూడండి. మీ పూర్వీకుడు అయిన ఆ కోతిని చూసి నవ్వుకోవాలా? లేక సిగ్గుపడాలా? అలాగే ప్రస్తుత మనిషిని చూసి సూపర్ మాన్ కూడా అలాగే అనుకుంటాడు. మీరు పరిణామక్రమంలో మనిషి ఇక్కడ వరకు రావడానికి మార్గం వేశారు. కానీ మీ మనస్సు ఇప్పటికీ కోతి దగ్గరే ఆగిపోయింది. మీ ప్రవర్తన ఇప్పటికీ మానవుడి కంటే తక్కువగానే ఉంది. మీలో చాలా తెలివైనవారు కూడా బలహీనమైన క్షణాల్లో మూర్ఖులవలె ప్రవర్తించి ఉంటారు. ఆ మూర్ఖుడు ఎక్కడో లేడు. అతను మీలోనే ఉన్నాడు. మీ వెనుక దాక్కున్నాడు. అవసరం ఐతే అతన్ని కొద్దిగా రెచ్చగొట్టడం

ద్వారా నేనతన్ని బయటికి పిలవగలను. అతను బయటకు వచ్చి మిమ్మల్ని వశపరుచుకోగలడు. మీ పాండిత్యం పైపైనే... నిజానికి మీరు ఒక్కరే కాదు.. మీరొక గుంపు.. మీది ఒక్కటే స్వరం కాదు.. చాలా స్వరాలు.. ఒకదానికొకటి విరుద్ధం.. ఏమాత్రం సామరస్యం లేదు. నిజానికి నువ్వొక సంతవి.

సూపర్ మాన్ మాత్రమే ఈ భూమికి పరిపూర్ణత తీసుకురాగలడు. మీరు కూడా సూపర్ మాన్ కావాలని బలంగా కోరుకోండి. దానికి నాతో సహకరించండి. ఒక విధంగా ఇది మీకు మీరు సహకరించుకోవడం లాంటిది.

ఓ సోదరులారా... నా సహోదరులారా..!

నేను మిమ్మల్ని వేడుకుంటున్నాను దయచేసి ఈ భూమిపట్ల నిబద్ధతగా ఉండండి. మీరు విత్తనం అయితే, సూపర్ మాన్ భూమిని చీల్చుకుంటూ ఎదిగే మహావృక్షం.

(మనిషి చాలా చెవిటివాడు. చైతన్యం యొక్క ఉన్నతదశల నుండి మాట్లాడుతున్న వ్యక్తిని అర్థం చేసుకోవడం దాదాపు అసాధ్యం. మనుషులు వింటారు. కానీ అర్థం చేసుకోలేరు.)

మీకు అత్యాశలు చూపేవారిని నమ్మొద్దు. తెలిసో తెలియకో వారు మానవాళిని విషతుల్యం చేస్తున్నారు. మీకు ఇక్కడ లభించేవాటిని త్యజించినట్లయితే స్వర్గంలో సర్వభోగభాగ్యాలను అనుభవించగలరని, ఆకాశంలో దేవదూతలు మిమ్మల్ని స్వాగతించడానికి సిద్ధంగా ఉన్నారని చెప్పేవారి మాటలను అస్సలు నమ్మకండి. వారు మానవాళిని ఇటువంటి మాటలతో నిర్వీర్యం చేస్తున్నారు. వారు మానవాళి యొక్క ఆనందాలను, నవ్వును, నృత్యాలను నాశనం చేశారు. వారు ప్రతి ఒక్కరినీ అవిటివారిని చేశారు. మీమీద విషప్రయోగం చేసారు. వారిపట్ల జాగ్రత్త వహించండి. వారు ప్రపంచాన్ని ప్రమాదకరమైన పరిస్థితికి తీసుకువచ్చారు. వారు ప్రపంచమంతా దాదాపు ఆత్మహత్య చేసుకునే దిశకు తీసుకువచ్చారు. ఒకప్పుడు దైవదూషణ అనేది చాలా పెద్ద తప్పు.. కానీ ఇప్పుడు దేవుడు మరణించాడు. ఈ పాపులు కూడా అతనితో మరణించారు. భూమికి వ్యతిరేకంగా పాపం చేయడం ఇప్పుడు భయంకరమైన నేరం.

❖ ❖ ❖

జరతూస్త్ర ఇంకా అక్కడున్న ప్రేక్షకులతో మాట్లాడటం కొనసాగిస్తునే ఉన్నాడు.

అక్కడున్న వాళ్ళు కళ్లుండి చూడలేని అంధులు, చెవులుండి వినలేని చెవిటివారు మరియు హృదయం లేనివారు.. కానీ అతనికి వారిపట్ల ఉన్న ప్రేమ వలన వారు అతని మాటలు వినడానికి అర్హులా కాదా అనే విషయం అతనికి పట్టింపులేదు.

“నా సోదరులారా!

నిశ్చయంగా మానవుడు ఒక కలుషితమైన ప్రవాహం. కలుషితమైన ప్రవాహాలన్నింటినీ అందుకోగలిగే సముద్రంలా ఉండాలి మానవుడు. ఇదిగో నేను మీకు సూపర్ మాన్ గురించి చెప్తాను. అతనొక సముద్రం. అతని ద్వారా మీ నీచత్వం పోతుంది. మీరు అనుభవించగల గొప్ప అనుభూతులైన ఆనందం, తర్కం, ధర్మాలు… అసహ్యంగా మారిన సమయం ఇది. అవి మీకు రోత పుట్టించేలా, విసుగు చెందేలా చేశాయి. మీ అజ్ఞానంపట్ల ఏహ్యాభావం. మీ ద్వేషంపట్ల ఏహ్యా భావం. మీ అసూయపట్ల ఏహ్యాభావం. చాలా సాధారణమైన జీవితంపట్ల ఏహ్యాభావం. మీలోని అన్ని జంతుప్రవృత్తుల ఆలోచనలపట్ల ఏహ్యాభావం. సంక్షిప్తంగా మీపట్ల మీకు ఏహ్యాభావం. ఇవి మీరు ప్రస్తుతం అనుభవించగల గొప్ప అనుభవాలు. మీ నమ్మకాలు కుళ్ళిపోయాయి. మీ సిద్ధాంతాలు కుళ్ళి పోయాయి. మీ మతాలు మీకు శారీరక హింస, మానసిక హింస తప్ప మరొకటి కాదు.. మీ తత్వాలు గాలిలోని పేకమేడలు మాత్రమే. ఒకసారి తీక్షణతో మీలోకి మీరు తొంగిచూడండి. మీ ఆనందం ఎక్కడుంది? అది అనాసక్తిగా తయారయ్యింది. ఎలాంటి ప్రత్యేకత లేకుండాపోయింది. రోజూ తీర్చుకునే కాలకృత్యాలుగా సర్వ సాధారణం అయ్యింది మీ ఆనందం. దానిలో గొప్పేమీ లేదు.

ఒకసారి మీ హేతుబద్ధ ఆలోచనని చూసుకోండి.. మీరు మీ హేతుబద్ధతని ఈసడించుకోకమానరు. మీవన్నీ నిరూపించబడని గుడ్డినమ్మకాలు.. అభూత కల్పనలు.. అనుభవం లేని విశ్వాసాలు.. ఎటువంటి రుజువులు లేకుండా, ఎటువంటి వాదనలు లేకుండా మీరు మీ మతాన్ని, మీ తత్వాన్ని మీ భుజాలపై ఎత్తుకొని మోస్తున్నారు. దాన్ని మరల మీరు హేతుబద్ధత అని పిలుస్తున్నారు.

మీ సత్ప్రవర్తన మాటేంటి...?

దాదాపు అందరూ ఎవరికి వారు ధర్మాత్ములనే అనుకుంటారు. ఎందుకంటే ఇక్కడున్నవారంతా ఏదో ఒక రోజు బిచ్చగాడికి భిక్షం వేసి మేము దాతృత్వం గలవారమని డప్పు కొట్టుకున్నవారే.. కానీ అసలీ బిచ్చగాళ్ళు ఎందుకు ఉన్నారని.. ఎక్కడ నుండి వచ్చారనే దాని గురించి ఎప్పుడైనా ఆలోచించారా? మీరే వాళ్ళను బిచ్చగాళ్లను చేస్తారు. మరలా మీరే మీ దగ్గరున్న దాంట్లో కొంత విసిరేసి మేము గొప్ప ధర్మాత్ములమని చెప్పుకుంటారు.

కానీ నా ఆనందం నా నుండే ఉద్భవిస్తుంది... అది నా ఉనికిని సమర్థిస్తుంది.

బయటి నుండి వచ్చి మిమ్మల్ని సంతోషపరిచేదేదైనా మిమ్మల్ని బానిసని చేస్తుంది. మిమ్మల్ని ఆధారపడేలా చేస్తుంది. మీ స్వేచ్ఛను నాశనం చేస్తుంది.

నా తర్కబుద్ధిలో కొత్తేముందని మీరు నన్ను అడగొచ్చు...

సింహం వేటకు వెళ్లినట్లు నా తర్కబుద్ధి జ్ఞానం కోసం పరిగెడుతుంది.. నా తర్కం 'సత్య దాహం' కోసం పరితపిస్తుంది. సత్యాన్ని కనుగొనడానికి ప్రతిదాన్ని త్యాగం చేయడానికి సిద్ధంగా ఉంటుంది.

నా సత్ప్రవర్తన మాటేంటి అని మీరడగొచ్చు...

అది నన్ను పిచ్చివాడిలా తయారుచేయలేదు. 'నీతిమంతుడు సమాజంలోని అబద్ధాలతో రాజీపడలేడు. సూపర్ మాన్ లక్షణాలను కాదు, వాటి వెనకున్న కారణాలను నాశనం చేస్తాడు.'

నా కరుణ ఎంత మంచిదని మీరు నన్ను అడగొచ్చు. నా కరుణ సిలువ వేయవలసింది కాదు. మీ కరుణ, మీ జాలి కేవలం సౌకర్యవంతమైన ఆలోచన అయితే మీరు దానిపట్ల సిగ్గుపడక తప్పదు.

మీరు గర్వంగా భావించే లక్షణాలన్నీ పరిశీలిస్తే, మీ ధర్మం అబద్ధమని, మీ మతం ఒక లాంఛనప్రాయమని, మీ నైతికత ఒక సామాజిక ప్రవర్తన అని, మీ నిజాయితీ కేవలం ఒక ముఖభాగం అని మీకు తెలుసు. మీరు ఏహ్యాభావంకు గురవుతారు. అలా గురవ్వడంలో తప్పులేదు. ఎందుకంటే లోలోపల స్వర్గానికి వెళ్లాలని పరితపించేలా చేసినవారిది ఆ తప్పు. ఎందుకంటే ఆ ఏహ్యాభావం తరువాత మాత్రమే మానవుడు 'సూపర్ మాన్' వైపు వెళ్ళడానికి కొంత ప్రయత్నం చేస్తాడు. మీరు ఎవరికి వారు ఉన్నతంగా ఉండాలి.

ఎవరైనా ఈ వికారమైన మానవాళిని అధిగమించి వెళ్తే ప్రజలు అతన్ని పిచ్చివాడు అంటారు. గుంపుని అనుసరించని వారిని, గుంపుకి అతీతంగా వెళ్లేవారిని ప్రజలు పిచ్చివారు అని చెప్పి రాళ్ళతో కొట్టి చంపుతారు. నేను మీకు సూపర్ మాన్ అవ్వడం గురించి నేర్పిస్తాను.

అతను కాంతివంతుడు, అతనికి కొంచెం వెర్రి కూడా ఉంటుంది. అతను ఆనందంతో నవ్వగలడు.. నృత్యం చేయగలడు.

ఒక కుక్క కుక్కగా పుట్టి కుక్కగానే చనిపోతుంది. కానీ మనిషి ఖచ్చితంగా అలా కాకూడదు... సూపర్ మాన్ స్థితిని చేరుకోవటానికి మీలో కుళ్ళినవన్నీ కాల్చేయ్యాలి మరియు అన్ని మోసాల్ని, అన్ని పద్ధతులను, మానవుడు సృష్టించిన అన్నిటికీ అతీతంగా ఉండాలి. సూపర్ మాన్ మీలోనే ఉన్నాడు.

అతను మీలోనే పెరుగుతున్నాడు. మనిషి అనేవాడు వంతెన మాత్రమే.."

జరతూస్త్ర ఇలా మాట్లాడుతున్నప్పుడు ప్రేక్షకులలో ఒకరు "ఇప్పుడు మేము టైట్‌రోప్ వాకర్ గురించి కావాల్సినంత విన్నాము.. ఇప్పుడు అతన్ని చూద్దాం" అని అరిచాడు. ప్రజలందరూ జరతూస్త్ర వైపు చూసి నవ్వుకున్నారు. కానీ టైట్‌రోప్ వాకర్ మాత్రం ఈ మాటలు తనను ఉద్దేశించినవే అని నమ్ముతూ తన పనిని ప్రారంభించాడు.

❖ ❖ ❖

అప్పటివరకూ జరతూస్త్ర ఆ టైట్‌రోప్ వాకర్‌ని చూడలేదు. కానీ జరతూస్త్ర ప్రజల వైపు చూసాడు. ఆశ్చర్యపోయాడు. జరతూస్త్ర టైట్‌రోప్ వాకర్‌ని రూపకంలా ఉపయోగించాడు.

"మనిషి అనేవాడు మృగానికి మరియు సూపర్ మాన్‌కి మధ్య బాగా ప్రమాదకరమైన ఎత్తులో, ప్రమాదకరమైన మార్గంలో ఉన్న వంతెన లాంటివాడు." కానీ మనిషి స్థిరంగా ఉండవలసినవాడు కాదు. అతడు మార్పు. అతడు జంతువు నుండి సూపర్ మాన్ వరకూ వెళ్ళాలి. మనిషి గొప్పతనం ఏమిటంటే, అతను ఒక వంతెన లాంటివాడు. అంతేగాని అంతం కావాల్సినవాడు కాదు. మనిషిలో ప్రేమించగలిగేది ఏమిటంటే అతనిలో ఉన్న సూపర్ మాన్ మూలాలు.

వెనక్కి ఎలా వెళ్లాలో తెలియక, ఎలా జీవించాలో తెలియనివారిని

ప్రేమిస్తున్నాను, ఎందుకంటే ఏదో ఒకరోజు వారు వంతెన దాటడానికి ధైర్యాన్ని కూడగట్టుకునేవారు.

నేను గొప్ప నిరాశావాదులను ప్రేమిస్తున్నాను, ఎందుకంటే వారు మారాలని ఎదురుచూసేవారు.

ఏదో ఒక రోజు ఈ భూమి సూపర్ మాన్‌ది అవుతుందని తెలుసుకొని తనని తాను అర్పించడానికి సిద్ధంగా ఉన్న జ్ఞానులను నేను ప్రేమిస్తున్నాను.

సూపర్ మాన్ నివసించడం కోసం భూమిని సిద్ధం చేయబోయే వ్యక్తిని నేను ప్రేమిస్తున్నాను.

తన పనిని ప్రారంభించడానికి ముందు బంగారు పదాలను ప్రసారం చేసే వ్యక్తిని నేను ప్రేమిస్తున్నాను, ఎందుకంటే అతను వాగ్దానం చేసినదానికన్నా ఎక్కువ ఇవ్వగలడు. అతను సూపర్ మాన్ కోసం అస్తమించాలని కోరుకుంటాడు.

భవిష్యత్తును సమర్థిస్తూ, గత తరాలను విస్మరించే వ్యక్తిని నేను ప్రేమిస్తున్నాను. ఎందుకంటే అతనిలో ప్రవహించే గతం తాలూకా వర్తమానాన్ని నాశనం చేసుకుంటూ భవిష్యత్తు సూపర్ మాన్‌కి మార్గం ఇవ్వాలనుకుంటాడు.

మీకు ఒకటే లక్ష్యం ఉండాలి. అప్పుడే మీరు జంతువుకి, సూపర్ మాన్‌కి మధ్య ఉన్న ప్రమాదకరమైన అగాధాన్ని దాటవచ్చు. చాలా ధర్మాలు అవసరం లేదు. పరివర్తన కోసం బలంగా కోరుకోండి.. మనిషిగా ఉండకూడదనే కోరిక. మనిషిని మించిన సూపర్ మాన్ అవ్వడానికి ప్రయత్నించే వ్యక్తిని నేను ప్రేమిస్తున్నాను.

మరణానికి భయపడని వ్యక్తిని నేను ప్రేమిస్తున్నాను. ఎందుకంటే విత్తనం చనిపోతే తప్ప మొక్క పెరగదని, విత్తనం చనిపోతే తప్ప పువ్వులు పుష్పించవని అతనికి తెలుసు. అతను చనిపోవడానికి సిద్ధంగా ఉంటాడు. ఆ ధైర్యంతో అతను ఆ ప్రమాదకరమైన వంతెనని సంతోషంగా దాటగలడు.

అధిగమించాల్సిన ప్రయాణం చాలా ప్రమాదకరమైనది. మీరు కనుమరుగవుతారు. కొత్త మనిషి ఉనికిలోకి వస్తాడు. అతడే సూపర్ మాన్. కొత్తగా రావడానికి మిమ్మల్ని మీరు త్యాగం చేసుకోవలసి ఉంటుంది. ఆ త్యాగం మీకు గొప్ప ఆనందాన్ని ఇస్తుంది. ఎందుకంటే మీరు సూపర్ మాన్‌గా

ఉద్భవించడానికి గర్భంగా ఉన్నారు. సూపర్ మాన్ అనే ఉన్నతశిఖరాల నుండి తిరిగి వెనక్కి రావడానికి ఇంకా ఎక్కువ ధైర్యాన్ని సేకరించాలి. తన వెనుక స్థిరంగా దాటలేనివారికి, మారలేనివారికి ధైర్యాన్ని ఇవ్వాలి. మీరు ఆ దశ చేరుకున్న తరువాత మీరు అక్కడ ఉండడం అనేది స్వార్థం. మీరు తిరిగి వెనక్కి రావాలి. ఎందుకంటే లక్షలాదిమంది ఇక్కడ ఉన్నారు. బహుశా వారి దాహం గాఢనిద్రలో ఉండొచ్చు. బహుశా వారి ఆకలి గురించి వారికి తెలిసి ఉండకపోవచ్చు. మీరు వారిని ఉత్తేజపరచండి, సవాలు విసరండి. వారికి మార్గనిర్దేశం చెయ్యండి. మార్గాన్ని చూపండి. వంతెన దాటి వెళ్లాలనే కోరిక లేని మనిషి, మనిషి అని పిలవడానికి అర్హుడు కాదు.”

జరతూస్త్ర మాట్లాడుతూ మాట్లాడుతూ ప్రజల వైపు తిరిగి చూశాడు.

వాళ్ళంతా నిలబడి జరతూస్త్ర వైపు చూస్తూ వాళ్ళలో వాళ్ళు ముసిముసి నవ్వులు నవ్వుకుంటున్నారు. ఒక్కసారిగా జరతూస్త్ర మౌనంగా ఉండిపోయాడు. ఆ మౌనం అతని బాధను, మనిషి యొక్క నిస్సహాయతను, గుంపు యొక్క తెలివిలేని తనాన్ని సూచిస్తుంది. జరతూస్త్ర తనలో తాను మాట్లాడుకుంటున్నాడు.

‘చెవుల్తో చూసేవారు, కళ్ళతో వినేవారికి మాత్రమే నా మాటలు అర్థం అవుతాయి. నేను ఇలాగే మాట్లాడటం కొనసాగిస్తే, వారు నన్ను అస్సలు అర్థం చేసుకోలేరు. నేను ‘ఏహ్య భావం’ అనే పదాన్ని వదలక తప్పదు. ఎందుకంటే అది వారి అహాన్ని బాధిస్తుంది. ఇక్కడ ప్రతి ఒక్కరికీ నా మాటలు విని అర్థం చేసుకోవడానికి వారికి అడ్డొచ్చేది వారు గర్వంగా భావించే వారి ‘సంస్కృతి’.

పశువుల మందనుండి వారిని వేరు చేసేదానిని వారు సంస్కృతిగా భావిస్తున్నారు.

అందుకే వారు ‘ఏహ్యాభావం’ అనే పదం వినడానికి ఇష్టపడడం లేదు. కానీ సంస్కృతి మనిషి అహం యొక్క ఆవిష్కరణ మాత్రమే. వారు ఒకే భాష మాట్లాడొచ్చు, ఒకే రకమైన దుస్తులు ధరించి ఉండవచ్చు, అందులో గర్వపడటానికి ఏమీ లేదు. ప్రతి సంస్కృతికి దాని సొంత అహంకారం ఉంటుంది. సంస్కృతి అనేది ప్రజలు అభివృద్ధి చేసిన ఒక నిర్దిష్ట జీవనవిధానం తప్ప మరొకటి కాదు. ఇది ప్రతి ఒక్కరినీ ఇతరులతో సమానంగా ఉండటానికి, ఒకే నమ్మక వ్యవస్థను కలిగి ఉండటానికి, ఒకే దేవుడిని కలిగి ఉండటానికి, ఒకే ఆలయానికి వెళ్ళడానికి,

ఒకే పవిత్ర గ్రంథాన్ని కలిగి ఉండటానికి, ఒకే నైతిక నియమావళిని కలిగి ఉండటానికి మాత్రమే బలవంతం చేసే ఒక వ్యవస్థ. అలాంటి జీవనవిధానాన్ని వీళ్ళు సంస్కృతి అని పిలుస్తున్నారు. నేను వారి అహాన్ని తృప్తి పరిచేలా మాట్లాడాలి. బహుశా అప్పుడే వారు నా మాటలు వినగలుగుతారు' అనుకున్నాడు జరతూస్త్ర.

జరతూస్త్ర మరలా మాట్లాడటం మొదలుపెట్టాడు.

"నేను ఇప్పుడు మీకు 'అల్పమైన మానవుని' గురించి చెబుతాను.

అతనే అంతిమ మానవుడు (లాస్ట్ మాన్).

మనిషి తనను తాను లక్ష్యంగా చేసుకోవలసిన సమయం ఆసన్నమైంది. మీరు మనిషిని అధిగమించాలి. మనిషి తనలో అత్యున్నత ఆశ యొక్క విత్తనాన్ని నాటడానికి సమయం ఆసన్నమైంది. ప్రస్తుతం దానికి సంబంధించిన నేలసారం సమృద్ధిగానే ఉంది. కానీ ఏదో ఒక రోజు ఈ సారం బలహీనమవక తప్పదు. దాని నుండి మీరు మహావృక్షంగా ఎదగలేరు. సమయం మించిపోతుంది.

(అందరూ అత్యంత ప్రసిద్ధమైన వ్యక్తి కావాలని, అత్యంత శక్తివంతమైన వ్యక్తిగా ఉండాలని కోరుకుంటారు. జరతూస్త్ర మనిషి యొక్క అహంకారం, లక్ష్యం, ఆశ యొక్క భాషను ఉపయోగిస్తున్నాడు.)

దానికై మీ పునాదులు దృఢంగా ఉండాలి. ప్రస్తుత మీ పునాదులు చాలా బలహీనమైనవి. దానినుండి మహావృక్షంగా ఎదగడానికి ఎక్కువ కాలం పడుతుంది. సమయాన్ని వృథా చేయవద్దు. మీ లక్ష్యాన్ని ఛేదించడానికి సిద్ధం అవ్వండి. సంపూర్ణ ఆశతో మీ మొత్తం శక్తిని కేంద్రీకరించండి."

(జరతూస్త్ర తాను చెప్పాలనుకున్న దానిని పరోక్ష మార్గంలో చెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు. మానవాళిని అధిగమించండని మరలా అదే చెప్తున్నాడు. కానీ అతను తన పదాల వాడుకని మార్చాడు. మీరు అప్రమత్తంగా లేకపోతే జరతూస్త్ర పూర్తిగా భిన్నమైన విషయాలు చెబుతున్నాడని అనుకుంటారు. అతని మాటలు మాత్రమే భిన్నంగా ఉంటాయి. వాటి అర్థాలు కాదు.)

"మీలో ఎప్పుడూ అంతర్యుద్ధం జరుగుతూ ఉంటుంది. మీలో ఉన్న డ్యాన్సింగ్ స్టార్‌కి జన్మనివ్వడానికి ఆ అంతర్యుద్ధం జరగనివ్వండి. డ్యాన్సింగ్ స్టార్‌కి జన్మనివ్వడానికి మీరు ఒక గర్భం మాత్రమే.

(మీరు జరతూస్త్ర భాషను అర్థం చేసుకోలేకపోతే అతను మీ భాష మాట్లాడతాడు.)

మీలో ఉన్న డ్యాన్సింగ్ స్టార్‌కి జన్మనివ్వడానికి సమయం కేటాయించకపోతే మీలో ఉన్న నీచమైన మనిషి బయటికి వస్తాడు. అతడే లాస్ట్ మాన్.

ఇదిగో! నేను అల్టిమేట్ మాన్ గురించి చెప్తాను.

అంతిమ మానవునికి ప్రేమంటే ఏమిటో తెలియదు. అతనికి ప్రేమంటే శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవడానికి పనికొచ్చే ఒక అనుభూతి మాత్రమే.

డబ్బు అంటే ఏమిటో, పవర్ అంటే ఏంటో మాత్రమే తెలుసు... కానీ అతనికి సృజనాత్మకత అంటే ఏమిటో తెలియదు. అయినా సృజనాత్మకత గురించి ఎవరు పట్టించుకుంటారు. అది చాలా ఖరీదైనది. ఎక్కువ సమయం పడుతుంది. అతనికి టెక్నాలజీ తెలుసు, సైన్స్ తెలుసు. మారణాయుధాలు ఎలా వాడాలో తెలుసు, మొత్తం మానవాళిని ఎలా నాశనం చేయాలో అతనికి తెలుసు. విధ్వంసానికి సంబంధించినంతవరకు అతను ఎంతో శక్తివంతుడు. అతని ముందు భూమి కూడా చిన్నది అవుతుంది. అతడు అమరుడు.

పొరపాట్లు చెయ్యడం అతని దృష్టిలో మహాపాపాలు. అలా చేసినవారికి అతనిచ్చే దండన రాళ్లతో కొట్టి చంపడం. అంతిమ మానవుడు పొరపాట్లు చేయకుండా ప్రతిదీ సమర్థవంతంగా చేసే ఒక మరమనిషి.

ఆహ్లాదకరమైన కలల కోసం అంతిమ మానవుడు మాదకద్రవ్యాలను కనుగొంటాడు. ప్రశాంతంగా ఆహ్లాదకరంగా మరణించడానికి వాటినింకా ఎక్కువ మోతాదులో తీసుకుంటాడు. వినోదం కోసం వారు ఇంకా ఇంకా పని చేస్తారు. ఆ వినోదం వారిని అలసటకి గురికానివ్వకుండా ఇంకా ఎక్కువ జాగ్రత్త పడతాడు.

ఒక రకంగా అతను సమర్థవంతమైన ఒక యంత్రపు మనిషి. అతని రాజ్యంలో ఎవరూ ధనవంతులుగాగానీ, పేదలుగాగానీ ఎదగరు. అందరూ సమానమే. ఎందుకంటే అతనికి రెండూ భారమైనవే. పాలించేవారు ఉండరు, పాలింపబడేవారు ఉండరు. అంతిమ మానవునికి ప్రతిదీ భారం అవుతుంది. అతని రాజ్యంలో అందరూ సమానమే. అందరూ ఒకే విధంగా ఉండాలి. కొంచెం భిన్నంగా ఆలోచించే వ్యక్తులను, మేధావులను పిచ్చిఆసుపత్రిలోకి నెట్టివేస్తాడు. పూర్వం ప్రపంచమంతా పిచ్చిగా ఉండేది. మేము ఇప్పుడు దానిని చాలా శుద్ధి

చేశామని మురిసిపోతాడు. కానీ అతనికి అతని ఆరోగ్యంపట్ల శ్రద్ధ ఉంటుంది. అనారోగ్యం మాత్రమే అతన్ని అప్రమత్తం చేస్తుంది.

అనారోగ్యం మాత్రమే అతనికి తాను ఉన్నానని గుర్తు చేస్తుంది. మేము ఆనందాన్ని కనుగొన్నామంటూ చెప్పి అంతిమ మానవులు మురిసిపోతారు.”

(అంతిమ మానవుడు అంటే మానవజాతి మరణం. అతనికి ప్రేమ గురించి కానీ, సృజనాత్మకత గురించి కానీ తెలియదు. మొత్తం ఉనికి యొక్క లక్ష్యం అతనే అని అనుకుంటాడు. కానీ 'నేను వచ్చాను', 'నేను చేరుకున్నాను' అనే ఆలోచన ఆత్మహత్యలాంటిది. జీవితం అనేది ఒక యాత్ర. అంతిమ మనిషి ఎక్కువ కాలం బ్రతుకుతాడు. జీవించడం వేరు. బ్రతకడం వేరు. ఎందుకంటే జీవించడానికి ఇంకా చాలా ఉందనే విషయం అతను మరచిపోయాడు. అతను పెరగడం ఆగిపోయాడు. కలలు కనడం మానేసాడు, అతనిలో ఉన్న ఆశల్ని చంపేశాడు. అతనికి భవిష్యత్తు లేదు, అతను ఇప్పటికే శవం. అందుకే అతను ఎక్కువ కాలం బ్రతుకుతాడు. చనిపోయిన వ్యక్తి మళ్ళీ చనిపోలేదు. అంతిమ మానవుడు సమస్త మానవాళి యొక్క వైఫల్యం. అందుకే అతను ఎక్కువ కాలం బ్రతుకుతాడు.)

అంతిమ మానవుడి గురించి అతని ప్రసంగాన్ని చెప్తూ ఉన్నప్పుడు, వారు వినే విధానం బట్టి ప్రజలు తనను తప్పుగా అర్థం చేసుకున్నారని భావించాడు జరతూస్త్ర.

ఎందుకంటే అక్కడున్న వారందరూ “ఓ జరతూస్త్ర! మాకు అంతిమ మానవుడిని ఇవ్వు, మమ్మల్ని అంతిమ మానవుడిలా మార్చు. ఆ తరువాత మేమే నీకు సూపర్ మాన్‌ని బహుమతిగా ఇస్తాం” అంటూ కేకలు వెయ్యడం మొదలుపెట్టారు.

జరతూస్త్ర మానవాళితో అంతిమ మానవుని ఖండించడం గురించి బోధిస్తున్నాడు. ఇది మనిషికి అతను చెప్పడానికి ఎంచుకున్న తాత్వికమార్గం. మీరు ఈ విధంగా పెరుగుతున్నట్లయితే అంతిమమనిషిగా అవుతారు మరియు మనిషి అంతిమమనిషి దగ్గరే ఆగిపోవడం అనేది అత్యంత నీచం అని చెప్పడం అతని ఉద్దేశం. అంతిమ మానవుడు మీకు కొనసాగింపు. అంతిమమనిషి వైపు ప్రయాణించడం కంటే మీరు సూపర్ మాన్ దిశగా మీ మార్గాన్ని మార్చాలి.

సూపర్ మాన్ మీకు కొనసాగింపు కాదు. జరతూస్త్ర అంతిమ మనిషిని ఖండిస్తున్నాడు. మీలో ఉన్న అంతిమ మనిషిని నిరోధించడానికి ఇంకా సమయం ఉందని మీకు తెలియజేస్తున్నాడు. సూపర్ మాన్ మీకు కొనసాగింపు కాదని చెప్పడం అతని ఉద్దేశం.

కానీ ప్రజలు జరతూస్త్రని తప్పుగా అర్థం చేసుకున్నారు. “మాకు అంతిమ మనిషిని ఇవ్వండి” అని వారు అతనిని అడుగుతున్నారు. అంతిమ మనిషి అత్యధికంగా అభివృద్ధిచెందిన మనిషని వారు భావిస్తున్నారు. కానీ అతను సమస్త మానవాళికి చిట్టచివరి మనిషి. ఎందుకంటే అతను సృజనాత్మకతపై, ప్రేమపై ఆసక్తిని కోల్పోతాడు. జరతూస్త్ర ఆలోచన ప్రస్తుత మానవాళిని నేరుగా ఖండించడం కాదు. ఎందుకంటే అది వారి అహాన్ని బాధిస్తుంది. అప్పుడు వారు వినడం మానేస్తారు. వారి ప్రస్తుతాన్ని ఖండించడం ద్వారా వారు ఎక్కడికి వెళుతున్నారో స్పష్టంగా వారికి తెలియజేయడం కోసం అతను ఎంచుకున్న మార్గం ఇది. కానీ వారి అహంకారాన్ని గాయపరచడం అతని ఉద్దేశం కాదు. అతను దాని కోసం ఒక అందమైన పదాన్ని ఉపయోగించాడు అదే ‘అంతిమ మనిషి’. కానీ ప్రజలు ఇప్పటికీ అతన్ని తప్పుగా అర్థం చేసుకున్నారు. మొదటిసారి అతన్ని తప్పుగా అర్థం చేసుకున్నారు. ఎందుకంటే అతను ‘ఏహ్యాభావం’ అనే పదాన్ని ఉపయోగించాడు.

ఎందుకంటే అది వారి అహంకారాన్ని గాయపరిచేలా ఉంది.

అందుకే అతడు పరోక్షమార్గాన్ని ఎంచుకున్నాడు. కానీ అతని విధానం అలాగే ఉంది. అయినా ప్రజలు కూడా వారి అజ్ఞానంలో అదే విధంగా ఉన్నారు. ఇప్పుడు వారు అంతిమమనిషి కోసం అతనిని కేకలు వేస్తున్నారు.

❖ ❖ ❖

అతను ప్రజల గురించి తీక్షణంగా ఆలోచిస్తున్నప్పుడు ఆ సంతలో జనసంద్రం మధ్యన బాగా ఎత్తున రెండు భవంతుల మధ్య బిగుతుగా కట్టిన తాడు మీద నుండి ఒకతను నడుచుకుంటూ వెళ్తున్నాడు. మార్కెట్ అంతా గోల గోలగా, సందడిగా ఉంది. అతను ఒక భవంతి నుండి తాడు మధ్యకు చేరుకోగానే రంగు రంగు దుస్తులలో ఒక హాస్యగాడు బయటకు దూకి వేగంగా పరిగెత్తుకుంటూ

వచ్చి “ఓయ్.. కుంటివాడా.. దొంగా.. నీ అరికాళ్ళకి చక్కిలిగింత పెడతా...” అని విస్మయం కలిగించే స్వరంతో అరుస్తూ, దుర్భాషలాడుతూ అతన్ని వెంబడిస్తూ భయపెడుతున్నాడు. “ఇక్కడేం చేస్తున్నావు నువ్వు? నువ్విక ఇక్కడే ఉండాలి” అంటూ వెక్కిరిస్తున్నాడు.

అతను లక్ష్యానికి ఒక్క అడుగు వెనుక దూరంలో ఉన్నప్పుడు అందరూ చూస్తుండగానే విస్మయానికి, భయానికి గురయ్యేలా అతను అదుపు తప్పి గట్టిగా కేకలు వేస్తూ, గాల్లో తిరుగుతూ తిరుగుతూ వేగంగా, గట్టిగా నేలను తాకుతూ జరతూస్త్రకు మూడు అడుగుల దూరంలో పడ్డాడు. ఒక సముద్రపు అల వచ్చి సంతను ముంచెత్తినట్లుగా ఒక్కసారిగా సంత అంతా జనసంద్రం యొక్క పరుగులతో భయానకంగా మారింది. ప్రజలు ఎవరి దార్లో వారు వేగంగా పరుగెత్తారు. కానీ జరతూస్త్ర మాత్రం అక్కడి నుండి ఒక్క అడుగు కూడా కదల్లేదు. అతను జరతూస్త్ర పక్కనే రక్తపు మడుగులో పడిపోయి ఉన్నాడు. కానీ ఇంకా చనిపోలేదు. ఆ వ్యక్తి స్పృహలోకి వచ్చాక అతని పక్కనే మోకరిల్లి ఉన్న జరతూస్త్రని చూశాడు.

“మీరు ఇక్కడ ఏమి చేస్తున్నారు? ఎప్పటి నుండో మృత్యుదేవత నాకోసం ఎదురుచూస్తోందని నాకు తెలుసు. నేను నరకానికి వెళ్తానని కూడా తెలుసు. నన్ను నరకానికి వెళ్లకుండా ఆపగలవా?” అని దీనంగా బాధతో అడిగాడు అతను.

“గౌరవనీయమైన నా ప్రియమిత్రమా! నువ్వు మాట్లాడేవన్నీ ఈ ఉనికిలో లేవు. దెయ్యం లేదు, నరకం లేదు. నీ శరీరానికి ముందే నీ ఆత్మ చనిపోతుంది. నువ్వు భయపడాల్సిన అవసరం లేదు” అన్నాడు జరతూస్త్ర.

ఆ వ్యక్తి జరతూస్త్ర వైపు విస్మయంగా చూస్తూ “మీరు చెప్పేది సత్యమే. ఐతే నేను చనిపోయినా పెద్దగా కోల్పోయేది ఏమీ లేదు. అప్పుడు నేను గట్టిగా దెబ్బలు తిన్న ఒక మృగం కంటే ఎక్కువ కాదు” అన్నాడు.

“అదేం లేదు... మీరు మీ వృత్తిని ప్రమాదంలో పడేశారు. అందులో నీచమైనది ఏమీ లేదు. మీరేమీ బాధపడవలసిన అవసరం లేదు. నేను దగ్గరుండి మీ దహన సంస్కారాలు చేస్తాను” అన్నాడు జరతూస్త్ర.

జరతూస్త్ర అతనికి ఈ విషయం చెప్పినప్పుడు మరణిస్తున్న ఆ వ్యక్తి నుండి ఎటువంటి సమాధానం లేదు. కానీ అతను జరతూస్త్రకి కృతజ్ఞత చెప్తున్నట్లుగా తన చేతిని అతని చేతితో కదిలించి కన్ను మూసాడు.

వెలుగులో ఉన్న సంత నెమ్మది నెమ్మదిగా చీకటిలో దాక్కుంటుంది. ప్రజలు చెల్లాచెదురుగా ఉత్సుకత మరియు భయంతో దూరం దూరంగా వెళ్తున్నారు. కానీ జరతూస్త్ర చనిపోయిన వ్యక్తి దగ్గరే నేలపై కూర్చొని, ఆలోచనల్లో మునిగి సమయాన్ని మరచిపోయాడు. రాత్రి అయ్యింది. చల్లని గాలి వీస్తోంది. ఆ ప్రాంతమంతా నిర్మానుష్యంగా ఉంది.

అప్పుడు జరతూస్త్ర పైకి లేచి 'నిశ్చయంగా నేను పట్టుకున్నది శవం అయితే కాదు. ఇది ఒక అందమైన చేప. మానవ ఉనికి అసాధారణమైనది. కానీ ఇప్పటికీ అర్థం లేకుండా ఉంది. నేను మానవాళికి వారి ఉనికి యొక్క అర్థాన్ని నేర్పుతాను. అతడే సూపర్ మాన్. మనిషి యొక్క చీకటి మేఘం నుండి వచ్చే మెరుపు అతను. కానీ నేను వారికి దూరంగా ఉన్నాను. నా భావాలు వారి ఇంద్రియాలను చేరేలా లేవు. నేను మనుషులని చేరే మార్గంలో మూర్ఖుడికి (హాస్యగాడు), ఈ శవానికి మధ్య చిక్కుకున్నాను' అనుకున్నాడు.

దట్టమైన ఆ నల్లని కారుచీకటిలో ఆ శవమే జరతూస్త్రకి తోడు. ఆ శవాన్ని భుజాన వేసుకొని దానికి దహనసంస్కారాలు చెయ్యడానికి బయల్దేరాడు జరతూస్త్ర.

❖ ❖ ❖

జరతూస్త్ర వంద అడుగులు కూడా వెయ్యకముందే ఒక స్వరం జరతూస్త్ర చెవిలో గుసగుసలాడడం మొదలుపెట్టింది.

"నేను.. అదే హాస్యగాడిని.. మర్చిపోయావా జరతూస్త్ర...! ఈ పట్టణం నుండి దూరంగా పారిపో.. నిన్ను ద్వేషించేవారు ఇక్కడ చాలామంది ఉన్నారు. మంచివారిచే, న్యాయవాదులచే నువ్వు అసహ్యింపబడుతావు. అంతేగాక వాళ్ళు నిన్ను శత్రువుగా మరియు వారిని నిరాశపరిచేవాడిగా లెక్కగడుతారు. జన సమూహానికి ప్రమాదంగా భావిస్తారు. నువ్వు నవ్వడం నీ అదృష్టం.. నిజమే, నువ్వు ఒక హాస్యగాడిలా నవ్వు తెప్పించేలా మాట్లాడావు. నువ్వు చనిపోయిన ఈ కుక్క ముందు మోకరిల్లడం ఇంకా అదృష్టం. ఒక విధంగా నువ్వు దీన్నిలా తీసుకెళ్లి నీ ప్రాణాన్ని నువ్వు కాపాడుకున్నావు. ఈ పట్టణం నుండి దూరంగా పారిపో..

లేదా రేపు నేను నీ మీదకు దూకుతాను..” అని చెప్పి ఆ హాస్యగాడు అదృశ్య మయ్యాడు.

కానీ జరతూస్త్ర దట్టమైన చీకటి దారుల గుండా పొలిమేరల దగ్గరికి చేరుకున్నాడు. అతను అక్కడ చలిమంట కాచుకుంటున్న కాటికాపర్లను చూశాడు.

వాళ్ళు ఆ వెలుగులో జరతూస్త్రని చూసి “జరతూస్త్ర చనిపోయిన కుక్కను తీసుకువెళ్తున్నాడు చూడండి. జరతూస్త్ర కాటికాపర్లవాడిగా మారడం ఎంతో బాగుంది. ఆ కుక్కని పట్టుకోనందుకు మన చేతులు చాలా శుభ్రంగా ఉన్నాయి. జరతూస్త్ర ఈ ఆహారాన్ని (శవాన్ని) దెయ్యం నుండి దొంగిలించగలడా? జరతూస్త్ర కంటే దెయ్యం మంచిదొంగ కాకపోతే ఈ కుక్క నీకు మంచి విందు కావాలని మేము కోరుకుంటున్నాము” అంటూ ఎగతాళి చేసారు.

జరతూస్త్ర ఒక్క మాట కూడా మాట్లాడకుండా మరో రెండు గంటలు అడవిలోని చిత్తడినేలగుండా, తోడేళ్ళ ఆకలి కేకలగుండా నడుస్తూ వెళ్తున్నాడు. అప్పుడే తనకి తన ఆకలి గుర్తొచ్చింది. అతను అర్ధరాత్రి అడవిలో ఒక నిర్మానుష్యమైన ప్రాంతంలో ఉన్న ఒక ఇంటివద్ద ఆగిపోయాడు. దొంగలాగే ఈ ఆకలి నన్ను అధిగమించింది అనుకుంటూ జరతూస్త్ర ఆ ఇంటి తలుపుని తట్టాడు. చిన్న దీపపుబుడ్డి వెలుగులో ఒక వృద్ధుడు ఈ సమయంలో ఎవరు నా నిద్రకు భంగం కలిగించేదని గొణుక్కుంటూ నిద్రమత్తుతోనే బయటికి వచ్చాడు.

“ఒక జీవమున్న మరియు ఒక మరణించిన వ్యక్తి తినడానికి, త్రాగడానికి ఏవైనా ఉంటే ఇవ్వండి. ఆకలితో ఉన్నాను” అని అడిగాడు జరతూస్త్ర.

వృద్ధుడు లోపలికి వెళ్లి కొద్దిసేపటికి తిరిగి వచ్చి జరతూస్త్రకి తినడానికి రొట్టె మరియు త్రాగడానికి కొంచెం వైన్ ఇచ్చాడు.

“ఇది అందరి ఆకలి తీర్చే ప్రాంతం... అందుకే నేను ఇక్కడ నివసిస్తున్నాను. ఆకలి వేసినప్పుడు అది మృగం కావచ్చు, మనిషి కావొచ్చు.. నా దగ్గరకు వస్తారు. కానీ మీ సహచరుడికి కూడా కొంత ఇవ్వండి. అతను మీకన్నా బాగా అలిసి పోయాడు అనుకుంటా..” అన్నాడు ఆ వృద్ధుడు.

“నా సహచరుడు చనిపోయాడు. నేను ఇప్పుడు అతనిని తినమని ఒప్పించలేను” అని జరతూస్త్ర బదులిచ్చాడు.

“నేను అదేం పట్టించుకోను. నా తలుపు తట్టి ఆకలి అన్న వారికి నా దగ్గర ఉన్నదానిలో ఎంతో కొంత ఇచ్చి ఆకలి తీర్చడం మాత్రమే నాకు తెలు”సని ముఖం చిట్లించుకుంటూ లోపలికి వెళ్ళాడు ఆ వృద్ధుడు.

ఆ దట్టమైన అడవిలో నక్షత్రాల కాంతి వెలుగులో ఆ శవాన్ని భుజాన వేసుకొని మరో రెండు గంటలు నడిచాడు జరతూస్త్ర. రెండు గంటల సుదీర్ఘ ప్రయాణం తరువాత వేకువజామునకు కొన్ని గంటల ముందు, ఎటూ వెళ్ళడానికి వీలులేని ఒక దట్టమైన అడవిలో తాను ఉన్నానని గుర్తించాడు. అతనికి మార్గం ఎక్కడా కనిపించలేదు. తోడేళ్ళ ఆకలి నుండి శవాన్ని రక్షించడానికి దానిని ఒక చెట్టు తొర్రలో దాచాడు జరతూస్త్ర. అతను కూడా అదే చెట్టు క్రింద నేలపై పడుకున్నాడు. వెంటనే గాఢనిద్రలోకి జారుకున్నాడు. జరతూస్త్ర శారీరకంగా బాగా అలసిపోయి ఉండొచ్చు. కానీ అతను పూర్తి చైతన్యంతో ధైర్యంగా ఉన్నాడు. అలా జరతూస్త్ర చాలాసేపు నిద్రపోయాడు.

❖ ❖ ❖

మిట్టమధ్యాహ్నానికి మేల్కొన్నాడు జరతూస్త్ర. కళ్ళు తెరిచి అడవిని, అడవిలో ఉన్న నిశ్శబ్దాన్ని చూసి విస్మయం చెందాడు. ఒక సూర్యోదయానికి ఇంకో సూర్యోదయానికి మధ్య వెలుగుని చూసాడు జరతూస్త్ర.

తనలో తాను మాట్లాడుకోవడం మొదలుపెట్టాడు.

‘మందతో మాట్లాడటం అనేది పూర్తిగా వృధా. సమయం విలువైనది మరియు చాలా పరిమితం. నాకు అనుచరులు కానీ, నన్ను నమ్మేవారు కానీ, గుంపు కానీ నాకు అక్కరలేదు. వారు నా మాటలు ఏ మాత్రం అర్థం చేసుకోలేరు. అర్థం చేసుకుంటారని అనుకోవడం కూడా పూర్తిగా అసంబద్ధం.

నాకు నన్ను అర్థం చేసుకునే సహచరులు కావాలి. అర్థం చేసుకోలేని వారితో నా సమయాన్ని గడపడం వృథా. నేను కోరుకున్న చోటుకి నాతోపాటు మోసుకెళ్లే చనిపోయిన మృతదేహాలు కాదు నాకు కావాల్సింది. నన్ను అనుసరించే సహచరులు నాకు కావాలి. ఎందుకంటే తమను తాము అనుసరించాలని అనుకునేవారు మాత్రమే నన్ను అనుసరిస్తారు. ఈ గుంపుకి కాపలాకుక్కలా లేదా గొర్రెలకాపరిగా నేను ఉండదలుచుకోవడం లేదు.

మానవాళి యొక్క సమూహాలు గొర్రెల సమూహాలు తప్ప మరొకటి కాదు.

గొర్రెలు మాత్రమే భయంతో నిండి ఉంటాయి. ఒంటరిగా ఉండటానికి భయపడతాయి. అందుకే గుంపులో నివసిస్తాయి. గుంపుతో కలిసి కదులుతాయి. ఏ రెండు గొర్రెల మధ్య ఖాళీ కూడా ఉండదు. అవి ఒకదాని శరీరాన్ని ఇంకొకటి రుద్దుకుంటూ వెచ్చగా, హాయిగా నేను ఒంటరిగా లేను, నాతోపాటు ఇంకా వేలాది గొర్రెలు ఉన్నాయనే ధీమాతో ముందుకు కదులుతాయి.

కానీ సింహాలు మాత్రమే ఒంటరిగా కదులుతాయి. నేను, నా సహచరులు సింహపు గుంపు. గొర్రెలకాపరులు తమను తాము మంచివారు, నీతిమంతులు, నిష్పక్షపాతమైన మరియు నిజమైన విశ్వాసం కలవారని ప్రకటించుకుంటారు. మందనుండి చాలామందిని ఆకర్షించడానికి నేను వచ్చాను. అందుకే ప్రజలు నాపై కోపంగా ఉన్నారు. గొర్రెల కాపలాదారుల దృష్టిలో నేనొక నేరస్థుడిని. ఎందుకంటే వారి గొర్రెలను మందనుండి ఒక్కొక్కరిని నేను సింహంగా మార్చబోతున్నాను కాబట్టి.

"శాంతి కాముకులు, నీతిమంతులని చెప్పుకునే వారిని చూడండి.. వాళ్ళు ఎవరిని ఎక్కువగా ద్వేషిస్తారు అనుకుంటున్నారు? వారి విలువల బల్లలను విచ్ఛిన్నం చేసే వ్యక్తిని. అయినప్పటికీ అతను సృష్టికర్త."

"అన్నిటినీ విశ్వసించేవారిని చూడండి.. వాళ్ళు ఎవరిని ఎక్కువగా ద్వేషిస్తారు అనుకుంటున్నారు? వాళ్ళ విలువల పట్టీలను ధ్వంసం చేసేవాడిని. అయినప్పటికీ అతనే సృష్టికర్త."

కొత్తదానిని సృష్టించాలంటే పాతదానిని నాశనం చెయ్యాల్సిందే. సృష్టికర్తలు ఎల్లప్పుడూ మంచిచెడుల యొక్క వినాశకారులుగా మరియు విద్వేషకులుగా ఉంటారు. సమస్త మానవాళి మెరుగుకోసం తమని తాము త్యాగం చేసుకునేవారే సృష్టికర్తలు. ఆ సృష్టికర్తలే నా సహచరులు.

నాకు కావాల్సింది పంటను కోసేవాళ్ళు. నాకు సంబంధించినదంతా పక్వానికి వచ్చింది. కానీ కావలసినన్ని కొడవళ్ళు మాత్రం లేవు. సృష్టికర్తకి ఎప్పుడూ తమ కొడవళ్ళని ఎలా పదును పెట్టుకోవాలి అనేది తెలిసిన సహచరులు కావాలి. మానవాళి వాళ్ళను విధ్వంసకారులు అని పిలుస్తారు. కానీ వారు పంటను కోసేవారు, వారే సంబరాలు జరుపుకునేవారు. వాళ్లకు మందలతో, గొర్రెల కాపరులతో, శవాలతో పనేముంటుంది?

ఓ నా ప్రియమిత్రుడా..! నీవే నా మొదటి సహచరుడివి. ఈ తోడేళ్ళ ఆకలి నుండి ఈ చెట్టు తొర్రలో నిన్ను భద్రంగా దాచాను. నేను నీ నుండి వెళ్ళక తప్పదు. సమయం ముగిసింది. నేనిక గొర్రెలకాపరిని కానీ, కాటికాపరిని కానీ కాను. నేను మరల ప్రజలతో మాట్లాడను. చివరిసారిగా నేను చనిపోయినవారితో మాట్లాడాను.

ఇకపై నేను సృజనాత్మకత ఉన్నవారితో, ఆనందంతో వేడుక చేసుకునే వారితో చేరతాను. నేను వారికి ఇంద్రధనస్సులోని రంగులను మరియు సూపర్ మాన్ అన్ని దశలను చూపిస్తాను. నా లక్ష్యానికి నేను నా సొంతమార్గంలోనే వెళ్తాను' అన్నాడు జరతూస్త్ర.

మిట్ట మధ్యాహ్నం సూర్యుడు నిప్పులు కక్కుతున్నాడు. జరతూస్త్ర ఆకాశంలోకి చూసాడు. ఆకాశం అంతా తనదే అయినట్టు ఒక డేగ చక్కర్లు కొడుతూ, అరుస్తూ తిరుగుతూ ఉంది. ఇంకొంచెం పరికించి చూసాడు. ఆ డేగ మెడలో ఒక పాము చుట్టుకొని ఉంది. కానీ ఆ పాము డేగకి ఎరలా లేదు. ఒక స్నేహితుడిలా ఉంది. ఎందుకంటే అప్పటికి ఆ డేగ మెడకి గాయమై ఉంది. సంతోషంతో 'ఇవి నా జంతువులు' అన్నాడు జరతూస్త్ర.

సూర్యుని కింద పాము, డేగ అన్వేషణకు బయలుదేరినట్టు ఉన్నాయి. జరతూస్త్ర ఇంకా బతికే ఉన్నాడో లేదో నిర్ధారించాలనుకుంటున్నట్టు తిరుగు తున్నాయి అవి. 'నిశ్చయంగా నేను ఇంకా జీవించే ఉన్నానా?' అని తనని తాను ప్రశ్నించుకున్నాడు జరతూస్త్ర. నా డేగ మరియు నా పాము నాకిప్పుడు మార్గాన్ని చూపిస్తాయి. జంతువుల కంటే మనుషుల మధ్య జీవితం చాలా ప్రమాదకరమైనది. ప్రమాదకరమైన మార్గాల్లో నడవాల్సిన అవసరం తప్పడం లేదు అనుకున్నాడు జరతూస్త్ర.

జరతూస్త్ర అడవిలో ఉన్న సాధువు చెప్పిన మాటలను గుర్తుచేసుకొని నిట్టూర్చాడు..

"నేను తెలివిగా ఉండాలి. నేను ఆ పాములాగా ఎల్లప్పుడూ జ్ఞానవంతుడిగా ఉండడం సాధ్యమేనా? అందుకు నా జ్ఞానానికి నా పొగరుని (డేగని) సహాయంగా అడుగుతున్నాను. నా జ్ఞానం ఏదో ఒక రోజు నన్ను విడిచిపెట్టినప్పుడు నా

పొగరు కూడా నా నుండి దూరంగా ఎగరడానికి ఇష్టపడుతుంది. అప్పుడు నా పొగరు నా మూర్ఖత్వంతో ఎగురుతుంది' అనుకొని జనాల మధ్యకి వెళ్ళడానికి సిద్ధం అయ్యాడు జరతూస్త్ర.

(పాము జ్ఞానాన్ని సూచిస్తుంది. పాము తన కుబుసం విడిచి వెనక్కి తిరిగి చూడకుండా వెళ్లినట్లు మనం గతానికి అతుక్కుపోకుండా గతాన్ని విడిచిపెట్టడమే గొప్ప జ్ఞానం. దాని ప్రయాణం ఎల్లప్పుడూ పాతది నుండి క్రొత్త జ్ఞానం వైపు.

డేగ పొగరుతో స్వేచ్ఛగా, భయం లేకుండా ఎత్తైన, సుదూర ప్రాంతాలకు ఎగరడానికి చిహ్నం. జ్ఞానం మరియు స్వేచ్ఛ ఒకే నాణెంకు ఉన్న బొమ్మ బొరుసు లాంటివి.)

జరతూస్త్రకి ఇప్పుడు ఇద్దరు స్నేహితులు: ఒకటి గ్రద్ద.. రెండు పాము.

# మొదటి భాగం

# వ్యక్తిత్వం యొక్క మూడు రూపాంతర దశలు

**జం**తువు నుండి మనిషిని వేరు చేసే ప్రధానాంశాల్లో 'సృజనాత్మకత' మొదటిది. కానీ మానవుడు దానికోసం అప్పటివరకు ఉన్న పాత విలువలను పక్కన పెట్టవలసి ఉంటుంది. ఆ సృష్టికర్తనే జరతూస్త్ర 'సూపర్ మాన్' అంటాడు.

జరతూస్త్ర మానవదశని అధిగమంచి సృజనాత్మకమైన వ్యక్తిగా మారడాన్ని మూడు రూపాంతర దశలుగా వివరించాడు.

ఒకటి ఒంటె

రెండు సింహం

మూడు పిల్లవాడు.

ఒంటె ఎక్కడ లేని భారాన్నంతా తనమీద వేసుకొని బానిసగా బ్రతకడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది. ఎదురుతిరగడం, తిరుగుబాటు చేయడం గురించి దానికి తెలియదు. దేనిగురించీ తెలుసుకోవాలన్న ఆసక్తి దానికి ఉండదు. అది మంచి నమ్మకస్థుడు. మంచి అనుచరుడు. నమ్మకమైన బానిస. ఒంటెని ఎవరో ఒకరు నడిపించాలి. నువ్వు అది చెయ్యి, ఇది చెయ్యి, అలా చెయ్యి, ఇలా చెయ్యి అని ఆజ్ఞలు జారీ చేసేవారికోసం ఎల్లప్పుడూ ఎదురుచూస్తూ ఉంటుంది. దానికి పది ఆజ్ఞలు అవసరం. దాన్ని నడిపించడానికి మతాలు, పవిత్ర గ్రంథాలు కావాలి. ఎందుకంటే దానిమీద దానికి నమ్మకం ఉండదు దాని మంచి చెడుల గురించి దానికి ఎటువంటి అవగాహనా ఉండదు. దానికి ధైర్యం, ప్రత్యేకమైన వ్యక్తిత్వం అంటూ ఉండదు. దానికి స్వేచ్ఛ అవసరం లేదు. అది అందరికీ విధేయుడు.

సింహం – తిరుగుబాటుకి ప్రతీక. స్వేచ్ఛ కోసం పోరాడే వీరుడు. కావలి కాస్తూ తనని నడిపించే అన్నిటి నుండి స్వేచ్ఛని పొందడం కోసం బానిస సంకెళ్ల నుండి తనని తాను విడిపించుకోవడానికి యుద్ధం చేసే వీరుడు. సింహానికి తనని నడిపించడానికి ఎలాంటి విలువలు, ఏ మతాచార్యుడు, ఏ పవిత్ర గ్రంథాలు, ఏ నాయకుడు దానికి అవసరం లేదు. తనకు తానే అన్నీ.. తనకు తానే రాజు. నువ్వు అది చెయ్యి, నువ్వు ఇది చెయ్యి, ఇది మంచి, అది చెడు అని దానికి

చెప్పడానికి అది ఎవర్నీ అనుమతించదు. అది దాని ఆత్మాభిమానానికి అవమానం కూడా. ఏదైనా అది దాని అభీష్టంతో ముందుకు వెళ్తుంది. అయినప్పటికీ సింహం వ్యక్తిత్వం యొక్క రూపాంతర దశల్లో ఉచ్ఛస్థితికి చెందినదైతే కాదు. సింహం కూడా రూపాంతరం చెంది పిల్లవాడిగా మారినప్పుడు మాత్రమే పరిపూర్ణత.

పిల్లవాడిది నిష్కపటత్వం. అతనిది విధేయత కాదు. అలా అని అవిధేయత కాదు. అతనిది విశ్వాసం కాదు. అలా అని అవిశ్వాసం కాదు.. అతనిది కల్మషం లేని స్వచ్ఛమైన విశ్వాసం. అది తన పవిత్రమైన జీవనవిధానానికి, దానికి సంబంధించిన అన్ని విషయాలకి, తనపట్ల తనకున్న విశ్వాసం. పిల్లవాడు నిర్మలత్వానికి, విధేయతకి, వాస్తవికతకి, వివేకానికి, జీవితం మరియు దానికి సంబంధించిన అన్ని ఆనందాలకు ప్రతీక.

జరతూస్త్ర బలహీనులు, విధేయులు అని పిలవబడేవారికి అనుకూలం కాదు. అతను బలమైన ధైర్యవంతుడు మరియు ఎటువంటి భయం లేకుండా తెలియని దారుల గుండా ప్రయాణించే సాహసికునికి అనుకూలం. జరతూస్త్ర ప్రజలకి వినయం గురించి చెప్పడానికి వచ్చిన ప్రవక్త కాదు. ఎందుకంటే ఇప్పటివరకు వినయం, పేదలు సౌమ్యులు అంటూ చెప్పిన బోధనలన్నీ విఫలమయ్యాయి. పాత బోధనలన్నీ మానవాళిని ఒంటె దశలో ఉంచడానికి మాత్రమే సహాయపడ్డాయి. మానవుడు రూపాంతరం చెందాలి.

ఒంటె సింహంగా, సింహం నుండి పిల్లవాడిగా మారాలి. జరతూస్త్ర మనిషి యొక్క స్వాభిమానం, అహం గురించి మరియు సూపర్ మాన్ గురించి బోధించడానికి వచ్చిన ప్రవక్త.

మొత్తం ఉనికిలో అత్యంత వికారమైన జంతువు 'ఒంటె'. అది బానిసగా ఉండాలని కోరుకుంటుంది. స్వేచ్ఛగా బ్రతకడానికి భయపడుతుంది, ఎందుకంటే దానికి బాధ్యతలు అంటే భయం. ఒంటె సాధ్యమైనంత ఎక్కువ బరువులు ఎత్తడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. బరువులు మోయడంలో అది తన ఆనందాన్ని వెతుక్కుంటుంది. అరువు తెచ్చుకున్న జ్ఞానంతో తనని తాను ఇంకా ఎక్కువ భారం చేసుకుంటుంది. గౌరవప్రదమైన ఏ వ్యక్తయినా అరువు తెచ్చుకున్న జ్ఞానంతో, అరువు తెచ్చుకున్న మంచి చెడులతో తనను తాను భారం చేసుకోడు. మంచిచెడులన్నీ ఎప్పుడో వందల సంవత్సరాల క్రితం చనిపోయినవారు సజీవంగా ఉన్నవారికి ఇచ్చినవి. ఒక రకంగా అది జీవించి ఉన్నవారిపై చనిపోయినవారి

ఆధిపత్యం. గౌరవప్రదమైన ఏ వ్యక్తయినా చనిపోయినవారి చేత పరిపాలించబడడానికి తనని తాను అనుమతించడు. అందుకే ఒంటె సింహంగా మారాలి.

సింహం చనిపోవడానికైనా సిద్ధంగా ఉంటుంది కానీ బానిసగా బ్రతకడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండదు. మీరు సింహాన్ని బరువులు మోసే జంతువుగా చేయలేరు. సింహానికి మరే ఇతర జంతువులకు లేనంత పేరు ఉంది. నిర్భయంగా మరణానికి కూడా భయపడని ధైర్యం దాని జీవనశైలిలోనే ఉంది. ఒంటె మోకాళ్ళ వరకు వంగి సాధ్యమైనంత ఎక్కువ బరువులు ఎత్తుకోవడానికి దానికంటూ ఒక అంతర్గత కోరిక ఉంది. విధేయత చూపడం, ఇతరులకు సేవ చెయ్యడం, బానిసగా ఉండడం ద్వారా ఒంటె తన ఆనందాన్ని వెతుక్కుంటుంది. ఆ బరువులతో ప్రయాణిస్తున్న ఒంటె ఎడారిలో కూలబడుతుంది. ఈ ఎడారిలోనే ఒంటె రూపాంతరం జరుగుతుంది. ఒంటె సింహంగా రూపాంతరం చెందుతుంది. సింహం స్వేచ్ఛను సంగ్రహించి తన సొంత ఎడారిలో తానే దేవునిగా ఉండాలని కోరుకుంటుంది. అది అప్పటివరకు తనమీద బరువులు ఎత్తించి బాధించిన వారెవరో తెలుసుకోవాలని, అతనితో యుద్ధం చెయ్యాలని నిశ్చయించుకుంటుంది. తన అంతిమ శత్రువుగా డ్రాగన్‌ని గుర్తిస్తుంది. ఇక్కడ సింహం తనకు తానే దైవం. మరే దేవుడు అయినా దానికి శత్రువే. కానీ విజయం కోసం, స్వేచ్ఛ కోసం సింహం ఆ పెద్ద డ్రాగన్‌తో యుద్ధం చెయ్యవలసి ఉంటుంది. జరతూస్త్ర ఆ డ్రాగన్‌ని 'దేవుడు' అంటాడు. అన్ని విలువలు, నైతికత, మంచిచెడు, ఏది చేయాలి, ఏది చేయకూడదని ముందే నిర్ణయించబడ్డాయి. సరైనదాన్ని ఎంచుకోవడానికి మానవాళికి ఎటువంటి స్వేచ్ఛ లేదు అంటుంది ఆ డ్రాగన్.

రాబోయే అన్ని భవిష్యత్తు తరాల కోసం వేలాది సంవత్సరాల క్రితమే చనిపోయిన ప్రజలు ఏది సరైనది, ఏది తప్పు అని ముందే నిర్ణయించారు. తిరగబడే ధైర్యం ఉన్న సింహం మాత్రమే రూపాంతరం చెందుతుంది. సింహం మరే దేవుని ముందు మోకరిల్లలేదు. అది ఏ దేవునికీ నమస్కరించలేదు. ఇక్కడ సింహం యొక్క సంపూర్ణ స్వేచ్ఛ అనేది దేవుని నుండి స్వేచ్ఛ, పది ఆజ్ఞలు అని పిలవబడే వాటి నుండి స్వేచ్ఛ, మతగ్రంథాల నుండి స్వేచ్ఛ, విలువలు అనే వాటినుండి స్వేచ్ఛ, ఇతరులు విధించిన నైతికత నుండి స్వేచ్ఛ. అప్పుడు దానికంటూ సొంత నైతికత తలెత్తుతుంది. దాని స్వేచ్ఛ దానికి బాధ్యతను గుర్తుచేస్తుంది. కానీ ఆ బాధ్యత మరెవరో దానిపై విధించింది కాదు. అది తన అంతరాత్మ సరైనదని

భావించినదాన్ని, సంపూర్ణ ఇంద్రియజ్ఞానం సరైనదని చెప్పినదానినే చేస్తుంది. అది తప్పు అని భావించినదాన్ని చెయ్యదు. దానికి ఏ మార్గదర్శకుడు కానీ, గురువు కానీ అవసరం లేదు.. తనకు తానే అన్నీ.. తన సొంత నేత్రాలతో ఈ ప్రపంచాన్ని చూడగలదు. దానికి వేరొకరి నేత్రాలు అవసరం లేదు. అది చూడగలదు, ఆలోచించగలదు, ఏది తప్పో, ఏది ఒప్పో తెలుసుకోగలదు. దాని నైతికత ఎల్లప్పుడూ దాని చైతన్యం యొక్క నీడగా ఉంటుంది. అన్ని మతాలు, అన్ని మతాల పెద్దలు ఈ డ్రాగన్ల గురించి రాసారు. వారు అన్ని విలువలు ముందే సృష్టించబడ్డాయి, మీరు ఇకపై ఏం నిర్ణయించుకోవలసిన అవసరం లేదు. మీ కంటే తెలివైన వ్యక్తులు మీ కోసం ప్రతిదీ ముందే నిర్ణయించారు. ఏదీ మీ స్వతహాగా నిర్ణయించుకోవాల్సిన అవసరం లేదు అంటారు. కానీ నిర్ణయ స్వేచ్ఛ / కోరిక లేకుండా అసలు స్వేచ్ఛ అనేదే లేదు. స్వేచ్ఛ లేకపోతే ఒంటె ఒంటిగానే మిగిలిపోతుంది. మత, రాజకీయ మరియు సామాజిక రంగంవారు తమ తమ స్వార్థప్రయోజనాల కోసం ఒంటెల్ని ఒంటెల్లాగానే ఉండనిస్తారు. అది వాళ్లకి చాలా అవసరం కూడా. ఇక స్వేచ్ఛ అనే ఆలోచనే వారికి ఉండదు. ప్రతిదీ ఇప్పటికే నిర్ణయించబడింది. మేము అనుసరించాల్సిన అవసరం ఉంది. అనుసరించేవారు ధర్మవంతులు, నీతివంతులు మరియు అనుసరించనివారు నరకానికి వెళ్తారనే భ్రమలో బ్రతుకుతూ ఉంటారు. సాధువులు అని పిలవబడే వారందరూ పరిపూర్ణ ఒంటెలు తప్ప మరేమీ కాదు. వారు కుళ్లిన సంప్రదాయాలకు, కుళ్లిన ఆచారాలకు, కుళ్లిన మతగ్రంథాలకు, చనిపోయిన దేవతలకు హారతి పట్టే పరిపూర్ణ ఒంటెలు మాత్రమే. అసంపూర్ణ ఒంటెలు వాటిని ఆరాధిస్తాయి. సింహం తనకు తానుగా కొత్త విలువలను సృష్టించుకోలేదు. కానీ అది స్వేచ్ఛను సృష్టించుకోగలదు. నూతన విలువలను సృష్టించగల అవకాశం దానికుంది. కానీ కొత్త విలువలు అంటే ఏమిటి?

'విధి' (తప్పక చెయ్యవలసిన పని) గొప్ప విలువని మానవాళికి నిరంతరం చెప్పబడింది. నిజానికి అది ఒక మురికి పదం. విధి మనిషిలో అందంగా ఉన్నవన్నీ నాశనం చేస్తుంది. అందుకే సింహం విధికి తిరుగుబాటుదారుడు.

వ్యక్తిత్వానికి సంబంధించినంతవరకు పిల్లవాడు రూపాంతరదశల్లో ఉన్నతమైనవాడు. కానీ పిల్లవాడు ఒక చిహ్నం మాత్రమే. జ్ఞానం లేని కారణంగా పిల్లవాడిని ప్రతీకగా ఉపయోగిస్తారు. అతని అమాయకత్వం వలన, అతని కళ్ళు

ఆశ్చర్యంతో నిండి ఉంటాయి. అతని ఆత్మ మర్మమైన వాటికోసం ఎంతో ఆశగా ఉంటుంది. అతని మొదటి కదలిక ఉనికిపట్ల ఉన్న నమ్మకం ద్వారా పవిత్రమైన 'అంగీకారం'తో ప్రారంభం అవుతుంది. కానీ పవిత్రమైన 'అంగీకారం' పవిత్రమైన 'తిరస్కరణ' తరువాత మాత్రమే వస్తుంది. ఒంటె కూడా అన్నిటినీ అంగీకరిస్తుంది. కానీ అది బానిస యొక్క 'అంగీకారం'. అది కాదని, లేదని చెప్పలేదు. అందుకే దాని 'అంగీకారం' అర్థరహితం.. అది పూర్తిగా బానిసత్వం. సింహం 'కాదు', 'లేదు' అని చెప్తుంది. కానీ అది దేన్నీ అంగీకరించదు. అది దాని స్వభావానికి విరుద్ధం. ఎందుకంటే దాని గతకాలపు ఒంటె వ్యక్తిత్వాన్ని గుర్తు చేస్తుంది. ఏదో ఒక విధంగా అది ఒంటె నుండి తనను తాను విడిపించుకుంది. ఒంటె యొక్క 'అంగీకారం' బానిసత్వానికి చిహ్నం. 'లేదు', 'కాదు' అని చెప్పడానికి అది ఒప్పుకోదు. సింహంలో ఎదిరించగల తిరుగుబాటు తత్వం వలన 'కాదు', 'కుదరదు' అని చెప్పగల సామర్థ్యం ఉంది కానీ అది దేనికీ అంగీకారం తెలుపలేదు.

పిల్లవాడికి ఒంటె గురించి కానీ, సింహం గురించి కానీ ఏమీ తెలియదు. అందుకే జరతూస్త్ర ఇలా అంటాడు.

"పిల్లవాడిది పూర్తిగా అమాయకత్వం మరియు మతిమరుపు... అతని 'అంగీకారం' స్వచ్ఛమైనది. అలాగే అతనికి 'కాదు', 'లేదు' అని చెప్పే సామర్థ్యం కూడా ఉంది. ఒకవేళ అతను అలా చెప్పలేకపోతే అది భయంవల్ల కాదు. అది తన పూర్తి ఎరుక నుండి వచ్చింది. నిజమైన వివేకవంతుడు మళ్ళీ పిల్లవాడు అవుతాడు.

❖ ❖ ❖

# స్వర్గ నరకాలు

జరతూస్త్ర 'మొట్లీ కౌ' అనే పట్టణంలోకి అడుగుపెడతాడు.

ఆ పట్టణంలో మరణం తరువాత స్వర్గనరకాలు ఉన్నాయని విశ్వసించే అక్కడి ప్రజలను ఉద్దేశించి వారితో మాట్లాడాడు జరతూస్త్ర. తాను కూడా మూర్ఖుడిలా ఒకప్పుడు దేవుణ్ణి, మరణానంతర జీవితాన్ని విశ్వసించానని, కానీ నిజానికి దేవుడు లేడని, మనిషి యొక్క ఊహ నుండే దేవుడు పుట్టుకొచ్చాడనీ, అనారోగ్యంతో అలసిపోయినవారు వారి అనారోగ్యం నుండి, వారి అలసట నుండి తమ దృష్టిని మరల్చడానికే దేవుడిని సృష్టించారని అక్కడి ప్రజలకు చెప్పాడు.

మతం యొక్క దృక్పథంలో భాగంగా మానవుడు దేవుని గురించి తెలుసుకోవాలంటే దేహాన్ని, భూసంబంధమైన ఆనందాలను త్యజించాలి. కానీ అటువంటి నమ్మకాలకు ఎటువంటి ఆధారాలు లేవని, తన సూపర్ మాన్‌కి సంబంధించిన తన బోధనలు మానవాళికి కొత్తమార్గాన్ని చూపుతుందని బోధించాడు జరతూస్త్ర.

❖ ❖ ❖

## దేహాన్ని త్యజించమని చెప్పేవారు

(మనలో 'నేను' అని పిలవబడేది దేహం తప్ప మరేమీ కాదు. అదే మనలోని ఆలోచనలను, భావాలను, కోరికలను నిర్దేశిస్తుంది. ఈ 'నేను' అనేది నిజంగా ఆత్మ మాత్రమే అని నొక్కిచెప్పేవారు దేహాన్ని త్యజించమని చెప్పేవారు.. జీవితాన్ని అసహ్యించుకునేవారు మరియు చనిపోవాలనుకునే అనారోగ్యదేహాన్ని కలిగి ఉన్నవారని అంటాడు జరతూస్త్ర.)

దేహాన్ని త్యజించమని చెప్పేవారికి జరతూస్త్ర వ్యతిరేకం. జరతూస్త్ర ప్రకారం దేహం మాత్రమే ఉంది. ఆ దేహం లోపల 'నేను' ఉంది. ఈ 'నేను' దేహానికి పాలకుడు. 'నేను' అహాన్ని నియంత్రిస్తుంది. ఇది జీవితంలోని ఆనందాలను, బాధలను నియంత్రిస్తుంది. 'నేను' అన్నింటికన్నా ఎక్కువగా కోరుకునేది 'తనను తాను ఉన్నతంగా సృష్టించుకోవడం'. జరతూస్త్ర మానవుని యొక్క దేహాన్ని రాజ్యంతో పోలుస్తాడు. దేహంలో ఈ 'నేను' ప్రతిదానికీ పాలకుడు.

ప్రపంచంలోని మతాలు, ప్రవక్తల బోధనలన్నీ దేహానికి వ్యతిరేకంగా ఉన్నాయి. వారి వాదన ఏంటంటే ఈ 'దేహం', ఆత్మ యొక్క పెరుగుదలకు అవరోధంగా ఉందని, కానీ మానవుడు దేహాన్ని ప్రేమిస్తే తప్ప, అర్థం చేసుకుంటే తప్ప అతను ఉత్సాహంగా ఎదగలేడు అంటాడు జరతూస్త్ర. దేహం దాని ప్రతి ఫలంగా మిమ్మల్ని ఏమీ అడగకుండా అదే ఇంకా మీ జీవితమంతా సేవలు అందిస్తుంది. దేహాన్ని ఖండించడం అనాగరికం. ఎందుకంటే దేహాన్ని ఖండించిన వారందరూ దేహం నుండి జన్మించినవారే. వారు దేహం ద్వారా జన్మించి, దేహం ద్వారా తమ జీవితాన్ని గడుపుతూ దేహాన్ని ఖండిస్తున్నారు. మానవాళి దేహం మరియు ఆత్మ వేరు వేరు అనే ప్రమాదకరమైన భావజాలాన్ని అంగీకరించింది. మీరు ఎంచుకుంటే దేహాన్ని లేదా ఆత్మను మాత్రమే ఎంచుకోవాలనే సవాలు

మానవాళి ముందు ఉంచింది. దేహాన్ని ఖండించడానికి ఒక ప్రాథమిక కారణం ఎటువంటి భౌతిక ఆకారం లేని దేవుడ్ని ప్రశంసించే మార్గం.. ఆత్మని స్తుతించే మార్గం... దేహాన్ని ఖండించకుండా ఇది కష్టతరం. దేహాన్ని ఖండించడం ద్వారా ఆత్మని, ఈ ప్రపంచాన్ని ఖండించడం ద్వారా దేవుడ్ని స్తుతించవచ్చని నూరిపోశారు. కానీ వారే మరలా ఈ ప్రపంచాన్ని దేవుడు సృష్టించాడని అంటుంటారు. దేవుడే ఈ ప్రపంచాన్ని సృష్టించినట్లయితే, దానిని త్యజించమని దేవుడు చెప్పడు కదా.. ఎంతో ఇష్టం లేకుండా దేవుడు పొరపాటున ఈ సృష్టిని సృష్టించలేదు కదా...! అలాంటి దేవుడు సృష్టించినదాన్ని మరలా వారే మిమ్మల్ని కాలదన్నమంటున్నారు.

మీరు 'నేను' అంటుంటారు. ఆ మాటను బలంగా నమ్ముతారు కూడా. మీరు నమ్మినా, నమ్మకపోయినా మీ దేహానికి దానికంటూ సొంతజ్ఞానం ఉంటుంది. అది 'నేను ఉన్నాను' అని గుర్తు చేయకపోయిన దాని పనిని అది నిర్వర్తిస్తుంది. దేహానికి తనదైన సొంతజ్ఞానం ఉంది. కానీ మానవుడు సంవత్సరాల తరబడి చేయబడిన నియంత్రీకరణ ద్వారా దేహానికి ఉన్న జ్ఞానాన్ని గుర్తించడానికి అతనికి ఉన్న అనుభవం కూడా సరిపోదు. నిజానికి శ్వాస అనేది మెదడుపై ఆధారపడి ఉండదు. మెదడుకి మరిచిపోయే గుణం ఉంది. అది ఏ క్షణంలోనైనా మర్చిపోగలదు. కానీ శ్వాసించడం మరచిపోయిన రోజున మరణిస్తారు. మీరు నిద్రలో ఉన్నప్పుడు శ్వాస ఎవరి ఆధీనంలో ఉంటుంది? మీ మెదడు గాఢనిద్రలో ఉన్నప్పుడు దేహానికి శ్వాస ఎలా అందుతుంది? నిజానికి మానవుడు పూర్తిగా కోమాలో ఉన్నప్పటికీ అతని జీవక్రియలో పెద్ద తేడా ఏం ఉండదు. హృదయ స్పందనలు, ఆహారాన్ని జీర్ణించుకోవడం, శ్వాస తీసుకోవడం, జీర్ణమయ్యే ఆహారాన్ని దేహంలోని వివిధ భాగాలకు పంపిణీ చెయ్యడం లాంటి పనులన్నీ నిర్వర్తించ బడతాయి. ఇది చాలా క్లిష్టమైన మరియు సంక్లిష్టమైన ప్రక్రియ. దేహంలో చాలా విటమిన్లు ఉన్నాయి. ఏ విటమిన్ దేహంలోని ఏ భాగానికి వెళ్ళాలనే విషయం దేహానికి తెలుసు, అది ఆ అవసరాన్ని నెరవేరుస్తుంది. రక్తంలో మూడు రకాల రక్తకణాలు ఉన్నాయి: తెలుపు, ఎరుపు మరియు రక్తఫలికికలు. గాయపడినప్పుడు మెదడు ఏమీ చేయలేదు. కానీ దేహం వెంటనే పరిస్థితిని నియంత్రణలోకి తెచ్చుకుంటుంది. గాయపడిన ప్రదేశానికి రక్తఫలికికలు వెంటనే నడుస్తాయి. ఆ రక్తఫలికికలు గాయంపై చేరి ఎర్ర రక్తకణాలను దేహం నుండి బయటకు

వెళ్లనివ్వకుండా కాపలా ఉండి దేహాన్ని రక్షిస్తాయి. అలా దేహం స్వయంగా తనని తాను నయం చేసుకుంటుంది. మెడిసిన్ యొక్క ఉపయోగం దేహం యొక్క వైద్యప్రక్రియకు సహాయపడటం మాత్రమే. కానీ ప్రాథమిక వైద్యం అంతా దేహం ద్వారానే జరుగుతుంది. దేహమే జీవితానికి మూలం. మానవుడు దానిపై ఆధారపడి ఉన్నాడు. అతను పాపి కావచ్చు. సాధువు కావచ్చు. కానీ దేహం అతన్ని పాపిగా ఉండమనదు. సాధువుగా ఉండమని ప్రోత్సహించదు. అతనెవరనేది దానికి అనవసరం. దేహం తన సొంతపనిని అది కొనసాగిస్తుంది.

మీ ఇంద్రియాలు మిమ్మల్ని చాలాసార్లు మోసం చేస్తాయి. ఎడారిలో మాత్రమే కాదు. ఎండలో ఎండమావి ద్వారా కూడా మోసపోతారు. మీ దైనందిన జీవితంలో మీ ఇంద్రియాలు మిమ్మల్ని మోసం చేస్తున్నాయి. ఇంద్రియజ్ఞానం, మనస్సు సాధనాలు మాత్రమే. వాటి వెనక ఉన్నది నిజానికి 'నేను'.

ఇంద్రియాలు, మనస్సు, అహం – ఇవన్నీ తప్పుడు అంశాలు. మీరు జీవించాలి అనుకుంటే దేహంతో ప్రారంభించండి. ఈ 'నేను' అనేది తనేం చూడాలనుకుంటుందో, ఏం వినాలనుకుంటుందో అది ఇంద్రియాల సహాయంతో వింటుంది, చూస్తుంది, పోల్చి చూస్తుంది, అధికారాన్ని సాధిస్తుంది. జయించింది నాశనం చేస్తుంది. ఇది అహం మీద కూడా తన నియంత్రణని సాధిస్తుంది. 'నేను' మాత్రమే నిజమైన యజమాని. ఈ 'నేను' ఇంద్రియాలను, మనస్సును సాధనాలుగా ఉపయోగిస్తే చాలా మంచిది. కానీ మనిషిలో విషయాలు చాలా తలక్రిందులుగా ఉంటాయి. అతను యజమానిని పూర్తిగా మరిచిపోతాడు. అతని సేవకులు యజమానులుగా నటిస్తారు. ప్రతి సేవకుడు తన అనుభవం మాత్రమే నిజం అని నొక్కి చెప్పడానికి ప్రయత్నిస్తూ ఉంటాడు. కానీ సేవకులు సేవకుల లాగానే ఉండాలి. యజమాని వారిని ఉపయోగించాలి. యజమాని వారిని ఉపయోగించకపోతే, యజమానిని అవి ఉపయోగించుకుంటాయి. మెదడు యజమానిగా నటిస్తుంది. కానీ అది కూడా సేవకుడు మాత్రమే దాని పని 'నేను'కి సేవ చెయ్యడం మాత్రమే. అది మీ దేహంలో నివసిస్తుంది. అది మీ దేహంలో ఒక భాగం మాత్రమే. కానీ దేహాన్ని ఖండించినందున మీరు 'నేను'ని కూడా ఖండించారు. మెదడు యజమాని అయ్యింది. దేహాన్ని వద్దనడంతో మానవుడు తన ఉనికిని కూడా తోసిపుచ్చాడు. అది తప్పు. మీరు మీ మెదడుతో పాలించబడు

తున్నారు. మెదడు మీకు సేవ చేయాలి. అంతేగాని అది మిమ్మల్ని పాలించకూడదు.

మీ ఉత్తమ జ్ఞానం కంటే మీ దేహానికే ఎక్కువ తర్కం తెలుసు. ఈ 'నేను' అహం యొక్క ఎత్తుపల్లాలను చూసి నవ్వుతుంది. ఈ దూకుడులు ఏంటి..? ఈ ఆలోచనల ఎత్తుగడలు ఏంటని తనను తాను ప్రశ్నించుకుంటుంది.

'నేను' అనేది అహానికి 'ఇక్కడ నొప్పి, అనుభూతి చెందు' అని చెప్తుంది. అప్పుడు అహం బాధపడుతుంది మరియు అది అలా బాధపడడానికి వంకలు కూడా వెతుక్కుంటుంది. 'నేను' అహానికి 'ఇక్కడ ఆనందించు' అని చెప్తుంది. అప్పుడు అహం సంతోషంగా ఉంటుంది. మరలా ఆ ఆనందాన్ని తిరిగి ఎలా పొందవచ్చో ఆలోచిస్తూ ఉంటుంది.

జరతూస్త్ర దేహాన్ని త్యజించమని చెప్పేవాళ్ళతో చెప్పాలనుకుంటున్నది ఒక్కటే. వారి దేహంపట్ల వారికున్న ఏహ్యాభావమే వాళ్ళకి ఆ గౌరవాన్ని తెచ్చిపెట్టింది. సృజనాత్మకమైన వారి 'నేను' గౌరవాన్ని కోరుకుంటుంది మరియు ఇతరులపట్ల ఏహ్యాభావాన్ని సృష్టిస్తుంది.

నిజానికి సృజనాత్మకమైన శరీరం 'ఆత్మ'ను ఎంతో ఇష్టంగా ఒక చేతిలా సృష్టించుకుంది. దేహంపట్ల మూర్ఖత్వంతో, ఏహ్యాభావంతో వారింకా దానికి సేవలు చేస్తున్నారు. వారి 'నేను' మరణించాలని కోరుకుంటుంది, వారి జీవితం వారి నుండి దూరంగా ఉండాలని కోరుకుంటుంది. వారి దేహం అన్నిటికీ మించి ఏమి చేయగలదో అది చేసే సామర్థ్యం దానికి లేదు. వారి 'నేను' మరణించాలని కోరుకుంటుంది.

ఓ దేహం యొక్క నిరాశవాదులారా..!

మీ 'నేను' మరణించాలని కోరుకుంటుంది. అందుకే మీరు దేహాన్ని నిరాశ పరిచారు. ఇకపై మిమ్మల్ని మించి మీరేది సృష్టించలేరు. అందుకే మీరు జీవితం పట్ల, భూసంబంధమైన ఆనందాలపట్ల కోపంగా ఉన్నారు. మీ అపస్మారక అసూయ, ధిక్కారం మీ కంటిచూపునుండి మాట్లాడుతుంది. నేను మీ మార్గానికి అడ్డు రాను.

దేహం యొక్క నిరాశావాదురులారా..! మీరు సూపర్ మాన్‌కు వంతెన కాదు.

❖ ❖ ❖

# నీ సొంత ధర్మం

ఓ సోదరుడా..! నీకంటూ ఒక ధర్మం ఉన్నప్పుడు.. దానిని నీ సొంతదానిలా అనుభూతి చెందు. దానిని ఎవరితోనూ పంచుకోకు. అది నీ సొంతం. నీకు మాత్రమే సొంతం. కావాలంటే దాన్ని ముద్దు పేరుతో పిలుచుకో... అవసరం ఐతే దాని చెవి లాగి దానితో సరసాలాడుకో. ఎందుకంటే అది నీది.

దానిగురించి ఇతరులతో మాట్లాడవలసిన అవసరం వచ్చినప్పుడు ఏమాత్రం తడబడకు.. సిగ్గుపడకు..

నువ్వు దానిని ఎంత ఎక్కువ ప్రేమిస్తే అది నిన్ను అంత ఎక్కువ సంతోష పరుస్తుంది.. అది నీ మంచే కోరుకుంటుంది.. నీవు నీ ధర్మాన్ని స్తుతించాలి.

తీవ్రవాంఛలు కలిగి ఉండడం ఒకప్పుడు చెడుగా భావించారు. కానీ ఇప్పుడు నీకు నీ ధర్మాలు మాత్రమే ఉన్నాయి. అవి నీ తీవ్రవాంఛల నుండి ఉద్భవించాయి. నువ్వు నీ అత్యున్నత లక్ష్యాల్ని తీవ్రవాంఛల రూపంలో నీ హృదయంలోకి నెట్టివేయి. అప్పుడు అవి నీ సొంతధర్మాలవుతాయి. అవి నీకు ఇంకా ఎక్కువ ఆనందాన్ని ఇస్తాయి.

నీ ధర్మాల సంఘర్షణ నుండి పెరిగే చెడు తప్ప నీలో ఇంకే చెడు ఉండ కూడదు.

నా సోదరుడా..! ఉంటే నీకు ఒక్క ధర్మమే ఉండాలి. అప్పుడు మాత్రమే నువ్వు వంతెనపై ఎటువంటి భయం లేకుండా ధైర్యంగా ముందుకు వెళ్లగలవు.

అనేక సద్గుణాలను కలిగి ఉండటం మంచిదే. కానీ అది చాలా కష్టతరమైనది కూడా.. కానీ అటువంటి వారందరూ ధర్మయుద్ధం పేరిట జరిగిన యుద్ధభూమిలో మరణించారు.

నా సోదరుడా..! నువ్వు యుద్ధాన్ని చెడుగా భావిస్తున్నావా? ఐతే ఆ చెడు నీకు చాలా అవసరమే. అసూయ మరియు అపనమ్మకాలని నీ ధర్మాల మధ్యలో ఉండనివ్వు. అప్పుడే నీలో ఉన్న ధర్మాలన్నీ ఒకదానిపట్ల ఇంకొకదానికి ఉన్న అసూయ వలన అత్యున్నత స్థానాన్ని కోరుకోవాలని చూస్తూ ఉంటాయి. మానవుడు తనను తాను అధిగమించవలసినవాడు. అందువల్ల నువ్వు నీ ధర్మాలను ప్రేమించాలి. ఎందుకంటే నువ్వు వాటిని నాశనం చెయ్యక తప్పదు కాబట్టి.

❖ ❖ ❖

# అసూయ

ఒక యువకుడు తనను తప్పించుకొని తిరుగుతున్నాడని జరతూస్త్ర గ్రహించాడు. 'మొట్లీ కౌ' అని పిలువబడే పట్టణం యొక్క చుట్టుపక్కల ఉన్న కొండప్రాంతాలలో సాయంత్రం ఒంటరిగా ఒక చెట్టు కింద కూర్చొని పక్కనే ఉన్న లోయల్లోకి దిగులుగా చూస్తూ కూర్చున్నాడు ఆ యువకుడు.

అతని పరిస్థితిని గమనించిన జరతూస్త్ర... ఆ యువకుడు కూర్చున్న చెట్టు వెనకనుండి వచ్చి "నేను ఈ చెట్టును నా చేతులతో కదిలించాలనుకుంటే కదిలించలేను. కానీ మన కంటికి కనపడని గాలి దీనిని దానికి ఇష్టమొచ్చిన దిశలలో ఈ చెట్టును ఊపగలదు" అని అన్నాడు.

ఒక్కసారిగా జరతూస్త్ర మాటలు విన్న ఆ యువకుడు తన ఆలోచనల నుండి తేరుకొని "నీ గురించే ఆలోచిస్తున్నాను జరతూస్త్ర!" అన్నాడు.

"ఎందుకు నీలో నువ్వు అంతా కుమిలిపోతున్నావు..? మనిషి ఎంత ఎత్తులకు ఎదగాలని బలంగా కోరుకుంటాడో, అతని మూలాలు భూమి లోపలి చీకటి పొరల్లోకి అంత బలంగా పాతుకుపోవాలి" అన్నాడు జరతూస్త్ర.

"అవును.. మీరు చెప్పేది నిజం.... చీకటి పొరల్లోకి..." అని ఏడుస్తూ.. "నేను ఎత్తులను అధిగమిస్తున్నప్పటికి నన్ను నేను విశ్వసించలేకపోతున్నాను. నన్నెవరూ విశ్వసించలేకపోతున్నారు. నేను తరచుగా ఎత్తులను అధిరోహిస్తున్న ప్రతిసారి అదుపు తప్పుతున్నాను. ఆ ఎత్తులు నన్ను క్షమించవని నాకు తెలుసు. ఎత్తులను అధిరోహిస్తున్న ప్రతిసారీ నాకు నేను ఒంటరిగా కనిపిస్తున్నాను. ఎవరూ నాతో మాట్లాడడం లేదు కూడా. ఏకాంతం యొక్క మంచు నన్ను వణికిస్తుంది" అని తన బాధను వెళ్ళగక్కి మౌనంగా ఉండిపోయాడు ఆ యువకుడు.

"ఈ చెట్టు ఇక్కడే కొండపై ఒంటరిగా ఉంది. ఒకవేళ ఇది మాట్లాడా లనుకుంటే, దానిని అర్థం చేసుకోగలిగేవారెవ్వరూ ఉండరు. అది మేఘాల ఎత్తులను చేరుకోవడానికి వాటినుండి వచ్చే మెరుపుల్ని తాకడానికి ఇంకా ఇంకా ఎదుగుతూనే ఉంటుంది. అది ఎంత ఎత్తులకు చేరాలని కోరుకుంటుందో అది దాని వేర్లను భూమి లోతుల్లోని చీకటి పొరల్లోకి అంత బలంగా పాతుతుంది" అన్నాడు జరతూస్త్ర.

జరతూస్త్ర ఈ విషయం చెప్పినప్పుడు ఆ యువకుడు ఏడుస్తూ కన్నీళ్లు పెట్టుకుంటూ "అవును.. జరతూస్త్ర.. నువ్వు మాట్లాడుతున్నది నిజం. నేను ఎత్తులను చేరుకోవాలని ఆశించాను. నేను ఎదురుచూస్తున్న ఆ మెరుపువి నువ్వే. నన్ను ఇంత ఆవేదనకు గురిచేస్తున్నది, నాశనం చేసినది నీ పట్ల నా అసూయే.." అన్నాడు.

జరతూస్త్ర అతని భుజం మీద చెయ్యి వేసి అతనితో కలిసి కొంతదూరం నడుస్తాడు.

జరతూస్త్ర మాట్లాడటం ప్రారంభించాడు.

"ఇది నా హృదయాన్ని బాధకి గురిచేసింది. నీ మాటలు వ్యక్తపరిచే వాటి కన్నా, నీ కళ్ళు నాకు ఎక్కువ వ్యక్తపరుస్తున్నాయి. నువ్వింకా బందీగానే ఉన్నావు. అందుకే స్వేచ్ఛను కోరుకుంటున్నావు. నువ్వింకా స్వేచ్ఛగా ఇంకా ఎత్తులను చేరాలని కోరుకుంటున్నావు. కానీ నీ చెడు ప్రవృత్తులు కూడా స్వేచ్ఛ కోసం అంతే దాహంగా ఉన్నాయి. అవి కూడా స్వేచ్ఛను కోరుకుంటున్నాయి. స్వేచ్ఛ విషయంలో నువ్వు ఇంకా బందీగానే ఉన్నావు. అటువంటి బందీల యొక్క ఆత్మ చాలా తెలివైనది, మోసపూరితమైనది, చెడ్డది కూడా. తనను తాను శుద్ధి చేసుకోవటానికి అటువంటి ఆత్మ నుండి విముక్తి పొందడం చాలా అవసరం.

నీపట్ల నాకున్న ప్రేమతో నేను నిన్ను వేడుకుంటున్నాను. నీ ప్రేమను వదలవద్దు. నీ ఆశను దూరం చేసుకోవద్దు. నువ్వు గొప్పవాడివే. ఇతరులు కూడా నువ్వు గొప్పవాడని నమ్ముతున్నారు. అయినప్పటికీ వారు నీపై ద్వేషాన్ని, పగని పెంచుకుంటారు.

మంచివారికి, గొప్పవాడెప్పుడు వారి మార్గానికి ఒక అడ్డంకిలా నిలబడతాడు. వారు అతన్ని మంచివాడని పిలిచినప్పటికీ అతన్ని దూరంగా ఉంచాలని కోరుకుంటారు. గొప్పవారు కొత్త విలువలను సృష్టించాలని కోరుకుంటారు. కానీ మంచివారు పాతవి పరిరక్షించబడాలని కోరుకుంటారు. అత్యున్నత ఆశను కోల్పోయిన గొప్పవారి గురించి నాకు బాగా తెలుసు. ఆపై వారు వారి గొప్ప గొప్ప ఆశలను అగౌరవపరిచారు. ప్రస్తుతం వారు తాత్కాలిక ఆనందాలలో సిగ్గు లేకుండా జీవిస్తున్నారు. ఆశయం చాలా గొప్పదని వారు చెప్పారు. కానీ వారు

వారి ఆశయం యొక్క రెక్కలను విరిచేశారు. ఒకప్పుడు వారు హీరోలు కావాలని ఆశించారు. కానీ ఇప్పుడు వారు విలాస ఇంద్రియ శాస్త్రవేత్తలుగా మారిపోయారు.

కానీ నీపట్ల నాకున్న ప్రేమతో, ఆశతో నిన్ను వేడుకుంటున్నాను, నీ ఆత్మలోని హీరోని దూరం చేసుకోవద్దు. నీ అత్యున్నత ఆశను పవిత్రంగా కొనసాగించు" అని జరతూస్త్ర ఆ యువకుడ్ని కోరాడు.

**నోట్:** ప్రపంచంలో పాపాలుగా పిలవబడేవాటిని కొత్తమార్గంలో ఉపయోగించి సూపర్ మాన్ స్థితిని చేరుకోవడం జరతూస్త్ర ఉద్దేశం. అందులో అసూయ ఒకటి.

క్రైస్తవ బోధనలు అసూయ అనేది నివారించవలసిన స్థితి అని చెప్తున్నాయి. జరతూస్త్ర దృష్టిలో సూపర్ మాన్ కావడానికి అసూయ ఒక ముఖ్య సాధనం. ఒక మనిషి తనకన్నా ఎక్కువ సాధించినవారిని చూసి ఉన్నతమైన స్థితిని పొందడానికి అసూయ పడాలి అంటాడు జరతూస్త్ర. తన శిష్యులకు అతన్ని అసూయపర్చాలని, అతను సాధించిన ఉన్నతస్థితిపై వారు అసూయపడాలని, అసూయ ద్వారానే మానవాళిని అధిగమించి మనిషి సూపర్ మాన్‌ని చేరుకో గలడని, అసూయలో దహించుకుపోవడం కంటే దానిని సూపర్ మాన్ స్థితికి చేరుకోవడానికి ఉపయోగించుకోవాలి అంటాడు జరతూస్త్ర.

❖ ❖ ❖

# యుద్ధ వీరులారా!

(జ్ఞానాన్ని అనుసరించే వారు గొప్ప క్రమశిక్షణతో ఉండాలి. జరతూస్త్ర దానిని యుద్ధంతో పోల్చాడు. క్రైస్తవ ధర్మాల కంటే ఇది మానవాళికి చాలా చేసిందని పేర్కొన్నాడు. నీషే యొక్క అన్ని రచనలలో చాలా తప్పుగా అర్థం చేసుకోబడిన అధ్యాయాల్లో ఇదొకటి.

"మీరు కొత్త యుద్ధాలను సాధనంగా చేసుకొని చిరకాల శాంతిని స్థాపించాలి" అనే Quote, నీషేని నాజీల దృష్టిలో దేవుడ్ని చేసింది. సందర్భానుసారంగా ఇటువంటి Quotes చదివినవారికి నీషే ఒక మేధో, అంతర్గత పోరాటం గురించి మాట్లాడుతున్నారని, హింస, రక్తపాతం, యుద్ధం గురించి కాదని తెలుసుకుంటారు. సాధారణంగా, నీషే ఈ పోరాటాన్ని ఎత్తైన పర్వతాన్ని అధిరోహించడంతో పోల్చాడు. )

మీరు స్నేహితుడిని ఎంచుకునేటప్పుడు జాగ్రత్తగా ఉండవలసిన అవసరం లేదు. కానీ మీ శత్రువును ఎంచుకునేటప్పుడు చాలా జాగ్రత్తగా ఉండాలి అంటాడు జరతూస్త్ర. మీరు ఎంచుకునే శత్రువు సాధ్యమైనంత వరకు మీకంటే ఎక్కువ ఉత్తమమైన లక్షణాలను కలిగి ఉండాలి. ఎందుకంటే భవిష్యత్తులో మీరు అతనితో పోరాడబోతున్నారు. మీరు ఎప్పుడైతే మీ శత్రువుతో పోరాడడం మొదలుపెడతారో అప్పటినుండి నెమ్మది నెమ్మదిగా మీరు మీ శత్రువులా మారిపోతారు. బలహీనమైన, తక్కువ స్థాయి శత్రువును ఎప్పటికీ ఎంచుకోకండి. లేకపోతే మీ విజయంలో కూడా మీరు ఓడిపోతారు, ఎందుకంటే మీరు మీ శత్రువులాగానే వ్యూహాలను, కుతంత్రాలను, యుద్ధనైపుణ్యతలను నేర్చుకోవాలి లేకపోతే మీరు అతనితో యుద్ధం చెయ్యలేరు. మీకంటే తెలివైన, బలమైన శత్రువును ఎంచుకోండి. అతనితో పోరాడటానికి మీరు తెలివిగా ఉండాల్సిన అవసరం కొనితెచ్చుకోండి. అతనితో పోరాడటం వలన మీరు అతనిలాగే తయారవుతారు లేదా అంతకంటే ఎక్కువ బలంగా తయారవుతారు. తక్కువ ఐతే అవ్వరు. మీరు ఓడిపోయారా.. విజయం సాధించారా అనేది అనవసరం. సరైన శత్రువు యొక్క ఎంపికే ముఖ్యమని గుర్తుంచుకోండి. శత్రువు లేకపోతే మీకు జీవితంలో ఎలాంటి సవాళ్లు ఉండవు. కానీ అన్ని మతాలు, తత్వవేత్తలు అని పిలవబడేవారందరూ మీకు శత్రువులు ఉండకూడదనే బోధించారు. వారి బోధనలు ఎదుగుదలకు, బలంగా ఉండటానికి సంబంధించిన అన్ని సవాళ్ళను, యుద్ధంలో వీరుడిగా, తెలివిగా ఉండడానికి కావల్సిన సవాళ్ళను, ఎప్పటికప్పుడు ఎరుకగా ఉండడానికి కావల్సిన తెలివి తేటలను దూరం చేస్తాయి. ప్రజలు శాంతి కోసం ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. అలా అని వారు నిజంగా ఈ శాంతి గురించి బోధించే వారి ప్రవక్తలని, వారి బోధనలను అర్థం చేసుకున్నారని కాదు. అవి వారి పిరికితనానికి దొరికిన మంచి ఓదార్పు అవకాశం మాత్రమే.

అలా అని జరతూస్త్ర మీరు హింసాత్మకంగా ఉండాలని, ఇతరులను చంపాలని, నాశనం చేయాలని అనడం లేదు.

మీరలా అనుకుంటే నీషేని చాలా తప్పుగా అర్థం చేసుకున్నట్టే.. అలా చరిత్రలో నీషేని తప్పుగా అర్థం చేసుకున్న అడాల్ఫ్ హిట్లర్ రెండవ ప్రపంచ యుద్ధానికి కారణం అయ్యాడు.. మీరు విధ్వంసకారిగా, దూకుడుగా ఉండాల్సిన అవసరం లేదు కానీ, ఎల్లప్పుడూ యుద్ధానికి సిద్ధంగా ఉండాలి. మీకు శాంతి

కావాలంటే, మీ బాణం, విల్లు ఎల్లప్పుడు సిద్ధంగా ఉంచుకోవాలి అంటాడు జరతూస్త్ర.

మిమ్మల్ని చంపడం ప్రారంభించమని అతను అనడం లేదు. కానీ మిమ్మల్ని నాశనం చేయడానికి వచ్చిన శత్రువు మీద కనికరం చూపించాల్సిన అవసరం లేదు అంటాడు. ఒకరు నిజంగా అహింసావాదిలా బ్రతకాలనుకుంటే ఒక యోధుడిలా, ఒక సైనికుడిలా, ఒక సమురాయ్‌లా ఉండాలి. యుద్ధకళ తెలిసి ఉండాలి... చంపడానికి కాదు... మిమ్మల్ని మీరు కాపాడుకోవడానికి, స్వేచ్ఛగా బ్రతకడానికి.

జరతూస్త్ర 'నేను మీ మంచి శత్రువుని' అంటూ సవాలు విసురుతాడు. నేను యోధుడనే, ఇంకా చెప్పాలంటే నేను మీ ఉత్తమ శత్రువుని, ఎందుకంటే నేను దూకుడుగా లేను అంటాడు. అప్పుడే అతడు తన గౌరవాన్ని, స్వేచ్ఛని కాపాడుకోగలడు.

మీరు శత్రువు కోసం ఎప్పుడూ ఎదురుచూస్తూ ఉండాలి. మొదట్లో మీరు యోధునిగా ఉండటంవల్ల మీ శత్రువుల మీద కొంత ద్వేషం ఉంటుంది. కానీ అది కేవలం మీ బలహీనత మాత్రమే. నిజానికి యోధుడికి ఎలాంటి ద్వేషం ఉండకూడదు. యుద్ధం అంటే ఒక క్రీడలా చూడాలి. క్రీడాకారుడిలా యుద్ధం కొనసాగించాలి. ద్వేషంతో కాకుండా స్వచ్ఛమైన ఆనందం కోసం పోరాడాలి. సవాలు సమాధానం ఇవ్వకూడదు. ఇది చేతులతో చేసుకునే ముష్టియుద్ధం కాదు. మీరు మీ అభిప్రాయాల కోసం మీ శత్రువును వెతకాలి. 'సత్యం' నాది కాదు అలా అని మీది కాదు. కానీ నా అభిప్రాయం సత్యానికి దగ్గరగా ఉండే అవకాశం ఉంది కానీ, మీ అభిప్రాయం అంత దగ్గరగా ఉండకపోవచ్చు. లేదా మీ అభిప్రాయం సత్యానికి దగ్గరగా ఉండవచ్చు, నా అభిప్రాయం అంత దగ్గరగా ఉండకపోవచ్చు. దేశవ్యాప్తంగా ఇలాంటి చర్చలు ప్రజల తెలివితేటల స్థాయిని పెంచాయి. ప్రపంచవ్యాప్తంగా గొప్ప ఆలోచనాపరులు తమ సూక్ష్మతర్కంతో ఒకరితో ఒకరు కుస్తీ పడ్డారు. మొత్తం ప్రపంచ వాతావరణం భావప్రకటనా స్వేచ్ఛ, మరియు ఇతరులను ఒప్పించే స్వేచ్ఛ, లేదా ఇతరులు చేత ఒప్పించబడే స్వేచ్ఛతో నిండిపోయింది. ఇది నిజంగా నిజమైన యుద్ధం. పవిత్రయుద్ధం, అభిప్రాయాల యుద్ధం, ఆలోచనలను రేకెత్తించే యుద్ధం, జ్ఞానానికి సంబంధించిన యుద్ధం. ఆయుధాలతో యుద్ధం అనేది నీచం. జంతుస్వభావం. కానీ

అభిప్రాయాలు, తత్వాలు, మొత్తం మానవాళి యొక్క ఆలోచనలను, భావాలను ఉన్నత స్థాయికి పెంచాయి.

ప్రపంచానికి మేధస్సుకి సంబంధించిన యోధులు కావాలి, ఒకవేళ మీ అభిప్రాయాలు ఓడిపోతే, మీ నిజాయితీ ఇంకా దానిపై విజయం సాధించాలి. మీ అభిప్రాయం ఓడిపోయినప్పటికీ చింతించకండి, కనీసం మీ నిజాయితీని మీ విజయంగా ప్రకటించండి. మీరు శాంతికాముకుడిగా మారకూడదు, ఎందుకంటే శాంతికాముకుడిగా మారడం శాంతివాదం మీద నమ్మకం లేనివారికి బాధితులుగా మారడం మాత్రమే.

మీరు శాంతిని ప్రేమించాలి, కానీ మీరు ఎల్లప్పుడూ కొత్త యుద్ధాలకు సిద్ధంగా ఉండాలి. ఆ యుద్ధాలు జరగనవసరం లేదు, కానీ మీరు మీ విల్లును విశ్రాంతి తీసుకోనివ్వకూడదు మరియు మీరు మీ బాణాలను మరచిపోకూడదు. మీ కత్తులపై దుమ్ముని చేరనివ్వకూడదు.

అది సాధారణ యుద్ధమైనా... లేక మేధోపరమైన యుద్ధమైనా... ఎల్లప్పుడూ సంసిద్ధంగా ఉండాలి. మీ సంసిద్ధత మీకు అందాన్ని, అలంకారాన్ని ఇవ్వాలి. ఎంత ఎక్కువ శాంతి ఉంటే అంత ఎక్కువ విశ్రాంతి ఉంటుంది. చాలామంది యుద్ధం ఉండబోదని అనుకుంటూ ఉంటారు. కానీ యుద్ధం ఏ స్థాయిలోనైనా ఏ క్షణమైనా ఉంటుందని అందరూ తెలుసుకోవాలి. యుద్ధాలను ఖండించకూడదు. మానవాళి సృష్టించిన ఆయుధాలను ఖండించాలి. కళ, సంగీతం, నృత్యం, వాస్తుశిల్పం, విలువిద్య, ఖడ్గవిద్య, కుస్తీలాగా యుద్ధం కూడా ఒక కళ అని గుర్తించాలి.

ప్రపంచవ్యాప్తంగా శాంతిని స్థాపిస్తే అప్పుడు యుద్ధం అనేది ఉండదు. సవాళ్లు ఉండవు. మానవులు దుర్బలులు అవుతారు. అప్పుడు రూపాంతరం చెందడానికి అవకాశం ఉండదు. ఒంటెలు మరింత దుర్బలంగా తయారవుతాయి. అవి సింహాలుగా మారే అవకాశం ఉందనే విషయం కూడా పూర్తిగా మరచిపోతాయి.

దాతృత్వం కంటే 'యుద్ధం' మరియు 'ధైర్యం' చాలా గొప్పవి.

దాతృత్వంలో మొదట మీరే వారిని పేదలను చేస్తారు, ఆపై మీరే దానధర్మాలు

చేస్తారు. ఒకవైపు దోపిడీలు చేస్తూనే మరోవైపు దానధర్మాలు చేస్తుంటారు. దాతృత్వం ఒక వింత ఆట. దాతృత్వం అవసరమయ్యే దేనినైనా నిరోధించాలి. దాతృత్వం అనేది ఒక వికారమైన భావన. ఉన్నదానిని పంచుకోవడం మరొక విషయం. మీరు మీ సమఉజ్జీలతోనే పంచుకుంటారు. దాతృత్వం అంటే అవతలి వ్యక్తిని కించపరచడమే.

దీర్ఘాయువు లక్ష్యం కాదు. జీవితం చిన్నదైనప్పటికీ, దాన్ని పూర్తిగా ఆస్వాదించండి. తీవ్రతతో జీవించండి. దాన్ని పాటగా చేసుకోండి, నృత్యంగా మలుచుకోండి. ఎక్కువకాలం జీవించాలనుకోవడం అర్థరహితం. మీ మూఢ నమ్మకాలకు, దురభిప్రాయాలకు దూరంగా ఉండండి. ఈ జరతూస్త్ర మనిషి యోధుని లక్షణాలను కోల్పోవడాన్ని ఇష్టపడడు. మనిషి పిరికివాడిలా ఉండడానికి అతడు అంగీకరించడు. జీవితంలో సవాళ్లను స్వీకరించడానికి ధైర్యం లేని మనిషి అసమర్థతని జరతూస్త్ర సహించడు. మనిషి యుద్ధానికి ఎప్పుడూ సిద్ధంగా ఉండాలి.

అతని కత్తి పదునైనదిగా ఉండాలి, అతని తెలివితేటలు ఇంకా పదునుగా ఉండాలి. అప్పుడు మాత్రమే, శాంతి ఉంటుంది. ఎప్పుడైతే అందరూ తెలివిగా, కళాత్మకంగా, చావుకి కూడా సిద్ధంగా ఉంటారో అప్పుడు బానిసత్వం అనేదే ఉండదు. ఏదైనా అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉన్న జీవితం, ఎటువంటి భయం లేకుండా ప్రమాదకరంగా జీవించగల జీవితమే నిజమైన జీవితం.

❖ ❖ ❖

## రాజ్యం

తన శిష్యుల మనస్సులపై పూర్తి నియంత్రణ సాధించాలంటే, తన శిష్యులు తన అనుచరులుగా, స్నేహితులుగా మారడానికి ముందే వారిలో రాజ్యం మరియు పరిపాలనపట్ల వారికున్న భావనలను విచ్ఛిన్నం చెయ్యాలనే ఆలోచనతో ఈ ప్రసంగం మొదలవుతుంది.

రాజ్యం పట్ల ప్రజలకి ఉన్న భక్తి, విధేయత, దైవభక్తిని అధిగమించింది అంటాడు జరతూస్త్ర.

“సోదరులారా..! మనకు దూరంగా అక్కడి ప్రజలు గుంపులు గుంపులుగా నివసిస్తున్నారు. వారు వాటిని రాజ్యాలు, రాష్ట్రాలు, దేశాలు అంటారు.

రాజ్యం అంటే ఏంటో తెలియదు కదూ మీకు..! రండి... నా మాటల కోసం మీ చెవులు తెరిచి ఉంచండి. నేను మీకు గుంపులు గుంపులుగా రోజూ మరణిస్తున్న ప్రజల గురించి వివరిస్తాను.

రాజ్యం దృష్టిలో అందరూ సమానమే. రాజ్యం భిన్నంగా జీవించడానికి, భిన్నంగా ఆలోచించడానికి, సృజనాత్మకంగా ఉండటానికి ఎవ్వర్నీ అనుమతించదు. రాజ్యం భిన్నత్వాన్ని సహించదు. రాజ్యంలో ప్రజలు దాని మంచిచెడుల గురించి మాట్లాడుతారు. కానీ అవి వారి పొరుగువారికి కూడా అర్థం కానంత గందర గోళాన్ని రాజ్యం సృష్టిస్తుంది. రాజ్యం ఆచారాలు మరియు హక్కులకు సంబంధించిన తనదైన సొంతభాషను సృష్టిస్తుంది. ఆ భాష తనకు తప్ప ఇంకెవరికీ అర్థంకాని విధంగా ఉంటుంది. రాజ్యం, మంచిచెడు భాషల గందరగోళం సృష్టిస్తుంది. నిశ్చయంగా ఈ సంకేతం మరణసంకల్పంగా సూచిస్తుంది. వారు ఎల్లప్పుడూ అనారోగ్యంతో ఉంటారు.

వారు తమ చెత్త ఆలోచనల్ని వాంతి చేసుకునే ప్రదేశాన్ని వార్తాపత్రిక అని పిలుస్తారు. రాజ్యం ప్రజలను అంతిమ మానవుల్నిగా మార్చే పనిలో ఉంటుంది. ఎప్పుడైతే రాజ్యం అంతరిస్తుందో అప్పుడు సూపర్ మాన్ ఉద్భవిస్తాడు.

అక్కడ ప్రజలు ఇంకా కొంతమంది ఉన్నారు, కానీ వారితో మనకు ఎటువంటి సంబంధం లేదు. అక్కడ రాజ్యాలు ఉన్నాయి. మంద ఎప్పుడూ తాము కేవలం గొర్రెలని, తమల్ని కాపలా కాయడానికి గొర్రెలకాపరి అవసరమని నమ్ముతారు. కానీ ఏకాంతగా ఉండే వ్యక్తి గౌరవంగా జీవిస్తూ అహంకారంగా ఉంటాడు. అతను మానవత్వం అనే ముసుగు వెనక యాంత్రికంగా ఉండటానికి ఇష్టపడడు. అతను ప్రపంచానికి కొంత అందం, కొంత ఆనందం, కొంత పారవశ్యం అందించాలని కోరుకుంటాడు. అతను తన ప్రేమను, జ్ఞానాన్ని పంచాలని కోరుకుంటాడు.

ప్రజలు రాజ్యం ముసుగున ఇటువంటి వ్యక్తులపై మోసపూరిత మార్గాల్లో వారికంటే బలంగా ఉండటానికి ప్రయత్నిస్తూ ఉంటారు. బలహీనులు ఎప్పుడూ కపటబుద్ధితో ఉంటారు. జిత్తులమారితనం వారి రక్షణ. మంద కపటబుద్ధితో గొప్ప చాకచక్యంతో సృష్టించినదే ఈ రాజ్యం. మందని, మనోవికాసం లేనివారిని, బలహీనులని, జీవచ్ఛవంలా జీవించేవారిని రక్షిస్తూ ఉంటుంది రాజ్యం. మానవ

వ్యవహారాలపై అవగాహన ఉన్న వారెవరైనా రాజ్యానికి వ్యతిరేకంగా ఉంటారు. ఎందుకంటే రాజ్యం మనిషి యొక్క బానిసత్వానికి చిహ్నం.

'నేను ప్రజల సేవకుడిని' అని రాజ్యం చెబుతున్నప్పటికీ, వాస్తవికత దానికి విరుద్ధం. ఈ సేవకుడు యజమాని అవుతాడు, ఎందుకంటే దానికి సర్వాధికారాలు ఉన్నాయి. దాని దగ్గర ఆయుధాలు ఉన్నాయి. ఈ శక్తి అంతా చనిపోయిన సంప్రదాయానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేసేవారిపై, మూఢనమ్మకాలపై తిరుగుబాటు చేసే కొద్దిమంది వ్యక్తులపై ఉపయోగించబడుతోంది. ప్రతి రాజ్యం అబద్ధాలతో ప్రజలను నిద్రబుచ్చుతుంది.

కానీ ప్రజల్ని నిజంగా ప్రేమించే వ్యక్తులు 'సృజనాత్మకమైన వ్యక్తులు'. వారే నిజమైన శక్తిని కలిగి ఉన్న వ్యక్తులు, ఎందుకంటే వారు సృష్టిలో పాల్గొంటారు.. ఏదోకటి సృష్టిస్తూ ఉంటారు. వారు ప్రజలకు వారి సృజనాత్మకతతో అభిషేకం చేస్తారు. వారు ప్రజలలో కోరికను రేకెత్తిస్తారు. వారు ప్రజలలో నమ్మకాన్ని సృష్టిస్తారు. కానీ నిజమైన చరిత్ర ఎప్పుడూ వ్రాయబడలేదు. చరిత్ర ఎప్పుడూ ఏమీ సృష్టించని వారి పేర్లను, హంతకుల పేర్లను, నాశనం చేసేవారి పేర్లను లెక్కిస్తుంది.

మీరు వేటినైతే ఎంత ఎక్కువ కలిగి ఉంటారో వాటికి అంత ఎక్కువగా బానిసలు అవుతారు. వస్తువులను ఉపయోగించండి, కానీ వాటిని కలిగి ఉండకండి. కానీ ఏదైనా కలిగి ఉంటే తప్ప దాన్ని ఆస్వాదించలేని వ్యక్తులు ఉన్నారు. మీరు చనిపోయిన వస్తువులను స్వాధీనపరుచుకోవచ్చు కానీ జీవం ఉన్నవాటిని స్వాధీనపరుచుకోవాలనే ఆలోచన వారి స్వేచ్ఛను హరిస్తుంది. రాజ్యం కూడా అటువంటిదే. స్వేచ్ఛ అనేది మానవాళికి ఆత్మ వంటిది.

మతాలన్నీ పేదరికాన్ని ప్రశంసించాయి. పేదలు ధన్యులని సంబోధించాయి. వారే దేవుని రాజ్యానికి వారసులని ప్రబోధించాయి. కానీ నేను మితమైన పేదరికానికి అనుకూలం అంటాడు జరతూస్త్ర. అది మిమ్మల్ని నాశనం చేసే పేదరికం కాదు, మిమ్మల్ని ఆకలితో ఉంచే పేదరికం కాదు. ప్రతి ఒక్కరూ జీవితానికి అవసరమైన మితమైన విషయాలతో సంతోషంగా ఉండటానికి ఇష్టపడితే, పేదరికమనేదే ఉండదు. తన పేదరికం కారణంగా చనిపోయేంత పేదలుగా ఎవరూ ఉండకూడదని జరతూస్త్ర అంటాడు.

రాజ్యం ఆగిపోయిన చోట మాత్రమే సూపర్ మాన్ అనే ప్రత్యేకమైన వ్యక్తి ఉనికిలోకి వస్తాడు. బలహీనులు లక్షలమంది ప్రజలచే గౌరవించబడేవారిని సహించలేరు. వారు శక్తి యొక్క భాషను మాత్రమే అర్థం చేసుకుంటారు కానీ వారు ప్రేమభాషను అర్థం చేసుకోలేరు. సృజనాత్మకత యొక్క భాష వారికి అర్థం కాదు. కవి ఎవరిపైనా ఆధిపత్యాన్ని చెలాయించడు. అతను తన కవితల ద్వారా, పాటల ద్వారా ఆనందాన్ని ప్రజలతో పంచుకుంటాడు. అతనే నిజమైన చక్రవర్తి.

నా సోదరులారా! రాజ్యం అంతరించిపోయే చోట మీరు చూడలేదా సూపర్ మాన్ యొక్క వంతెనలు" అంటాడు జరతూస్త్ర.

❖ ❖ ❖

# షో మాన్

జరతూస్త్ర మొదట్లో వచ్చిన సంతకి మరల తిరిగి వస్తాడు. రాజ్యం గురించి తన ప్రసంగాన్ని ముగించిన తరువాత, ఆలోచనలు ప్రవహించే, రేకెత్తించే సంత గురించి మరియు అక్కడున్న ప్రజల వర్గీకరణ గురించి తన శిష్యుడికి వివరిస్తాడు.

ఇక్కడ షోమాన్‌లాంటి గొప్ప వ్యక్తులు ఉన్నారు. వారు ప్రజలను బాగా ఆకర్షించగలరు మరియు వారు వారి అభిప్రాయాలను, ఆలోచనలను ఉద్రేకంతో బాగా వ్యక్తపరచగలరు. ఈ షో మాన్‌లు తొంభై తొమ్మిది శాతం ఉండి, గొప్ప వ్యక్తులు ఒక్క శాతమే ఉన్నప్పటికీ ప్రపంచంలో అందంగా ఉన్నవన్నీ వేళ్ళ మీద లెక్కించగల ఈ కొద్దిమంది గొప్పవారిచే సృష్టించబడతాయి. ఈ షో మాన్ భూమికి కేవలం భారం మాత్రమే. నా ప్రజలు షో మాన్‌లా ఉండకూడదని, భూమికి భారం కాకూడదని నేను కోరుకుంటున్నాను.

కీర్తికోసం ప్రాకులాడే ఈ షోమాన్‌లు ఉత్తమ ప్రదర్శనకారులు, నామమాత్రపు రాజకీయ నాయకులు మరియు మేధావులు. ప్రేక్షకులను ఎలా ఆకర్షించాలో, ఆలోచనల ద్వారా ఎలా ఆధిపత్యం చెలాయించాలో వారికి బాగా తెలుసు. ఈ శక్తివంతమైన వ్యక్తులు సంతలో ఉండే ఈగలలాంటివారు. ప్రజల్ని అంతిమ మానవులుగా మార్చడమే వారి పని.

నిరంతరం సంతలో ఉండిపోవడం నిన్ను నువ్వు అధిగమించే మార్గం కాదు. ఆలోచనలు వెలుగులోకి రావాలన్నా.. అవి కార్యరూపం దాల్చుకోవా

లనుకున్నా... ఏకాంతాన్ని నీ నివాసం చేసుకోవాలి. పోటీ, కీర్తి పొందాలనే కోరిక, ఆధిపత్యం చెలాయించాలనే కోరిక విషపూరితమైనవి.

మిత్రమా, నీ ఏకాంతంలోకి పారిపో....

సృష్టికర్త అనేవాడు గుంపులో ఉండడం మరియు ఆ గుంపుకి దగ్గరగా ఉండటం చాలా ప్రమాదకరం. తెలిసో తెలియకో మీరు వారిలో ప్రతీకారజ్వాలను రేకిత్తిస్తారు. వారి ప్రతీకారంతో మిమ్మల్ని చుట్టుముట్టడం ద్వారా మీ సృజనాత్మకతను, మీ గొప్పతనాన్ని నాశనం చేస్తారు. మీరు విషపూరిత ఈగల ద్వారా బాధపడుతున్నారని నేను గమనిస్తున్నాను. కానీ ఈ చిన్న వ్యక్తులపై, షో మాన్‌లపై కోపాన్ని ప్రదర్శించడం అర్థం లేని విషయం. వారు చేయగలిగినది అది మాత్రమే. నాకు తెలుసు. వాళ్ళు మిమ్మల్ని వారి స్థాయికి లాగి కోపగించడానికి ప్రయత్నిస్తారు. మీరు వాళ్ళతో పోరాడకండి. ఎందుకంటే వారు చాలామంది. మీరు వారిని కోపగించుకోకండి. ఎందుకంటే వారు దయనీయంగా, అనారోగ్యంతో ఉన్నారు.

వారు మీకు అన్ని రకాల హాని చేస్తున్నప్పటికీ, వారిపట్ల కరుణగా ఉండండి. వారు సృజనాత్మకత వ్యక్తుల ముందు ఆత్మన్యూనతాభావంతో తీవ్రంగా బాధ పడతారు. ఆ ఆత్మన్యూనత కారణంగానే నైతికత పేరిట, సంస్కృతి పేరిట, మతం పేరిట అనేక తప్పుడు సాకులతో వారు మీపై ప్రతీకారం తీర్చుకోవడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటారు. సోక్రటీస్ సంస్కృతిని నాశనం చేయలేదు.. నైతికతను నాశనం చేయలేదు.. యువకులను నాశనం చెయ్యలేదు... మతాన్ని నాశనం చేయలేదు. కానీ వారు సోక్రటీస్‌ని విషం ఇచ్చి చంపారు. దీనికి విరుద్ధంగా సోక్రటీస్ వంటి వ్యక్తులు నిజమైన సంస్కృతి, ప్రామాణికమైన నైతికత యొక్క వ్యవస్థాపకులుగా ఆవిర్భవించారు. కానీ అతను షో మాన్‌ని, చిన్నమనిషిని కించపరిచాడు. అతను వారి ఉనికి హీనమైనదని గుర్తుచేశాడు. అందుకే వారు అతనికి విషం ఇచ్చి చంపారు. “ఒంటెలు పర్వతాల దగ్గరకు వెళ్లడానికి ఇష్టపడవు” అనే సామెత ఉంది. అందువల్ల వారు పర్వతాలు ఉన్న ఎడారులలో నివసించడానికి ఇష్టపడరు. అందుకే పర్వతం పక్కన ఒంటెలు ఆత్మనూన్యత భావానికి గురవుతాయి. కాబట్టి పర్వతాలను తొలగించాలి, ఎడారులు సృష్టించాలి అంటాడు షో మాన్.

❖ ❖ ❖

# స్నేహం

తత్వవేత్తలచే విస్మరించబడిన విషయాలలో స్నేహం ఒకటి. దానర్థం ఏమిటో మనం అర్థం చేసుకున్నామని భావించాము. అందువల్ల దాని లోతుల గురించి, దానివలన ఉన్న పెరుగుదల అవకాశాల గురించి, విభిన్న ప్రాముఖ్యతల గురించి మానవుడు ఇంకా అజ్ఞానంలోనే ఉన్నాడు. ఈ ప్రసంగంలో జరతూస్త్ర తన శిష్యుడైన ఒకరితో స్నేహం గురించి మాట్లాడుతాడు. స్నేహం స్నేహితుల మధ్య అసూయను ప్రేరేపించేలా ఉండాలని, ఆ అసూయా, ఈర్ష్యలతో ఉన్నత శిఖరాలను అధిరోహించడానికి ఒకరికొకరు సహాయపడాలని అంటాడు జరతూస్త్ర.

ఏకాంతంగా ఉండటానికి చేతకాని వాడికే స్నేహితులు అవసరం అవుతారు. తనమీద నమ్మకం లేనివాడే ఇతరులని బలంగా నమ్ముతాడు. అందుకే మనిషి తనను నమ్మినవారినే ఎక్కువ నమ్ముతాడు.

నీ ఒంటరితనాన్ని పోగొట్టుకోవడానికి నీకో స్నేహితుడు కావాలి. అలాగే అతని ఒంటరితనం పోగొట్టడానికి అతనికి నీతో స్నేహం కావాలి. ఎందుకంటే మీకు ఏకాంతంగా జీవించడమంటే భయం. మీ ఇద్దరికీ ఏకాంతంగా జీవించాలంటే భయం. ఇక్కడ ఎవరికీ వారిపై విశ్వాసం కానీ, నమ్మకం కానీ లేదు.

మీ మీద మీకు నమ్మకం లేకుండా మీరు వేరేవారిపై నమ్మకం ఉంచలేరు. అది మిమ్మల్ని మీరు మోసం చేసుకోవడమే. తనమీద తనకి నమ్మకం లేకుండా గుడ్డిగా ఇతరులను నమ్మినవాడు ఏదో ఒక రోజు మోసపోక తప్పదు. ఎప్పుడూ నమ్మినవాడే మోసపోతాడు. యేసు కూడా తన తండ్రి అయినా యొహోవాపైనే నమ్మకం ఉంచాడు ఎందుకంటే యేసు సైతం తనని తాను విశ్వసించేంత ధైర్యవంతుడు కాదు కనుక. ఆ యొహోవా కూడా ఎవరిని నమ్ముతున్నాడో మనకు తెలియదు కానీ అతను కూడా ఎవరినో ఒకరిని నమ్మాలి. ఇది విశ్వాసుల యొక్క అనంతమైన గొలుసు. బహుశా ఎవరికి వారు ఇతరులు వారి శూన్యతను సంతృప్తిపరుస్తారని ఆశిస్తున్నారేమో. కానీ మీ శూన్యతను ఎవరూ సంతృప్తి పరచలేరు అనేది పచ్చినిజం. మీరు మీ శూన్యతను ఒంటరిగా ఎదుర్కోవాలి. మీరు అలా కలిసి ఉండటం వలన మీ ఒంటరితనం అదృశ్యమవుతుందని

అనుకోవడం అర్థం లేని విషయం. అది అదృశ్యం అవ్వకపోగా ఇంకా రెట్టింపు అవుతుంది. అందువలనే అన్ని సంబంధాలూ మరింత దుఃఖానికి, మరింత వేదనకు దారితీసాయి. ఒకరిపై విశ్వాసం కలిగి ఉండాలనే కోరిక నీలో ఉండే డొల్లతనాన్ని, ఎరుకలేనితనాన్ని బహిర్గతం చేస్తుంది.

మీ పరిస్థితిని మార్చుకోవడానికి ఇది మార్గం కాదు. ఇది తప్పుడు ఓదార్పుకు మార్గం. నిజానికి మీరు కోరుకోవల్సింది ఓదార్పు కాదు. మీ ఉనికి యొక్క పరివర్తన.

నిన్ను నువ్వు ప్రేమించలేకపోతే, నిన్ను ఎవరు ప్రేమిస్తారు?

నీకు నువ్వు స్నేహితుడిగా ఉండలేకపోతే, నీకు ఎవరు స్నేహితుడిగా ఉంటారు?

నీ మీద నీకే విశ్వాసం లేకపోతే.. నిన్ను ఎవరు విశ్వసిస్తారు...? పైపైన కురిపించే ప్రేమలతో అసూయలని అధిగమిస్తున్నాం అనే భ్రమతో జీవిస్తూ ఉంటారు ప్రజలు. మానవుని అవసరాలు చాలా లోతైనవి. ఆలోచనలు మోసపూరితమైనవి. ప్రజలు వికారమైన విషయాలకు అందమైన పేర్లను పెడుతుంటారు.

తరచుగా దాడి చేసే వ్యక్తులే దాడికి గురవుతారనే భయంతో దాడి చేసి మరీ శత్రువులను పెంచుకుంటారు. భయంవల్లనే ఎవరైనా ముందు దాడికి దిగుతారు. ఇది ఎదుటివారు దాడి చేస్తారేమో అని ఆలోచించి ముందుగా చేసే దాడి కాదు. ఎందుకంటే అది వారి బలంపట్ల వారికున్న అపనమ్మకం. వారి బలహీనత వారికి తెలుసు. వారి దుర్బలత్వం వారికి తెలుసు. ఆ భయం నుండి, బలహీనత నుండి వారిని వారు కాపాడుకోవడానికి ముందుగానే దాడికి దిగుతారు. ఎవరైనా దాడి చేసినప్పుడు అతను చాలా శక్తివంతుడు అందుకే దాడి చేస్తున్నాడనే ఉద్దేశంతో ఉంటారు. కానీ అది నిజం కాదు. అది అతని బలహీనత నుండి, ఆత్మన్యూనతాభావం వల్ల అతను మీకు అవకాశం ఇవ్వడానికి ఇష్టపడడు. మొదటిగా దాడి చేయడం. 'బహుశా అతను బలవంతుడు, శక్తివంతుడు కాకపోతే అతను దాడి చెయ్యడు కదా!' అని దాడి చేయబడిన వ్యక్తి అనుకుంటాడు.

"నా స్నేహితుడిగా ఉండండి" అని మీరు ఎవరినైనా అడగగలరు. కానీ నా శత్రువుగా అయినా ఉండు అని మీరు ఎప్పుడైనా ఎవరినైనా అడగగలరా?

అలా అడగకపోయినా మీకు స్నేహితుల కంటే శత్రువులే ఎక్కువ. కానీ మీరెప్పుడైనా ఆలోచించారా ఈ శత్రువులు ఎక్కడి నుండి వస్తారని.

"నా స్నేహితుడిగా ఉండండి" అని మీరు ఎవరినైనా అడిగినప్పుడు అది మీలో ఉన్న భయాన్ని బహిర్గతం చేస్తుంది… మీరు అతనిని మీ స్నేహితుడిగా ఉండండని అడగకపోతే అతను మీ శత్రువుగా మారే అవకాశం ఉందనే భయం మిమ్మల్నీ వెంటాడుతుంది.

నిజానికి స్నేహితుడిని సంపాదించడం శత్రువును సృష్టించడం రెండూ ఒక్కటే.. నేటి స్నేహితుడే రేపటి శత్రువు…

ఎవరైనా మీ శత్రువు కావచ్చు అని మీరు భావిస్తే..

"కనీసం నా శత్రువుగా అయినా ఉండు" అని నిజాయితీతో, మనస్ఫూర్తిగా అడగండి. అది మిమ్మల్ని ఇంకా బలోపేతం చేస్తుంది. సత్యం ఎల్లప్పుడూ మనిషిని బలంగా చేస్తుంది. సత్యానికి అంత బలం ఉంది. కానీ ప్రజలు అబద్ధాలపై ఎక్కువ ఆధారపడ్డారు.

వారు నిరంతరం అబద్ధపు స్నేహాలు చేసుకునే పనిలో నిమగ్నం అయ్యి పరిచయాలను పెంచుకుంటున్నారు. నిజానికి పరిచయాలు వేరు.. స్నేహం వేరు.. మీరు సమాజంలోని ఉన్నత వర్గాలవారితో, శక్తివంతమైన వ్యక్తులతో స్నేహం చేస్తుంటారు. తద్వారా వారు, మీరు సుఖంగా ఉండాలని, వారు మీకు విరుద్ధంగా ఉండరనే భ్రమలో ఉంటారు. కానీ నిజానికి ఇది స్నేహవలయం కాదు. మీకు మీరుగా నిర్మించుకున్న రక్షణవలయం మాత్రమే. కానీ ఇది మిమ్మల్ని ఇంకా బలహీనపరుస్తుంది. మీకు నిజంగా స్నేహితుడు కావాలంటే, అతని శత్రువులను నీ శత్రువులుగా గుర్తించాలి..

మీకు స్నేహితుడు కావాలంటే మీరు అతని కోసం యుద్ధం చేయడానికి సిద్ధంగా ఉండాలి. ఎందుకంటే స్నేహం అంటే ఒకరికొకరు మంచి రోజులలో, చెడు రోజులలో, ఆనందపు క్షణాలలో, విచారకరమైన క్షణాలలో, కీర్తి సమయాల్లో మరియు వైఫల్యసమయాల్లో మీరు అతని పక్షాన ఉంటారని అర్థం. యుద్ధం చేయడానికి మీరు మీ స్నేహితుడి శత్రువుకి శత్రువుగా ఉండగల సామర్థ్యం కలిగి ఉండాలి. ఒకవేళ మీరు భయపడి, పిరికివానిగా ఉంటే మరియు మీకు

శత్రువుగా ఉండగలిగే ధైర్యం లేకపోతే స్నేహితుడిగా ఉండాలనే ఆలోచనను మరచిపోండి.

హద్దులు మీరడం ద్వారా మాత్రమే మీరు మీ స్నేహితుడికి అతి దగ్గరగా వెళ్ళగలరు. కానీ అలా హద్దులు మీరడానికి ఎవరూ ఇష్టపడరు. ఎందుకంటే అక్కడే స్నేహం శత్రుత్వంగా మారుతుంది. ఇదొక విచిత్రమైన విషయం. దగ్గరగా ఉండటానికి మీరు హద్దులు మీరాలి. మీరు హద్దులు మీరకపోతే దూరంగా ఉంటారు. అప్పుడు స్నేహం అనేది ఒక లాంఛనప్రాయంగా మాత్రమే ఉంటుంది. హద్దులు మీరడం, అతన్ని బాధపెట్టడం, అతన్ని చికాకు పెట్టడం అతని రహస్యాల్ని మీకు చెప్పమని బలవంతం చేయడం శత్రుత్వానికి నాంది. అప్పుడు నీ స్నేహితుడిలో ఉన్న శత్రువును కూడా నువ్వు అంగీకరించాలి, గౌరవించాలి. ఎందుకంటే మీ స్నేహితుడు ఏ రోజునైనా, ఏ క్షణమైనా నీకు శత్రువుగా మారవచ్చు. ఎందుకంటే స్నేహం మరియు శత్రుత్వం అనేవి నాణెంకి ఉన్న బొమ్మ బొరుసు లాంటివి.

అందుకే ఎప్పుడు ఎలాగైనా శత్రువు నీ స్నేహితుడు కావచ్చు. స్నేహితుడు నీ శత్రువు కావచ్చు. అతనిలో శత్రువు ఉంటేనే మిత్రుడు నీకు శత్రువు అవుతాడు.

మీరు అతనిలో ఉన్న శత్రువును కూడా గౌరవించగలగాలి. అప్పుడే మీరు మీ స్నేహితుడిని మొత్తంగా అంగీకరించినవారవుతారు. మీ స్నేహితుడిలోనే మీ ఉత్తమ శత్రువు కూడా ఉంటాడు. మీరు వద్దని అతన్ని దూరంగా ఉంచినప్పుడే అతను మీ హృదయంలో తిష్ట వేస్తాడు. తనని తాను రహస్యంగా ఉంచుకునేవాడు వేరేవాళ్ళ నగ్నత్వాన్ని చూసి అసహ్యించుకుంటాడు. ఎవ్వరికీ ఏ హానీ చేయక పోయినా మీ నగ్నత్వాన్ని బహిర్గతం చేయడం నేరం. సమాజం దానిని నేరంగా పరిగణిస్తుంది. ఎందుకంటే మిమ్మల్ని మీరు నగ్నంగా బహిర్గతం చేస్తూ, మీరు వారిని కూడా నగ్నంగా బహిర్గతం చేస్తున్నారు. నగ్నంగా ఉండటం ద్వారా మీరు వారి బట్టల లోపల కూడా మీరు నగ్నంగా ఉన్నారని వారికి గుర్తు చేస్తున్నారు. అది వారికి కోపం తెప్పిస్తుంది, చికాకు పెడుతుంది. ఏదైనా దాచడం ఉనికికి అసత్యం. మిమ్మల్ని మీరు పూర్తిగా బహిర్గతం చెయ్యడం అనేది మీ నమ్మకాన్ని చూపిస్తుంది, మీ ప్రేమను చూపిస్తుంది, మీరు విషపూరితం కాదని తెలియజేస్తుంది.

మీరు నిజమైన స్నేహితుడు అయితే మీరు స్నేహితుడి కోసం ఏమి చెయ్యాలి...? మీ స్నేహితుడికి మీ ప్రేమ వ్యక్తపరచడం ఎలా...?

మీరు అతన్ని ధనస్సు నుండి వదిలిన బాణంలాగా సూపర్ మాన్ దిశగా అడుగులు వేయించాలి. మీ స్నేహితుడు ఎలాంటివాడో తెలుసుకోవడానికి అతని మరొక ముఖాన్ని తెలుసుకోవడానికి, మీ స్నేహితుడి గాఢనిద్రను దగ్గరనుండి చూసారా? ఒక రకంగా అది మసకబారిన అద్దంలో మీ సొంత ముఖమే. నిద్ర పోతున్న వ్యక్తులను చూస్తే బహుశా ఇది నా ముఖం కూడా అని మీరు తెలుసుకోవడం అసాధ్యం. వారు నిద్రలో మునిగిపోతారు. ఆ నిద్రలో వారు అసంబద్ధమైన విషయాలు చెబుతారు, అశ్లీలపదాలు ఉపయోగిస్తారు. వారు స్పృహలో లేరు. కానీ ఇది మీ ముఖం అని కూడా తెలుసుకోండి.

మీరు బానిస అయితే గనుక మీలో బానిస లక్షణాలు ఉంటే మరొకరికి స్నేహితుడిగా ఉండాలనే విషయం మరచిపోండి. ఒక బానిసగా ఉంటూ మీరు మీ స్నేహితుడికి విమోచకుడిగా నటించలేరు. రక్షకులు అని పిలవబడేవారి విషయంలో కూడా ఇదే వర్తిస్తుంది. వారు రక్షించబడరు. కానీ వారు మొత్తం ప్రపంచాన్ని రక్షించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రగల్భాలు పలుకుతారు. యేసు నిరంతరం చెప్పేది కూడా అదే "నేను రక్షకుడిని", మీరు నన్ను విశ్వసిస్తే మీకు ఇంకేం అవసరం లేదు. నరకం నుండి రక్షించబడతారు. మీ బాధల నుండి రక్షించబడతారు. తీర్పు యొక్క చివరి రోజున యేసు తన తండ్రి యెహోవాతో వచ్చి తన గొర్రెలు ఎవరో ఎత్తి చూపిస్తాడని లక్షలాదిమంది క్రైస్తవులు తమను తాము ఓదార్చుకుంటున్నారు. వారు రక్షింపబడి స్వర్గంలోకి తీసుకువెళ్ళబడతారని, మిగిలినవారు నరకం యొక్క లోతుల్లోకి విసిరివేయబడతారని విశ్వసిస్తున్నారు. ఇప్పటికి కూడా లక్షలాదిమంది ప్రజలు తాము చేయవలసింది కేవలం యేసును విశ్వసించడం మాత్రమేనని నమ్ముతున్నారు. అతను దేవుని ఏకైక కుమారుడని, ఆపై వారు కోరుకున్నది ఏదైనా చేయగలరని, వారు రక్షించబడతారని గుడ్డిగా నమ్ముతున్నారు. అది మూర్ఖత్వం.

బానిసలుగా ఉండాలనుకునేవారు వారి బాధ్యతలన్నీ వారిని బానిసలుగా చేసే వ్యక్తికి అప్పగిస్తారు. మీరు జీవితంలోని అన్ని బాధ్యతలను తీసుకోవడానికి తగినంత ధైర్యం లేకపోతేనే మీలో బానిసత్వం ఉంటుంది. ఎందుకంటే బానిస

మాత్రమే బాధ్యతలు లేకుండా ఉంటాడు. కానీ బానిస స్నేహితుడిగా ఉండలేడు. నిజానికి అతను యజమాని కోసం వెతుకుతున్నాడు. స్నేహితుడి కోసం కాదు.

మీరు నిరంకుశంగా ఉన్నారా? ఐతే మీకు స్నేహితుల అవసరం లేదు.

ఎందుకంటే నిజానికి మీరు వెతికేది బానిసలని.. స్నేహితులను కాదు. గౌరవం ఉన్నవారెవరైనా స్నేహం పేరిట బానిసలుగా ఉండడానికి ఇష్టపడరు. అందుకే స్నేహం పిల్లలు ఆడే ఆట కాదు అంటాడు జరతూస్త్ర.

❖ ❖ ❖

## వెయ్యిన్నొక్క లక్ష్యాలు

జరతూస్త్ర అనేక ప్రాంతాలను మరియు సంస్కృతులను, వాళ్ళు మంచి, చెడు అని భావించేవాటిని, విలువలని ఆరాధించేవాటిని, పాటించేవాటిని చూసాడు. జరతూస్త్ర ఈ భూమిపై మంచిచెడు అని భావించేవాటి కంటే మించిన గొప్పశక్తిని కనుగొనలేదు అంటాడు.

జరతూస్త్ర అనేక సంస్కృతులను మరియు నాగరికతలను చూశాడు. అయితే ఏ ఒక్క సంస్కృతి, నాగరికతల యొక్క మంచిచెడులు ఒకేలా లేవు. ఒక సంస్కృతి మంచిగా పరిగణించింది మరొక సంస్కృతి చెడుగా పరిగణించవచ్చు. ఏ సంస్కృతి అయినా దాని గొప్ప ఇబ్బందులను అధిగమించడంలో విలువను కనుగొంటుంది. ఒక సంస్కృతి దాని యొక్క అత్యున్నత అవసరాన్ని, దాని గొప్ప కష్టంగా గుర్తిస్తుంది మరియు దానిని అధిగమించినప్పుడు సంస్కృతి దానిని పవిత్రంగా భావిస్తుంది. పిలుస్తుంది.

అన్ని గొప్ప అర్థాలు మానవులచే సృష్టించబడినవే. మనుషులకు మరియు ఇతర జంతువులకు మధ్య ఉన్న వ్యత్యాసం 'విలువలు'.

విలువల ప్రకారంగా ఏ జంతువులూ జీవించవు. కానీ విలువలు అంటే ఏమిటో తెలియకుండా గుడ్డిగా జీవిస్తాడు మానవుడు. వారు మానవుల్లాగానే కనిపిస్తారు. కానీ వారింకా జంతుస్థాయిని కూడా అధిగమించలేదు.

విలువలు రెండు రకాలుగా ఉంటాయి.

ఒకటి.. బయటి నుండి మీపై విధించినవి. రెండు.. మీ సొంత ఉనికి నుండి ఉద్భవించేవి.

మొదటి రకమైన విలువలు కేవలం మానవుడు తనని తాను జంతువుల నుండి వేరు చేసుకోవడానికి సమాజం సృష్టించిన వంచనాపూరితమైన విలువలు. అవి మానవుడు జంతుస్థాయిని అధిగమించాడని నమ్మడానికి తనకు తాను పన్నిన ఒక వ్యూహం. కానీ నిజానికి మానవుడు జంతువుల కన్నా కిందే ఉన్నాడు. జంతువులు కనీసం సహజమైనవి. మానవుడు సహజంగా లేడు. అతని విలువలు అతని స్వభావాన్ని, అతని సహజత్వాన్ని వక్రీకరించాయి. అవి అతను ఇంకా మనీషే అనే తప్పుడు భావనను సృష్టించాయి.

రెండవ రకమైన విలువలు ప్రామాణికమైన విలువలు.

వీటి కోసం మానవుడు బయటి నుండి తనపై విధించబడిన విలువలను తోసిపుచ్చాలి. తన అంతర్గత ఉనికి నుండి వచ్చే విలువల్ని మాత్రమే అనుమతించాలి. తల్లిదండ్రులు, పూజారులు, నాయకులు, సాధువులు అని పిలవబడేవారంతా మీరు స్వేచ్ఛగా ఉండటానికి అనుమతించరు. ఎందుకంటే వారు వారి దగ్గర ఉన్న విలువలే నిజమైన విలువలని, మీరు పుట్టినప్పటి నుండి మిమ్మల్ని నమ్మిస్తూ ఉంటారు. ఏది సరైనది? ఏది తప్పు? ఏది మంచి? ఏది చెడు అని మీరు జన్మించకముందే వారు మీ కోసం నిర్ణయించారు. వారు మీ శరీరాలను బంధించడం లేదు కానీ మీ ఆత్మని, మీ వ్యక్తిత్వాన్ని మీ శక్తి సామర్థ్యాలను గొలుసులతో బందిస్తున్నారు. ఆ గొలుసులు బంగారంతో చేయబడి ఉండడం వలన అవి గొలుసులు కాదు విలువైన ఆభరణాలని, మీ సమాజం మిమ్మల్ని ధనవంతులని, గొప్పవాళ్ళని చేస్తోందని, మీ సమాజం మిమ్మల్ని మెరుగుపరుస్తుందని నమ్ముతూ ఉంటారు. కానీ అవి ఉక్కుతో చేసినవైనా, బంగారంతో చేసినవైనా గొలుసులు గొలుసులే అనే విషయం మీరు పూర్తిగా మరిచిపోయారు. అవి బంగారపు గొలుసులు కావడంవల్ల మీరు వాటిని అంటిపెట్టుకుని ఉండటానికి అవకాశం ఉంది. ఇది ప్రపంచంలోనే అత్యంత నీచమైన బానిసత్వం. అన్ని మంచి ఉద్దేశాలతో మిమ్మల్ని ప్రేమిస్తున్నారని భావించే వ్యక్తులు నిజంగా మిమ్మల్ని నాశనం చేసే వ్యక్తులు, మిమ్మల్ని బానిసలుగా ఉంచే వ్యక్తులు. మీ పొరుగువారిపట్ల జాగ్రత్త వహించండి. అపరిచిత వ్యక్తిగా ఉండటానికి కావాల్సినంత ధైర్యంగా ఉండండి. అపరిచితుడిగా ఉండటానికి ఇంకా ఎక్కువ బలంగా ఉండండి. అప్పుడు మాత్రమే మీరు జీవించడానికి పూర్తిగా భిన్నమైన విలువలను కనుగొంటారు. పొరుగువారు, మీ సమాజం విధించిన విలువలను

తోసిపుచ్చండి. వివిధ సమూహాలు వివిధ విషయాలను విలువైనవిగా భావిస్తాయి. మంచిచెడుల పట్ల విభిన్న భావనలను కలిగి ఉంటాయి. ప్రజలు కష్టంగా భావించే వాటిని, వారు అధిగమించడానికి కష్టపడేవాటిని గొప్పవిగా భావిస్తారు. మీ పూర్వీకులు మంచిచెడు అంటే ఏమిటో ముందే నిర్ణయించారు. కానీ ఇప్పుడు మనం ఈ మంచిచెడులకు అతీతంగా సూపర్ మాన్‌లా మారడానికి ప్రయత్నించాలి. ఇక్కడ లక్షలమంది ప్రజలు ఉన్నారు. ప్రతి ఒక్కరూ మంచిచెడుల గురించి వారి సొంత భావనలతో తమ జాతి కోసం వారి సొంత లక్ష్యంతో ఉన్నారు. అది వారిని వారు నిరంతరం అధిగమించే ప్రయత్నం తప్ప మరొకటి కాదు.

ప్రతీ సంస్కృతి, నాగరికత ప్రతీ సందర్భంలో వారు 'మంచి' అని భావించేది ఏదైనా సరే 'శక్తి సంకల్పం' యొక్క గొంతుక తప్ప మరొకటి కాదు.

విలువలు విశ్వవ్యాప్తం కాదు. ప్రతి సమాజం తన సొంత అవసరాలకు అనుగుణంగా దాని సొంత విలువలను సృష్టించుకుంది. కానీ ఆ విలువలు వేల సంవత్సరాల క్రితం సృష్టించబడ్డాయి. ప్రస్తుతం అవసరాలు మారాయి, పెరిగాయి కానీ, విలువలు మాత్రం అలాగే ఉన్నాయి. అందుకే ప్రస్తుత మానవుడు వేల సంవత్సరాల క్రితం వెనుకబడి ఉన్నాడు. ప్రతి తరం, తన తరం విలువలను తర్వాతి తరానికి ఇస్తూనే ఉంటుంది. తన కష్టాలకు కారణం వీటివల్లనే సంభవించాయని మానవుడు ఎప్పుడూ అనుకోడు. అతని విలువలు, నైతికత కాలానికి అనుగుణంగా లేవు. అతని విలువలు అతని ఉనికికి అనుగుణంగా లేవు. అన్ని మతాలు, అన్ని సంస్కృతులు, అన్ని నాగరికతలు గతానికి చెందినవి. అవి ఎప్పుడో మరణించాయి. వాస్తవానికి గౌరవంగా వాటిని స్మశానానికి తీసుకు వెళ్లాల్సిన సమయం ఆసన్నమైంది. ఆ మృతకళేబరాలు మీ మధ్యనే తిరుగుతూ మీపైనే ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఈ పాత విలువలు ఎప్పుడో ఉద్భవించినవి. ఇప్పుడు మనిషి పరిపక్వత చెందాడు. కానీ ఇంకా ఆ పాత విలువలే పవిత్రమైనవి అనే భ్రమలో ఉన్నాడు. పరిణతి చెందిన యువకుడు ఇప్పటికీ చిన్నపిల్లల దుస్తులను ధరించినట్లుగా ఆ యువకుడు ఇంకా ఆ పాత విలువలకే కట్టుబడి ఉన్నాడు. ఆ బట్టలు చూడడానికి అసహ్యంగా ఉండడమే కాదు. అవి వేసుకొని ముందుకు కదలడం కష్టతరం కూడా అవుతుంది. మీ విలువలు మారాలి. మనిషి గతానికి చెందినవాడు కాదు. అతను భవిష్యత్తుకి చెందినవాడు. ఒకసారి మిమ్మల్ని

కలుషితం చేసే, మతపరం చేసే విలువలని చూడండి. గతంలోని చదువురానివారు, నాగరికత తెలియనివారిచే ఈ కుళ్ళిన గ్రంథాలు వ్రాయబడినవి. అవి ఇప్పుడు విలువలు అనే పేరిట మీ మీద ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. ఈ విలువలు ఒక నిర్దిష్ట సమాజం చేత సృష్టించబడినవి. అవి వారి 'శక్తి సంకల్పం' కోసం తప్ప మరొకటి కాదు.

ప్రజలు కష్టతరమని భావించినవాటిని కూడా విలువైనవాటిగా భావిస్తారు. కానీ ఆ భారం విలువైనదేనా, కాదా అని ఎవరూ పట్టించుకోరు.. ఎవరో ఒకరు తలక్రిందులుగా నిలబడి ఉంటారు. ప్రజలు దానికి చప్పట్లు కొడతారు, ప్రశంసిస్తారు. ఎందుకంటే అది కష్టం కాబట్టి. ఇది దేనినీ పెంచదు. కానీ విలువలన్నీ ఈ విధంగానే సృష్టించబడ్డాయి. చాలా అరుదైన మరియు అన్నింటి కన్నా కష్టతరమైనదేదైనా పవిత్రమైనదిగా భావిస్తున్నాడు మానవుడు. మానవుడు తనను తాను వ్యక్తపరుచుకోవడానికి మాత్రమే విలువలను సృష్టించాడు. వాటికి అర్థాన్ని ఇచ్చాడు. వాటిని తనకు ఆపాదించుకున్నాడు. అతనికి 'మనిషి' అని పేరు పెట్టుకున్నాడు. పరిణామక్రమం ద్వారా మాత్రమే విలువ అనేది ఉంటుంది. పరిణామక్రమం లేకుండా విత్తనం విత్తనంగానే ఉండిపోతుంది.

విలువల్లో మార్పు అంటే విలువలను సృష్టించేవారిలో మార్పు అని అర్థం. ఉన్నత విలువల కోసం మానవుడు అతన్ని ఎప్పటికప్పుడు మార్చుకుంటూ ఉండాలి. అతను సృష్టికర్త. కానీ సృష్టికర్తగా ఉన్నవాడు విధ్వంసానికి కూడా ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలి.

అధిక విలువలను సృష్టించాలనుకుంటే పాత విలువలను విధ్వంసం చేయాలి. కొత్తది ఏదైనా సృష్టించడానికి పాతదాన్ని నాశనం చేయడానికి సిద్ధంగా ఉండాలి. మూఢనమ్మకాలను నాశనం చేయాలి. వేదాంతాలను నాశనం చేయాలి. మతాలను నాశనం చేయాలి. మీరు మొత్తం మానవాళిని ఒకటిగా ఉండాలని కోరుకుంటే జాతీయత అనే పాత విలువను కూడా నాశనం చేయాలి. శతాబ్దాలుగా మతం కంటే 'జాతీయత' ఒక గొప్ప విలువగా ప్రశంసించబడుతూ వచ్చింది. దేశాల మధ్య హద్దులు చెరిగిపోవాలి. ఎందుకంటే అవి మానవుడు పటంలో సృష్టించిన హద్దులు తప్ప ఇంకేం కావు. మానవాళి మధ్య ఉన్న ఈ విభజనలన్నీ ఒక దేశం మరియు మరొక దేశం మధ్య వివాహ స్వేచ్ఛను అనుమతించవు. సంబంధం లేని వ్యక్తుల మధ్య వివాహాలు జరగాలి అనేది ఆరోగ్యకరమైన

విషయం. అప్పుడు పిల్లలు మరింత అందంగా, మరింత తెలివిగా, బలంగా ఉంటారు. మానవుడు జంతువుల గురించి, చెట్ల గురించి ఉన్నంత శాస్త్రీయంగా అతనిపట్ల లేడు. మానవులు వారిపట్ల వారు చాలా అశాస్త్రీయంగా ఉన్నారు. మొదటి మనిషి ఒక సృష్టికర్త / సృజనాత్మక వ్యక్తి.

జరతూస్త్ర చాలా ప్రాంతాలను చాలామంది ప్రజలను చూసాడు. ఈ ప్రేమగల సృజనాత్మకత వ్యక్తుల సృష్టి కంటే గొప్ప శక్తిని ఈ భూమిపై కనుగొనలేదు అంటాడు. వాటికి అతను మంచి మరియు చెడు అని పేరు పెట్టాడు. గొప్ప విలువలను అర్థం చేసుకోవడం సులభం. మానవులను ప్రేమించడం ద్వారా అది సృష్టించబడింది. చెడు కూడా సృష్టించబడిందనే విషయం అర్థం చేసుకోవడానికి కొంచెం ఎక్కువ సమయం పడుతుంది. ఉనికిలో చెడు లేదు.. మంచి లేదు... ఉదాహరణకు మారణాయుధాలు సృష్టిస్తున్న వ్యక్తులు కూడా సృజనాత్మకంగా ఉంటారు కానీ వారిది చెడుకి సంబంధించిన సృజనాత్మకత. మానవుడు చెడును సృష్టించడం మానేసినప్పుడే భూమి సంతోషిస్తుంది. మనిషి యొక్క సృజనాత్మకత యొక్క మొత్తం శక్తి మంచిని మాత్రమే సృష్టిస్తుంది. గుంపుకి అక్కడ అనేక లక్ష్యాలు ఉన్నాయి. అక్కడ అనేకమంది ప్రజలు ఉన్నారు. ఎందుకంటే మానవాళి వేలాది ముక్కలుగా విభజించబడింది. మొత్తం మానవాళికి ప్రత్యేకంగా ఒక లక్ష్యం అంటూ ఏదీ లేదు. మొత్తం మానవాళికి ఇంకా ఒక లక్ష్యం లేకపోతే మానవత్వం కూడా ఉందని మీరు చెప్పగలరా? అందుకే ఇప్పుడు సమస్త మానవాళికి కావాల్సిన ఏకైక లక్ష్యం సూపర్ మాన్‌ని సృష్టించడం.

❖ ❖ ❖

## పొరుగువారిపట్ల ప్రేమ

ప్రజలు తమ పొరుగువారిని ప్రేమించాలా? అనే ప్రశ్నకు జరతూస్త్ర సమాధానం: వద్దు.

ఒక వ్యక్తి తన పొరుగువారిని ప్రేమిస్తున్న దానికంటే తనను తాను ఎక్కువగా ప్రేమించుకోవాలి అంటాడు జరతూస్త్ర.

ఒక వ్యక్తి తన వ్యక్తిత్వం యొక్క పవిత్ర స్వభావాన్ని నిజంగా గుర్తించే వరకు, అతను సూపర్ మాన్ కాలేడు. ప్రజలు తమ పొరుగువారిని ప్రేమిస్తారు ఎందుకంటే వారు తమ గురించి గొప్పగా అనుకోవాలని కోరుకుంటారు. మిమ్మల్ని

మీరు నిస్వార్థపరులుగా, గొప్ప ప్రేమస్వరూపులని నిరూపించడం కోసం మీరు మీ పొరుగువారి కోసం పరుగెడతారు. అది నిజంగా మీకు మీ పొరుగువారి పట్ల ఉన్న ప్రేమ కాదు. అది మీలోని శూన్యత. మీరు ఏదో ఒక విధంగా బంధుత్వం ఏర్పరచుకోవాలి అనుకుంటూ ఉంటారు. ఎందుకంటే మీకు మీ ఏకాంతంపట్ల, మీలో శూన్యతపట్ల, చివరకు మరణం పట్ల మీకున్న భయం. మీరు మీ పొరుగువారి కోసం పరుగెడతారు. వివాహం చేసుకుంటారు, పిల్లల్ని కంటారు. స్నేహితులను కోరుకుంటారు. ఎలాగైనా మీ నుండి మిమ్మల్ని తప్పించుకోవటానికి, మీతో మీరు సంబంధాలు పెట్టుకోకుండా ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉండడం కోసం ఎంత తెలివితక్కువ పనైనా చేస్తారు.

మీకు మీరు నిస్వార్థపరులు అని చాటిచెప్పుకుంటారు. ఇది ఎలాంటి నిస్వార్థత? సమాజం చేత గౌరవించబడతారనే ఆశకు సంబంధించిన నిస్వార్థత. కానీ నిస్వార్థసేవ చేస్తున్నామనే భ్రమలో మనిషి తననుండి తాను తప్పించుకుంటున్నాడు అనే విషయం మరిచాడు. అన్ని మతాలు ప్రజలను విషపూరితం చేయడానికి ఉపయోగిస్తున్న పదాలలో 'నిస్వార్థత' ఒకటి.

ప్రజలు కూడా ఆ వలలో చిక్కుకుంటారు ఎందుకంటే నిస్వార్థసేవలో వారు తమను తాము మరచిపోవాలని కోరుకుంటారు. తనను తాను మరచిపోవటం చాలా ధర్మమైన మార్గం, పుణ్యమార్గం, గౌరవనీయమైన మార్గం అని వారు మీకు నేర్పారు. కానీ తనను తాను మరిచిపోవడం అధర్మం. తనను తాను గుర్తుంచుకోవడమే ధర్మం అంటాడు ఈ జరతూస్త్ర.

మీ పొరుగువారు మీరు ఉన్న అదే గుంపులో భాగం తప్ప మరొకటి కాదు. మీ పొరుగువారు మీ కంటే భిన్నంగా లేరు. అతను మీరు మాట్లాడే భాషే మాట్లాడతాడు. అదే నైతికతను, అదే విలువలను అనుసరిస్తాడు. అతను మీ యొక్క జిరాక్స్ కాపీ తప్ప మరొకటి కాదు. జరతూస్త్ర మీ పొరుగువారి నుండి దూరంగా పారిపోండి అంటాడు.. ఎందుకంటే దూరం మాత్రమే మీ పెరుగుదలకు, మీ రూపాంతరానికి, పరివర్తనకు మార్గం చూపుతుంది. పొరుగువాడు అద్దంలో మీ ముఖం తప్ప మరొకటి కాదు. ఆ అద్దంలో మీరు మీ సొంత ముఖాన్ని చూసి సంతృప్తి చెందుతారు. అతనికి మీలాగే కపటబుద్ధి ఉంటుంది. మీలాగే కోపంతో, అత్యాశతో, లైంగికతతో, అసూయతో, హింసతో నిండి ఉంటాడు. పొరుగువారి పట్ల ప్రేమగా ఉండడం కంటే ఎక్కువ దూరంలో ఉన్న భవిష్యత్తు మనిషిని

ప్రేమించండి. మంచి కారణాల కోసం ఎల్లప్పుడూ ముందుకు పరుగెత్తండి. మంచి పోరాటయోధుడిగా ఉండండి. గుంపు ఎప్పటికీ మీకు మద్దతుగా ఉండదు. గుంపు ఎప్పుడూ తమను తాము సమర్థించుకుంటారు. ఎందుకంటే వారి జీవనవిధానం దాదాపు స్థిరమైనది. వారి పూర్వీకులు అదే విధంగా జీవించారు. వారు మరల అదే జీవనవిధానాన్ని పునరావృతం చేస్తుంటారు.

ఏదైనా కొత్తదనంతో వెలుగుని తీసుకొని వస్తే గుంపు వెంటనే అతనికి విరోధి అవుతుంది. కొత్తది వెంటనే జనాదరణ పొందదు... జనాదరణ లేని విషయాలను ప్రేమించండి... సుదూర కలలను ప్రేమించండి. అది ప్రస్తుత మనిషిని ప్రేమించడం కంటే చాలా మహోన్నతమైనది. సూపర్ మాన్ కోసం కలగనండి. మిమ్మల్ని మీరు త్యాగం చేసుకోండి. సూపర్ మాన్ కోసం మార్గం ఇవ్వండి.

కానీ మీరు భయపడతారు.. మీరు మీ పొరుగువారి కోసం పరుగెడతారు. ఎందుకంటే మీ పొరుగువారు మిమ్మల్ని ప్రశంసిస్తారు. అలా అందరూ ఒకరినొకరు ప్రశంసించుకోవడానికి అలవాటుపడ్డారు. ప్రతి ఒక్కరూ మీరు చాలా అందంగా, చాలా ఉదారంగా, తెలివిగా, నిబద్ధతగా, ధర్మంగా ఉన్నారని స్తుతిస్తూ అదే అభినందనలు మీకు తిరిగి వస్తాయని ఆశిస్తూ ఉంటారు. ఆ ఆనందంతో ప్రతి ఒక్కరూ చాలా సంతోషంగా ఇంటికి వెళతారు. ఈ మూర్ఖత్వం మానవాళి అంతటా వ్యాపించి ఉంది.

ప్రతి ఒక్కరు పొరుగువారి కోసం పరుగెడుతారు. ఎందుకంటే అతనిలో వారిని వారు చూసుకుంటారు. అలా తనని తాను మరిచిపోదాం అనుకుంటారు. మీ పేరు, మీ వృత్తి, మీ అర్హతలు, మీ డిగ్రీలు మీరు పొరుగువారి వద్దకు వెళ్ళినప్పుడు అతను మీకు ఇవి గుర్తుచేస్తాడు, అతను మిమ్మల్ని ఈ విషయాల గురించి అభినందిస్తాడు, మీరు అతన్ని అభినందిస్తారు. అలా ఒకరినొకరు ప్రశంసించుకుంటూ సంతోషంగా ఉంటారు. ఏకాంతం అంటే మీకు భయం. మీ ఏకాంతం దాదాపు మీకొక జైలులా అనిపిస్తుంది. అందుకే దాని నుండి బయటపడాలని కోరుకుంటారు. దానికోసం పరుగెడుతూ, ఏదో ఒకటి చేస్తూ ఉంటారు. కానీ ఏకాంతం చాలా అందమైన అనుభవం, మీ దగ్గరున్న అత్యంత అద్భుతమైన నిధి, కానీ మీరు దానిని ఎప్పుడూ అన్వేషించలేదు ఎందుకంటే మిమ్మల్ని మీరు ఎప్పుడూ ప్రేమించుకోలేదు. మీ తల్లిని ప్రేమించండి, మీ తండ్రిని

ప్రేమించండి, మీ సోదరుడిని ప్రేమించండి, మీ సోదరిని ప్రేమించండి, మీ భార్యను ప్రేమించండి, మీ పిల్లలను ప్రేమించండి, దేశాన్ని ప్రేమించండని చెప్పారే కానీ మిమ్మల్ని మీరు ప్రేమించుకోండని ఎవరూ చెప్పలేదు.

నేను మీకు పొరుగువారిని గురించి నేర్పించను. కానీ స్నేహితుడిని గురించి చెప్తాను. మీ పొరుగువాడు మీకు యాదృచ్ఛికం. కానీ స్నేహితుడు మీ పూర్తి స్పృహ యొక్క ఎంపిక. స్నేహితుడిని ప్రేమించండి, స్నేహం పండగ అవుతుంది. మీ స్నేహంలో సూపర్ మాన్ జన్మిస్తాడు. బంగారాన్ని శుద్ధి చేసేది అగ్ని అయితే, స్నేహం, ప్రేమ సాధారణ మానవులను సూపర్ మాన్‌గా చేస్తుంది. మీ ప్రేమతో, మీ స్నేహంతో ఇతరులను సూపర్ మాన్‌లా తీర్చిదిద్దడానికి సహకరించండి.

నిజానికి ప్రేమికులని పిలవబడేవారు బిచ్చగాళ్ళు. 'నాకు ఇంకొంచెం ఎక్కువ ప్రేమను ఇవ్వు' అని అడుక్కుంటూ ఇద్దరు గుడ్డి బిచ్చగాళ్ళు ఒకరికొకరు ఎదురెదురు గిన్నెలతో యాచించుకునేవారే ఈ ప్రేమికులు. కానీ వారి ఎదురుగా ఉన్నవారు కూడా యాచించే గిన్నెతో ఆకలితో ఉన్నారని వారు చూడలేరు. మీరు ప్రేమ విషయంలో స్పాంజిలాగా ఉండడం నేర్చుకోవాలి. ప్రేమ కోసం యాచించడం కాదు. ప్రేమ వచ్చినప్పుడు, పొంగిపొర్లుతున్నప్పుడు, దానిని గ్రహించగల, జుర్రుకోగల సామర్థ్యం కలిగి ఉండాలి.

ప్రేమ మానవాళిలో సృజనాత్మక శక్తులను సృష్టిస్తుంది. మీరు ఎవరితోనైనా ప్రేమలో పడినట్లయితే, అకస్మాత్తుగా సృజనాత్మకంగా మారతారు. ప్రపంచంలోని ప్రజలకు ఒకే మతం ఉండాలి అదే 'ప్రేమ'. అప్పుడు ప్రపంచం స్వర్గం అవుతుంది. మీ కళ్ళు భవిష్యత్తుపై స్థిరంగా ఉండాలి.

అది మిమ్మల్ని తెలియని ఎత్తులకు, అంతకుముందు గుర్తించని నూతన ప్రదేశాలకు కలలను, అనుభవాలను లాగుతుంది. మీ పూర్తి ప్రేమతో మీ స్నేహితుడు సూపర్ మాన్ అవ్వాలి. పూర్తిగా ప్రేమించడంవల్ల స్నేహితుడు సూపర్ మాన్ కంటే తక్కువగా ఉండటానికి అవకాశం ఉండదు. పొరుగువారి గురించి బాధపడకండి. వారి గురించి ఆలోచించకండి. స్నేహితుడి గురించి ఆందోళన చెందండి. మీకు సామర్థ్యం ఉన్నంత ప్రేమను సృష్టించండి, ప్రేమను పంచండి. ప్రేమగా ఉండటానికి పరిమితి లేదు, సరిహద్దులు లేవు. మీరు మీ పూర్తి ప్రేమతో ఎవరినైనా ప్రేమించగలిగితే మీరు అతనిని పూర్తిగా మార్చవచ్చు. సూపర్ మాన్

అనే సుదూర లక్ష్యాన్ని నెరవేర్చగల సామర్థ్యం ఉన్న స్నేహితుడి కోసం ఎదురు చూడండి. ఈ ప్రపంచానికి పొరుగువారు అవసరం లేదు, స్నేహితులు కావాలి.

ప్రేమ మరియు స్నేహంతో నిండిన ప్రపంచమే లక్ష్యంగా ఉండాలి. అది మాత్రమే మానవాళిని కాపాడుతుంది. అది మాత్రమే సూపర్ మాన్‌ని సృష్టించగలదు.

❖ ❖ ❖

# సృజనాత్మకమైన వ్యక్తి యొక్క మార్గం

సృజనాత్మక వ్యక్తి యొక్క సృష్టి మార్గంలో ఉన్న ఇబ్బందుల గురించి జరతూస్త్ర ఈ ప్రసంగంలో వివరిస్తాడు. లక్ష్య సాధనకై ఏకాంతంలోకి వెళ్ళాలి. కానీ అలా ఏకాంతంలోకి అడుగుపెట్టినప్పుడు ఏం జరుగుతుందనే దాని గురించి జరతూస్త్ర తన శిష్యులకు బోధిస్తాడు. ప్రపంచంతో సంబంధాలను విడిచి పెట్టినప్పటికీ వారు తమ బుర్రలో మందను తీసుకువెళతారని అంటాడు జరతూస్త్ర.

ఆ మంద యొక్క గొంతు, వారి లక్ష్యసాధనకై సొంతమార్గంలో వెళ్లిన వారికి అపరాధభావన కలిగిస్తుంది. కానీ ఆ అపరాధాన్ని అధిగమించి ముందుకు వెళ్లిన తర్వాతే వారు తమ సొంత విలువలను మరియు నైతికతను తమకు తాముగా నిర్దేశించుకుంటారు. దీనిని మంద అంగీకరించదు. కానీ సూపర్ మాన్ వెళ్లే మార్గంలో ఇది అత్యంత ముఖ్యమైన దశ. అవసరమైన దశ.

ఏకాంతంలోకి వెళ్ళేవారిని, సూపర్ మాన్ దిశగా అడుగులు వేసేవారిని చూసి 'మంద' ఎక్కువగా ద్వేషిస్తుంది.

సంత ప్రజల అనుభవం తరువాత జరతూస్త్ర ఈ విషయాన్ని తెలుసు కుంటాడు. ఏకాంతంలో ఉన్నవారికి చాలామంది శత్రువులు ఎదురవుతారని, కానీ ఆ సమయంలో అత్యంత ప్రమాదకరమైన శత్రువు నీకు 'నువ్వే' అని జరతూస్త్ర తన శిష్యుల్ని హెచ్చరిస్తాడు. నీలో ఉన్న ఈ 'నేను' తిరిగి 'మంద' వైపు వెళ్లాలని కోరుకుంటుంది. నువ్వు సూపర్ మాన్‌గా ఎదిగే క్రమాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నిస్తుంది. సృష్టికర్త అనేవాడు ఎప్పుడూ గుంపులో భాగం కాకూడదు. సృష్టికర్త ఏకాంతంగా ఉండటానికి, ఏకాంతం యొక్క గాఢతను ఆస్వాదించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా, ధైర్యంగా ఉండాలి. ఎందుకంటే అక్కడ మాత్రమే మీ సామర్థ్యం

కార్యరూపం దాలుస్తుంది. ఏకాంతంగా ఉండే వ్యక్తులను చూసి గుంపు ఎప్పుడూ ద్వేషిస్తుంది, ఎందుకంటే వారు తమ సొంత మార్గంలో, సొంత జీవనశైలితో జీవిస్తూ ఉంటారు. కానీ మంద వాళ్ళని వారిలో ఒకడిగానే చూడాలని కోరుకుంటుంది. ఆ విభజన వారి ఆత్మన్యూనతను గుర్తు చేస్తుంది. ఆత్మన్యూనతతో బాధపడుతున్న వారందరూ తమతో సమానమైన వ్యక్తులతో కలిసి ఉండాలని కోరుకుంటారు. అప్పుడు మాత్రమే వారు తమ ఆత్మన్యూనతను మరచిపోగలరు. కానీ ఆత్మన్యూనతతో బాధపడని వారెవరైనా ఏకాంతంగా నిలబడతారు. జన సమూహ సహకారం, ప్రజల మద్దతు వారికి అవసరం ఉండదు. తనకు తానే అన్నీ.

అలాంటి వారిని మంద 'గుంపు నుండి దూరంగా వెళ్లవద్దు, ఏకాంతంగా ఉంటే మీరు పిచ్చివారవుతారు' అని హెచ్చరిస్తుంది. కానీ సృష్టికర్త యొక్క ఆనందం అతని సృష్టిలోనే, అతని ఏకాంతంలోనే ఉంటుంది. వేరే ప్రతిఫలం తనకి అవసరం లేదు. సృష్టికర్త తన కార్యానికి మించిన బహుమతి గురించి ఆలోచించడం ప్రారంభించిన క్షణం అతను ఒక 'సాంకేతిక నిపుణుడు' మాత్రమే అవుతాడు. సృష్టికర్త కాడు.

సృజనాత్మకమైన వ్యక్తులను చూసి ప్రజలు భయపడతారు. ఎందుకంటే వారు సమాజం యొక్క సామాజిక విలువలను, నైతికతను పాటించరు. వారు మందలో భాగం కాదు. మంద వెళ్లే పవిత్ర స్థలాలకి, పవిత్ర గ్రంథాలని భావించే వాటి జోలికి వెళ్ళరు. వారి సృజనాత్మకతే వారి మతం. మంద దానిని అర్థం చేసుకోలేదు మరియు వారిని ఒప్పించడానికి ప్రయత్నిస్తుంది. 'మీరు తిరిగి రావడం మంచిది. ఒంటరిగా వెళ్లవద్దు. మీరు చాలా పోగొట్టుకోవ'చ్చని భయపెడుతుంది కూడా.

కానీ సృష్టికర్త ఎల్లప్పుడూ నేను మీకు చెందినవాడిని కాదు. నేను నా జీవితాన్ని నాకు అనుగుణంగా జీవించాలనుకుంటున్నాను, నా గమ్యాన్ని ఎవరూ నిర్దేశించకూడదు, నాపై ఎవరూ ఆధిపత్యం చెలాయించకూడదు అనే ధైర్యంతో ముందుకు సాగిపోతాడు. కానీ ఆ ఏకాంత గాఢత అతన్ని బాధకు గురి చెయ్యొచ్చు, పిచ్చివాడిని చెయ్యొచ్చు. ప్రతి ఒక్కరూ అతను అసాధారణమని భావించినందున అతనికి పిచ్చి. సహజంగానే అలాంటి వ్యక్తులు గొప్ప బాధతో జీవిస్తారు. అయినప్పటికీ వారు తమ కష్టాల మార్గానికే వెళ్లాలని కోరుకుంటారు. ప్రజలచేత

వారు నవ్వులపాలవుతారు.. సమాజానికి దూరంగా వెలేయబడతారు. కానీ వారు వారి సృష్టిని విడిచిపెట్టరు. సృష్టించడమే వారి మతం.. సృజనాత్మకతే వారి జీవితం.. అది నెరవేరిననాడే వారి జీవితానికి అర్థం. సృష్టికర్త పేరుప్రతిష్ఠల కోసం ప్రాకులాడడు. అతని మొత్తం శక్తి అతని సృష్టిలో పాల్గొంటుంది. ఉనికి యొక్క సృజనాత్మకతకు సాధనంగా మాత్రమే వారిని వారు భావించుకుంటారు. తమకి తాము సృష్టికర్తలం, సృజనాత్మకత కలవారం అని వారు ఎప్పుడూ అనుకోరు. అందుకే వారు తాము సృష్టించిన వాటిపై వారి పేరును సంతకంగా పెట్టడానికి కూడా ఒప్పుకోరు.

ఏకాంతంగా ఉండగలిగేవారికి మాత్రమే స్వేచ్ఛ అవసరం. లక్షలాదిమందికి బానిసలుగా ఉండాలనే లోతైన అంతర్గత కోరిక ఉంది. ఎందుకంటే బానిసలకి వారి బానిసత్వంలో ఉండడం ద్వారా కొంత లాభం ఉంది. బానిస జీవితానికి సంబంధించిన బాధ్యతలన్నీ అతని యజమాని చూసుకుంటాడు కనుక. ఈ రకమైన బానిసత్వం అనేక రూపాల్లో ఉంది.

వేరొకరిచే రక్షించబడటానికి సిద్ధంగా ఉన్న మీరు స్వేచ్ఛాజీవులు ఎలా కాగలరు?

మీకు ఆత్మాభిమానం లేదా? మీకు తెలివి లేదా? మీ చీకటి నుండి మీకు మీరుగా బయటపడే ధైర్యం లేదా? ఎవరో వచ్చి మీ జీవితాల్లో వెలుగుని నింపాలని ఎదురుచూస్తున్నారా? మీ జీవితంలో వెలుగుల్ని మీరు నింపుకోలేరా? మిమ్మల్ని రక్షించడానికి రక్షకులు కావాలా? ఏం మీకు మీరు రక్షకులుగా ఉండలేరా? కానీ ఏదో ఒక రోజు మిమ్మల్ని రక్షించినవాడే మిమ్మల్ని భక్షించకమానడు.. మీ జీవితంలోకి కాంతిని తెచ్చిన వ్యక్తే ఏదోకరోజు దాన్ని తిరిగి వెనక్కి తీసుకెళ్లగలడు. ఎందుకంటే అది మీ కాంతి కాదు. మీలో స్వతహాగా ఉద్భవించే స్వేచ్ఛ, కాంతి, ప్రేమ పైనే మీరు ఆధారపడగలరు.

బానిసల ఏకైక విలువ వారి సంకెళ్లు. కానీ వారు విముక్తి పొందిన క్షణం వారికేం చేయాలో తెలియదు. మీ విలువ మీ బానిసత్వం కావచ్చు. కానీ మీరు మీ సంకెళ్లను విసిరే ముందు, ఒకటికి రెండుసార్లు ఆలోచించండి. దేని నుండి మీకు స్వేచ్ఛ కావాలి అనేదాన్ని ఈ జరతూస్త్ర పట్టించుకోడు. కానీ ఆ స్వేచ్ఛ దేని నుండి, దేనికోసమో నీకు నువ్వు సమాధానం ఇచ్చుకో. మనిషి ఎప్పుడూ ఏదో

దానినుండి విముక్తి పొందాలని ఆలోచిస్తూనే ఉంటాడు. కానీ ఆ స్వేచ్ఛ నుండి తనేం చెయ్యాలో తనకే తెలియనంత అమాయకత్వంలో ఉంటాడు. మీకు లభించిన ఆ స్వేచ్ఛ నుండి మీకు మీరే చట్టంగా మారగల సామర్థ్యం ఉందా? లేకపోతే మీరు స్వేచ్ఛను కోరుకోకండి. మీ స్వతహాగా మీ మంచిచెడులను, మీ విలువలను మీరు సృష్టించుకోగలరా? లేకపోతే మీరు పది ఆజ్ఞలను పాటించాలి. మీకు మీరు న్యాయమూర్తిగా ఉండటానికి, ఏదైనా తప్పు చేస్తే మిమ్మల్ని మీరు శిక్షించుకోవడానికి సిద్ధంగా ఉన్నారా? లేకపోతే మీరు బానిసగా ఉండడమే మంచిది. అప్పుడు మీ మంచి చెడుల గురించి, మీ నైతికత గురించి మరొకరు చూసుకుంటారు. పూర్తిగా స్వేచ్ఛగా జీవించాలని కోరుకునే వ్యక్తి మరియు సృజనాత్మకంగా జీవించాలనే వ్యక్తి తన విలువలను తాను సృష్టించడానికి, తన మంచి చెడుల పట్ల సొంత నైతికబాధ్యత వహిస్తూ అవసరం అయితే తనని తాను శిక్షించుకోవడానికి తగినంత బలాన్ని, ధైర్యాన్ని కలిగి ఉండాలి. ఏకాంతంగా జీవించలేని మానవుడు మానవుడే కాదు. అతని నిజమైన గౌరవం ఏకాంతంగా ఉండటంలోనే ఉంటుంది. ఏకాంతంలో జీవించడానికి మీకు మీరుగా తెలివిగా ఉండడానికి చాలా బలం, ధైర్యం అవసరం. మీ విచక్షణ గుంపు యొక్క తెలివి తేటలపై ఆధారపడి ఉంటుంది. మిమ్మల్ని మీరు ఏకాంతంలో ఉంచుకున్న కొద్ది రోజుల్లో మీరు జైలులో ఉన్నట్టు అనుభూతి చెందుతారు. ఎవ్వరూ మిమ్మల్ని హింసించరు, కానీ అంతా చీకటి. త్వరలో మీరు మీ తెలివితేటలను, మీ బలాన్ని కోల్పోవచ్చు కూడా. మరికొంతకాలం తరువాత భ్రమలు, భ్రాంతులు చూడటం ప్రారంభిస్తారు. ఆ భ్రాంతులతో మాట్లాడటం కూడా మొదలుపెడతారు. కానీ అక్కడ ఎవ్వరూ ఉండరు.. అవతలివైపు నుండి కూడా మీకు మీరే సమాధానం ఇచ్చుకుంటారు. అక్కడ కేవలం మీరు మాత్రమే ఉంటారు. మాయ యొక్క తత్వాన్ని, ప్రపంచతత్వాన్ని భ్రమగా సృష్టించిన వ్యక్తులు ఏకాంతంలో ఎక్కువ కాలం జీవించిన వ్యక్తులు కూడా అలాంటి అనుభూతులే పొందారు. ఏకాంతంగా మరియు తెలివిగా ఉండటానికి ఒక విషయం ఖచ్చితంగా అవసరం. అది మీ ఏకాంతంలో కూడా మీరు సృజనాత్మకంగా, సృష్టికర్తగా ఉండగలగడం. సృష్టికర్త కాకపోతే మీరు ఏదీ సృష్టించలేకపోతే మీ ఏకాంతంలో మీరు పిచ్చివారైపోతారు. మీరు సృష్టికర్త అయితే మీ ఏకాంతంలో కూడా మీరు మీ తెలివితేటలను, విచక్షణను కాపాడుకోగలుగుతారు.

మీ ఏకాంతతని చంపడానికి ప్రయత్నిస్తున్న భావోద్వేగాలు ఉన్నాయి. ఏకాంతంలో మీ సొంత భ్రమలపట్ల, మీ సొంత భావోద్వేగాలకు హంతకుడిగా ఉండండి. ఈ కోరికలు మిమ్మల్ని చంపుతాయి. మీరు వాటిని చంపలేకపోతే అవే మిమ్మల్ని చంపుతాయి.

అందుకే ఈ జరతూస్త్ర మిమ్మల్ని అడుగుతున్నాడు “మీరు మీ సొంత భావోద్వేగాలకు హంతకుడిగా ఉండగలరా?”

తమని తాము అధిగమించిన వారిని ప్రజలు ఎప్పటికీ క్షమించరు. అందుకే ‘వినయం’, ‘విధేయత’ ప్రజలచేత ఎంతగానో ప్రశంసించబడ్డాయి. మీ మంచి చెడులకు మీరే యోధుడిలా ఉండండి. మంద ఎప్పుడూ ఏకాంతంగా ఉండేవారి పట్ల ద్వేషం కలిగి ఉంటుంది. వాళ్ళని శపించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుంది. పవిత్రమైన నిరాడంబరతను మాత్రమే ప్రజలు ప్రశంసిస్తారు. గుర్తుంచుకోండి అటువంటివారు చాలా ప్రమాదకరమైన వ్యక్తులు. ఎందుకంటే నిరాడంబరత కానివి వారికి అపవిత్రమైనవిగా, చెడ్డవాటిగా కనిపిస్తాయి.

సృజనాత్మకత అసమానమైంది.. అద్భుతమైనది.. మరియు సంక్లిష్టమైనది.

నిరాడంబరంగా ఉండడం గొప్ప ధర్మమేమీ కాదు. అది ఎవరైనా చేయగలరు. అందుకే ప్రజలు ఏకాంతంగా ఉండేవారిని క్షమించలేరు. సాధారణ మానవులు తమ ప్రతిభను బయటికి తీసుకురావడానికి ఎప్పుడూ ప్రయత్నించరు, ఎందుకంటే అది కష్టతరమైనది, కఠినమైనది, దానికి నిరంతర కృషి, తెలివి అవసరం. గొప్ప విలువ కలిగినది ఏదైనా సంక్లిష్టంగా ఉంటుంది. ఎంత ఎక్కువ విలువ ఉంటే అది అంత ఎక్కువ సంక్లిష్టంగా ఉంటుంది. కానీ పవిత్ర నిరాడంబరతను ప్రశంసించాలంటే ప్రజలు అపవిత్రమైన సంక్లిష్టతను ఖండించవలసి ఉంటుంది. మీకు మించినదాన్ని సృష్టించాలి అంటే మీరు అదృశ్యం కావాలి. మీరు లేనప్పుడు మాత్రమే మీ కంటే గొప్పది ఉనికిలో ఉంటుంది. మీ తప్పుడు వ్యక్తిత్వం అంతా కనుమరుగైనప్పుడే మీ నిజమైన వ్యక్తిత్వం జన్మిస్తుంది. సృష్టికర్త కాకుండా మీరు నిజంగా సజీవంగా, స్వేచ్ఛగా ఉండలేరు. మీ సృజనాత్మకత అనేది స్వేచ్ఛ, బలం, తెలివితేటలు, స్పృహను తెలియజేస్తుంది. కానీ దానితోపాటు అది మీకు ప్రమాదాలను కూడా తెస్తుంది. ధైర్యంగా, ప్రమాదకరంగా జీవించాలనుకునేవారికి

సృజనాత్మకంగా జీవించడం ఒక్కటే మార్గం. పిరికివాళ్ళు కేవలం నామమాత్రంగా మనుగడ సాగిస్తూ ఉంటారు. ధైర్యవంతులు మాత్రమే జీవిస్తారు. మిమ్మల్ని మీరు అధిగమించవలసినప్పుడు ధైర్యం మరియు బలం అవసరం అవుతాయి. మీరు మంటల్లో కాలిపోయి బూడిదగా మారవలసి ఉంటుంది అప్పుడు మాత్రమే సూపర్ మాన్ ఉనికిలోకి వస్తాడు. సృజనాత్మకత అనేది మీనుండి సూపర్ మాన్ వరకు ఉన్న మార్గం. సృష్టిలో భాగంగా సృజనాత్మకతతో మనిషి తన సూపర్ మాన్‌ను కనుగొనకపోతే అతను ఓడిపోయాడని అర్థం.

❖ ❖ ❖

## కొంటె నిజం

ఒక రోజు మిట్ట మధ్యాహ్నం ఒక చెట్టు కింద ఉన్న అరుగుపై కూర్చొని ఉన్నాడు జరతూస్త్ర.

ఎవరో ఒక బాటసారి రావడం చూసి... ఏదో దొంగతనం చేసినట్టుగా దేనినో తన కోటు కింద చాలా జాగ్రత్తగా దాచాడు.

దానిని గమనించిన ఆ బాటసారి "ఏయ్... జరతూస్త్ర... ఏంటిది..? దొంగలాగ ఏదో దాస్తున్నావేంటి? చూపించు..." అని అడిగాడు.

దానికి బదులుగా జరతూస్త్ర ఇలా అన్నాడు. "ఓ సోదరుడా... అది నేను దాస్తున్నది, మోస్తున్నది ఒక కొంటెనిజం. ప్రస్తుతం నేను దాని నోరు మూసి ఉ ంచకపోతే చాలా బిగ్గరగా అరుస్తుంది.. అందుకే దానిని భద్రంగా దాచా... అయితే ఆ కొంటెనిజం నువ్వు వినడానికి సిద్ధమే కదా!" అని జరతూస్త్ర చెప్పడం మొదలు పెట్టాడు.

"నేనొక రోజు సంధ్యా సమయాన ఒంటరిగా వెళుతున్నప్పుడు ఒక వృద్ధ మహిళ నాకు తారసపడింది.

తను నా దగ్గరికొచ్చి 'జరతూస్త్ర మాకు చాలానే బోధించాడు. కానీ స్త్రీల గురించి మాతో అతను ఎప్పుడూ మాట్లాడలేదని చాలామంది స్త్రీలు నాతో అన్నారు' అన్నది.

ఆమెకు నేను 'స్త్రీ గురించి పురుషులతో మాత్రమే మాట్లాడతాను' అని సమాధానం ఇచ్చాను.

'అయినా నాకు వయసు మీద పడింది. మతిమరపు కూడా ఎక్కువే. నువ్వు చెప్పబోయేది మర్చిపోతానేమో కూడా.. ఫర్వాలేదు... చెప్పు..' అని ఆ వృద్ధురాలు బలవంతపెట్టడంతో నేను వృద్ధురాలితో చెప్పక తప్పలేదు..

స్త్రీకి సంబంధించిన ప్రతిదీ ఒక చిక్కుప్రశ్న లాంటిది. ఆ ప్రశ్నకి సమాధానం తన గర్భమే. పురుషుడు స్త్రీకి ఒక సాధనంలాంటివాడు. కానీ దాని అంతిమ ఫలితం 'పిల్లవాడు'.

మరి పురుషునికి స్త్రీ ఏంటి?

నిజమైన మనిషి రెండు విషయాలను కోరుకుంటాడు. ఒకటి ప్రమాదం, రెండు ఆట. అందువల్లనే అతను స్త్రీని కోరుకుంటాడు. అది అత్యంత ప్రమాద కరమైన ఆట.

మగాడు ఎప్పుడూ యుద్ధానికి సంసిద్ధంగా ఉన్న యోధుడిలా ఉండాలి. స్త్రీ ఆ సంసిద్ధతకు అందాన్ని ఇచ్చేదిగా ఉండాలి. మిగతావన్నీ మూర్ఖత్వంతో కూడినవి.

చాలా తీపిపండ్లని యోధుడు ఇష్టపడడు. అందువల్ల అతను స్త్రీని ఇష్టపడతాడు. మధురమైన స్త్రీ కూడా అతని దృష్టిలో క్రూరమైనదే.

స్త్రీ, పురుషుల కంటే పిల్లలను బాగా అర్థం చేసుకోగలదు. అయితే పురుషుడు కూడా స్త్రీ ముందు ఒక పిల్లవాడే అనే విషయం మరవద్దు. నిజమైన పురుషునిలో పిల్లవాడు దాగి ఉంటాడు. అతడెప్పుడూ ఆడుకోవాలని కోరుకుంటుంటాడు.

ఓ.. స్త్రీ.. అటువంటి సమయంలో మీరు ఆ పురుషునిలో ఒక పిల్లవాడిని చూడండి. స్వచ్ఛమైన ఒక చక్కని విలువైన రంగు రాయిలా, ప్రపంచంలో సకల సద్గుణాలతో ప్రకాశించే ఒక ఆటవస్తువులా ఉండండి అతనికి..

మీ ప్రేమతో ఒక నక్షత్రం యొక్క పుంజం ప్రకాశింపజేయండి. ఆశగా 'నేను సూపర్ మాన్‌కు జన్మనివ్వగలను, అతన్ని భరించగలను' అని గర్వంగా చెప్పండి..

మీ ప్రేమలో శౌర్యం ఉండనివ్వండి. మిమ్మల్ని భయపెట్టేవారిపై కూడా మీ ప్రేమతో దాడి చెయ్యండి. మీ ప్రేమలో గౌరవం ఉండనివ్వండి. సాధారణ స్త్రీకి ఆ గౌరవం యొక్క అర్థం బోధపడదు. మిమ్మల్ని ఎక్కువగా ప్రేమించేవారి కంటే వారిని ఇంకా ఎక్కువగా ప్రేమించండి. రెండవ స్థానం కాకుండా ఎప్పుడూ మొదటి స్థానం కోసం పోరాడండి. అందులోనే మీకు గౌరవం దక్కుతుంది.

స్త్రీ ప్రేమించేటప్పుడు పురుషుడిని భయపడనివ్వండి. అప్పుడే ఆమె ప్రతిదీ త్యాగం చేస్తుంది. అప్పుడు ఆమె మిగతావన్నీ పనికిరానివాటిగా భావిస్తుంది.

స్త్రీ అసహ్యించుకున్నప్పుడు పురుషుడు భయపడనివ్వండి. ఎందుకంటే అతను తన అంతరంగంలో కేవలం చెడ్డవాడు మాత్రమే. అప్పుడు అతని దృష్టిలో ఆ స్త్రీ కూడా చెడ్డదే.

కానీ స్త్రీని ఎవరు ద్వేషిస్తారు?

ఒకసారి ఇనుము అయస్కాంతంని అడుగుతుంది.

'నేను నిన్ను ద్వేషిస్తున్నాను.. ఎందుకంటే నువ్వు నన్ను నీవైపు ఆకర్షిస్తున్నావు. కానీ నువ్వు నన్ను మొత్తంగా లాక్కునేంత శక్తి నీలో లేదని'.

మగాడి యొక్క ఆనందం ఏమిటంటే 'నేను సాధించగలను అనే సామర్థ్యం', స్త్రీ యొక్క ఆనందం 'అతడు సాధించగలడు అనే నమ్మకం'. ఎప్పుడైతే స్త్రీ తన ప్రేమకి తాను కట్టుబడి ఉంటుందో అప్పుడు ఈ ప్రపంచం అంతా పరిపూర్ణంగా, అందంగా ఉంటుంది. అప్పుడే స్త్రీ తన ఉపరితలం యొక్క లోతులను తెలుసుకోవడానికి కట్టుబడి ఉంటుంది. ఉపరితలం అనేది స్త్రీ యొక్క స్వభావం. తన ఆత్మ, నిస్సారమైన నీటిపై కదలగల ఒక తుఫాను చిత్రం.

కానీ పురుషుని యొక్క స్వభావం లోతైనది. అతనినది భూగర్భ గుహలలో నుండి గర్జిస్తుంది. స్త్రీ అతని శక్తిని ఆస్వాదిస్తుంది కానీ దానిని అవగాహన చేసుకోలేదు.

అప్పుడు ఆ వృద్ధురాలు నాకు ఇలా సమాధానమిచ్చింది.

'జరతూస్త్ర చాలా మంచి విషయాలే చెప్పాడు.. ముఖ్యంగా దానికి తగిన వయస్సులో ఉన్నవారికి. కానీ విచిత్రం ఏంటంటే జరతూస్త్రకి స్త్రీ గురించి చాలా తక్కువే తెలుసనుకుంటా. కానీ తెలిసినంత వరకు బాగానే చెప్పావు.

కానీ స్త్రీతో అసాధ్యం కాకుండా ఏదైనా ఉంటుందా?

మీరు ఇప్పటివరకూ చెప్పినదానికి కృతజ్ఞతగా నేను మీకో సత్యాన్ని ఇస్తాను.. అంగీకరించండి..

నా వయస్సుకు ఆ అర్హత ఉంది.

మీ చేతులతో గట్టిగా దాని నోరు మూసి పట్టుకోండి. లేకుంటే అది చాలా బిగ్గరగా అరుస్తుంది.

అది చిన్న కొంటె నిజం.

"ఓ..స్త్రీ... నీ ఆ సత్యాన్ని నాకు ఇవ్వండి!" అని అడిగాను నేను.

అప్పుడు ఆ వృద్ధురాలు "నీవు మహిళల దగ్గరకు వెళ్తున్నావా జరతూస్త్ర! ఐతే దీన్ని మర్చిపోవద్దు...." అని చెప్పి నా చేతిలో ఈ కొరడా పెట్టి వెళ్ళిపోయింది."

❖ ❖ ❖

# న్యాయం

కొంచెం మగతగా ఉండడం వల్ల జరతూస్త్ర అంజురా చెట్టు కింద పడుకోవాలనుకున్నాడు. ఎండ బాగా ఎక్కువగా ఉండడంతో ముఖానికి అడ్డుగా చేతులు పెట్టుకొని పడుకున్నాడు. అప్పుడే ఒక విషసర్పం వచ్చి జరతూస్త్ర మెడ మీద కాటువేసింది. ఒక్కసారిగా జరతూస్త్ర లేచి బాధతో గట్టిగా అరుస్తూ పారిపోతున్న ఆ విషసర్పం వైపు చూశాడు. ఆ సర్పం కూడా జరతూస్త్ర వైపు చూసి వెంటనే అతని నుండి ఇంకా దూరంగా, వేగంగా పరిగెత్తడానికి సిద్ధం అయ్యింది.

"ఓ విషసర్పమా... ఆగు...

నువ్వు నా కృతజ్ఞత అంగీకరించకముందే వెళ్లడం మంచిది కాదు. నువ్వు నన్ను సరైన సమయానికి మేల్కొలిపావు. నేనింకా చాలా దూరం ప్రయాణించాలి, నా గమ్యాన్ని నాకు గుర్తు చేసావు.." అన్నాడు జరతూస్త్ర.

సర్పం బాధతో "నా విషం నిన్ను చంపేస్తుంది" అన్నది.

జరతూస్త్ర నవ్వి "పాము యొక్క విషం వలన డ్రాగన్ ఎప్పుడైనా మరణించిందా? నీ విషాన్ని నువ్వు వెనక్కి తిరిగి తీసుకో, ఐనా నువ్వు నాకు ఇచ్చేంత ధనవంతుడవు కాదు..." అన్నాడు జరతూస్త్ర.

అప్పుడు ఆ విషసర్పం జరతూస్త్ర యొక్క మెడని చుట్టుకొని విషాన్ని తిరిగి వెనక్కి తీసుకుంది.

జరతూస్త్ర ఒకసారి తన శిష్యులతో ఈ విషయం చెప్పినప్పుడు, వారు ఈ కథ యొక్క నీతి ఏమిటని అడిగారు. అప్పుడు జరతూస్త్ర, నైతికత మరియు

మంచి చెడుల యొక్క వినాశకారి అని నన్ను పిలవండి. నా కథ యొక్క నీతి అనైతికమైనది అన్నాడు.

యేసు చెప్పిన అతిముఖ్యమైన సూక్తులలో ఒకటి:

'ఎవరైనా మిమ్మల్ని చెంపదెబ్బ కొడితే, అతనికి మీ రెండవ చెంప కూడా చూపించండి.'

జరతూస్త్రది దీనికి అస్సలు ఏకీభవించని మనస్తత్వం. అలా ఏకీభవించక పోవడానికి అసలు కారణం... ఎవరైనా మిమ్మల్ని ఒక చెంపదెబ్బ కొట్టినప్పుడు మీరు అతనికి మీ రెండవ చెంప కూడా చూపించినట్లు ఐతే మీరు అతన్ని తక్కువ చేసి అగౌరవపరుస్తున్నట్టే. అతన్ని పాపి అని అతనికి గుర్తు చెయ్యడం ద్వారా మీకు మీరు పవిత్రుడు, శాంతికాముకుడు అని మిమ్మల్ని మీరు హెచ్చించు కుంటున్నారు. అలా చూపించడం ద్వారా మీరు అతన్ని అవమానిస్తున్నారు, అగౌరవపరుస్తున్నారు... కానీ జరతూస్త్ర మీరు తిరిగి అతన్ని కొట్టి నేను కూడా మనిషినే అని అతనికి గుర్తు చెయ్యమంటాడు.

అలా చెయ్యడం అనేది సమానత్వాన్ని చూపుతుంది. నేను మీకు చెందినవాడిని, నువ్వు నాకు చెందుతావు. నేను మీ కంటే గొప్పవాడిని కాదు. నువ్వు నాకంటే తక్కువ కాదు అని చెప్పడం లాంటిది. ఇద్దరమూ సమానమే అని చెప్పడం లాంటిది. పవిత్ర పురుషులు అని పిలవబడే వారంతా వాళ్ళు చూపే విధేయత, అణుకువలో కూడా నేను నీకంటే అధికుడని అనే అహం అంతర్లీనంగా ఉంటుంది. వారికి మనుషులపట్ల ఉన్నది ఏహ్యాభావం తప్ప మరొకటి కాదు. వారి లోలోపల మీరు పాపులు అనే భావం తప్ప ఇంకోటి ఉండదు. మీరు వారి కోపానికి కూడా అర్హులు కాదు అన్నట్లు ఉంటారు. వారు తమతో సమానంగా ఏ విధంగానూ మీకు విలువ ఇవ్వరు.

కానీ జరతూస్త్ర.. నేను మీ వాడినే నా సోదరులారా.. సహోదరులారా.. అనుకుంటూ ఎటువంటి అహంభావం లేకుండా సాధారణ మానవునిలా మనలో కలిసిపోయే మనిషి. కేవలం మిమ్మల్ని పాపులు అని పిలవడం ద్వారానే సాధువులలో తొంభై తొమ్మిది శాతంమంది గొప్ప సాధువులు అయ్యారు. ప్రతి ఒక్కరినీ వారి పాదాల ముందు మోకరిల్లేలా చేయడం, ప్రతి ఒక్కరి గౌరవాన్ని నాశనం చేయడం వారి అంతర్గత ఆనందం.

మీ శత్రువు వలన మీకు ఏదైనా చెడు జరిగినప్పుడు తిరిగి మీరు అతనికి మంచి చేయవలసిన అవసరం లేదు. కానీ మంచే చెయ్యాలని మీకు మతాలు, నీతిశాస్త్రాలు బోధించాయి. కానీ ఎందుకు మంచి చెయ్యాలని మీకెవరూ చెప్పలేదు.. దాని వెనుక ఉన్న అసలు సత్యం ఏమిటి అని కూడా ఎవ్వరూ ఆలోచించరు. మీరు అపస్మారకస్థితిలో మీ అవతలి వ్యక్తిని ఇబ్బందికి గురిచేస్తున్నారనే వాస్తవం మీకు బోధపడదు. దీన్ని ఏ కోణంలో నైతికత అని పిలవవచ్చు?

అతను మీకు చేసినట్లే మీరు కూడా అతనికి చేస్తే బాగుంటుంది. అప్పుడు అది అతనికి ఎటువంటి ఇబ్బందీ కలిగించదు. అది మీ అహానికి పోషణ ఇవ్వదు. తను చేసిన చెడుకి మంచిగా సమాధానం ఇవ్వడం కంటే, అతను చేసిన చెడును అంగీకరించి, అతను మీకు మంచే చేశాడని నిరూపించండి. అతను మీకు ఏదైనా మంచి చేశాడని మీరు నిరూపించగలిగితే, మీరు అతనికి చెడు చేయకుండా ఉండటమే కాదు, మీరు అతనికి ఏదైనా మంచి చేసినందున మీరు కూడా ఇబ్బంది పడటం మానేస్తారు. అతను మీకు మంచి చేశాడని నిరూపించడం ద్వారా, మీరు అతని దృష్టిలో అతని స్థాయిని పెంచుతారు. బహుశా ఇది అతని శత్రుత్వం మాయమయ్యే అవకాశాన్ని సృష్టించవచ్చు.

మీ చెడు చర్యలను మంచివని రుజువు చేసే వ్యక్తికి శత్రువుగా ఉండటం చాలా కష్టం, అలా అని జరతూస్త్ర ఎవరైనా తప్పు చేస్తే క్షమించమని అనడం లేదు. ఎందుకంటే మీరు ఒకరిని క్షమించినట్లయితే తిరిగి అతను మిమ్మల్ని క్షమించాలి అనుకోవడం అవివేకం మరియు అమాయకత్వం. ఎవరైనా మిమ్మల్ని కొడితే మీరు అతన్ని తిరిగి కొట్టడమే సమానత్వం. ఆ విషయం అక్కడితో పూర్తవుతుంది. కానీ మీరు క్షమించినప్పుడు అది అసంపూర్ణం మాత్రమే. మీరు ఆ మనిషిని ఇబ్బంది పెడుతున్నట్లే. అతను మిమ్మల్ని క్షమించలేడు. క్షమించడం ద్వారా మీరు శత్రువును సృష్టించుకుంటారు. జరతూస్త్ర తప్ప మరెవరూ ఈ దృష్టి కోణం నుండి చూడలేదు. ఈ కోణం శత్రుత్వాన్ని నాశనం చేయడమే తప్ప దానిని సృష్టించడం కాదు.

మీరు నిజంగా శత్రుత్వం అదృశ్యం కావాలని కోరుకుంటే, మీ శత్రువు మీకు గొప్ప ప్రయోజనాన్ని, విలువైనదాన్ని ఇచ్చాడని అతనికి నిరూపించండి మరియు మీరు మీ శత్రువుని చాలా గొప్పవాడు మరియు దానిని వ్యక్తీకరించడానికి

మీకు పదాలు లేవన్నట్లు ప్రవర్తించండి. అది అతన్ని కలవరపెడుతోంది. దిగ్భ్రాంతికి గురిచేస్తుంది.

కోపంగా ఉండకూడదని అందరూ మీకు బోధిస్తున్నారు, కానీ మీ శత్రువుపట్ల మీరు కోపం ప్రదర్శించకపోయినట్లైతే మీరు అతన్ని అవమానిస్తున్నట్లే.

మీకు ఎవరైనా అన్యాయం చేస్తే, ప్రతిఫలంగా తిరిగి అతనికి అన్యాయం చేయండి. ఇది దాదాపు సగం న్యాయం. మొత్తం న్యాయం సాధ్యం కాకపోతే, కనీసం సగం అయినా చెయ్యండి. కానీ మానవత్వం, జాలి, కరుణ గురించి బోధించేవారు 'మీరు వినయంగా ఉండాలి, సున్నితంగా ఉండాలి, కోపంగా ఉండకూడదు, క్షమించే గుణం ఉండాలి' అంటుంటారు.

ఒకవేళ మీకు అన్యాయం జరిగితే, మీరు తిరిగి ఆ న్యాయం చేసుకోపోగా, మీకు అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేయకుండా, దానిని భరించే అంత సామర్థ్యం మీకు ఉంటే మీరు మానవుడిని అగౌరవపరుస్తున్నట్టే. మీ శిక్ష శిక్షించబడే వారికి గౌరవంగా ఉండాలి. అది తన ఆత్మకు వినాశకరమైనది కాకూడదు. అది గౌరవంగా, అతన్ని బలోపేతం చేసేదిలా ఉండాలి. దానికి అతను అర్హుడు అయ్యి ఉండాలి.

ముఖ్యంగా మీరు చేసినది సరైనది అయినప్పుడు, మీరు సరైనవారని చెప్పుకోవడం కంటే మిమ్మల్ని మీరు తప్పు చేసినవారిగా ప్రకటించడం చాలా గొప్పది. అది మీకు గౌరవాన్ని ఇస్తుంది. అది ఎవరి గౌరవాన్ని హరించదు. మీ దృష్టిలో మీపట్ల మీకు గౌరవం, ప్రేమ ఇంకా పెరుగుతాయి. మీరు దానికి తగినంత అర్హులై కూడా ఉండాలి. ఒకరిని శిక్షించడానికి నిజంగా గొప్ప వ్యక్తిత్వం కలిగి ఉండాలి. అది మీ చేత శిక్షించబడేవారికి మీపట్ల గౌరవాన్ని పెంపొందించేలా ఉండాలి.

నేను మీ నిరాధారమైన న్యాయాన్ని ఇష్టపడను అంటాడు జరతూస్త్ర.

ప్రేమ మీద ఆధారపడలేని న్యాయం న్యాయమే కాదు. న్యాయస్థానాలు అన్నీ క్రూరమైనవి. వాటికి ప్రేమ, కరుణ ఉండవు. చట్టం, న్యాయం కేవలం మృతపదాలు మాత్రమే. వాటికి ప్రేమ గురించి, కరుణ గురించి తెలియదు. అలాంటి చనిపోయినవి బ్రతికి ఉన్నవారి మంచిచెడులను నిర్ణయిస్తాయి. న్యాయస్థానాలు తప్పు చేసినవాడి గతం ఆధారంగా అతని భవిష్యత్తుని నాశనం

చేస్తాయి. అది అతని గతచర్య, కానీ భవిష్యత్తులో ఈ నేరం చేసినవాడు ఒక మంచివానిగా మారలేడని చెప్పలేరు. మనిషి ఈ క్షణం మార్చగలడు. కానీ అతని భవిష్యత్తు ఇంకా తెరిచే ఉంది. ఇది అతని నిన్నటి వరకు ఆక్రమించబడలేదు. మొత్తం న్యాయవ్యవస్థ 'రేపు' అనేది లేదని శతాబ్దాలుగా పరిగణనలోకి తీసుకుంది. మనిషి గురించి నిర్ణయించడానికి నిన్నటి రోజులు సరిపోతాయి అనుకుంటుంది. అతని నిన్నటి రోజులు కాలగర్భంలో కలిసిపోయాయి. జీవితంలోని చనిపోయిన భాగం అతని భవిష్యత్తుని నిర్ణయిస్తుంది. అది అతని స్వేచ్ఛను హరించవచ్చు. అది అతని మరణమే కావొచ్చు. ఒక చిన్న చర్య మనిషి మొత్తం జీవితాన్ని నిర్వచించకూడదు. న్యాయమూర్తి తన జీవితమంతా ఎవరికో ఒకరికి శిక్ష వేయడం, ఉరిశిక్షకు పంపడం గురించి తీర్పులు చదువుతూనే ఉంటాడు. అతని కళ్ళలో కన్నీరు ఉండదు. శిక్షింపబడే వ్యక్తికి భార్య ఉండవచ్చు, పిల్లలు ఉండ వచ్చు, వృద్ధ తల్లితండ్రులు ఉండవచ్చు. కుటుంబంలో సంపాదించే ఏకైక వ్యక్తి అతనే అయ్యి ఉండొచ్చు. ఆ కుటుంబానికి అతనే ఆధారం అయ్యి ఉండొచ్చు. అతన్ని ఉరికి పంపడం వలన జరిగిన తప్పుని సరిచేసానని న్యాయమూర్తి అనుకుంటాడు. కానీ ఆ ఉరి అతను చేసిన తప్పుని తిరిగి వెనక్కి వెళ్లి సరిదిద్దకపోగా, మరొక తప్పుని సృష్టిస్తుంది. అతని పిల్లలు బిచ్చగాళ్ళు, దొంగలు అవుతారు. భార్య వేశ్యగా మారవలసి ఉంటుంది. వారి వృద్ధాప్యంలో ఆ వృద్ధ తల్లితండ్రులు తిండి కోసం సరిపడిన సంపాదన కోసం వారు ఇంకా కష్టపడవలసి ఉంటుంది. ఒక చిన్న చర్య, బహుశా చాలా క్షణికమైన భావోద్వేగస్థితిలో ఆ వ్యక్తి తప్పు చేసి ఉండవచ్చు. కానీ అది అతని జీవితమంతా నిర్ణయాత్మకంగా ఉండకూడదు. అతన్ని మాత్రమే కాదు, అతని పిల్లలు, అతని భార్య, తల్లిదండ్రులు, అతని పిల్లల భవిష్యత్తుని నిర్ణయిస్తుంది. ఆ చిన్న చర్య శతాబ్దాలుగా ఆ వంశవృక్షాన్ని పట్టి పీడిస్తుంది.

ఇది చాలా క్రూరమైనది, కఠినమైనది, ప్రేమ లేనిది. అటువంటి న్యాయం అసలు న్యాయమే కాదు. ఇది నిజంగా సమాజం యొక్క ప్రతీకారం. న్యాయమూర్తి సమాజసేవ ముసుగులో ఉరి తీసేవాడు తప్ప మరొకటి కాదు. సమాజంలోని నియమ నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తించినప్పుడు ఆ మనిషిని నాశనం చేయడానికి న్యాయమూర్తి, పోలీసులు, సైన్యం, చట్టం అన్నీ ఉన్నాయి. మంద చట్టవిరుద్ధమని నిర్ణయించినదానిని ఆ వ్యక్తి చేశాడు. అక్కడ మీకు కఠినమైన

హృదయంతో తీర్పుని ఇచ్చే న్యాయమూర్తి, శిక్షించేవారు మాత్రమే కనపడతారు. కానీ ప్రేమతో నిండిన హృదయం లేకుండా మీరు ఒక వ్యక్తి జీవితంలో మొత్తం సంక్లిష్టతను చూడలేరు. ఒక చిన్న చర్య సుదీర్ఘ జీవితం గురించి నిర్ణయాత్మకంగా ఉంటుంది. వారు అతని భవిష్యత్తు తలుపులు మూసివేస్తున్నారు. వారు అతనిని మార్చడానికి అవకాశాన్ని ఇవ్వడం లేదు. కానీ ప్రేమ ఎప్పుడూ అవకాశం ఇవ్వడానికి సిద్ధంగా ఉంటుంది. న్యాయమూర్తుల ఆ కఠినమైన కళ్ళకు చనిపోయిన చట్టాలు మాత్రమే తెలుసు. వారు తమ చట్టాలను అనుసరిస్తూ, చట్టం చేయబడలేదు కాబట్టి మనిషి దానికోసం బలి కావాలి. మనిషికి సేవ చేయడానికి చట్టం రూపొందించబడింది. చట్టానికి సేవ చేయడానికి మనిషి జన్మించలేదు. చట్టాన్ని మార్చవచ్చు. చట్టం మానవ నిర్మితమైనదని న్యాయమూర్తులు ఆలోచించరు. మానవుడు ఇంకా మూర్ఖత్వంతో, అంధత్వంలో ఉన్నాడు. చట్టాలకు వ్యతిరేకంగా, న్యాయస్థానాలకు వ్యతిరేకంగా ఎటువంటి తిరుగుబాటు లేకుండా గుంపుని అనుసరిస్తూనే ఉన్నాడు. న్యాయం పేరిట ప్రభుత్వం తనలో కోపం, క్రూరత్వం, ప్రతీకారం, అసూయలను దాచుకుంది. ఇది చాలా క్రూరత్వం. వ్యక్తి పట్ల కానీ , ప్రాణంపట్ల కానీ దానికి ఎటువంటి గౌరవం ఉండదు. హృదయంలో నాది అనుకున్న దానిని అందరికీ ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను అంటాడు జరతూస్త్ర. అప్పటికే మీది అయినదానిని గురువు మీకు ఇస్తాడు. మీది కానిది మీ నుండి తీసివేస్తాడు. మీలో నిజమైన దానిని పెరగడానికి, వికసించడానికి అతడు మీకు అవకాశం ఇస్తాడు. గురువు తనది అంటూ ఇవ్వగలిగేది అతని పారవశ్యం, ప్రేమ, ఆనందం, జీవిత సమృద్ధి. మానవుడు పుట్టినప్పుడు వేలాది సామర్థ్యాలతో పుడతాడు. అవి విత్తనదశలో మాత్రమే ఉంటాయి. అందువల్ల మీరు వాటిని చూడలేరు. సరైన అవకాశం, సరైన ప్రయత్నం, సరైన పునాదులు ఇచ్చినట్లయితే, అవన్నీ వికసిస్తాయి. ఒక మనిషికి అలాంటి ప్రేమ మరియు అలాంటి ఆనందం ఉంటే తప్ప అతను న్యాయమూర్తి కావడానికి అర్హుడు కాదు.

న్యాయమూర్తికి చట్టం గురించే కాకుండా ప్రేమ, కరుణ కూడా తెలిసి ఉండాలి. ప్రజలకు చట్టంలోని చనిపోయిన అక్షరాలను ఇవ్వడం ప్రమాదకరం. అంధుల చేతులకి మీరు అంత శక్తిని ఇస్తున్నారు. మీరు అధికారాన్ని ఇచ్చే ముందు వారికి ప్రేమను ఇవ్వండి, తద్వారా శక్తి ఎప్పుడూ దుర్వినియోగం అవ్వదు. ప్రేమ మాత్రమే శక్తిని దుర్వినియోగం చేయకుండా ఉండగలదు. చట్టం కంటే

ప్రేమ చాలా విలువైనది. కానీ చట్టం అత్యున్నత విషయంగా మారింది, ప్రేమ పూర్తిగా విస్మరించబడుతుంది. చట్టానికి సంబంధించినంతవరకు ప్రేమకు చోటు లేదు కానీ ప్రతి చట్టాన్ని ప్రేమ చట్టాల ప్రకారం మార్చే గొప్ప విప్లవం అవసరం. న్యాయం కేవలం ప్రేమకి నీడలా ఉండాలి.

చివరగా నా సోదరులారా..!

నాలాంటి సాధువుకి అన్యాయం చేయడంపట్ల జాగ్రత్త వహించండి. ఎందుకంటే తాను ఏదీ అంత సులభంగా మరిచిపోలేడు. బావిలో రాయి విసరడం అయితే చాలా సులభం. కానీ ఆ విసిరేసిన రాయిని బయటికి ఎవరు తీయగలరు? నేను లోతైన బావి లాంటివాడిని. ఒకవేళ మీరు అలా విసిరి ఉంటే నన్ను కూడా చంపెయ్యండి అంటాడు జరతూస్త్ర.

❖ ❖ ❖

# సరైన సమయంలో మరణించండి

చాలామంది మరణించాల్సిన సమయం కంటే ముందరే మరణిస్తారు. కొంతమంది మాత్రం మరణించే సమయం వచ్చినా మరణించక తమ మరణాన్ని ఇంకొంత కాలం వాయిదా వేస్తూ ఉంటారు. కానీ జరతూస్త్ర సందేశం ఏంటంటే 'సరైన సమయంలో మరణించండి'.

చాలామంది ఆలస్యంగా చనిపోతారు. అంటే వాళ్ళ జీవితానికి ఎటువంటి అర్థం ఉండదు. వారి జీవితంలో ఎలాంటి ఆనందం, ఆట, పాట, నృత్యం లాంటివి ఉండవు. వాళ్ళ జీవితంలో చిగురించటానికి ఏం ఉండదు. వారు బ్రతికే ఉంటారు, కానీ వారి జీవితంలో ఎలాంటి ఉత్సాహం, పారవశ్యం ఉండదు. ఎలా జీవించాలో తెలియక, శరీరాన్ని వదిలే ధైర్యం లేక పరాన్నజీవులలా, ఎలాంటి సృజనాత్మకత లేకుండా, జీవితాన్ని ఆనందంగా పాడుతూ, డ్యాన్స్ చేసేవారిని చూస్తూ చాలా అసూయతో రగిలిపోతూ, జీవిస్తున్న వారందరినీ ఖండిస్తూ, భూమికి భారంలా మనుగడ సాగిస్తూ ఉంటారు. వీరంతా జీవితాన్ని ప్రేమించు, జీవించు అని చెప్పేవారు కాదు. జీవితాన్ని ఖండించు, ఈ దేహం తుచ్ఛమైనది అని చెప్పే సాధువులు, పూజారులు. ఇలాంటివారిని మనం పవిత్రులు అంటాం. వారు పవిత్రులు కాబట్టి పవిత్రులు అనము. ఎందుకంటే వారికి ఎలా జీవించాలో

తెలియదు, ఎలా చనిపోవాలి అనే విషయం కూడా దాదాపు మరిచిపోయారు. ఇలాంటివారు అంధకారంలో జీవిస్తారు.

కొంతమంది చాలా ముందుగానే చనిపోతారు. దానర్థం వారు నిజంగా చనిపోతారని కాదు, వారు తమ మరణానంతరం కూడా జీవితాన్ని గడుపుతున్నారని అర్థం. వారు ముప్పై సంవత్సరాలకే చనిపోతారు కానీ డెబ్బై సంవత్సరాల తరువాత ఖననం చేయబడతారు. ఆ నలభై సంవత్సరాలు వాళ్ళ జీవితం ఒక ఎడారి. ప్రేమించడం ఆపేసిన రోజున, నృత్యం చేయడం మరచిన రోజున, పాట పాడడం మరచిన రోజున, సృష్టించడం ఆపివేసిన రోజున, సృజనాత్మకత మరుగునపడిన రోజున వారు శారీరకంగా శ్వాస తీసుకుంటున్నప్పటికిని మానసికంగా మరణించినట్టే.

ఈ జరతూస్త్ర సందేశం ఏంటంటే 'సరైన సమయంలో మరణించండి' అని. పూర్తి తీవ్రతతో ఆనందంగా, ముఖం మీద చెరగని చిరునవ్వుతో, జీవితాన్ని అనుక్షణం ప్రేమిస్తూ, వారి సొంత జీవనవనరుల ప్రకారం తనలోని సృజనాత్మకత శక్తిని ఉపయోగించుకుంటూ ఆనందంగా జీవించేవాడు మాత్రమే సరైన సమయంలో చనిపోవడానికి అర్హుడు. పూర్తిగా జీవించే మనిషికి మరణం ఒక నిర్ణయం మాత్రమే. అతను విశ్రాంతి తీసుకోవాలనుకునే సమయం ఆసన్నమైనప్పుడు, ఇక భూమిపై కాలం గడపవలసిన అవసరం లేదు అనుకున్నప్పుడు అతను తన శరీరాన్ని మరణానికి అందుబాటులో ఉంచుతాడు. అతను మరణించాలి అనుకున్నప్పుడే తనంతట తాను వెళ్లి మరణాన్ని కౌగిలించుకుంటాడు. ఒక వ్యక్తి చనిపోవడానికి సరైన మార్గం తన చుట్టూ ఉన్న వారికి సూపర్ మాన్ యొక్క ఆశ మరియు వాగ్దానం ఇవ్వడం ద్వారా మరణించడం.

మరణించేవారిలో దాదాపు 99.9 శాతం చాలా ఆలస్యం లేదా చాలా తొందరగా చనిపోయినవారే. ఖచ్చితంగా చెప్పాలంటే, సరైన సమయంలో ఎప్పుడూ జీవించనివాడు సరైన సమయంలో చనిపోలేడు. మీరు ఎల్లప్పుడూ ఉంటే ఆలస్యంగా ఉంటారు.. లేకపోతే తొందరగా ఉంటారు. కానీ సరైన సమయంలో ఎప్పుడూ ఉండరు.. కారణం మనస్సు గతంలో చిక్కుకోవడం. ఎవరైతే తమ గత జ్ఞాపకాలతో గతంలో చిక్కుకుపోతారో వారు జీవితంలో ఎల్లప్పుడూ ఆలస్యమే. ఆలస్యమే వారి దినచర్య అవుతుంది. వారు ప్రస్తుతంలో జీవించలేరు. సరైన

సమయంలో ఉండడం అంటే ఇప్పుడు ఇక్కడ వర్తమానంలో ఉండటం. వర్తమానంలో జీవించడం.

భవిష్యత్తులో జీవించే వ్యక్తులు కూడా ఉన్నారు. వారు ఎల్లప్పుడూ రేపటి కోసం ప్రణాళికలు వేసుకుంటూ రేపటికోసం కలలు కంటూ ఉంటారు. వారు ఎల్లప్పుడూ సమయం కంటే ముందు ఉండాలనే ఆశతో ప్రస్తుతాన్ని పక్కన పెట్టేస్తారు. గతంలో లేదా భవిష్యత్తులో విషయాలు చాలా అసంబద్ధమైనవి.

కానీ దాదాపు ప్రతి ఒక్కరూ ఈ రెండు వర్గాలుగా విభజించబడ్డారు.

గత–ఆధారిత మరియు భవిష్యత్తు–ఆధారిత.

వర్తమానంలో ఇక్కడ, ఇప్పుడు జీవించే వ్యక్తిని కనుగొనడం చాలా అరుదు. కానీ ప్రజలు గతకాలపు జ్ఞాపకాలతో లేదా భవిష్యత్తు ఊహలలో తిరుగుతున్నారు. వర్తమానం వారికి లభించిన ఏకైక జీవితం అని ఈ చిన్న విషయాన్ని పూర్తిగా మర్చిపోయారు. కానీ ఎవ్వరూ గతంలో జీవించలేరు, ఎందుకంటే అది ఇక లేదు. ఎవ్వరూ భవిష్యత్తులో జీవించలేరు ఎందుకంటే అది ఇంక రాదు.

జీవించడానికి ఉన్న ఏకైక అనువైన కాలం – ఇప్పుడు, ఇక్కడ, ఈ క్షణం మాత్రమే.

నిజానికి గతం, భవిష్యత్తు మరియు వర్తమానం అనేవి మన మనస్సు యొక్క విభజనలు మాత్రమే.

కాలానికి తెలిసింది – 'ఈ క్షణం' మాత్రమే. ఇది ఎల్లప్పుడూ ఉంటుంది. సరైన సమయంలో జీవించనివారు సరైన సమయంలో మరణించలేరు, ఎందుకంటే మరణం అసంపూర్తిగా ఉన్న జీవితానికి ముగింపు మాత్రమే. జీవించడం గురించి తెలియనివారు నిరుపయోగంగా భూమికి భారంగా ఉన్నవారు. నిజానికి, మనిషి ఎంత నిరుపయోగంగా ఉంటాడో అతను చేసే శబ్దం అంత ఎక్కువగా ఉంటుంది. అతను తన మరణాన్ని గొప్పగా జరుపుకోవాలని అనుకుంటాడు. అతను ఎలాగో జీవించడాన్ని మరిచిపోయాడు. అతనికి మిగిలి ఉంది మరణం మాత్రమే. అందుకే దానిని గొప్ప వేడుకగా చేసుకుంటాడు. నిరుపయోగమైన మనిషికి తన జీవితానికి అంతర్గత విలువ లేదు. బయటినుండి విలువ ఇవ్వడానికి అతనికి డబ్బు, శక్తి, ప్రతిష్ఠ కావాలి కానీ బయటి నుండి ఏదీ జీవితాన్ని కానీ, మరణాన్ని కానీ

గొప్పగా చేయలేదు. జీవితాన్ని నృత్యంగా మార్చుకోగల శక్తి మీలోనే ఉంది. మరణం జీవితం యొక్క చివరి గొప్ప నృత్యం. మరణాన్ని ప్రతి ఒక్కరూ ముఖ్యమైన విషయంగా గుర్తించాలి. దాన్ని ఒక పండగలా జరుపుకోవాలి. మీ జీవితం ప్రేమతో, సృజనాత్మకతతో, పంచుకోవడంలో, ఆనందంగా ఉంటే, మీరు జీవించకుండా ఉండటానికి ఏ భాగాన్నీ వదిలిపెట్టకపోతే అప్పుడు మీ మరణం మీకొక వేడుక అవుతుంది.

ఇప్పుడు ఈ క్షణాన్ని భవిష్యత్తులో వేరొక దానికోసం త్యాగం చేయవద్దు. మధురమైన గత జ్ఞాపకాలను గుర్తుంచుకోవడంలో వర్తమానాన్ని వృథా చేయవద్దు. ఈ క్షణాన్ని మీకు వీలైనంత తీపిగా, అందంగా సృష్టించుకోండి.

మీకు అలా మరణించే ధైర్యం లేకుంటే యుద్ధంలో వీరుడిగా ఐనా మరణించండి. కానీ మీరు మీ జీవితానికి యజమానిగా ఉండకపోతే, మీ మరణానికి ఎలా యజమాని అవుతారు? ఒక అద్భుతమైన మరణాన్ని ఆస్వాదించాలి అనుకుంటే మీరు ఈ క్షణం నుండే జీవించడం ప్రారంభించాలి. కొంతమంది బిచ్చగాళ్లలా మరణిస్తారు. మరణించే అవకాశం వచ్చిన చిన్నపిల్లాడిలా ఇంకా జీవితానికి అతుక్కునే కూర్చుంటారు. వారు చనిపోవటానికి ఇష్టపడరు. ఎందుకంటే వారు ఇంకా పూర్తిగా జీవించలేదు కాబట్టి. కానీ వారి మరణం వారి ఇంటి గుమ్మం ముందు వారికోసం పడిగాపులు కాస్తూనే ఉంటుంది. వారు జీవించాల్సిన సమయంలో జీవితాన్ని వృథా చేశారు. ఇప్పుడు మరణం వారి ఇంటి తలుపులు తట్టింది. వారు వృథా అయినా జీవితం గురించి తెలుసుకున్నారు. కానీ పూర్తిగా జీవించిన మనిషి మృత్యువు తలుపులు ధైర్యంగా తెరిచి ఉంచుతాడు. అతడు మరణాన్ని ప్రేమతో స్వాగతిస్తాడు. ఎందుకంటే మరణం అతని శత్రువు కాదు కాబట్టి.

ఇప్పటివరకూ ఉన్న బోధకులు, ప్రవక్తలు అంతా నెమ్మది నెమ్మదిగా మరణించడమెలా అని మాత్రమే బోధించారని, సరైన సమయంలో మరణించడం గురించి బోధించలేదని జరతూస్త్ర విలపిస్తాడు. యేసు తనని చుట్టుముట్టిన చెడు ద్వారా చాలా చిన్న వయస్సులోనే మరణించాడని, ఒకవేళ యేసు జనాల మధ్యకి రాకుండా ఏకాంతంలోనే జీవించి ఉంటే 'జీవించడం గురించి, భూమిని ప్రేమించడం గురించి నేర్చుకొని ఉండేవాడని' జరతూస్త్ర అభిప్రాయపడతాడు.

జరతూస్త్ర తన మరణం ఒక అద్భుతమైన సందర్భం అవుతుందని ఊహిస్తాడు. ఎందుకంటే ఇకపై అతని చుట్టూ ఉన్న అతని శిష్యులు తన సూపర్ మాన్ బోధలను కొనసాగిస్తారు. ఒక విధంగా చెప్పాలంటే జరతూస్త్ర తన సొంత బోధనలను పాటించడం లేదని తెలుసుకుంటాడు. అతను ఇంతకు ముందే చనిపోయి ఉండవచ్చు, కానీ ఇప్పుడు, తన శిష్యులు సూపర్ మాన్ యొక్క బోధనలను, ఆదర్శాన్ని కొనసాగిస్తారని ఆశిస్తాడు జరతూస్త్ర. తన శిష్యుల పట్ల ఉన్న ప్రేమే వారి మధ్య ఇంకొంత కాలం ఉండేలా చేసిందని, ఇక తాను వెళ్లే సమయం ఆసన్నమైందని జరతూస్త్ర తన శిష్యులకి చెప్తాడు.

❖ ❖ ❖

# వీడ్కోలు

జరతూస్త్ర తను ఉంటున్న మోట్లీ కౌ పట్టణాన్ని మరియు తన శిష్యులను విడిచి వెళ్ళడానికి సిద్ధం అయ్యాడు. అతని శిష్యులు సాగనంపడానికి ఊరి చివరివరకు అతనితో కలిసి నడుస్తూ వచ్చారు. వారు నడుస్తున్నప్పుడు జరతూస్త్ర తాను ఏకాంతంగా నడవాలనుకుంటున్నట్లు వారికి చెప్పాడు. అతని శిష్యులు జరతూస్త్రకి బహుమతిగా ఒక బంగారు చేతికర్రని ఇస్తారు. దాని చివర ఒక పాము సూర్యుడ్ని చుట్టుకొని ఉంటుంది. జరతూస్త్ర ఆ బహుమతిపట్ల సంతోషాన్ని వ్యక్తపరిచాడు. ఆ చేతికర్ర సహాయంతో నడుస్తూ ఈ బంగారానికి ఎందుకు అంత విలువో తెలుసా అని తన శిష్యులను అడిగాడు. ఎవ్వరూ సమాధానం ఇవ్వకపోవడంతో జరతూస్త్రనే మాట్లాడ్డం మొదలుపెడతాడు.

ఎందుకంటే ఇది అసాధారణమైనది, పనికిరానిది మరియు మెరిసే గుణం కలది. సూపర్ మాన్ కోసం జరిగే శోధన బంగారుగనిని తవ్వడం లాంటిది. మీ ధర్మం కూడా అదే విధంగా ఉండాలి. సూపర్ మాన్ స్థాయికి చేరుకోవడం మనిషికి అసాధారణమైన, ఆనందదాయకమైన ధర్మం. కానీ ఆ అసాధారణం త్వరలోనే చాలా విలువైనదిగా మారుతుంది. త్వరలో మానవాళి సూపర్ మాన్ యొక్క సంపద మరియు రత్నాలను అన్వేషించడం మొదలుపెడుతుంది. ఇది స్వార్థమే.. కానీ పవిత్రమైన, శ్రేష్ఠమైన స్వార్థం. ఇది మంచి స్వార్థమే, ఎందుకంటే నేను, మీరు ఈ సద్గుణాలు మన కోసం అయినప్పటికీ, సమస్త మానవాళిని కూడా సూపర్ మాన్ స్థాయికి తీసుకురావాలనే ఆశతో ఉన్నాము.

మరొక రకమైన స్వార్థం కూడా ఉంది, అదే దుర్గుణమైన స్వార్థం. ఈ రకమైన స్వార్థం దాని స్వార్థం అది చూసుకుంటుంది. దానికి మానవాళికి సహాయం చేయాలనే కోరిక ఉండదు. ఇతరులు సూపర్ మాన్ స్థాయిలకు చేరుకోవడం కూడా ఈ స్వార్థం పట్టించుకోదు. చరిత్రను చూసే వ్యక్తి ఈ రెండు రకాల స్వార్థానికి సంబంధించిన సంకేతాలను చూడగలుగుతాడు మరియు మంచిచెడుల యొక్క అంతర్లీన కోరికలను చూడగలుగుతాడు. అటువంటి సంకేతాలను గుర్తించగలిగిన వ్యక్తిని నేను. అందుకే నేను మీరు సూపర్ మాన్ యొక్క ఎత్తులను ఆస్వాదించాలని కోరుకుంటున్నాను.

మీరు భూమిపట్ల నిబద్ధతగా, పవిత్రంగా ఉండాలని, సూపర్ మాన్‌కి సంబంధించిన సువార్తను విశ్వవ్యాప్తం చేయమని కోరుకుంటున్నాను. మానవాళి, మానవాళి దగ్గరే ఆగిపోవడం అతి పెద్ద పొరపాటు మరియు లోపం కూడా. ఈ లోపం కారణంగానే పిచ్చి 'చరిత్రని' అధిగమించింది. ఇప్పటివరకు నేను మీకు మానవాళిని, ఆ పిచ్చిని అధిగమించగల సూపర్ మాన్ గురించి చెప్పాను. వైద్యుల మాదిరిగానే ఎప్పటికప్పుడు మిమ్మల్ని మీరు ఆరోగ్యంగా ఉంచుకుంటూ, సమస్త మానవాళి యొక్క ఆరోగ్యంపట్ల కూడా శ్రద్ధ చూపండి. సూపర్ మాన్ ద్వారా మానవాళిని అధిగమించినప్పుడు మాత్రమే ఈ భూమి కోలుకోగలదని జరతూస్త్ర ఉత్సాహంగా తన శిష్యులకి చెప్పాడు.

జరతూస్త్ర ఈ మాటలు మాట్లాడి ఇక తన దగ్గర చెప్పడానికి ఇంక మాటలు లేవు అన్నట్లు కొంచెం విరామం ఇచ్చాడు. గొంతుని సవరించుకొని మరల మాట్లాడ్డం మొదలుపెట్టాడు. ఈసారి అతని స్వరం మారిపోయింది.

శిష్యులారా...! నేను ఇప్పుడు ఒంటరిగా వెళ్తాను. మీరు ఒంటరిగా మీ మార్గంలో ముందుకు సాగండి. నన్ను విడిచిపెట్టి, జరతూస్త్ర నుండి జాగ్రత్తగా ఉండండి. ఇంకా చెప్పాలంటే అతన్ని చూసి సిగ్గుపడండి. బహుశా అతను మిమ్మల్ని మోసపుచ్చి కూడా ఉండవచ్చు.

జ్ఞానం ఉన్న మనిషి తన శత్రువులను ప్రేమించడమే కాదు, తన స్నేహితులను ద్వేషించగలడు కూడా. శిష్యుడు శిష్యుడిగానే మిగిలిపోతే గురువుకి మీరు ఇచ్చే విలువేంటి? మీరు నన్ను గౌరవిస్తారు.. పూజిస్తారు.. ఆదరిస్తారు.. మీకు నాపట్ల ఉన్న గౌరవం మంటకలిసిపోతే..?

జరతూస్త్రని మీరు నమ్ముతున్నారు సరే.. కానీ జరతూస్త్ర మిమ్మల్ని నమ్ముతున్నాడా? మీరు నా విశ్వాసపాత్రులు.. కానీ విశ్వాసులందరి విశ్వాసం ఎటువంటిది? ఎంతవరకు? ఎప్పటివరకు?

మిమ్మల్ని మీరు ఇంకా అన్వేషించలేదు. అందుకే ఇప్పటివరకు నాకు విశ్వాసపాత్రులుగా, శిష్యులుగా ఉన్నారు. ఇప్పుడు మీరు నన్ను త్యజించి మిమ్మల్ని మీరు అన్వేషించండి. మీరందరూ నన్ను తిరస్కరించినప్పుడే నేను మరల మీ ముందు ఉంటా.

నా సహోదరులారా..! నేను తప్పిపోయినవారిని వెదకుతాను. ఇంకా శ్రేష్ఠమైన ప్రేమతో నేను వారిని ప్రేమిస్తాను. మరోసారి మీరు నాకు మిత్రులుగా మారుతారు. అప్పుడు మీతో గొప్ప వేడుకలు జరుపుకోవడానికి నేను మూడవసారి మిమ్మల్ని కలుసుకుంటాను.

"దేవుళ్ళు అందరూ చనిపోయారు. ఇప్పుడు సూపర్ మాన్ ఉనికిలోకి రావాలని బలంగా కోరుకుందాము. ఈ సుందరమైన మధ్యాహ్నం సమయాన ఇదే మన అంతిమ సంకల్పం అయ్యి ఉండాలి.." అని చెప్పి జరతూస్త్ర తన శిష్యులని విడిచి వెళ్ళిపోయాడు.

# రెండవ భాగం

# రాక్షస ప్రతిబింబం

**త**న శిష్యులను వదిలి ఒంటరిగా తానుంటున్న ప్రాంతానికి తిరిగొచ్చాడు జరతూస్త్ర. ఆ అడవుల్లోనే, కొండల్లోనే నెలలు, సంవత్సరాలపాటు మౌనంగా ఏకాంతంలో ఉండిపోయాడు.

అతను ఏకాంతంగా ఉన్నప్పటికీ తన జ్ఞానంతో ఇంకా ఇంకా భారమైపోతూ ఉంటాడు. ఒక రోజు తెల్లవారుజామున కల రావడంతో ఉలిక్కి పడి లేచాడు. ఆ కలలో ఒక పిల్లవాడు అద్దం పట్టుకొని జరతూస్త్ర వద్దకు వచ్చాడు. జరతూస్త్ర అద్దంలోకి తొంగిచూసాడు. కానీ ఆ అద్దంలో తన ప్రతిబింబానికి బదులుగా ఒక భయంకరమైన దెయ్యం అపహాస్యంగా నవ్వుతుండడం చూసి తన బోధనల యొక్క శత్రువులు అతని భావాలను, బోధనలను వక్రీకరించి తన శిష్యులను దారితప్పించారని ఆ కల ద్వారా అర్థం చేసుకుంటాడు జరతూస్త్ర. తన శిష్యులు తన బోధనలను సరైన మార్గంలో ప్రతిబింబించడం లేదని, అంటే సూపర్ మాన్ ఉనికిలోకి రావడం కష్టమనే ఉద్దేశంతో ఉన్నారని భావించి అప్పటివరకు ఉన్న తన మౌనాన్ని విడనాడి, పర్వతం మీద ఉన్న తన జంతువులైన పాము మరియు డేగతో తాను తిరిగి వెళ్ళవలసిన అవసరాన్ని వివరిస్తాడు. యుద్ధానికి వెళ్ళడానికి సిద్ధమవుతున్న ఒక యోధునిగా జరతూస్త్ర తనని తాను పోల్చుకున్నాడు. జరతూస్త్ర తిరిగి స్నేహితుల వద్దకు తిరిగి వెళ్తున్నాననే ఆనందంతోపాటు తన శత్రువులను నాశనం చేయాలనే ఉద్దేశంతో కిందకి బయలుదేరాడు. అతని శిష్యులు అతన్ని చూసి భయపడవచ్చు. అయినప్పటికీ, అతని కోపం తన బోధనలను తిరిగి పునరుజ్జీవింపజేస్తుందని జరతూస్త్రకు తెలుసు. తానుంటున్న గుహని వదిలి తన శిష్యులకు కొత్త రకమైన జ్ఞానాన్ని ఇవ్వడానికి కిందకి బయలుదేరాడు జరతూస్త్ర.

❖ ❖ ❖

# సృష్టికర్తల లక్షణం

జరతూస్త్ర అకస్మాత్తుగా 'దీవెనలద్వీపం'లో తన శిష్యులను కలుసుకున్నాడు. ('అదృష్టద్వీపాలు' లేదా 'దీవెనలద్వీపాలు' అనే పదం గ్రీకు పురాణాలకు సంబంధించినది. గ్రీకు దేవుడు అలసిపోయిన హీరోల కోసం రూపొందించిన స్వర్గాన్ని తలపించే ఒక విశ్రాంతి స్థలం.)

ఇది ఆకురాలు కాలం.. మిట్టమధ్యాహ్నం... గగనం ప్రశాంతంగా ఉంది.. బలంగా వీస్తున్న గాలి వలన అంజీరపండ్లు చెట్ల నుండి రాలి కిందపడుతున్నాయి. అవి చూడడానికి అందంగా, తినడానికి తియ్యగా ఉంటాయి. పండిన అంజీర పండ్లను కింద పడెయ్యడానికి వీచిన ఉత్తర గాలిని నేను. అదే విధంగా ఈ అంజీరపండ్ల వలే నా బోధనలు కూడా మీ కోసమే.

నా మిత్రులారా... వాటిని ఆరగించండి.. వాటి తీపిని ఆస్వాదించండి. సుదూర గమ్యస్థానాల వద్ద మీరు దేవుడు ఉన్నాడని నమ్మారు.. కానీ దేవుడు అనేది కేవలం ఒక పదం మరియు అదొక ఊహ మాత్రమే. ఈ విస్తారమైన విశ్వంలోకి మానవుడు ఒంటరిగా వచ్చాడు. అతనికి రక్షణగా, తోడుగా ఉండడానికి అతనికి తండ్రి అవసరం అయ్యాడు.. మానవుడు అతన్ని 'దేవుడు' అన్నాడు. నిజానికి మీకు, దేవునికి మధ్య ఎటువంటి వంతెన లేదు.

'దేవుడు' కేవలం మీ భయం సృష్టించిన ఒక పదం మాత్రమే. దేవుడున్నాడు లాంటి మూర్ఖపు ఆలోచనలను వదిలివేయండి. ఆ పదం మానవాళికి చాలా హాని చేసింది. మీరిప్పుడు స్తుతించవలసింది దేవుడ్ని కాదు సుదూర గమ్యాలలో ఉన్న సూపర్ మాన్‌ని. ఎందుకంటే సూపర్ మాన్ మీ పూర్తి ఎదుగుదల. సూపర్ మాన్ మీ భవిష్యత్తు దేవుడు. సూపర్ మాన్ ఊహ కాదు.. సూపర్ మాన్ మీలోనే ఉన్నాడు. ఆ సూపర్ మాన్ సృష్టి మీ చేతుల మీదగానే జరగాలి. సత్యాన్వేషణపట్ల మీకున్న సంకల్పం దానిని సాధ్యం చేయగలదు. ఇప్పటివరకు మానవుడు అన్నిటినీ నిర్ధారించగల, అర్థం చేసుకోగల సత్యంగా మార్చాడు. చిట్టచివరివరకు మీ అన్వేషణను కొనసాగించండి. కానీ మానవుడు సృష్టించగలడని, తనకి సృజనాత్మక సంకల్పం ఉందని మర్చిపోయాడు. మీ సృజనాత్మక సంకల్పం చేరగలిగిన మేరకు

మీ ఊహలు కూడా చేరాలని నేను ఆశిస్తున్నాను. మీకు ఇది ప్రారంభంలో ఒక ఊహగా కనిపించవచ్చు కానీ అది వాస్తవంలోకి రూపు దాలుస్తుందని నేను బలంగా విశ్వసిస్తున్నాను.

"మీరు దేవుణ్ణి సృష్టించగలరా?" మీరు దేవుడ్ని సృష్టించగలిగితే, దేవుడు కల్పితం కాదు. అతను వాస్తవం అవుతాడు. ఒకవేళ మీరు దేవుడిని సృష్టించలేకపోతే అప్పుడు దేవుడు ఒక ఊహ మాత్రమే. మీరు సృష్టించగలిగేది ఏదైనా మీకు ఆనందాన్ని ఇస్తుంది. అది మిమ్మల్ని దేవుడ్ని చేస్తుంది. ఎందుకంటే దానికి మీరే సృష్టికర్త.

మీరు దేవుడు కావాలి. దేవుడిగా మారడం అంటే మీకన్నా గొప్పదానిని, మీ కంటే ఉన్నతమైనదానిని సృష్టించడమే. అతనే సూపర్ మాన్. ఇప్పటికిప్పుడు మీరు సూపర్ మాన్‌ని సృష్టించలేకపోవచ్చు. కానీ మీరు సూపర్ మాన్ ఉద్భవించగల పరిస్థితులను సృష్టించగలరు. తర్వాతి తరాలలో అతను తప్పక ఉద్భవిస్తాడు. అప్పుడు కనీసం మనం సూపర్ మాన్ యొక్క పూర్వీకులుగా అయినా ఉండవచ్చు. దేవుడు ఈ ప్రపంచాన్ని సృష్టించాడనే తప్పుడు భావనతో మీరు జీవించినందున ఈ ప్రపంచం ఇంత దయనీయంగా ఉంది. దేవుడు ప్రపంచాన్ని సృష్టించాడనే ఆలోచనని తోసిపుచ్చిన మరుక్షణం ఆ బాధ్యతంతా మీపై పడుతుంది. అప్పుడు మీ ప్రపంచాన్ని మీరే సృష్టించాలి.

ఒకవేళ దేవుళ్ళే ఉంటే నేను దేవుడిగా కాకుండా ఎలా ఉండగలను..? ఎందుకంటే నేను దేవుడుగా ఉండకపోతే ఎప్పుడూ ఆత్మ నూన్యతా భావంతోనే బానిసలా ఉండేవాడిని కదా... అందుకే దేవుడు లేడు. నాకు ఎలాంటి న్యూనత భావం కానీ, ఏ దేవునితో పోటీ కానీ లేదు. పూర్తి ఆరోగ్యంతో, పూర్తి ఆనందంతో, పూర్తి స్వచ్ఛతతో ఉన్నాను కాబట్టి నాకు దేవుని అవసరం లేదు. మరెవరిపైనా నేను అసూయపడే ప్రశ్నే లేదు.

"దేవుడు"అనే ఆలోచన మనిషి నుండి విలువైన ప్రతిదాన్ని తీసివేసింది. అది స్వేచ్ఛ అనే ఎంతో గొప్ప విలువను మానవాళి నుండి తీసివేసింది. కేవలం ఒక కల్పితమైన దాని కోసం మానవుడు తన జీవితంలో అందంగా ఉన్నవన్నీ నాశనం చేసుకున్నాడు.

కవులు కూడా తమ అబద్ధాలతో దేవుడ్ని ఇంకా కీర్తించారు. నేను ఆ కల్పితమైన దానిని మీనుండి తీసివేసి, మీ స్వేచ్ఛ, మీ సృజనాత్మకత, మీ ప్రేమను మీకు తిరిగి ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను. దేవుడు లేకపోతే ఈ భూమిని స్వర్గంగా మార్చే అవకాశం మీదే. మీరు దేవుడు అని పిలిచే దానిని నేను 'చెడు' అంటాను. ఇది మానవాళికి, వారి జీవనవిధానానికి పూర్తి విరుద్ధం. అది ఎటువంటి మార్పుని అనుమతించదు. ఈ అర్థంలేని దాన్ని మరచిపోండి. దేవుడు సృష్టించిన సృష్టికి మార్పు అనే ప్రశ్న లేదు. అతను కుక్కలను సృష్టించాడు, కోతులను సృష్టించాడు, చెట్లను సృష్టించాడు, మనిషిని సృష్టించాడు. అవి అలానే ఉండాలని, మార్పుని అనుసరించకూడదు అనుకున్నాడు.

కానీ 'దేవుడు' అనే కల్పనని తొలగిస్తే ప్రస్తుతం ఉన్నదానికి బదులుగా జీవితాల్లో మార్పు వచ్చి చేరుతుంది. అప్పుడు మానవుడు ప్రవహించకుండా స్తబ్ధతగా ఉన్న మురికినీరు ఏ మాత్రం కాదు. అప్పుడు మానవుడు పరవళ్లు తొక్కుతూ ప్రవహించే ఒక నది. ప్రవహించకుండా చలనం లేకుండా ఉన్నది ఏదైనా మరణంతో సమానం.

'మార్పు' సంకల్పాన్ని, శక్తి సామర్థ్యాలను సూచిస్తుంది. సంకల్పంతో ప్రతి క్షణాన్ని మీకు అనుగుణంగా మార్చుకోగలగాలి. కల్పితమైన దేవుడి మీద ఎలాంటి బాధ్యతలు ఉంచవలసిన అవసరం లేదిక. మీ పూర్తి బాధ్యతని మీ సొంత భుజాలపై ఎత్తుకోండి. మీ తలరాతకు సంబంధించిన ఫిర్యాదులు ఇక ఎంతమాత్రం ఉండవు. మీ బాధ, మీ ఆనందంపట్ల పూర్తి బాధ్యత మీదే. నేను మనిషిలో అత్యున్నత సృజనాత్మక శక్తిని ఇష్టపడతాను. అతనే ఈ భూమిని స్వర్గంగా మార్చగలడు. మీరు ఈ మనిషిని సూపర్ మాన్ చేయగలరు. మీ సంకల్పం మీ చేతుల్లో ఉన్న గొప్ప శక్తి. సంకల్పం మిమ్మల్ని సృష్టికర్తలను చేస్తుంది, సంకల్పం మిమ్మల్ని దేవుళ్లను చేస్తుంది. సంకల్పం మిమ్మల్ని సూపర్ మాన్‌గా మారుస్తుంది.

నిజంగా దేవుడు అనేవాడే ఉంటే సూపర్ మాన్‌కి సంబంధించిన నా బోధనలకు మరియు దేవుని యొక్క బోధనల మధ్య శత్రుత్వం భరించలేనిదిగా ఉండేది. నేను నా బోధనల యొక్క భవిష్యత్తు రూపాన్ని చూడగలుగుతున్నాను. అతడే సూపర్ మాన్.. అతడే దేవుడు కూడా.

కాబట్టి ప్రస్తుత దేవుడు ఉండకూడదు. దేవుడు మరణించాడు.. సూపర్ మాన్ ఉనికిలోకి రావాలి.. అతడే మీ దేవుడు అవ్వాలి. దేవుళ్లను సృష్టించిన యుగకవులు దేవుని విషయంలో చాలా అబద్ధాలే పలికారు. బదులుగా మీరు మీ నిత్యజీవితాన్నే కాకుండా మీ మరణాన్ని కూడా కీర్తింపజేయమని కోరుతున్నాను. అప్పుడు మాత్రమే సూపర్ మాన్ ఉనికిలోకి వస్తాడు.

❖ ❖ ❖

## జాలి

ఒక వ్యక్తి, జరతూస్త్ర మనుషుల మధ్య నడిచేటప్పుడు తనని తాను జంతువుల మధ్య నడిచేవానిగా ఊహించుకుంటున్నాడని... జరతూస్త్ర చాలా గర్విష్టి అని అనడం జరతూస్త్ర వింటాడు.

జరతూస్త్ర దీనిని ఉద్దేశించి తన శిష్యులతో ప్రసంగిస్తాడు. నావంటి నిజమైన జ్ఞానం కలవారికి ఈ రకమైన అహంకారం సముచితమేనని తన శిష్యులకు చెప్పాడు. ఏమీ తెలియని వ్యక్తి మాత్రమే తనను తాను వేరే వ్యక్తులతో పోల్చుకుంటాడు. కానీ నాలాంటి జ్ఞానం కలవాడు తనను తాను సూపర్ మాన్‌గా మార్చుకోవడానికి మాత్రమే ప్రయత్నిస్తాడని తన శిష్యులకి చెప్పాడు. జరతూస్త్ర యొక్క శత్రువులు, జరతూస్త్ర శిష్యులు తమను తాము ఎక్కువగా ఊహించు కుంటున్నారని, అలా తమని తాము ఎక్కువగా ఊహించుకోవడం అవివేకమని అనుకుంటారు. కానీ జరతూస్త్ర తమని తాము తన శిష్యులతో పోల్చి తక్కువ చేసుకోవడం కంటే ఎంతో కొంత చెడు చేయడం మంచిదని, జరతూస్త్ర యొక్క శత్రువులు మాత్రమే తమను తాము తక్కువ చేసి చెప్పుకుంటారని.. కానీ జరతూస్త్ర లాంటి జ్ఞానం కలిగిన తన శిష్యులు మాత్రమే సూపర్ మాన్ అవ్వగలరని తన శిష్యులకు బోధించాడు.

జాలి చూపడం మంచిది కాదు. అటువంటి దురదృష్టవంతులపట్ల జాలి, దయ చూపించడం అనేది వారి శక్తిహీనతను బహిర్గతం చేస్తుంది. జరతూస్త్ర జాలి అనే భావన మానవాళి అధిగమించాల్సిన ప్రధాన ఇతివృత్తాలలో ఒకటిగా భావిస్తాడు. జాలి అనేది చాలా బలహీనంగా ఉన్నవారిని సూపర్ మాన్ స్థితికి చేరనివ్వకుండా నిరోధిస్తుంది.

జాలి రెండు వ్యవస్థలుగా వర్గీకరించబడింది. ఒకటి మతవ్యవస్థ.. రెండు రాజ్యం. మతం ప్రజలు తమని తాము రక్షించుకోలేని బలహీనులుగా గుర్తిస్తుంది. దేవుడు మాత్రమే మిమ్మల్ని రక్షిస్తాడని మభ్యపెట్టి వారిని ఇంకా బలహీనులుగా మార్చేస్తుంది. వాస్తవానికి మానవాళికి తమని తాము అధిగమించగల శక్తి సంకల్పం ఉంది. కానీ మతం చూపే జాలి మానవాళిని ధర్మం, స్వర్గం అనే భావాలతో కట్టిపడేసి బలహీనులుగా మార్చింది.

అలాగే రాజ్యం కూడా ప్రజలపై జాలి చూపుతుంది. ఎందుకంటే మానవాళి తమను తాము పరిపాలించుకోలేరని నమ్ముతుంది. జరతూస్త్ర ప్రకారం, ప్రజలకు పాలించే రాజ్యం కానీ, పాలకులు కానీ అవసరం లేదు. రాజ్యం పౌరులపై జాలి చూపాల్సిన అవసరం లేదు. వారు ప్రభుత్వ మార్గదర్శక సూత్రాలు లేకుండా భూమితో నిజమైన సామరస్యాన్ని సాధించగలుగుతారు. శక్తి సంకల్పం మరియు సూపర్ మాన్ ఎత్తులను ఆస్వాదించడం ద్వారా మానవాళి తమకు తాముగా ఆనందాన్ని పొందగలదు.

అందుకే ఏ వ్యక్తీ ఇతరులపై జాలి చూపకూడదు. ఇతరులతో తమని తాము పోల్చి చూసుకోకూడదు, మానవాళిపట్ల జాలి ఉండకుండా తమ హృదయాన్ని కఠినతరం చేయడమే సూపర్ మాన్‌గా మారడానికి ఉన్న ఏకైక మార్గం. జాలి చూపడానికి బదులుగా సూపర్ మాన్ యొక్క మార్గానికి సంబంధించిన జ్ఞానాన్ని ప్రజలకు నేర్పాలి అంటాడు జరతూస్త్ర.

❖ ❖ ❖

## మతాచార్యులు

ఒక రోజు మతాచార్యుల బృందం జరతూస్త్ర ఎదురుగా వస్తుంది. అప్పుడు జరతూస్త్ర తన శిష్యులకు వారిని చూపించి మానవజాతి యొక్క మంచి ఉద్దేశాలను వారెలా తారుమారు చేసి వక్రీకరించి, నా బద్ధశత్రువులుగా మారారో నేను మీకు వివరిస్తాను వినండి అంటూ తన ప్రసంగాన్ని మొదలుపెట్టాడు. నాకే కాదు సత్యాన్వేషణకి బయలుదేరిన ప్రతి ఒక్కరికీ వారు శత్రువులే. మీరు సత్యానికి ఎంత దగ్గర అయితే వారు మీకు అంత బద్ధశత్రువులు అవుతారు. వారిని త్వరగా దాటండి. ఎవరూ గొడవ చేయకండి. వారు వాదించడంలో చాలా సమర్థవంతులు. ఎప్పటికప్పుడు వాదనని గెలవడమెలా అనే దానిపైనే వారి దృష్టంతా. వారికి

వాదించడం మాత్రమే తెలుసు. వారితో వాదనకి దిగకండి. మీరింకా సత్యాన్ని తెలుసుకోలేదు కాబట్టి వారు మిమ్మల్ని వారి వాదనతో కలవరపెట్టగలరు, తప్పుదారి పట్టించగలరు. మొదట సత్యానుభవం కలిగి ఉండండి. అప్పుడు ఏ వాదనకు భయపడాల్సిన అవసరం ఉండదు. అప్పుడు ఏ వాదనా మీ అనుభవాన్ని నాశనం చేయలేదు.

వారు చాలా వినయం నటిస్తారు. కానీ ఎల్లప్పుడూ ప్రతీకారజ్వాలలతో నిండి ఉంటారు. వారు మతం పేరిట యుద్ధాలు, దండయాత్రలు సృష్టించారు. మతం పేరిట, ప్రేమ పేరిట, సత్యం పేరిట వారు అందరికంటే ఎక్కువమందిని చంపారు. చంపుతున్నారు. వారి వినయం ఒక వంచన, వారికి తెలిసింది ప్రతీకారం మాత్రమే. వేలాది సంవత్సరాలుగా వారు మానవుల ఐక్యతను నాశనం చేస్తూ వస్తున్నారు.

సమస్త మానవాళి ఒక్కటే.. కానీ మతాచార్యులు దానిని అంగీకరించరు. ఎందుకంటే మొత్తం మానవాళి ఒకటిగా మారిన రోజున మతాలనేవే ఉండవు.. పవిత్ర స్థలాలు ఉండవు.. మతాచార్యులు నష్టపోతారు. వారికి వివిధ మతాల మధ్య ఇబ్బందులు, అల్లర్లు సృష్టించడం తప్ప ఇంకేం తెలియదు. కనీసం వారిని తాకొద్దు కూడా. వారి పరిచయం మిమ్మల్ని అపవిత్రం చేస్తుంది. వారిది భూమిపై అత్యంత వికారమైన, అసహ్యకరమైన వృత్తి. మతాచార్యులు అందరి కంటే ఎక్కువగా మానవాళిని మోసం చేస్తున్నారు. అందరి కంటే ఎక్కువ విషపూరితం చేస్తున్నారు. వేశ్యవృత్తి కంటే వారి వృత్తి నీచమైనది. కనీసం వేశ్య మీకు ప్రతిఫలంగా సుఖాన్ని ఇస్తుంది. కానీ మతాచార్యుని దగ్గర మీకు ఇవ్వడానికి ఏమీ ఉండదు.

నిజానికి రక్షకులు అని పిలవబడేవారే మనుషులని బానిసత్వంలో ఉంచారు. నిజానికి ఎవ్వరూ ఎవ్వరినీ రక్షించలేరు. ఎవరికీ వారే రక్షకులు. రూపాంతరం చెందడానికి చేసిన అన్ని ప్రయత్నాలను రక్షకులు అని పిలవబడేవారి మాయ మాటల్లో పడి మానవుడు విరమించుకున్నాడు. ఈ రక్షకులు మానవాళి కోసం జైళ్లను మాత్రమే సృష్టించారు. ఎవరికివారు వారి రక్షకుల నుండి మాత్రమే రక్షించబడాలని కోరుకుంటారు. కానీ వారి రక్షకుల మాటలు అబద్ధమని వారికి తెలియజేస్తే వెంటనే వాళ్ళకి శత్రువులు అవుతారు. ఈ మతాచార్యులు ఆ

చనిపోయిన రక్షకులకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ మతాచార్యులకి బానిసత్వంలో ఉన్నవారి బానిసత్వం వారికి కొంత పైకం చెల్లిస్తుంది.

అన్ని మతగ్రంథాలు, వేదాంతాలు అబద్ధాలతో నిండి ఉన్నాయి. సత్యాన్ని తెలుసుకోవడం చాలా సులభం. దానికి ఏ గ్రంథమూ అవసరం లేదు. దానికి అవగాహన, వివేకం ఉంటే సరిపోతుంది. ప్రతి మతం మనిషిని పాపి అని పిలవడం ద్వారా అతని స్వాభిమానాన్ని నాశనం చేస్తూ వస్తుంది. అది మొత్తం మానవాళిని వారి ప్రార్థనలతో పాపుల సమూహంగా మార్చింది.

ఉనికిలో, పరిణామక్రమంలో మానవుడు ఉన్నతుడు. చైతన్యం యొక్క మరింత ఉన్నత దశలకు అతన్ని తీసుకురావాలని, సూపర్ మాన్ కావాలని ఉనికి ఆశించింది. కానీ ఈ మతాచార్యులు మిమ్మల్ని సూపర్ సిన్నర్లుగా (మహా పాపులుగా) మారుస్తున్నారు. అసలు పాపం దాదాపు అన్ని మతాలచే చర్చించ బడింది. వారందరికీ దాని గురించి భిన్నమైన ఆలోచనలు ఉన్నాయి. క్రైస్తవమతం ప్రకారం 'అవిధేయత' అసలు పాపం. అవిధేయత పాపం అని నిర్ణయించిన మరుక్షణం 'విధేయత' గొప్ప ధర్మం అవుతుంది. విధేయత బానిసలను, బానిసత్వాన్ని సృష్టిస్తుంది. విధేయత అనేది తిరుగుబాటు యొక్క అన్ని అవకాశాలను నాశనం చేసే ఒక భయంకరమైన విషం. విధేయత వినాశకరమైనది. అది మనిషి యొక్క గౌరవాన్ని నాశనం చేస్తుంది. అతని ఆలోచనని చంపేస్తుంది.

రాత్రి చల్లని పిల్లగాలిలో నక్షత్రాలతో నిండిన ఆకాశం, సూర్యకాంతితో నిండిన ఉదయం, పక్షుల కిలకిలరావాలు, పువ్వుల పరిమళాలు.. వాటిని ఆస్వాదించగల మీ ఉనికి యొక్క స్వేచ్ఛ.. ఇంతకంటే గొప్ప ఆలయం ఇంకేముంటుంది? ఇక ఈ ప్రార్థనా మందిరాల అవసరం ఎందుకు? ప్రార్థనా మందిరాల లోపల తప్పుడు భావజాలంతో కట్టుబడి ఉండటం మిమ్మల్ని మీరు బానిసత్వంలోకి నెట్టుకున్నట్లే. మతాచార్యులు పవిత్రత, అపవిత్రత మరియు శరీరం,ఆత్మల వంటి విరుద్ధభావనలతో మానవాళిలో చీలికను సృష్టించారు.

దేవుడే ఈ ప్రపంచాన్ని సృష్టించినట్లయితే ప్రపంచంలో ఎందుకు ఇంత దుఃఖం ఉంది? ప్రజలు ఆకలితో ఎందుకు చనిపోతున్నారు? దేవుడు తాను సృష్టించిన ఈ విశ్వం గురించి మరచిపోయాడా? దేవుడు ఈ విశ్వాన్ని సృష్టించినట్లయితే దానికి ఆయన బాధ్యత వహించాలి కదా..

దేవుడే మనుషులలో నేరప్రవృత్తిని, పాపపు బీజాలను సృష్టించాడు. లేకపోతే ఈ పాపులందరు, నేరస్థులందరు ఎక్కడి నుండి వచ్చారు? అయినా ఇంకా మూర్ఖులు దేవుణ్ణి ఆరాధిస్తూనే ఉన్నారు. దేవుని పేరు మీద జరిగినన్ని మారణహోమాలు ఇంకే పేరుమీద జరగలేదు. వింత దేవుడు, వింత సృష్టికర్త. అతని ప్రతినిధులు మరీ వింతగా ఉన్నారు. వారి పని మొత్తం మనిషిని చంపడం, మనిషిని నాశనం చేయడం.

ఈ మతపరమైన పూజారులు అని పిలవబడేవారి వింత బోధనలు ఏంటంటే దేవుడు సృష్టించిన ఈ ప్రపంచాన్ని త్యజించడం. దేవుడు సృష్టించిన ఈ ప్రపంచాన్ని త్యజించడం అంటే దేవుడ్ని త్యజించడం అనే వైరుధ్యాన్ని మతాచార్యులు మరిచారు. మతం, ప్రజలు తమను తాము అధిగమించలేరని చెబుతుంది. వారికి బయట నుండి దేవుని సహాయం కావాలని అంటుంది. కఠినమైన హృదయాన్ని కలిగి ఉండటం మరియు తమకంటే గొప్ప సృజనాత్మక వ్యక్తులపట్ల అసూయపడటం ద్వారా మాత్రమే మీరు సూపర్ మాన్‌గా పరిణామం చెందగలరు.

ఈ గొర్రెలకాపరులు వారిని వారు రక్షకులుగా ప్రకటించుకుంటారు. కానీ వారు గొర్రెల మాదిరిగానే ఉంటారు, ఎందుకంటే వారు మానవునికి భవిష్యత్తు ఉందని, అతనికి చాలా శక్తిసామర్థ్యాలు ఉన్నాయని మర్చిపోయారు. మానవుడు చాలా రకాలుగా సూపర్ మాన్ కావచ్చు. ప్రపంచంలోని ప్రతి సూపర్ మాన్ తనకు తాను ప్రత్యేకంగా ఉంటాడు. అలా ఎవరికివారు ప్రత్యేకంగా ఉండడం ద్వారా ఈ భూమి ఇంకా అందంగా, ఇంకా సజీవంగా మారుతుంది. అందరూ ఒకేలా ఉంటే జీవితం విసుగు చెందుతుంది. కానీ వేలాది సంవత్సరాలుగా రక్తం మాత్రమే మతం యొక్క వాదన. తలల్ని ఖడ్గంతో నరకడం ద్వారా మాత్రమే తన మతం సరైనదని నిరూపిస్తూ వస్తుంది. కత్తి వాదన కాదు కానీ వేలాది సంవత్సరాలుగా ఇదే వాదన. మతాచార్యులు మనిషి యొక్క పెరుగుదలను, వారి స్వేచ్ఛను అడ్డుకున్నారు. మీకు కావలసిందల్లా అన్ని రకాల మానసిక మరియు ఆధ్యాత్మిక బంధాల నుండి స్వేచ్ఛను కనుగొనడం, మీరే మీ సొంత విమోచకుడిగా, మీ సొంత రక్షకుడిగా మారడం. అప్పుడు మీ రక్షకులందరికంటే మీరు చాలా గొప్పవారు, అత్యంత శక్తివంతులు అవుతారు.

❖ ❖ ❖

# సామాన్య జనం

జరతూస్త్ర ఎప్పటికీ జ్ఞానోదయం సాధించలేని ప్రజల వైపుకు తన దృష్టిని కేంద్రికరించాడు. నిజంగా అటువంటి ప్రజలను నేను అసహ్యించుకుంటానని అంటాడు జరతూస్త్ర. వారినే 'సామాన్యజనం / బానిస నైతికత కలవారు' అని అంటాడు జరతూస్త్ర. సమాజంలో ఇటువంటి ప్రజల ఉనికి సూపర్ మాన్ స్థితికి అడ్డంకి అనేది అతనికి ఇబ్బంది కలిగించే ఆలోచన.

జరతూస్త్రకి సామాన్యజనం ఉనికి యొక్క ఆవశ్యకత గురించి ఆలోచించడానికి బదులు అటువంటివారు లేని సూపర్ మాన్ సమాజాన్ని ఊహించుకోవడంవల్ల కొంత ఊరటని ఇస్తుంది. అతని బోధనలు జీవితాన్ని తీవ్రతతో జీవించేవారికి.. అంతేగానీ జీవించడాన్ని వ్యతిరేకించే క్రైస్తవమతం, దేవుడు వంటి భావనలతో మరియు సమాజంచే సృష్టించబడిన మంచిచెడు భావాలకు అతుక్కుపోయే బానిస నైతికతను పాటించేవారికి మాత్రం కాదు.

**నోట్:** నీషే ఈ అధ్యాయంలో పరోక్షంగా Master morality (యాజమానుల నైతికత) మరియు దిగువ తరగతుల మధ్య అభివృద్ధి చెందిన Slave morality (బానిస నైతికత)కి గల వ్యత్యాసాన్ని వివరించాడు. బలహీనులు తమ యజమానులపై ప్రతీకారంగానే బానిస నైతికతను స్థాపించారు. బలహీనులపై తమ యజమానులు చూపించే అధికారం, ఆధిపత్యం పట్ల ఎల్లప్పుడూ కోపంగా ఉంటారు. వారి యజమానులపై ప్రతీకారం తీర్చుకోలేక వారి సొంత అసమర్థతపట్ల ఎల్లప్పుడూ మరింత ఆగ్రహంగా ఉంటారు. ఈ జీవితంలో వారు గణనీయమైన రీతిలో వారిపై తిరిగి దాడి చేసే శక్తి లేక ఈ బానిసలే మరణానంతర జీవితాన్ని, స్వర్గనరకాలను, జడ్జిమెంట్ డే వంటి వాటిని కనుగొన్నారు అంటాడు నీషే.

'చెడు' అనే భావనను కూడా కనుగొంది బానిసలే. దీనిని మానవజాతి యొక్క గొప్ప ఆవిష్కరణలలో ఒకటిగా భావిస్తాడు నీషే. తమ యజమానులు మరియు వారికి సంబంధించిన 'మంచి' అనిపించిన ప్రతిదీ అంటే ఐశ్వర్యం, ఆరోగ్యం, ఆనందం, బలం, శక్తి వంటి వాటిని చెడుగా మరియు అవమాన కరమైనవిగా భావించారు ఈ బానిసలు. దీనికి విరుద్ధంగా బానిసలు ఈ యాజమానుల నైతికతలో లేని ప్రతిదానిని మంచివాటిగా గుర్తించారు. పేదరికం,

విచారంగా ఉండడం, అనారోగ్యంగా ఉండడం, బలహీనంగా, వినమ్రంగా, విధేయతగా ఉండడం లాంటివి మంచివాటిగా పరిగణించారు.

నీషే క్రైస్తవమతం మరియు ప్రజాస్వామ్యన్ని బానిస నైతికతగా గుర్తించాడు. క్రైస్తవమతం బానిస నైతికతకు స్పష్టమైన ఆధారంగా మత్తాయి: 5-7ని సూచించాడు. అందులో భూసంబంధమైన ధనవంతులు కాని సౌమ్యులు మాత్రమే పరలోకానికి అర్హులు అంటూ యేసు ప్రశంసించాడు.

ప్రజాస్వామ్యం విషయానికొస్తే, ఇది స్వేచ్ఛ, సమానత్వం మరియు న్యాయం అనే భావనలపై ఆధారపడి ఉంటుంది. సొంతంగా న్యాయం పొందలేని బానిసల యొక్క ఆవిష్కరణగా నీషే దీనిని భావిస్తాడు. బలహీనులు వారిని వారు పరిపాలించుకోవాలని, బలవంతులు వారిపై పెత్తనం చెలాయించకూడదు, వారివల్ల అణిచివేయపడకూడదు అనే ఉద్దేశంలో నుండి పుట్టినదే ఈ ప్రజాస్వామ్యం అంటాడు నీషే. నీషే బానిస నైతికతకు పూర్తి వ్యతిరేకం కాదు. ప్రత్యేకించి, అతను నైతికత యొక్క మొత్తం వ్యవస్థను తిప్పికొట్టగల సామర్థ్యం ఉన్న వ్యక్తుల యొక్క సృజనాత్మకత శక్తిని, సూపర్ మాన్ స్థితిని మెచ్చుకుంటాడు.

❖ ❖ ❖

# తత్వవేత్తలు

ప్రజలు వారి మూఢనమ్మకాలని, మతవిశ్వాసాలని గౌరవించేవారిని మాత్రమే గౌరవిస్తారు. ప్రజలు అటువంటివారిని సాధువులుగా, ప్రవక్తలుగా, వారిని రక్షించడానికి వచ్చిన రక్షకులుగా కూడా భావిస్తారు. కానీ ప్రజలు వారి మూఢనమ్మకాలను, మతవిశ్వాసాలను కించపరిచేవారిని, వారి గాఢనిద్రకు భంగం కలిగించేవారిని ఎట్టి పరిస్థితుల్లో క్షమించరు. ఎందుకంటే వారు మూఢ నమ్మకాలను, మతవిశ్వాసాలను అప్పటికే పరిగణింపబడ్డ పరమ పవిత్ర సత్యాలుగా భావించారు.

జరతూస్త్ర ప్రసిద్ధ తత్వవేత్తల గురించి మాట్లాడుతున్నాడు. వారు ప్రసిద్ధులు.. ఎందుకంటే వారు ప్రజల మతవిశ్వాసాలను, మూఢనమ్మకాలను గౌరవిస్తూ వారు ఎక్కడున్నారో అక్కడే ఉండేలా చేసినందుకు.. వారి ఎదుగుదలకు ఏవిధంగానూ సహకరించనందుకు.. సత్యాన్ని కనుగొనడంలో ప్రజలకు శ్రమ తగ్గించినందుకు..

వారిని వారు ఉన్నతంగా మలుచుకునే శ్రమ తగ్గించినందుకు.. కానీ నిజంగా సత్యాన్ని బోధించడానికి వచ్చేవారిని ప్రజలు రాళ్లతో కొట్టి చంపుతారు.. విషమిచ్చి చంపుతారు.

ప్రజలు వారిలో గొప్పగా చెప్పుకోవడానికి ఏమీ లేకపోయినా వారిని గొప్ప తత్వవేత్తలుగా భావిస్తారు. ఎందుకంటే వారు వారి గాఢనిద్రకు ఎలాంటి భంగం కలిగించడం లేదు కాబట్టి.. ప్రజల్ని వారు ఇంకా జంతువుకి మరియు సూపర్ మాన్‌కి మధ్యలో ఉండేలా చేసారు కాబట్టి ప్రజలు వారిని ఇంకా గౌరవిస్తారు. తత్వవేత్తలు అని పిలవబడేవారు ప్రజల మూఢనమ్మకాల గురించి కానీ, దేవుని గురించి కానీ, స్వర్గనరకాల గురించి కానీ, వారి పవిత్రగ్రంథాల గురించి కానీ వ్యతిరేకంగా ఎప్పుడూ మాట్లాడరు. దీనికి విరుద్ధంగా వారు వాటిని ప్రశంసిస్తారు.

ప్రజలకు వారి తరఫున వాదించే వారు అవసరం లేదు. కానీ వారి జీవితానికి అనుకూలంగా వాదించడం అనేది తత్వవేత్తలు మానవాళికి చేస్తున్న గొప్ప సహాయంగా భావించారు. భావిస్తున్నారు. నిజానికి ప్రజలకు కావలసింది అటువంటివారు కాదు. వారి మూఢనమ్మకాలను నాశనం చేసి తద్వారా వారికి సత్యాన్ని అన్వేషించడంలో సహాయం చేసేవారు కావాలి. వారి బద్ధకాన్ని వదిలించి వారి పురోగతికి సహకరించేవారు కావాలి.

ఓ.. తత్వవేత్తలారా..! మీరు గొప్పవారని నేను నమ్మాలని కోరుకుంటే, 'ప్రజలు మిమ్మల్ని గౌరవించాలనే మీ ఆశని చంపెయ్యండి..'

మీరు ప్రజల బండిని మోస్తున్న గాడిదలతో సమానం. మీరు పేరుప్రతిష్ఠల కోసం ప్రజలకు అసంబద్ధంగా ఉన్నవి అయినా వారికి నచ్చితే వాటికి విరుద్ధంగా ఒక్క మాటైనా అనకపోగా వాటిని కీర్తిస్తారు. కానీ గౌరవప్రదమైన ఏ వ్యక్తయినా గౌరవం కోరుకోడు. తన సొంత గౌరవం, ఆత్మాభిమానం తనకుంటుంది. అతను తనను తాను గౌరవించుకుంటాడు. అతనికి మరెవరి గౌరవం అవసరం లేదు. అతను ఏది నిజమో దానిని సాధ్యమైనంత స్పష్టంగా చెబుతాడు.

మూఢనమ్మకాలలో జీవిస్తున్న ప్రజలకు ఈ మతాచార్యులు, తత్వవేత్తలు, వేదాంతులు కూడా వారికి మద్దతు ఇవ్వడం ద్వారానే వారికి గౌరవం లభిస్తుంది. కానీ ఇది చాలా అమానుషం.. మరియు నీచమైనది. తత్వవేత్తలు వారి గౌరవాన్ని పక్కన పెట్టి ప్రజలకు నిజం చెప్పడం మంచిది. ఇంకా సమయం మించిపోలేదు..

ప్రజలను వారి నిద్రనుండి మేల్కొల్పచ్చు.. సూపర్ మాన్ రాకకు బీజాలు వెయ్యొచ్చు.

మీరు మనిషి యొక్క ఆత్మ గురించి, వారి శక్తిసామర్థ్యాల గురించి తెలియకుండా గొప్పవారెలా కాగలరు? మీరు గుంపును అనుసరిస్తున్నారు. వారు ధర్మబద్ధమని నమ్ముతున్నది మీరు ధర్మబద్ధం చేస్తున్నారు. ప్రజల ధర్మం గురించి వారి ఆలోచనను అనుసరిస్తున్నందుకు ప్రజలు మిమ్మల్ని గొప్పవారిగా భావిస్తున్నారు.

ఓ తత్వవేత్తలారా..! నిజంగా మీరు గొప్పవారిలా పరిగణించబడాలంటే విభిన్న సమాజాలకు ఉన్న భిన్నమైన అధర్మమైన ధర్మాలుగా పరిగణింపబడుతున్న వాటిని ఖండించండి. మీరు గౌరవింపబడడం కోసం ఇంకా గుంపును అనుసరిస్తున్నారు. ఆ గుంపు ఏది సరైనది అంటే అదే సరైనది, అది తప్పు అని చెప్తే అదే తప్పనే భావజాలంతో ఉన్నారు. మీది ఆత్మవంచన. ఎందుకంటే అది మీ సొంత ఆత్మనుండి ఉద్భవించినది కాదు. అది ప్రజలను గాఢనిద్రలో ఉంచడానికి మీకు మీరుగా సృష్టించుకున్నది.

మానవుని జీవితం అనేది నిరంతర సవాళ్లతో, పోరాటాలతో కూడినది. జీవితం ఎప్పటికప్పుడు తనని తాను ఉన్నతంగా, తెలివిగా ఉంచుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉంటుంది. అతని ఉనికి నుండి, అతని సొంత అనుభవం, అవగాహన నుండి సొంత ధర్మం, నైతికత పుడతాయి. అవి మాత్రమే నిజమైనవి. అవి మాత్రమే అతనికి ఆనందాన్ని ఇస్తాయి.

మనిషి సాహసికుడు. గుంపు చెరువు లాంటిది. అది ఎక్కడికి వెళ్ళదు. స్థిరంగా ఉంటుంది. చెరువులోని నీరు ఎప్పటికప్పుడు ఎండకి ఆవిరైపోతూ రోజు రోజుకీ ఇంకా మురికిగా మారుతుంది. త్వరలోనే చెరువంతా బురదనీటిగా మారుతుంది. కానీ స్వతంత్రమైన మనిషి ఒక నదీప్రవాహం లాంటివాడు. అది ఎల్లప్పుడూ కొత్త ప్రాంతాలగుండా, పర్వతాల నుండి, లోయలకు, మైదానాలకు ప్రవహిస్తూనే ఉంటుంది. మానవుడు ఉన్నతమైన దానికోసం తనలో ఉన్న పాత వాటిని త్యాగం చేయనివ్వండి. అతను ఉన్నతంగా మార్పు చెందడానికి మాత్రమే అతను తనలో ఉన్న పాతవాటిని చంపేస్తాడు.

అంధుడు కాంతి ఉందని నమ్ముతాడు. నిజానికి అంధులు మాత్రమే

నమ్ముతారు. తెలుసుకోవడం పూర్తిగా భిన్నమైన విషయం. నమ్మకం దానికి వ్యతిరేకం. తెలుసుకోవటానికి కఠోరమైన ప్రయత్నం, అన్వేషణ అవసరం. మరో మాటలో చెప్పాలంటే నమ్మకాలన్నీ గుడ్డివి. విషయమేంటో తెలిసిన క్షణం నమ్మకంతో పని ఉండదు. గుంపులో నివసించడం, గౌరవప్రదంగా జీవించాలని కోరుకోవడం, అనుచరులను కలిగి ఉండాలన్న ఆశ తప్ప ఇంకేం తెలియదు మీ తత్వవేత్తలకి. జ్ఞానోదయమైన వ్యక్తి చైత్యనం యొక్క పర్వతాలను నిర్మించడం నేర్చుకుంటాడని మీకు తెలుసా?

మీరు ఏ మాత్రం డేగలు కారు..

విస్ఫోటనంలో ఉన్న ఆత్మ యొక్క ఆనందం మీకు తెలుసా?

కేవలం డేగలు మాత్రమే ఏకాంతం యొక్క గాఢతను, ప్రమాదం యొక్క ఎత్తులను ఆస్వాదించగలవు. కానీ ప్రమాదపుటంచులు తెలియకుండా ఎవ్వరూ ఎదగలేరు.

ఓ తత్వవేత్తల్లారా.. మీకు ఆ ధైర్యం లేదు.

ఈ జరతూస్త్ర మానవాళికి ఇచ్చే సందేశం ఏంటంటే 'ప్రమాదకరంగా జీవించండి'.

గగనతలంలో దూరంగా ఎత్తులను ఆస్వాదిస్తున్న డేగను అనుసరించండి. దేనికీ భయపడవద్దు. మీ అంతరంగ ధైర్యానికి ఎటువంటి మరణం లేదు. ప్రమాదాలకు భయపడేవారు వారి అమరత్వం గురించి తెలియనివారు. వారి భయం వారి అజ్ఞానాన్ని తప్ప ఇంకేం తెలియజేయదు. ప్రమాదపుటంచుల మీద ఇంటిని నిర్మించుకునే ఆనందం చాలా కొద్దిమంది ధైర్యవంతులకే మాత్రమే దక్కుతుంది. ప్రమాదకరంగా జీవించడానికి సిద్ధంగా ఉన్నవారు మాత్రమే సత్యాన్ని కనుగొనగలరు. వారు మాత్రమే జీవితానికి అర్థాన్ని ఇచ్చుకోగలరు. వారు మాత్రమే ఏదో ఒక రోజు సూపర్ మాన్ అవ్వగలరు. మంద ఎటువంటి అలజడులు, తీవ్రతలు లేకుండా సురక్షితంగా మనుగడ సాగిస్తూ ఉంటుంది. కానీ భద్రత గురించి ఎక్కువ శ్రద్ధ చూపేవారు అన్వేషకులుగా ఉండలేరు. మామూలు జీవితం నుండి బయటకు రావాలి.. జీవించడం వేరు.. మనుగడ సాగించడం వేరు.

ఉయ్యాల నుండి సమాధి వరకూ మానవుడు నేర్చుకున్నది కేవలం ఎలా సురక్షితంగా మనుగడ సాగించాలని మాత్రమే. సమాధికి చేరుకోక ముందే

ఆనందంతో పాడండి. నృత్యం చేయండి. ప్రమాదకరంగా జీవించండి. జీవితాన్ని పండగ చేసుకోండి. మీరు ప్రమాదకరంగా జీవిస్తున్నా లేదా మోస్తరుగా మనుగడ సాగిస్తున్నా వచ్చే మరణం రాక తప్పదు. కానీ ప్రమాదకరంగా, పూర్తి తీవ్రతతో జీవించినవాడికి మరణం కూడా పండగ అవుతుంది.

ప్రజలు స్వేచ్ఛ గురించి మాట్లాడుతారు. వాదోపవాదాలకు దిగుతారు. కానీ స్వేచ్ఛను మాత్రం కోరుకోరు. ఎందుకంటే స్వేచ్ఛ ప్రమాదాలను తెచ్చిపెడుతుంది. బానిసత్వం చాలా సౌకర్యవంతంగా ఉంటుంది. ఎందుకంటే మీ జీవితానికి సంబంధించిన పూర్తి బాధ్యతలు మరొకరు తీసుకుంటారు కాబట్టి.

కానీ వివేకంతో ఎప్పుడూ ఎరుకతో ఉండడం అంటే స్వేచ్ఛగా జీవించడమే. తరువాతి క్షణం ఏం జరుగుతుందో మీకు ఎప్పటికీ తెలియదు. అది అకస్మాత్తుగా వస్తుంది. మీరు ప్రమాదపు అంచుల చివర జీవిస్తారు.

వేదాంతులు, తత్వవేత్తలు, మతాచార్యులు నాతో పోరాడలేరు. వారు నాతో కలిసి ప్రమాదపుటంచుల మీద నివసించలేరు. నాతో కలిసి ఎత్తైన పర్వతాలని అధిరోహించలేరు. ఎందుకంటే వారు పిరికివారు. జీవితంలోని అన్ని రకాల సవాళ్ళను అంగీకరించడంలో ఉన్న గౌరవం, ఆనందం వారికి ఇంకా తెలియదు.

❖ ❖ ❖

# ఇవ్వడంలో ఉన్న వెలితి..
# తీసుకోవడంలో ఉన్న ఆనందం..

నేను కాంతినై ఉన్నాను.

నేనే కనుక చీకటిని అయి ఉంటే ఎంత బాగుండేదో..

నా ఈ ఒంటరితనానికి కారణం: నేను వెలుగుతో నింపబడి ఉండటమే..

నేనే కనుక చీకటిని, నిశాచరుడిని అయి ఉంటే కాంతి యొక్క స్థనాల్ని ఎంత ఆత్రుతతో జుర్రుకునేవాడినో... మెరిసే నక్షత్రాలని, మిణుగురులని కూడా దీవించేవాడిని. మీకు ఉన్న కాంతిపట్ల సంతోషంగా ఉండండి.

కానీ నేను నా కాంతితో జీవిస్తున్నాను. నా నుండి చీల్చుకు వచ్చే మంటల్నే నేను తిరిగి తాగుతున్నాను. నిజానికి తీసుకునేవారికి ఉండే ఆనందం ఎలా

ఉంటుందో నాకు తెలియదు. తీసుకోవడం కంటే దొంగతనం చేయడం చాలా గొప్పదని అనుకుంటాను నేను..

ఇదే ఇదే నా పేదరికం. నా చేతికి ఇవ్వడం నుండి విశ్రాంతి దొరకడం లేదు.. ఇదే నా అసూయ. నేను ఎదురుచూసే కనుల్ని, ఎదురుచూపుల్లో వెలుగుతున్న రాత్రుల్ని చూస్తున్నాను.

ఎప్పటికీ ఇస్తూ ఉండేవారికి ఉండే ప్రమాదం ఏంటంటే వారు ఇవ్వడంలో ఉన్న సిగ్గుని కోల్పోతారు. అడుక్కునేవారిపట్ల నాకిక ఏ మాత్రం అసహ్యం లేదు. నిండిపోయిన చేతులు వణికేంతగా, నా చేయి వణకకుండా మొద్దుబారిపోయింది.

నా కన్నీళ్ళన్నీ ఎక్కడికి పోయాయి..? ఇచ్చేవారిది ఎంత ఒంటరితనమో కదా..! మెరిసేవారంతా ఎంత మితభాషులో కదా.!

సూర్యుళ్లు ఎప్పుడూ తుఫానుల్లా తమ కక్ష్యల్లో ఎగురుతూ ఉంటారు. వారి అనూహ్యమైన సంకల్పాన్ని వారు నిర్వహిస్తూ ఉంటారు.

కేవలం మీరు మాత్రం వెలిగేవాటినుంచి చలి కాచుకుంటూ ఉంటారు..

ఓ నిశాచరులారా..! కేవలం మీరు మాత్రమే కాంతి పొదుగుల నుండి పాలను తాగి సేదతీరుతారు..

❖ ❖ ❖

## జీవితం.. జరతూస్త్ర.. జ్ఞానం

ఓ జీవితమా.! ఇటీవల నేను నీ కన్నుల్లోకి చూసినప్పుడు అంతులేని అగాధాల్లోకి మునిగిపోతున్నట్లుగా తోచింది. కానీ నువ్వు నీ బంగారపు గాలంతో నన్ను ఒడ్డున పడేసావ్.

నువ్వు అగాధానివి అన్నప్పుడు నువ్వు నన్ను వెక్కిరిస్తూ నవ్వావు. చేపలన్నీ ఇలాగే మాట్లాడుతాయి అన్నావు కదా.. అని జరతూస్త్ర జీవితంతో అన్నాను.

అప్పుడు లోతు కొలవలేని వాటినన్నీ అగాధాలనే తీర్మానించారు. కానీ నేను కేవలం మారిపోతూ ఉండేదానిని, మచ్చిక చేసుకోబడేదానిని. ఇంకా చెప్పాలంటే ఒక స్త్రీలాంటి దానినని, నేనేమీ విలువైనదానిని కాదు. మీ మనుషులంతా నన్ను నమ్మకమైనదానినని, మార్మికమైనదానినని, లోతైనదానినని, ఎప్పటికీ నిలిచి ఉండేదానిని అంటారు. మీ విలువలతో నన్ను నిర్వచించడానికి

ప్రయత్నిస్తారు. మీరంతా విలువల్ని అంటిపెట్టుకున్న మనుషులని అంటూ తాను బిగ్గరగా నవ్వింది.

తన గురించి తాను చెడుగా మాట్లాడుతున్నప్పుడు నేను తనని కాని, తన నవ్వుని కాని అస్సలు నమ్మను. నేను ఒకసారి జ్ఞానంతో మాట్లాడుతున్నప్పుడు నీకు జీవితం కావాలి, దాన్ని ప్రేమిస్తున్నావు, అందుకే దానిని ఎప్పుడూ పొగుడుతూ ఉంటావు అన్నది. అప్పుడు నేను వెంటనే తనకు నిజమే చెప్పాను..

మా ముగ్గురి మధ్య అలా సంభాషణలు జరుగుతున్నాయి. చెప్పాలంటే అంతరాంతరాల్లో నేను జీవితాన్ని ఎక్కువగా ప్రేమిస్తున్నాను. ముఖ్యంగా నేను జీవితాన్ని ద్వేషించినప్పుడు. ఇప్పుడు నేను జ్ఞానం వైపు ఎక్కువ మొగ్గుచూపడానికి కారణం: తాను నాకు జీవితాన్ని జ్ఞప్తికి తేవడమే. తన దగ్గర ఆమె కళ్ళు, నవ్వు, ఇంకా ఆమె దగ్గర ఉన్న బంగారుగాలం కూడా ఉంది. వాళ్ళిద్దరూ ఒకేలా కనిపించడం నా తప్పా..?

ఒకసారి జీవితం నన్ను జ్ఞానమంటే ఏంటని అడిగింది. జ్ఞానంపట్ల ఉన్న దాహం తీరనిది. కొంతమంది పరదాల గుండా తొంగిచూస్తారు. కొంతమంది వల వేసి పట్టుకుంటారు. బహుశా తాను చెడ్డది. ఇంకా స్త్రీలాంటిది. ఇది కానీ, తన గురించి తాను చెడుగా మాట్లాడుతున్నప్పుడు ఆమె నన్నింకా ఎక్కువగా నన్ను ఆకర్షిస్తుంది అని చెప్పినప్పుడు... తాను కళ్ళు మూసుకొని వెటకారంగా నవ్వుతూ నువ్వు నా గురించి మాట్లాడుతున్నావు.. నా గురించే కదా.. ఒకవేళ అది నిజమైనా నాకు చెప్పవలసిన అవసరం ఏంటి..? సరే.. ఇప్పుడు నీ జ్ఞానం గురించి కూడా ఎంతో కొంత చెప్పు అంటూ జీవితం తను కళ్ళు తెరిచింది.

ఓ ప్రియమైన నా జీవితమా..! నేను మరల లోతైన అగాధంలోకి మునిగి పోతున్నట్లుగా తోచింది అన్నాను.

చాలాసేపటి తరువాత సూర్యుడు అస్తమించాడు. పచ్చికల్లో తేమ చేరుకుంది. చెట్లనుండి చల్లని గాలి వీస్తుంది. అతన్ని విచారం అలుముకుంది.

ఓ నా స్నేహితులారా...! ఈ సాయంత్రం నన్ను ఇలాంటి ప్రశ్నలు అడిగేలా చేసింది. ఈ విచారాన్ని మన్నించండి.. సంధ్యా సమయం కావొచ్చింది. సంధ్యా సమయం నన్ను క్షమించండి అన్నాడు జరతూస్త్ర..

❖ ❖ ❖

# సమాధి కాబడిన కలలు

జరతూస్త్ర మాట్లాడే ఈ 'సమాధి' అతని 'గతం'.

జరతూస్త్ర తన యవ్వనంలో కోల్పోయిన స్వప్నాల గురించి విలపించాడు. ఆ స్వప్నాలు తనకు విశ్వాసరహితంగా ఉన్నాయని అందుకే అవి అతనిని విడిచిపెట్టినట్లు నమ్మాడు. వాస్తవానికి అవి తన శత్రువులచే హత్య చేయబడ్డాయని, ఒక విధంగా ఆ స్వప్నాలు మరణించడం తనకి సముచితమే అన్నట్లు ఉంటాడు. తన శాశ్వతత్వం మరియు సూపర్ మాన్‌కి సంబంధించిన తన స్వప్నాలను దొంగిలించి చంపినందుకు జరతూస్త్ర తన శత్రువులను ఈసడించుకున్నాడు. ఈ ఆలోచనలన్నీ అసలు ఎలా హత్య చేయబడ్డాయో తనకి తాను వివరించు కుంటూ ఉన్నాడు. జరతూస్త్ర ఇకపై అన్నిటికీ అతీతంగా నృత్యం చేయలేనని తెలుసుకున్నప్పటికీ జరతూస్త్ర మరల నృత్యం చేయాలని, తన ఆశను పునరుత్థానం చేయాలని నిర్ణయించుకున్నాడు. అతని నుండి తన శత్రువులు ఆ స్వప్నాలను తీసుకున్నప్పటికీ, జరతూస్త్ర నిరాశ చెందకుండా తన శక్తి సంకల్పం ద్వారా ఆ స్వప్నాలను పొందాడు.

తనలో దేనికీ లొంగని, గాయపడని, బండరాళ్లను సైతం పేల్చే శక్తి ఏదో ఉందని.. అదే తన 'శక్తి సంకల్పం' అని జరతూస్త్ర తెలుసుకున్నాడు.

❖ ❖ ❖

# నిన్ను నువ్వు అధిగమించు

ఇప్పటివరకు జీవించి ఉన్న, జీవించిన గొప్ప ఆలోచనాపరులను, తత్వవేత్తలను ఉద్దేశించి జరతూస్త్ర తన ప్రసంగాన్ని మొదలుపెట్టాడు..

తత్వవేత్తలు ఎవరికివారు తాము సత్యాన్వేషణ చేస్తున్నామని చెప్పినప్పటికీ, వాస్తవానికి వారు తమ క్రింద ఉన్నవారికి సత్యాన్ని సృష్టిస్తారు. తెలివైనవారు, ప్రజలు తమ ముందు మోకరింపబడేలా చేయగల నైతికప్రపంచాన్ని సృష్టిస్తున్నారు. ఏది సరైనది.. ఏది తప్పు.. ఏది మంచి.. ఏది చెడు అనే భావనలతో వారు తమ క్రింద ఉన్నవారి కోసమే ఈ నైతికప్రపంచాన్ని సృష్టించి నైతికప్రపంచానికి రారాజులై కూర్చున్నారు. ఏది తప్పు, ఏది ఒప్పు అనే భావనలకి వారు కారణాలు కూడా సృష్టిస్తారు. అదే వాళ్ళని ఇంకా శక్తివంతుల్ని చేస్తుంది.

నేను కూడా విధేయతతో ఉండండి అని చెప్తాను.. మతాలు కూడా విధేయతను బోధిస్తాయి. కానీ అవి వాళ్ళ దేవుడికి, వాళ్ళ పవిత్రగ్రంథాలకి, మతాచార్యులకు విధేయతగా ఉండమని బోధిస్తాయి. నేను బోధించే విధేయత జీవితానికి సంబంధించిన విధేయత. మీపట్ల మీకున్న విధేయత. ఈ విధేయత నుండి మిమ్మల్ని మరలించడానికి అన్ని మతాలు ప్రయత్నిస్తున్నాయి. మీపట్ల మీరు నిబద్ధతగా ఉండాల్సిన అవసరం లేదు, దేవుని మాట వినండి. మీ హృదయం చెప్పే మాటలు వినవద్దు, పవిత్రగ్రంథాలలోనివి వినండి. మీ సొంత శరీరాన్ని, దాని జ్ఞానాన్ని వినవద్దు. చనిపోయిన సాధువుల, కల్పిత, పౌరాణిక పాత్రల యొక్క మాటలు వినండని చెప్తూ భూమికి, భూసంబంధమైన ఆనందాలకు మిమ్మల్ని దూరం చేస్తూ వస్తున్నారు. కానీ గుర్తుంచుకోండి... విధేయతకు సంబంధించిన నా బోధనలు, మతానికి సంబంధించిన విధేయత అని పిలవబడే దానికి పూర్తిగా వ్యతిరేకం.

“మిమ్మల్ని మీరు అనుసరించండి. మీ శరీరానికి సంబంధించినంతవరకు మీ ప్రవృత్తులు పాటించండి. మీ హృదయానికి సంబంధించినంతవరకు మీ భావాలను పాటించండి. మీ మనసుకు సంబంధించినంతవరకు మీ తెలివితేటలకు కట్టుబడి ఉండండి. మీ ఉనికికి సంబంధించినంత వరకు మీ అంతర్‌దృష్టిని పాటించండి. మీకు మీరే ఒక పవిత్రగ్రంథం. మీకు మీరే ఒక మతం. మీ శరీరానికి అవసరమైన ప్రతి జ్ఞానం దానికి ఉంది. మీ తెలివితేటలు మీ ఉనికి యొక్క అత్యంత రహస్యాలను కూడా అర్థం చేసుకోగలవు. మీ అంతర్గత దృష్టి మీ ఉనికిని అన్వేషించగలదు.

జీవితం అనేది నిరంతరం నిన్ను నువ్వు అధిగమించే ఒక నిరంతర ప్రక్రియ.

అది ఎప్పటికప్పుడు మరింత శక్తివంతంగా ఉండటానికి పాతవాటిని అధిగమిస్తూనే ఉంటుంది. ఈ అధిగమించడం ఒకసారి మొదలయ్యి ఆగిపోయే ప్రక్రియ కాదు. నువ్వు ఒక లక్ష్యాన్ని చేరుకుంటావు కానీ అకస్మాత్తుగా ఆ లక్ష్యం భవిష్యత్ లక్ష్యం కోసం ఒక మెట్టు మాత్రమే అని తెలుసుకుంటావు. లక్ష్యం ఎప్పుడూ నీకంటే ముందే ఉంటుంది. నీ ముందు ఉన్న ఆ లక్ష్యం ఎల్లప్పుడూ నీకు సవాలు విసురుతూనే ఉంటుంది. అది మిమ్మల్ని తెలియని ప్రదేశాలకు, తెలియని ఎత్తులకు లాగుతుంది. అధిగమించే ఈ సూత్రం పరిణామానికి పునాది

వంటిది. ఇదే లేకపోతే ఎటువంటి పరిణామం ఉండదు. ఎక్కడున్న ప్రపంచం అక్కడే ఉండిపోతుంది.

పరిణామక్రమం, రూపాంతరం, అధిగమించడం నేను బోధించే మతం.

తనను తాను ఎప్పటికప్పుడు అధిగమిస్తూ జీవితపు సవాళ్ళను స్వీకరిస్తూ ప్రమాదకరంగా జీవించేవాడు ఎల్లప్పుడూ సజీవంగా ఉంటాడు. తనను తాను అధిగమించడాన్ని ఆపివేసిన క్షణం, జీవితపు సవాళ్ళని ఎదుర్కొనే ధైర్యం లేని క్షణం అతను శ్వాస తీసుకుంటున్నప్పటికిని మరణించినట్టే.

కానీ మిమ్మల్ని మీరు అనుసరించేంత ధైర్యవంతులు కారు.. మీరు చేసేది తప్పు కావచ్చునే భయం వలన పిరికితనంతో మీకంటే తెలివైనవారి మాట వినడం మంచిది, ప్రాచీన జ్ఞానాన్ని, గ్రంథాలను, వేలాది సంవత్సరాలుగా బోధించిన జీవితసూత్రాలను వినడం మంచిదనే భ్రమలో బ్రతుకుతున్నారు. కొన్ని కోట్ల సంవత్సరాల క్రితంనాటి మీ సొంత శరీరం కంటే మీకివి నమ్మదగినవిగా కనపడుతున్నాయా? కానీ ఒక్కటి గుర్తుపెట్టుకోండి.. ఏ గ్రంథం మీ శరీరాని కంటే పురాతనమైనది కాదు. మీ సొంత శరీరానికి ఉన్న అనుభవం ఇక్కడ ఏ మతగ్రంథానికీ లేదు. మిమ్మల్ని మీరు అనుసరించకపోతే, మీపై మీకు ఆధిపత్యం లేకపోతే వేరేవారు మిమ్మల్ని ఆదేశించడానికి, మీపై ఆధిపత్యం చెలాయించడానికి సిద్ధంగా ఉన్నారు.. ఉంటారు. కానీ నిజానికి ఆజ్ఞాపించడం, ఆధిపత్యం చెలాయించడం అంత సులభం కాదు. ఎందుకంటే ఇతర వ్యక్తుల యొక్క బాధ్యతని తమ భుజాలపై వేసుకోవడం వాళ్ళకి ఇంకా భారం అవుతుందనే విషయాన్ని వారు తెలుసుకోలేరు. ఆజ్ఞాపించేవాడు, అధికారం చెలాయించేవాడు ఎల్లప్పుడూ తనను తాను పణంగా పెట్టవలసి ఉంటుంది. ఆధిపత్యం చెలాయించేవాడి ఆజ్ఞలు సగటు మానవునికి మాత్రమే అనుకూలంగా ఉంటాయి. కానీ ఇక్కడ సమస్య ఏంటంటే ఉనికిలో సగటు మానవుడు అనేవాడు లేకపోవడం. ప్రామాణిక నైతికత, మంచిచెడుకి సంబంధించిన సగటు ఆలోచనలు ఎవరికీ సరిపడవు. ప్రజలను ఆజ్ఞాపించే బాధ్యత ఎవరైనా తీసుకోవడం అనేది అమానుషం. అతను ప్రజలలోని ప్రత్యేకతలను, సామర్థ్యాలను తక్కువ చేసి చూస్తున్నట్లే. అతను అందరికీ ఒకే రకమైన సగటు విలువలు అంటగడుతున్నాడు. ఆధిపత్యం చెలాయించేవాడు

తన ఆలోచనలకు, అభిప్రాయాలకు అనుగుణంగా వారి ప్రాణాలను పణంగా పెట్టి మానవులతో ఆడుతున్నాడు. వివేకం ఉన్న ఏ మనిషీ ఆధిపత్యం చెలాయించడు. వివేకం ఉన్న వ్యక్తి మీ జీవితానికి ఒక నిర్దిష్టశైలిని, పాత్రని, నైతికతని ఇవ్వడానికి ప్రయత్నిస్తాడు. వివేకం ఉన్న వ్యక్తి మీ సొంత స్వభావాన్ని కనుగొనడంలో మీకు సహాయం చేస్తాడు. మీ శరీరం యొక్క భాషను, ప్రేమ యొక్క భాషను అతను మీకు నేర్పుతాడు, అతను మీ అంతర్‌దృష్టిని మీకు తెలియజేసి మీ సొంతమార్గంలో, మీ సొంతలక్ష్యం వైపు వెళ్ళడానికి మిమ్మల్ని పూర్తి స్వేచ్ఛగా వదిలేస్తాడు. ఎందుకంటే మీ లక్ష్యం భిన్నమైంది. మీరు భిన్నమైన వారని అతనికి తెలుసు.

ఈ తత్వవేత్తలు సత్యాన్వేషణ అనే పేరుతో మీపై ఆధిపత్యం చెలాయిస్తున్నారు. శక్తి సంకల్పం వలనే వారు ఇంకా బలవంతులు, అధిపతులు అవుతున్నారు. బలహీనులు బానిసలవుతున్నారు. కానీ కిందిస్థాయి బానిస కూడా అధికారం కోసం కలలు కంటూ ఉంటాడు. అధికారం చెలాయించే బలవంతుడు తనకింద బానిసలకు ఎప్పుడూ భయపడుతూనే ఉంటాడు ఎందుకంటే ఎవరైనా ద్రోహం చేసి తన అధికారాన్ని చేజిక్కించుకుంటారనే భయం అతన్ని వెంటాడుతుంది.

'అధికార సంకల్పం' అనేది ఒక వింత ఆట. (అధికార సంకల్పం వేరు.. శక్తి సంకల్పం వేరు)

మీకంటే పైన ఉన్నవాడు మీపై అధికారం చెలాయిస్తాడు. మీరు మీ కింద ఉన్నవారిపై అధికారం చెలాయించాలని చూస్తారు. కానీ అధికారం చేజిక్కించుకున్న వాడెప్పుడూ అక్కడే ఉండడు. ఎందుకంటే కింద కాళ్ళు పట్టుకొని లాగేవారు మరికొందరు కిందే ఉంటారు. కిందిస్థాయి బానిస కూడా అధికారం కోసం కలలు కంటాడు. అతనికి అవకాశం వచ్చినప్పుడల్లా తనకింద ఉన్నవారిని హింసించడానికి ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటాడు.

ప్రేమికులు కూడా నిరంతరం ఒకరిపై ఒకరు ఆధిపత్యం చెలాయించడానికి ప్రయత్నిస్తూనే ఉంటారు. వారు నిజానికి ప్రేమ అనే ఆట ఆడుతున్నప్పటికీ, లోతుగా ఒకరిపై ఒకరు ఆధిపత్యం కోసం చేసే పోరు. అది నిజానికి ఒకరిపై ఒకరు అధికారం చెలాయించడానికి ఆడే ఆట. లేకపోతే ప్రేమికులు నిరంతరం ఎందుకు గొడవలు పెట్టుకుంటారు? వారు ప్రేమించుకునే సమయం కంటే

గొడవలు పెట్టుకోవడానికి వెచ్చించే సమయమే ఎక్కువ. వారు పోరాడటానికి మాత్రమే ఇష్టపడతారు. ఒకరిపై ఒకరు ఆధిపత్యం కోసం పోరాడుకుంటారు. మగాడు నేరుగా పోరాడుతాడు. స్త్రీ తనదైన శైలిలో తనదైన సామర్థ్యంతో రహస్య మార్గాల గుండా పోరాడుతుంది. కానీ ఎల్లప్పుడూ ఆమెనే విజేతగా నిలుస్తుంది. ఎందుకంటే మగాడు బయటి ప్రపంచంతో పోరాడి పోరాడి అలిసిపోతాడు కాబట్టి.

జీవితం కూడా ఒక అదృశ్యశక్తితో తనను తాను అధిగమించాలనే ఒకే కోరికతో మరింత శక్తివంతంగా, విజేతగా ఉండడానికి ఎల్లప్పుడూ ముందుకు కొనసాగుతుంది. ఇది జీవితం యొక్క స్వభావం. నేను సృష్టించేదేదైనా ప్రేమతో సృష్టిస్తాను. నేనే దానిని నాశనం కూడా చేస్తాను.. ఎందుకంటే నేను దాన్ని అధిగమించి ముందుకు వెళ్లాలనుకుంటున్నానని జీవితం ఎప్పటికప్పుడు తనని తాను అధిగమిస్తూ ముందుకి సాగుతూనే ఉంటుంది.

'సత్యాన్వేషణ' పేరుతో జరిగేది ఆధిపత్యపోరు కోసం సంబంధించిన సంకల్పం తప్ప మరొకటి కాదు, ఎందుకంటే సత్యాన్ని తెలుసుకోవడం ద్వారా మానవుడు ఇంకా శక్తివంతుడు అవుతాడు. 'మనుగడ సాగించాలనే కోరిక' ఈ ఉనికిలో లేదు. మనుగడ సాగించాలి అనే కోరిక శక్తి సంకల్పానికి తోడు అయినప్పుడే జీవితానికి అర్థం ఉంటుంది.

మానవుడు సృజనాత్మకత మార్గంలో కూడా విధ్వంసకారిగా ఉండాలి. ఉన్నతమైన విలువలను కావాలని కోరుకుంటే, తక్కువస్థాయి విలువలను నాశనం చేయాలి. కొత్త ఇంటిని నిర్మించుకోవాలని అనుకుంటే పాత ఇంటిని నాశనం చేయవలసిందే. నిజమైన సృష్టికర్త ఎల్లప్పుడూ విధ్వంసకుడిలా కూడా ఉండాలి. పాత విలువలను నాశనం చెయ్యడం ద్వారా కొత్త విలువను సృష్టించాలి. కొత్త విలువలను సృష్టించడం ద్వారా మానవుడు తనని తాను ఉన్నతంగా మలుచుకో గలడు. అవసరం అయితే కొత్త విలువ కోసం మంచిచెడు అనే భావనలు, నైతికత, మతం, తత్వశాస్త్రం లాంటివన్నీ త్యాగం చెయ్యాలి. సూపర్ మాన్ ఎప్పటి కప్పుడు తనని తాను ఉన్నతంగా మలుచుకుంటాడు. తనని తాను అధిగమించడమే తన మతం.. తనకు తెలిసిన మతం.

❖ ❖ ❖

# ఆధునిక ఆలోచనాపరులు

శక్తి సంకల్పం గురించి తెలుసుకున్న తరువాత అటువంటి ఆవిష్కరణ ఏ రకమైన ప్రపంచానికి దారితీస్తుందో తెలుసుకోవడానికి జరతూస్త్ర తన దృష్టిని ఆధునికజ్ఞాన సంస్థల వైపు మరల్చాడు. దేవుని మరణానికి కారణమైన శాస్త్రీయ సంశయవాదం కొత్త విలువలను, లక్ష్యాలను సృష్టించలేదు. తత్ఫలితంగా, ఆధునిక జీవనవిధానం ఎటువంటి దిశాగమ్యం, సంకల్పం లేకుండా తయారయ్యింది.

జరతూస్త్ర మొదట జ్ఞానం యొక్క అద్భుతమైన ఆధునిక అన్వేషకుల గురించి చెప్తూ.. ఈ ఆధునికజ్ఞానులు క్రైస్తవమతం యొక్క పాత మూఢనమ్మకాల నుండి తమని తాము ఏదో విధంగా విడిపించుకోగలిగారు. కానీ తాను పొందగలిగిన ప్రశాంతతను పొందలేకపోతున్నారని, జ్ఞానం యొక్క గంభీరమైన అన్వేషకుడు ఇంకా నవ్వడం గురించి, అందం గురించి నేర్చుకోలేదని జరతూస్త్ర బాధపడ్డాడు. జరతూస్త్ర ఒక శక్తివంతమైన వ్యక్తిలో తేలికైన మనస్తత్వాన్ని, దయను విలువైనదిగా భావిస్తాడు. ఎందుకంటే అలాంటి వ్యక్తి గొప్ప గంభీరత, క్రూరత్వం వంటి సామర్థ్యాలను కూడా కలిగి ఉంటాడు. క్రూరంగా ఉండటానికి తగినంత శక్తి లేనందునే దయతో ఉండడంలో ఎటువంటి ధర్మం లేదు. ఈ ఆలోచనాపరులు హింసని ఇష్టపడకుండా అందాన్ని కనుగొనలేకపోతున్నారని విలపించాడు జరతూస్త్ర.

ఈ ఆధునిక ఆలోచనాపరులతో, తత్వవేత్తలతో జరతూస్త్రకు ఉన్న సమస్య ఏమిటంటే.. పురాతన గ్రీకు తత్వవేత్తల వలె వీరు అందాన్ని కనుగొనే రహస్యాన్ని ఇంకా తెలుసుకోకపోవడం. ఈ ఆధునిక ఆలోచనాపరులు జ్ఞానాన్ని పొంది నందుకు గొప్పవారు అయినప్పటికీ, ఇంకా గొప్పస్థితిని పొందటానికి వారు వారి గొప్పతనాన్ని అధిగమించలేకపోయారు. వారి ఇష్టాన్ని నియంత్రించే, నిరోధించే సామర్థ్యాన్ని గురించి వారింకా నేర్చుకోలేదని భావించాడు జరతూస్త్ర.

వీరి అంతిమలక్ష్యం స్వచ్ఛమైన వస్తుగతదృక్పథాన్ని సాధించడం. కానీ స్త్రీలింగ చిహ్నమైన చంద్రుడు స్వయంప్రకాశం కాదు. ఈ ఆధునిక ఆలోచనాపరులు చంద్రుడుకి ప్రతీక. వీరు స్వచ్ఛమైన విషయదృక్పథాన్ని సాధించగలడని నమ్ముతారు. కానీ అలాంటివారు స్వయంగా ప్రకాశించలేరు. బదులుగా చంద్రుడు సూర్యుని ప్రకాశంతో తనని తాను అధిగమించడానికి ప్రయత్నించాలి. వీరు ఎటువంటి

ప్రత్యేక లక్ష్యం లేకుండా సత్యం యొక్క స్వచ్ఛమైన అవగాహన కోసం మాత్రమే దేన్నైనా అన్వేషించడానికి చూస్తారు. స్వార్థం, దురాశ, ఎటువంటి శక్తి సంకల్పం లేకుండా స్వచ్ఛమైన విషయస్పష్టత కోసం ప్రయత్నిస్తున్నామని తృప్తిపడేవారిని జరతూస్త్ర ఎగతాళి చేస్తాడు. అలా చూడడంలో ఉన్న సంతృప్తి సూపర్ మాన్‌కు దారితీయదు అంటాడు జరతూస్త్ర. స్వచ్ఛమైన విషయస్పష్టత అనేది ఒక భ్రమ. ఎందుకంటే ప్రతి వ్యక్తి తాను చూసేదానికి ఒక నిర్దిష్ట దృక్పథాన్ని తీసుకురావడానికి ప్రయత్నిస్తాడు. మొదట తనని తాను నమ్మడం ముఖ్యం. తాను ఒకప్పుడు ఇలాగే ఉన్నానని, కానీ నిజమైన కాంతి అయిన శక్తి సంకల్పానికి సంబంధించిన జ్ఞానం, సూపర్ మాన్ స్థితికి చేరుకోవాలన్న ఆశ తనని మార్చిందని అంటాడు జరతూస్త్ర. సూర్యుడిలా ఉన్న ఆ కాంతినుండి చంద్రుడు గ్రహించేది ఈ యథార్థమైన జ్ఞానం కాదని అంటాడు జరతూస్త్ర.

❖ ❖ ❖

## పండితులు

ఒక రోజు జరతూస్త్ర చెట్టు కింద ఉన్న పొదల మధ్యలో నిద్రిస్తున్నప్పుడు గొర్రెలమంద వచ్చి అతని తలపై వాసన చూసి జరతూస్త్ర పండితుడు కాదని గ్రహించి గర్వంతో అతని నుండి దూరంగా వెళ్లిపోయింది. అక్కడే కొంతదూరంలో ఆడుకుంటున్న ఒక పిల్లవాడు జరతూస్త్ర దగ్గరికి వచ్చి జరిగిన విషయం చెప్పాడు. జరతూస్త్ర అక్కడి నుండి లేచి కొంతదూరంలో పిల్లలు ఆడుకుంటున్న మైదానంలో కూలిన గోడ పక్కన ఉన్న పచ్చికబైళ్లపై విశ్రాంతి తీసుకోవడానికి వెళ్ళాడు.

ఇతరులను గుడ్డిగా అనుసరించే పండితుల సమూహాన్ని గొర్రెలమందగా భావిస్తూ, తాను ఇకపై వారి పాతపద్ధతుల ప్రకారం పండితుడు కానందుకు గాను జరతూస్త్ర గర్వంగా ఉంటాడు.

జరతూస్త్ర తాను ఒకసారి పండితుల గృహానికి వెళ్లిన తన గతకాలపు అనుభవాలను గుర్తుకు తెచ్చుకుంటాడు. కానీ పండితుల గృహానికి వెళ్లిన కొద్ది సమయంలోనే జరతూస్త్ర బయటికి వచ్చేసాడు. ఎందుకంటే అది సత్యం దొరికే ప్రదేశం కాదని, నిరంతరం సత్యం గురించి చర్చించబడే ప్రదేశం అని తెలుసు కున్నాడు. సత్యం గురించి వేలాది పరికల్పనలు సృష్టించబడే ప్రదేశం అది. ఇక

మున్ముందు కూడా సత్యం గురించి ఎటువంటి నిర్ధారణకు రాని ప్రదేశం అని జరతూస్త్ర తెలుసుకున్నాడు.

పండితులు ఏనుగును చూడటానికి వెళ్ళిన గుడ్డివాళ్ళ లాంటివారు. వారు ఏనుగును చూడలేరు కాబట్టి ఎవరికి వారు ఏనుగును తాకి అది ఎలా ఉంటుందో వేరేవాళ్లకి చెప్పడానికి ప్రయత్నిస్తున్నారు. ఒకడు ఏనుగు పాదాలను, ఇంకొకడు చెవుల్ని, ఇంకొకడు శరీరాన్ని తాకి ఏనుగు అంటే ఎలా ఉంటుందో నాకు తెలుసు అని చెప్తున్నారు. ఏనుగు పాదాలను తాకినవాడు ఏనుగు స్తంభంలా ఉంటుంది అన్నాడు. ఏనుగు చెవుల్ని పట్టుకున్నవాడు నువ్వొక మూర్ఖుడివి. నా అనుభవం ప్రకారం ఏనుగు విసనకర్రలా ఉంటుంది అన్నాడు.. అలా ఎవరికి వారు తమకు తోచింది చెప్తున్నారు. అలా వాళ్ళల్లో వాళ్ళు వాదించుకుంటూ ఒక అంతిమ అభిప్రాయానికి రారు. అంధులు కాంతి గురించి, చీకటి గురించి, రంగుల గురించి చర్చించడం పండితులు సత్యం గురించి మాట్లాడడం రెండూ ఒక్కటే. పండితుడు అరువు తెచ్చుకున్న జ్ఞానంతో ప్రజలు ఇచ్చే గౌరవంతో సౌకర్యవంతంగా జీవిస్తాడు. కానీ నిజమైన అన్వేషకుడికి అది అసంబద్ధంగా ఉంటుంది. వారు మతగ్రంథాలను ఉదహరించడం ద్వారా ఏమీ తెలియని అజ్ఞానుల నుండి గౌరవం పొందాలని చూస్తారు. కానీ ఏమి తెలియని అజ్ఞానుల చేత గౌరవింపబడాలనే ఆలోచన అత్యంత నీచం.

సౌకర్యవంతంగా జీవించడం అనేది నెమ్మది నెమ్మదిగా మరణించడం లాంటిది. పండితులు కుళ్ళిన మృతకళేబరాలను మోస్తున్నారు. ఆ మృతకళేబరం ఎంత పురాతనమైనది అయితే వారంత గొప్పవారు. ఆ మృతకళేబరాన్ని వారు జ్ఞానం అని పిలుస్తారు. జ్ఞానం చౌకగా మరియు సులభంగా దొరుకుతుంది. కానీ ఎల్లప్పుడూ ఎరుకగా ఉండడం, స్వతహాగా అన్వేషించడం కష్టతరమైనది, ప్రమాదకరమైనది. దానికి ధైర్యం అవసరం.

జరతూస్త్ర “నేను సాధారణ మనిషిని. నేను జ్ఞానవంతుడను కాను” అంటాడు.

జరతూస్త్ర ఒక అమాయకమైన పిల్లవాడు. ‘అమాయకత్వం’ జీవితపు లోతులను, చైతన్యం యొక్క ఎత్తులను, మరియు ఉనికి యొక్క రహస్యాలను తెలుసుకోగలదు. జరతూస్త్రది పూర్తిగా అమాయకత్వం. పండితుడు నీటిపై ఒక

గ్రంథం వ్రాయవచ్చు. కానీ వారి గ్రంథం ఇతరుల దాహాన్ని తీర్చలేదు. పండితుడు సత్యం మాట్లాడలేడు, ఎందుకంటే దాని గురించి అతనికేం తెలియదు. దాని గురించి తెలిసిన వ్యక్తులు కూడా దాని గురించి పూర్తిగా మాట్లాడలేరు. కాకపోతే వారు కొన్ని సూచనలు, కొన్ని మార్గదర్శకాలను ఇవ్వగలరు. కానీ పండితుడు ఎల్లప్పుడూ తన వేదాంతంలో, పాండిత్యంలో మునిగి ఉంటాడు. అతను జీవించడం మర్చిపోయాడు. అతనికి ఆలోచించడం మాత్రమే తెలుసు. ఒక అందమైన సూర్యాస్తమయాన్ని చూసినప్పుడు పండితుడు తన పదప్రయోగంతో దానిని వర్ణించడంలో మునిగిపోతాడే కానీ ఆస్వాదించడు. వారి ధర్మాలు చాలా విచిత్రమైనవి. వేర్వేరు పండితులు వేర్వేరు ధర్మాలను కలిగి ఉంటారు మరియు వారి ధర్మాలు జరతూస్త్ర అభిరుచికి మరింత వ్యతిరేకం. వారి ధర్మాలు కేవలం భాషాపరమైనవి. వారికి వాస్తవికతతో సంబంధం ఉండదు. వాదనలు గెలవడం ద్వారా వారు దేన్నైనా ధర్మంగా మార్చగలరు. జరతూస్త్ర వారి మధ్య జీవించినప్పుడు అతను వారి కంటే ఉన్నతంగా జీవించాడు. అందుకే అసూయ వలన వారు జరతూస్త్రపట్ల చాలా కోపంగా ఉన్నారు. జరతూస్త్ర ప్రశ్నలకు వారి సమాధానం కోపం. కానీ కోపం ఎప్పటికీ వాదన కాదు. ఎవరూ సమానం కాదని అందరికీ తెలుసు. కానీ అసూయ నుండి జన్మించిందే సమానత్వం. బలవంతుడిపై బలహీనుడికి అసూయ. తెలివితక్కువవాడికి తెలివైనవాడిపై అసూయ. ఎక్కువ సంఖ్యలో ఉన్నవారిపై తక్కువ సంఖ్యలో ఉన్నవారి అసూయ. పండితుల వాదన ఏంటంటే.. మనుషులంతా సమానమే.. సమానత్వం మనిషి జన్మహక్కు. కానీ జరతూస్త్ర వారికంటే ఎత్తులో ఉన్నాడు.. మనుషులంతా సమానం కాదు. జరతూస్త్ర ఆ పండితుల కంటే ముందు ఉన్నాడు. ఆత్మహత్యకు పర్యాయపదంగా వారు సమానత్వాన్ని బోధిస్తున్నారు. మానవులంతా సమానం కాదని.. ఎవరి శక్తి సామర్థ్యాలు వారివి అంటాడు జరతూస్త్ర. ఆధునిక ప్రజాస్వామ్యం యొక్క ఆదర్శాలు, సమానత్వం వంటి బోధనల వలన పండితులు సూపర్ మాన్ అవ్వడానికి అర్హులు కాదని అంటాడు జరతూస్త్ర.

❖ ❖ ❖

# కవులు

జరతూస్త్ర శిష్యుడు జరతూస్త్రని ఒకసారి మీరు కవులు అబద్ధాలు ఆడతారని అన్నారు కదా..! ఎందుకు అని ప్రశ్నించాడు. దానికి జరతూస్త్ర 'ఎందుకు' అని నన్ను అడగవద్దు. ఎందుకంటే నేను తత్వవేత్తను కాను. నేను పండితుడిని కాదు. నా ప్రతిపాదనలు హేతుబద్ధమైనవి కావు. అందువల్ల నన్ను 'ఎందుకు' అని అడగడం అసంబద్ధమైనది. నా ప్రతిపాదనలు పూర్తిగా నా అనుభవంపై ఆధారపడి ఉంటాయి అన్నాడు జరతూస్త్ర.

(తత్వవేత్తల ప్రతిపాదనలకు, అభిప్రాయాలకు కారణాలు ఉంటాయి. కానీ జరతూస్త్ర ప్రతిపాదనలకు ఎటువంటి కారణాలు ఉండవు. అతని ప్రతిపాదనకు అతనే ఒక రుజువు. అతని జీవితానుభవమే దానికి సాక్ష్యం. అతని అభిప్రాయాలే అతని అనుభవాలు.)

చాలాసార్లు నేను నా అభిప్రాయాలను, ప్రతిపాదనలను కూడా మరిచిపోతాను. నాది పిల్లవాని అమాయకత్వం, మతిమరపు. నేను ఏది చెప్పినా అప్రయత్నపూర్వకంగానే చెప్తాను. నేను నీతో ఏమి చెప్పానో నాకు గుర్తులేదు. నేను నా అభిప్రాయాలను, నా కారణాలను నాతో మోసుకెళ్లలేను. అవి నాకు భారంగా తోస్తాయి. బహుశా కవులు ఎక్కువగా అబద్ధాలు ఆడతారని చెప్పే ఉంటాను. కానీ నీ జరతూస్త్ర కూడా ఒక కవి అనే విషయం మరవకు. అలా అయితే నేను కూడా అబద్ధాలు ఆడే ఉంటానే.. అలాంటప్పుడు నన్ను ఎందుకు నమ్ముతున్నావని అడిగాడు జరతూస్త్ర.

దానికి అతని శిష్యుడు "మీరు చెప్పేది నిజమా.. అబద్ధమా.. అనే విషయం నేను పట్టించుకోను. మీపై నాకున్న నమ్మకం మీ ప్రతిపాదనలపై, మీ అభిప్రాయాలపై ఆధారపడి ఉండదు. నా నమ్మకం మీ ఉనికిపై ఆధారపడి ఉంటుంది" అన్నాడు.

జరతూస్త్ర నవ్వుతూ.. నిదానంగా తలాడిస్తూ నాపట్ల నీకున్న నమ్మకం నన్ను సంతోషపెట్టదు.

అవును మనం చాలా అబద్ధాలు ఆడతాము. సత్యం గురించి ఎంతో కొంత తెలిసిన మనిషి తనను తాను చాలా ఇబ్బందుల్లో పడేసుకుంటాడు.

మొదటిది: అతను దానిని వ్యక్తపరచలేడు.

రెండవది: అతను దానిని వ్యక్తపరచటానికి ప్రయత్నించవలసి వస్తే అతను అబద్ధాలను ఆడవలసి ఉంటుంది.

మూడవది: అతను ఏదో ఒకవిధంగా చెప్తున్నప్పటికీ ప్రజలు అప్పటివరకు తమకున్న జ్ఞానంతో దానిని తప్పుగా అర్థం చేసుకుంటారు. అబద్ధాలు ఎల్లప్పుడూ అవాస్తవంగా ఉండవు. కొన్నిసార్లు అవి ఖచ్చితంగా అవసరం అవుతాయి. సత్యాన్ని పూర్తిగా వ్యక్తపరచడం అసంభవం. కవిత్వానికి ఉన్న గొప్ప లక్షణం ఏంటంటే అది ఖచ్చితంగా నిజం కానవసరం లేదు. అది ఎంత అందంగా ఉంటే అంత మంచిది. కొన్నిసార్లు అబద్ధం, నిజం కంటే అందంగా ఉంటుంది. కవి కవిత్వానికి, సత్యానికి మధ్యలో ఉన్న అంతరాలను పూరించడానికి అందమైన రూపకాలు వాడతాడు. కవిత్వంలో అది కుదురుతుంది. అది సత్యానికి సంబంధించిన మొత్తం ఆలోచనారూపాన్ని పూర్తిగా ఇస్తున్నట్లు ఉంటుంది. కవిత్వంలో అబద్ధం ఒక రూపకం అవుతుంది. చెప్పే మార్గం సులువు అవుతుంది. అబద్ధంగా వాడబడే రూపకం అలంకరణ అవుతుంది. కానీ గద్యంలో అబద్ధం చాలా స్పష్టంగా తెలిసి పోతుంది. దానిని దాచడం చాలా కష్టం. నాలాంటి వ్యక్తి అబద్ధం చెప్పడం అనేది అపస్మారకస్థితిలో ఉన్న వ్యక్తి చెప్పే నిజం కంటే గొప్పది. కానీ నా అబద్ధం మానవచైతన్యం యొక్క పరిధులను పెంచుతుంది. నా అబద్ధం కల నిజం అయ్యే చోటుకి ప్రయాణిస్తుంది.

ఒక ఆధ్యాత్మిక వ్యక్తి కవి కావచ్చు. కవి ఒక ఆధ్యాత్మిక వ్యక్తి కావచ్చు. కానీ అది తప్పనిసరైతే కాదు. ఒక కవి కేవలం కవిగా మిగిలిపోయినప్పుడు, అతను తన కవిత్వాన్ని, పాటలను ప్రజలు విని, తనని మెచ్చుకోవాలని కోరుకుంటాడు. వినే ప్రజలెవరో తనకి పట్టింపు ఉండదు. అలాంటి కవులు వారిని మెచ్చుకోవటానికి నిరంతరం ఎవరినో ఒకరిని వెతుకుతూనే ఉంటారు. అలాంటి కవులతో నేను విస్తుపోయాను. కానీ అదే కవి ఒక మార్మికకవిత్వం ద్వారా మాట్లాడేటప్పుడు, అది పూర్తిగా భిన్నమైన విషయం. అప్పుడు అతని ఆందోళన కవిత్వం గురించి కానీ, ప్రశంసల గురించి కానీ, చప్పట్ల గురించి కానీ కాదు. అతని ఆందోళన తన కవిత్వం ద్వారా ఏదో ఒక విత్తనంగా ప్రజల

హృదయాంతరాలలోకి చేరుకోవచ్చని. ఒక కవి తన కవిత్వంతో అలిసిపోయి నప్పుడు అతన్ని అభినందించడానికి వేరొకరి కోసం ఎదురుచూడడం కంటే అతను తన లోలోతుల్లో తనను తాను తెలుసుకోవడం ప్రారంభించినప్పుడు అతను ఒక ఆధ్యాత్మిక వ్యక్తిగా మారడానికి చాలా దగ్గరగా ఉన్నాడని అర్థం.

కవి కవిగా మిగిలిపోకూడదు. అతను ఒక ఆధ్యాత్మిక వ్యక్తి అయినప్పుడు మాత్రమే అతని జీవితానికి సార్థకత. కవి ఇతరులపై ఆసక్తి కలిగి ఉండడం కంటే, మార్మికంగా తన సొంత అన్వేషణ ప్రారంభించడం మంచిది. కవి మీరు అభినందించే విషయాలు చెప్పగలడు. మార్మికంగా తన సొంత లోతుల్లో తాను కనుగొన్న విషయాలు చెప్పగలడు. బహుశా అతను మీలో అన్వేషణ కోసం కోరికను కూడా సృష్టించగలడు. కవి ప్రకృతిపట్ల ప్రేమ కలవాడు. కవి స్వర్గనరకాలను, దేవుళ్లను, ఇతర ప్రపంచాలను కూడా సృష్టించాడు.. కానీ ఈ దేవుళ్ళు, స్వర్గనరకాలకు సంబంధించిన వారి కవిత్వం ద్వారా వారు ఆడిన అబద్ధాలు మనుషులను బానిసలుగా చేశాయి. వారిని ఒంటెలుగా చేశాయి.

నీ జరతూస్త్ర కూడా కవే. ఎందుకంటే అతను సూపర్ మాన్ గురించి, అతని రాక గురించి తన బోధనలు మీకు వివరిస్తున్నాడు కాబట్టి.

(సూపర్ మాన్‌కి సంబంధించిన జరతూస్త్ర యొక్క కవిత్వాలలో, అతని బోధనలలో కూడా అబద్ధాలు ఉన్నాయన్న విషయం అతని శిష్యుడికి కోపం తెప్పించింది. జరతూస్త్ర కూడా తనకు అబద్ధాలు చెప్పాడనే విషయం అతను తట్టుకోలేకపోయాడు. కానీ మునుపటి యుగపు కవులను జరతూస్త్ర విమర్శించాడు. ఎందుకంటే వారు మానవులను సూపర్ మాన్ స్థితిని గ్రహించకుండా ఉంచిన దేవతలను, స్వర్గనరకాలను సృష్టించారు. జరతూస్త్ర కూడా ఒక విధంగా కవే. తన సూపర్ మాన్‌కు సంబంధించిన కలలను నిజం చేయడానికి నిజాయితీగా, నిబద్ధతతో ఉన్నాడు.)

నేను నా ముందు వచ్చిన ఇతర కవులలాంటివాడిని కాను. ఎందుకంటే నా బోధనలు వారి బోధనల కంటే ఉన్నతమైనవి. స్వర్గం మరియు భూమి మధ్య చాలా విషయాలు ఉన్నాయి, వాటిని కవులు మాత్రమే కలగనగలరు. అవి ప్రస్తుతం కలలు మాత్రమే అయినప్పటికీ ఏదో ఒక రోజు అవి వాస్తవరూపం దాలుస్తాయి.

కవులు మాత్రమే కలలు కనేంత ధైర్యం కలవారు. ఇప్పటివరకు ఉన్న కవులు తప్పుడు ప్రపంచాలను, దేవుళ్లను సృష్టించారు. కానీ నీ జరతూస్త్ర సూపర్ మాన్ గురించిన గొప్ప సత్యాన్ని బోధించడానికి వచ్చిన ఒక మార్మికమైన కవిగా గుర్తించు అని తన శిష్యుడికి చెప్తాడు.

❖ ❖ ❖

# భవిష్యవాణి

అర్ధరాత్రి జరతూస్త్ర గాఢనిద్రలో ఉండగా ఎటువంటి హెచ్చరిక లేకుండా ఒక భయానక స్వప్నంలో భవిష్యవాణి అతనితో ఇలా అంటుంది..

"నేను మానవాళిపైకి ఒక గొప్ప దుఃఖం రావడాన్ని చూశాను... అంతా శూన్యంగా ఉంది.. ఏదీ మారలేదు.. అన్నీ యథాతథంగానే ఉన్నాయి.. గతం ఎలా ఉందో ఇకపై భవిష్యత్తు కూడా అలాగే ఉండబోతుంది.."

జరతూస్త్ర నిద్ర లేచి.. ఆ జోస్యం యొక్క అర్థం ఏమిటో తెలుసుకోవడానికి ప్రయత్నిస్తాడు.. దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న నిహిలిజం / శూన్యవాదం యొక్క చీకటి కాలాలు సమీపిస్తున్నాయని, అతని బోధనలు ప్రమాదంలో ఉన్నాయనే విషయం జరతూస్త్ర అర్థం చేసుకుంటాడు. ఆ జోస్యం నిజమేనన్న దిగులుతో మూడు రోజులుగా ఏమీ తినకుండా, ఎవ్వరితో మాట్లాడకుండా సంచరిస్తూనే ఉండడం వలన బాగా నీరసించిపోయాడు. బాగా అలసిపోయిన జరతూస్త్ర తన శిష్యుల వద్దకు తిరిగివచ్చి గాఢనిద్రలోకి జారుకుంటాడు. మూడు రోజులుగా అతనికి, అతని బోధనలకి దూరం అయిన అతని శిష్యులు జరతూస్త్ర చుట్టూ చేరతారు. చాలా గంటల గాఢనిద్రనుండి ఒక్కసారిగా మేల్కొంటాడు జరతూస్త్ర. తనచుట్టూ శిష్యులు గుమిగూడి ఉండడం చూసి...

నా మిత్రులారా..! గాఢనిద్రలో నాకొచ్చిన ఈ కల ఇప్పటికీ నాకు చిక్కు ప్రశ్నగానే ఉంది. ఆ కల మీకిప్పుడు చెప్తాను. దానర్థం ఏంటో తెలుసుకోవడానికి నాకు సహకరించండంటూ జరతూస్త్ర తనకొచ్చిన కల చెప్పడం మొదలుపెట్టాడు.

ఆ కలలో నేను ఒక మరణకోటకి ఒక కాపలాదారుడిగా ఉన్నాను. అక్కడున్న శవపేటికలను కాపలా కాస్తున్నాను. అధిగమించిన జీవితం గాజు శవపేటికల నుండి నన్ను చూస్తూ ఉంది. అక్కడున్నవి మూడే మూడు.. ఒకటి

నాలో ఉన్న వెలుగు.. రెండు నా ఒంటరితనం.. మూడు మరణం యొక్క తీక్షణమైన నిశ్శబ్ద శబ్దాలు. ఆ శవపేటికలకు, ఆ మరణకోట యొక్క సింహద్వారానికి సంబంధించిన తాళపుగుత్తి నా వద్దే ఉంది. వాటిని ఎలా ఉపయోగించాలో, ఎలా తెరవాలో నాకు తెలుసు. మెల్లగా పెరుగుతున్న గాలి వలన సింహద్వారం ఊగుతూ శబ్దం చేస్తుంది. పక్షులు అరుస్తున్నాయి. మరల వెంటనే ఒక్కసారిగా అంతా నిశ్శబ్దం అయిపోయింది.

కానీ నేను ఒంటరిగా ఇంకా అక్కడే కూర్చొని ఉన్నాను. కొంత సమయం గడిచిపోయింది.. సమయం నేనింకా ఉనికిలోనే ఉన్నానని గుర్తుచేయడానికి అన్నట్టు ఒక పెద్ద తుఫాను ఉరుములా వచ్చి ఆ కోట సింహద్వారాన్ని మూడు సార్లు గట్టిగా కొట్టింది. ఆ భయంకరమైన శబ్దం, నా నిశ్శబ్దాన్ని మేల్కొలిపింది. వేగంగా పరిగెత్తుకుంటూ నేను ఆ ద్వారం దగ్గరకు వెళ్ళాను. అక్కడున్న బూడిదను ఎవరో పర్వతంపైకి తీసుకువెళుతున్నారు. ఎవరూ.. ఎవరూ.. ఆ బూడిదను తీసుకెళ్తుందెవరని అరిచాను. నా దగ్గర ఉన్న తాళంతో ఆ ద్వారాన్ని తెరవడానికి గట్టిగా ప్రయత్నించాను. కానీ నావల్ల కాలేదు. ఆ భయంకరమైన తుఫాను గాలికి ఒక నల్లటి శవపేటిక నా ముందు వచ్చి పడింది.

విచిత్రమైన ఈలలతో.. కీచుకీచు శబ్దాలతో.. రకరకాల నవ్వులతో ఒక్కసారిగా ఆ శవపేటిక తెరుచుకుంది. దాంట్లోనుండి ఒక్కసారిగా పిల్లలు, దేవదూతలు, గుడ్లగూబలు, మూర్ఖులు, చిన్నపిల్లల పరిమాణంలో ఉన్న సీతాకోక చిలుకలన్నీ బయటికి వచ్చి నన్ను ఎగతాళిగా చూసి, వెకిలి నవ్వులు నవ్వుకుంటూ నా నుండి దూరంగా పోయాయి. భయంతో దడుసుకొని కిందపడ్డాను. అరుస్తూ ఏడ్చాను. ఒక్కసారిగా నేను మేల్కొని, స్పృహలోకి వచ్చాను."

ఆ విధంగా జరతూస్త్ర తన శిష్యులకు కలను చెప్పి మౌనంగా, దిగులుగా ఉండిపోయాడు. నిజానికి ఆ కల అర్థమేంటో అతనికి కూడా తెలియదు. కానీ ఒక శిష్యుడు జరతూస్త్రని తన సమాధానంతో ఉత్సాహపరచడానికి ఆశించి.. ఆ కలకి తనదైన భాష్యం చెప్పడానికి ముందుకొచ్చాడు.

"జరతూస్త్ర...! మీ జీవితమే ఈ కలను మాకు వివరిస్తుంది. ఈలలతో.. విచిత్రమైన శబ్దాలతో, కన్నీళ్లతో మరణకోటల ద్వారాలను తెరవలేరు. రంగురంగుల వ్యంగ్యాలతో నిండిన శవపేటిక మీరే అని నాకు తెలుసు.. అందులోనుండి

వచ్చినవి మీ బోధనల ప్రతిరూపాలు. అవి మీరే.. అలా మీరు ఎగురుతూ ఇతర మరణకోటల్లోకి ప్రవేశిస్తారు. ఇతర మరణకోటల దగ్గర కాపలాగా ఉన్న సంరక్షకులు వారిదగ్గరున్న తాళాలతో మరణకోట ద్వారాలు తెరవలేని వారిని చూసి మీరు నవ్వుతారు. మీ నవ్వుతో మీరు వారిని భయపెడతారు. మీ శక్తి వారిని మూర్ఛపోయేలా చేస్తుంది. అది వారిని మేల్కొల్పుతుంది. మరణం యొక్క అలసట వచ్చినప్పుడు కూడా, మీరు ఆకాశంలో అస్తమించరు.. మీరు జీవితాన్ని గడుపుతారు. మీరు స్వప్నం నుండి మేల్కొన్నట్లు, మీ శత్రువులు కూడా వారి వారి కలల నుండి మేల్కొని జరతూస్త్ర బోధలను వినడానికి వస్తా"రంటూ తనదైన భాష్యం చెబుతాడు ఆ శిష్యుడు.

మిగతా శిష్యులందరూ జరతూస్త్ర చుట్టూ గుమిగూడి ఉన్నారు. అతనిని తన దిగులుని విడిచి, మంచం దిగి రావాలని ఒప్పించడానికి సిద్ధం అయ్యారు. కానీ జరతూస్త్ర మంచం మీద నుండి లేచి నిటారుగా కూర్చున్నాడు. తన చుట్టూ ఉన్న తన శిష్యుల ముఖాలను పరిశీలించాడు. కానీ జరతూస్త్రకి అవన్నీ కొత్త మొహల్లా కనపడ్డాయి. వారు జరతూస్త్రని పైకి లేపి నిల్చోబెట్టారు. అతని కళ్ళు అకస్మాత్తుగా మారాయి. జరిగినదంతా గ్రహించి, జరతూస్త్ర తన గడ్డాన్ని సవరించుకుంటూ గంభీరమైన స్వరంతో..

"మిత్రులారా..! మనం ఇప్పుడు మంచి విందు ఆరగిద్దాం పదండి.. చెడు కలలకు స్వస్తి చెప్పే సమయం ఆసన్నమైంది.. విందులో ఆ భవిష్యవాణి చెప్పినవానిని నా పక్కనే కూర్చోపెట్టుకొని అతను మునిగిపోయే సముద్రాన్ని నేను అతనికి చూపిస్తాను" అన్నాడు.

కానీ తరువాత అతను తన కలకు భాష్యం చెప్పినట్టు నటిస్తూ, తనని సంతోషపరచడానికి ప్రయత్నించిన తన శిష్యుడి ముఖంలోకి చాలాసేపు చూసి, అతను చెప్పినది తప్పని, శూన్యవాదం యొక్క జోస్యమే నిజమవుతుందని తెలుసుకుంటాడు జరతూస్త్ర. జరతూస్త్ర, అతని బోధనలపట్ల అతని శిష్యుడు ఎంత విధేయతగా ఉన్నాడో చూపించడానికే అలా చెప్పాడని తెలుసుకుంటాడు. అతని శిష్యులు అతన్ని నిరాశపరిచారని గ్రహిస్తాడు జరతూస్త్ర. ఏదో ఒక సమయంలో తన శిష్యులను తప్పక వదిలివేయాలని జరతూస్త్ర నిశ్చయించు కుంటాడు.

❖ ❖ ❖

# విముక్తి

జరతూస్త్ర ఒక రోజు ఒక పెద్ద వంతెన గుండా నడుస్తున్నాడు. అక్కడ అతన్ని వికలాంగులు, బిచ్చగాళ్ళు చుట్టుముట్టారు. అందులో ఒక గూనివాడు జరతూస్త్ర దగ్గరికి వచ్చి, మేము నీ బోధనలను విశ్వసించినప్పటికినీ నీవు మమ్మల్ని స్వస్థపరిస్తేగాని నిన్ను అర్థం చేసుకోలేమని అంటాడు. వాటిని నయం చేయడం తాను చేయగలిగిన నీచమైన పనుల్లో ఒకటని, అది ప్రపంచంలోని క్రూరత్వాలకు దారి తీస్తుందని చెప్తాడు జరతూస్త్ర. జరతూస్త్ర తనని తాను ఒక మహిమగల దేవునిలా నిరూపించుకోవడానికి నిరాకరిస్తాడు. ఇది అతన్ని ప్రలోభపెట్టే అవకాశం. మహిమగల వ్యక్తిలా తనని తాను నిరూపించుకోవడం ప్రజల దృష్టిలో అతని స్థాయిని పెంచుతుంది. కానీ తన ఉద్దేశం అది కాదు. మానవాళికి శక్తి సంకల్పం ఉందని.. వారిని వారు అధిగమించగలరని, వారికి ఆ శక్తి సామర్థ్యాలు ఉన్నాయని గుర్తుచేయడం అతని ఉద్దేశం. వంతెన చివరికి రాగానే జరతూస్త్ర ఒక కురూపిని చూస్తాడు.

జాలికి సంబంధించిన తన బోధనలను పక్కనపెట్టి ప్రపంచ స్వభావాన్ని (శక్తి సంకల్పం) తెలుసుకోవడానికి నిజమైన మార్గాన్ని నేర్పడానికి కఠినమైన హృదయంతో ఉండక తప్పదని నిశ్చయించుకొని ముందుకు నడుస్తాడు జరతూస్త్ర.

దీని గురించి జరతూస్త్ర తన శిష్యులకి బోధించడం మొదలుపెడతాడు. మతాలు మనిషి యొక్క హుందాతనాన్ని నాశనం చేసాయి. అవి చాలా తెలివిగా మనుషుల్లో చీలికని సృష్టించి, మానసిక వికలాంగుల్ని చేసాయి. మానవాళిపట్ల క్షమించరాని నేరం చేశాయి. శరీరం తుచ్ఛమైనది. భూసంబంధమైన ఆనందాలు చెడ్డవి అంటూ చెప్తూ వచ్చాయి. శరీరం మాత్రమే నిజమని, మిగతావన్నీ కల్పన అని నమ్మేవారు కొందరైతే, మనిషి ఉనికిని ఖండించేవారు మరికొందరు. మానవ మేధస్సుని ఖండించేవారు కొందరైతే, ఆత్మని ఖండించేవారు ఇంకొందరు. వారెవరూ మనిషిని సహజంగా, ప్రకృతికి అనుగుణంగా ఎదగనివ్వలేదు. మానవాళి మొత్తం బాధపడుతోంది. మతపరమైన ఆలోచనలవల్లే మనిషి సహజంగా ఎదగలేక పోతున్నాడు. సహజంగా జీవించలేకపోతున్నాడు. ఇది చాలా మోసపూరిత వ్యూహం. మొదట వారు బాధను సృష్టిస్తారు. ఆపై ఆ బాధను ఉపయోగిస్తూ మీరు పుట్టడమే

పాపంతో పుట్టారు అనే వాదానికి దిగుతారు. అందుకే పరిపూర్ణమైన మానవుడిని కనుగొనడం చాలా కష్టం అయిపోయింది.

సంపూర్ణమైన మనిషి అంటే సూపర్ మాన్.. అతను ఎల్లప్పుడూ ఆనందంగా ఉంటాడు. ప్రతి క్షణాన్ని ఆస్వాదిస్తాడు. ప్రతి క్షణం జీవిస్తాడు. అతని జీవితం ఒక నృత్యం, అతని జీవితం ఒక వేడుక. అతనికి పూజారుల అబద్ధాలతో పని లేదు. అతనికి ఇంకెక్కడో ఉండే స్వర్గం యొక్క అవసరం ఉండదు. అతనికి ఈ భూమే భూతల స్వర్గం. కానీ మతాలు ఈ భూమిని యుద్ధభూమిగా మార్చాయి. ప్రతి ఒక్కరూ ఏదో ఒక విధంగా నాశనం చేయబడ్డారు. ప్రతి ఒక్కరూ పెరగకుండా ఆగిపోయారు. మతం ఎవ్వర్నీ సంతోషంగా ఉండడం చూడలేదు. ఎవరైనా ఆనందంగా ఉంటే ఓర్వలేదు. ఎవరైనా అవిధేయతగా ఉంటే ఒప్పుకోలేదు. ప్రజల ఆనందాన్ని ఎలా నాశనం చేయాలో వారు గొప్ప వాదనలు అభివృద్ధి చేశారు. వారి గొప్ప వాదన ఏమిటంటే, ఈ జీవితం చాలా చిన్నది, మరియు ఆనందం చాలా అశాశ్వతమైనది, నిరంతరం మారుతుంది. దానితో మోసపోకండి, ఎందుకంటే మీరు మోసపోతే స్వర్గంలో పొందవలసిన శాశ్వతమైన ఆనందాల్ని కోల్పోతారనే భయాన్ని మానవాళిలో సృష్టించింది. జీవితంలోని చిన్న చిన్న ఆనందాల్ని కూడా మతం వ్యతిరేకిస్తూ వచ్చింది.

మానవాళి యొక్క గతాన్ని మరియు వర్తమానాన్ని చూడటం చాలా బాధాకరమైనది. భవిష్యత్ ఇంకా ఉందనే ఆశ మాత్రమే మానవాళిని ఇంకా సజీవంగా ఉంచుతుంది. గతం పూర్తయింది. వర్తమానం ప్రతి క్షణం గతం అవుతోంది. సూపర్ మాన్ అవ్వగలమనే ఆశ మాత్రమే ప్రస్తుత మానవుడ్ని ఇంకా సజీవంగా ఉంచగలుగుతుంది. మనిషికి ప్రకృతి తప్ప వేరే మతం లేదు. అతని స్వభావమే (శక్తి సంకల్పం) అతనికి మార్గనిర్దేశం చేస్తుంది. ప్రకృతి తప్ప వేరే మార్గదర్శి లేదు. మిగతా మార్గాలన్నీ మిమ్మల్ని తప్పుదారి పట్టించేవే. వారు మానవుడ్ని సహజత్వం నుండి దూరం చేసారు.

ప్రకృతి పునరుత్పత్తి చేయాలనుకుంటుంది. ప్రకృతి అనేది పరిణామం యొక్క నిరంతర ప్రక్రియ. కానీ మతాలు దీనికి వ్యతిరేకం. ఎందుకంటే ఒక వ్యక్తి ఎంత ఎక్కువ అభివృద్ధి చెందుతాడో అతను ఏదైనా మతమూర్ఖత్వానికి బాధితుడు అయ్యే అవకాశం అంత తక్కువ.

జరతూస్త్ర తన శిష్యులను నేను ఎలా ఉండాలని మీరు ఆశిస్తున్నారు అని అడుగుతాడు.

కవిగానా?

లేదా నిజాయితీగల వ్యక్తిగానా?

రక్షకుడిగా?

మంచి మనిషిగానా?

లేక దుష్టమనిషిగానా?

జరతూస్త్ర తన నిజమైన లక్ష్యం ప్రజలకు 'శక్తి సంకల్పం' తీసుకురావడం అని తెలుసుకుంటాడు.. కానీ అతను తన అంతిమ బందీ అయిన 'కాలం' నుండి సంకల్పాన్ని విచ్ఛిన్నం చేసేంతగా ముందుకు సాగలేనందుకు బాధపడతాడు. శక్తి సంకల్పం మాత్రమే ప్రజలను విముక్తి చేయగలదు, కానీ గతం అనేది విముక్తి కావాలని కోరుకునేవారిని కూడా గొలుసులతో బంధిస్తుంది. ఎంత గొప్ప సంకల్పమైన గడిచిన కాలాన్ని తిరిగి వెనక్కి వెళ్లి మార్చలేదని తెలుసుకొని జరతూస్త్ర బాధపడతాడు.

❖ ❖ ❖

## ముందు జాగ్రత్తలు

జరతూస్త్రని అర్థం చేసుకోవాలంటే కావలసిందల్లా అప్పటివరకు ఉన్న అన్ని విశ్వాసాలను, అన్ని నమ్మకాలను పక్కన పెట్టి ఒక చిన్నపిల్లవానిలా అనాలోచితంగా, అమాయకంగా ఉండడమే. అమాయకత్వం జరతూస్త్రని, అతని భాషను అర్థం చేసుకోగలదు, ఎందుకంటే జరతూస్త్ర కూడా పిల్లవాడే. పిల్లలకి ఏమీ తెలియదు, కానీ జరతూస్త్రకి ప్రతిదీ తెలుసు.. కానీ అన్నీ వదిలేసాడు. ఎందుకంటే అదంతా చెత్తని జరతూస్త్రకి తెలుసు. జరతూస్త్రలాంటి గొప్ప వ్యక్తిని అర్థం చేసుకోవడానికి ప్రయత్నిస్తున్నప్పుడు కావాల్సింది మేధోచతురత కాదు. కావాల్సింది అమాయక పసిహృదయం.

జరతూస్త్ర ప్రకారం, మనిషి లోతైన అగాధంపై వంతెన మీద ఉన్నవాడు. జరతూస్త్ర, తనను తాను అధిగమించడానికి సిద్ధంగా వున్న ప్రతి వ్యక్తితో, తనని తాను ఉన్నతమైన వ్యక్తిగా రూపాంతరం చెందడానికి తనకి తాను సహకరిస్తున్న

ప్రతి వ్యక్తితో మాట్లాడుతున్నాడు. అతను ఎత్తైన వంతెనను దాటుతున్నాడు. కానీ కింద భయంకరమైన అగాధం ఉంది. ఇక్కడున్న ప్రమాదం ఏమిటంటే అతను ఏ క్షణాన్నైనా పట్టు కోల్పోవచ్చు. ఇక్కడ ఎత్తు సమస్య కాదు. అధిగమించడం కష్టం అయి ఉండొచ్చు. భయంకరమైనది ప్రక్కనే ఉన్న 'అగాధం'. ఒక్క చిన్న తప్పటడుగు, కొంచెం అపస్మారకంగా ఉన్నా మనిషి జంతువు స్థాయికి పడిపోతాడు. అందుకే లక్షలాదిమంది ప్రజలు ఎత్తు గురించి భయపడాల్సిన అవసరం లేదని, తమకంటే పైకి ఎదగడానికి ఎటువంటి ప్రయత్నం చేయకూడదని నిర్ణయించు కున్నారు. అక్కడే ఉండి ఎదగడానికి ఎప్పటికీ ప్రయత్నించని వారి జీవితాల్లో ఎత్తుపల్లాలు అనేవి ఉండవు. వాళ్ళకి సవాళ్ళను స్వీకరించే ధైర్యం ఉండదు. వారు ఎక్కడికి, ఎప్పటికీ కదలరు. వారు ఉన్న చోటనే ఉంటారు. కానీ అప్రమత్తంగా పూర్తి అవగాహనతో, పూర్తి వివేకంతో ఉండడం ద్వారా ఒక్క తప్పటడుగు కూడా పడదు. ఇది దాదాపు బిగుతుగా వున్న తాడుపై నడవడం లాంటిది. ఉత్సాహం విపరీతంగా ఉంటుంది. శిఖరానికి చేరుకున్నవారి పారవశ్యం అపరిమితమైనది.

జరతూస్త్ర ఇలా అంటాడు.

నన్ను నేను అధిగమించాలనే కోరిక నాలో ఇంకా ఉంది. కానీ మానవాళి పట్ల ఉన్న ప్రేమ కారణంగా సంకెళ్లతో బంధింపబడి ఉన్నాను. ఎత్తులు నన్ను పిలుస్తున్నాయనే భయం నాలో ఉంది. ఆ ఎత్తుల వైపు వెళ్ళటానికి నేను అగాధాన్ని మరచిపోలేను. అగాధాన్ని నివారించడానికి నన్ను నేను మానవాళిపట్ల ఉన్న ప్రేమసంకెళ్లతో బంధింపబడి ఉన్నాను. నేను మనుష్యుల మధ్య గుడ్డిగా జీవించాను. వారి మూఢనమ్మకాలను అంగీకరించాను. ఇప్పుడు నేను ఏకాంతంగా ఉండటానికి భయపడుతున్నాను. ఏకాంతంలో ఉన్నప్పుడు నాకున్న ఒకే ఒక్క కోరిక ఎత్తైన శిఖరాల్ని అధిరోహించడం. నన్ను నేను అధిగమించడం.. సూపర్ మాన్ అవ్వడం.

జీవితం ఎప్పటికప్పుడు తనను తాను అధిగమించాలని కోరుకుంటుంది. ఇది జరతూస్త్ర యొక్క ప్రాథమిక బోధనలలో ఒకటి. కానీ అలా అధిగమించాలంటే మీలో ఉన్న పాతవాటిని తుడిచెయ్యాలి. కానీ పాతది చనిపోయి కొత్తది రాకపోతే ఏంటనే భయం అతనిని అక్కడే ఉండేలా చేస్తుంది. చెట్టునుండి పాత ఆకు

పడిపోతున్నప్పుడు, దాని స్థానంలో కొత్త తాజా పచ్చని ఆకు మరల చిగురిస్తుందనే హామీ ప్రకృతి దానికిస్తుంది. తన జీవితంలో పరివర్తన జరగాలని కోరుకునే వ్యక్తి సాహసం చేయాలనే విషయం తెలుసుకోవాలి అంటాడు జరతూస్త్ర.

జరతూస్త్ర తన మొదటి ముందు జాగ్రత్తగా "నన్ను మోసం చేయడానికి సిద్ధంగా ఉన్నవారికి నేను మోసపోవడానికి సిద్ధంగా ఉంటాను" అంటాడు. నిరంతరం ఆందోళన చెందకుండా ఉండటానికి ఇది నాకు సహాయపడుతుంది. ఇది నాకు విశ్రాంతి తీసుకోవడానికి అనుమతిస్తుంది. జాగ్రత్తగా ఉండవలసిన అవసరం లేదు, ఎందుకంటే నీకు నీవు కాపలాగా ఉండటం మానవజాతి యొక్క నీచమైన వాటిల్లో ఒకటి. అందరూ అపరిచితులే.. చాలా సన్నిహితంగా ఉన్నవారు కూడా అపరిచితులే. నిజానికి వారేం చేయబోతున్నారో ఎవరికీ తెలియదు. ఎప్పుడూ ఉద్రిక్తత, ఆందోళన, ప్రతి ఒక్కర్ని అనుమానంగా, శత్రువులా చూడటం, నిరంతరం నాకు నేను కాపలాగా ఉండటం కంటే ఇది చాలా సులువైనది అనుకుంటాడు జరతూస్త్ర.

జరతూస్త్ర యొక్క రెండవ ముందు జాగ్రత్త ఏంటంటే "వినమ్రతతో ఉండడం కంటే అహంతో ఉండడం మంచిది..". ఎందుకంటే అహంకారం దెబ్బతిన్న మరుక్షణం అది మనలో ఉన్నతమైనదానిని సృష్టించడానికి కొత్త సవాళ్ళను ఎదుర్కొంటుంది. అసలు సమస్య వినమ్రంగా ఉండే మనిషి. పూర్తిగా విషయం లేనివాడే వినయం, సౌమ్యత, సరళత చూపించడానికి ప్రయత్నిస్తాడు. మీరు అతన్ని బాధించలేరు. మృదువైన వ్యక్తిని, వినయపూర్వకమైన మనిషిని ఎలా బాధపెట్టగలరు? అతను ఎప్పటికీ అలాగే ఉంటాడు. అతను ఎప్పటికీ మెరుగుపడడు. ఎందుకంటే అతనికి ఎటువంటి సవాళ్లు ఉండవు. అతన్ని ఎవరూ రెచ్చగొట్టలేరు. అతనికి అహంకారం ఉండదు. అది ఎప్పటికీ గాయపడదు. సాధారణంగా మతాలు వినమ్రులను ప్రశంసిస్తాయి. గర్విష్ఠులను ఖండిస్తాయి. కానీ ప్రపంచంలోని మానవాళి గర్వించదగిన ప్రతిదీ అహంకార మనిషిచే సృష్టించబడుతుంది.

మీరు వినయపూర్వకమైన చిత్రకారుడిని కానీ, కవిని కానీ, సృష్టికర్తను కానీ, నర్తకిని కానీ, గాయకుడ్ని కానీ కనుగొనడం కష్టం. వినయపూర్వకమైన మనిషి కేవలం వినయంగా ఉండడం ద్వారా మానవాళికి గొప్ప సేవ చేశానని

అనుకుంటాడు. నిజానికి వినయంతో అతను తన పిరికితనాన్ని దాచడానికి ప్రయత్నిస్తూ ఉంటాడు. తన వినయంతో అతను పోటీకి దూరంగా ఉంటాడు. అతని వినయం జీవితపోరాటం నుండి తప్పించుకోవడం తప్ప మరొకటి కాదు. ఇది సానుకూల విలువ కాదు, ఇది ప్రతికూల విలువ. వినయపూర్వకమైన మనిషి వినయంగా ఉంటాడు కాబట్టి అతను గౌరవించబడతాడు. వారంతా మంచి నటులు. వారి కోరికల్లా ఒక్కటే.. సమాజం చేత గుర్తించబడాలని.. సమాజం వారిని గుర్తించాలని..

అహంకారం ఉన్న వ్యక్తుల అహాన్ని గాయపరచకూడదు. ఎందుకంటే వారు బాధపడితే, వారి అహంకారాన్ని కాపాడుకోవడానికి, వారి సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి వారు ఇంకా ఉన్నతస్థాయికి ఎదుగుతారు.

మానవాళిలో వ్యర్థంగా పడి ఉన్నవారు.. వినమ్రులు. ఇతరులకు కావలసిన దానికోసం వీరు నటించడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటారు. అది కేవలం నటన మాత్రమే. వారు వెనుక ఒకలా, ముందు ఒకలా ఉంటారు. వీరు ఇతరుల ముందు సాధువులా ఉంటారు. కానీ వెనక నుండి వారు క్రూరుల్లా ఉంటారు. ఎల్లప్పుడూ ప్రతీకారంతో రగిలిపోతూ ఉంటారు. సమాజం ముందు అలంకరణతో గౌరవింపబడడానికి, అవార్డులను స్వీకరించడానికి చిరునవ్వుని నటిస్తూ, నిలబడి ఉంటారు.

జరతూస్త్ర మూడవ ముందు జాగ్రత్త..

"దుర్మార్గులు అని పిలవబడేవారిలో కూడా నేను చాలా అద్భుతమైనవి చూసాను.."

"నటులు తప్ప మరేమీ కానీ గొప్ప సాధువులను చూసినట్లే, దుర్మార్గులలో కూడా నేను మంచివాటిని చూశాను" అంటాడు జరతూస్త్ర.

జ్ఞానులు.. మీరు అనుకున్నంత తెలివైనవారు కాదు. దుర్మార్గులు మీరు అనుకున్నంత దుర్మార్గులు కారు. నిజానికి తెలివైనవారు, దుర్మార్గులు వేరువేరుగా లేరు. అవి ఒకే నాణానికి రెండువైపులా ఉన్న బొమ్మా బొరుసు లాంటివి. దుర్మార్గులు మరింత నిజాయితీగలవారు, కానీ సాధువులు, పవిత్ర పురుషులు, వినమ్రులు నటులు తప్ప మరొకటి కాదు. దుర్మార్గులు కనీసం నటులు కాదు. వారు నిశ్చయంగా దుర్మార్గులే. వారికి ఒక నిర్దిష్ట నిజాయితీ ఉంది. ఆ నిజాయితీనే

వారిని గొప్పవారిని చేస్తుంది. దుర్మార్గుడికి కూడా భవిష్యత్తు ఉంది. అతను చెడ్డవానిగా ఉండడం అనేది అతని ధైర్యాన్ని, శక్తిని తెలియజేస్తుంది. పిరికివాడు చెడ్డవానిగా ఉండలేడు. దానికి ధైర్యం కావాలి. కానీ అతని ధైర్యం సవాలు చేయబడిన తరువాత అతను ఏ క్షణమైనా మారగలడు. అతను చెడ్డవాడు, ఎందుకంటే ప్రమాదకరంగా జీవించాలనుకోని ఒక మోస్తరు జీవితాన్ని గడపడానికి ఇష్టపడని వ్యక్తి. మంద మాత్రమే మధ్యస్థంగా, సాధారణ జీవితాన్ని జీవిస్తుంది. సాధువులు అస్సలు జీవించరు. కానీ పూర్తిగా తీవ్రంగా జీవించాలనుకునే వారికి ఎటువంటి స్పష్టమైన దిశ, గమ్యం, ఎటువంటి మార్గదర్శకత్వం లేదు. ఈ వ్యక్తులు సామాజిక నిబంధనలకు వ్యతిరేకంగా, కపట సమాజానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేస్తే, సమాజంలో కూడా మంచి మార్పులు వస్తాయి. కావలసిందల్లా ఒక సవాలు మాత్రమే. ప్రస్తుతం చెడు మాత్రమే అలాంటివాటికి సవాలుగా ఉంటుంది.

మంచివారు అని పిలవబడేవారి మంచితనం పైపైనే. వారిని కొద్దిగా రెచ్చగొట్టడం ద్వారా వారిలో ఉన్న మృగాన్ని బయటికి తీసుకురావచ్చు. వారు కేవలం షో మాన్‌లు మాత్రమే. వారి జీవితాలను లోతుగా పరిశీలిస్తే, వారి జీవితాలు బహిరంగ పుస్తకంగా మారితే ఆశ్చర్యపోతారు. ఈ గొప్పవ్యక్తులు, మంచివారు, న్యాయవంతులు, నీతిమంతులు అని భావించేవారికి ఎవ్వరికీ తెలియని చీకటి జీవితం కూడా ఉంటుంది. వారు దెయ్యం అంటే భయపడతారు. వారు దెయ్యం గురించి భయపడడానికి ఒక కారణం: దేవుడు అనే మరొక కల్పన వైపు ఆకర్షితులు అవ్వడమే. మంచి–చెడు, దేవుడు–దెయ్యం అనేవి ఒకే కల్పన యొక్క రెండు వ్యతిరేక ధ్రువాలు. దేవుడు లేకుండా దెయ్యం ఉనికిలో ఉండదు, దెయ్యం లేకుండా దేవుడు ఉండలేడు. వారు ఒకరికొకరు కావాలి, అవి పరిపూరకరమైనవి. కాబట్టి దేవుణ్ణి ఆరాధించేవారు దెయ్యం గురించి భయపడతారు.

కల్పనలను ఆరాధించడం చాలా నవ్వు తెప్పిస్తుంది, కల్పనలు భయ పడతాయి. గొప్ప మనుషులు అని పిలవబడే సాధువులు, పవిత్రులు, మంచివారు వీటికింకా భయపడతారు. మంచివారు అని పిలవబడే వారికంటే చెడ్డవారే ఎక్కువ పరిణతి చెందినవారు.

సూపర్ మాన్ అని పిలవబడేవాడు మత ప్రజల చేత ఒక దెయ్యంగా, ఒక చెడ్డవానిగా పిలువబడతాడు. ఎందుకంటే సూపర్ మాన్ మంచిచెడు ఆలోచనలకు, 'పాపంపుణ్యం', 'ధర్మం అధర్మం', 'స్వర్గం నరకం' అనే ఆలోచనలకు అతీతంగా ఉంటాడు. ఎందుకంటే సూపర్ మాన్ చిన్నపిల్లవాడు కాదు. అతను పూర్తిగా పరిణతి చెందిన, సత్యాన్ని తెలుసుకున్న మానవుడు. అందుకే మతప్రజలు అతన్ని దుష్టుడు దెయ్యం, చెడ్డవానిగా పరిగణిస్తారు.

మీరు గొప్పవారు అనబడేవారికి ఎంత దూరంగా ఉంటే అంత మంచిది. వారి గురించి తెలుసుకోకపోవడమే మంచిది. ఈ గొప్ప వ్యక్తులను నేను నగ్నంగా చూసిన క్షణం చాలా విసుగు చెందాను. అందుకే నేను సుదూర ప్రాంతాలకు పరుగెత్తాను. వారు మారువేషంలోనే ఉండాలని కోరుకుంటున్నాను, ఎందుకంటే వారు నగ్నంగా నిలబడితే ఈ ప్రపంచం మొత్తం చాలా అసహ్యంగా కనిపిస్తుంది. వారు అలాగే ఉండడం మంచిది. ప్రామాణికమైన సమాజంలో జాగ్రత్తలు అవసరం లేదు. ఏదైనా సరళంగా, బహిరంగంగా అందరికీ అందుబాటులో ఉంటే చాలు. రహస్యంగా ఏదీ ఉండకూడదు. రహస్యం నీచమైనది. సూపర్ మాన్ తెరిచి ఉంచిన పుస్తకం లాంటివాడు.

కానీ సూపర్ మాన్ ఈ ఉనికిలోకి రానంతవరకు ఈ మారువేషంలో ఉన్న వారందరి మధ్యన నేను మారువేషంలో ఉంటాను.. ఎందుకంటే ఈ మారువేషంలో ఉన్న వ్యక్తుల మధ్య నగ్నంగా నిలబడటం సిలువ వేయబడటంతో సమానం.

నాల్గవ ముందు జాగ్రత్త: సూపర్ మాన్ ఎత్తులను అధిరోహించాలి అంటే జరతూస్త్ర తనని తాను ప్రజల నుండి దూరంగా ఉంచుకోవాలి అనుకుంటాడు.. ఎందుకంటే ప్రజలు విలువైన వాటికి చాలా దూరంగా ఉన్నారు. సూపర్ మాన్ తన దయతో వారికి భయంకరంగా కనిపిస్తాడు. మానవాళిపట్ల ఉన్న ప్రేమను పక్కన పెట్టకపోతే జరతూస్త్ర తన సూపర్ మాన్ లక్ష్యాన్ని సాధించలేడని గ్రహిస్తాడు. అందుకే జరతూస్త్ర తన శిష్యుల నుండి దూరంగా ఉండాలని నిశ్చయించు కుంటాడు.

❖ ❖ ❖

# నా ప్రేయసి

(జరతూస్త్ర రెండు సంకల్పాలకి మధ్యలో నలిగిపోతుంటాడు. ఒకటి తాను సూపర్ మాన్ అవ్వాలని, రెండు తన శిష్యులని సూపర్ మాన్‌లాగా తీర్చిదిద్దాలని..

జరతూస్త్ర సత్యభారం కారణంగా దానిని ప్రజలతో పంచుకోవాలని అనుకున్నాడు. కానీ అతని మాట వినడానికి ఎవరూ సిద్ధంగా లేరు. ఇటువంటి వైఫల్య క్షణాలలో జరతూస్త్రకి ఉన్న ఒకే ఒక మార్గం... మళ్ళీ తన ఏకాంతానికి తిరిగి వెళ్లడం. ఎందుకంటే మరల కొత్త పదాల వాడుక, కొత్త మార్గాలగుండా, కొత్త పద్ధతులగుండా మరల ప్రజలకు సూపర్ మాన్ గురించి బోధించడానికి.

ఈ ఏకాంతం తనని తాను ఇంకా మెరుగుపరుచుకోవడానికి.. తన మాటలకు, తన కవిత్వానికి, తన పాటలకు తుదిమెరుగులు దిద్దడానికి.. వివిధ కోణాల నుండి మరల ప్రయత్నించడానికి.. నిద్రాణమై ఉన్న మానవులలో వేరే కోణం నుండి తమను తాము అధిగమించాలనే కోరికను, సూపర్ మాన్ అవ్వాలన్న కోరికను రేకిత్తించడానికి. జరతూస్త్ర తన శిష్యుల నుండి వెనుతిరిగి ఏకాంతంలోకి వెళ్లాలని కోరుకుంటాడు.

ఇప్పటి వరకు ప్రజలకు మీరు సూపర్ మాన్ అవ్వగలరని, వారిని వారు అధిగమించగలరని, వారికి శక్తి సంకల్పం ఉందని చెప్పడానికి జరతూస్త్ర చేసిన ప్రయత్నం విజయవంతం కాలేదు. ఎందుకంటే వారు మరణాన్ని అధిగమించలేరనే భయం వారిలో ఉంది. మునుపటి రక్షకుల వలె జరతూస్త్ర ఉండాలని వారు కోరుకుంటున్నారు. జరతూస్త్ర మంచి ప్రయత్నమే చేసాడు. సరళమైన పదాలను, స్పష్టమైన భావనలనే ఉపయోగించాడు. కానీ ప్రజల మనస్సులు అరువు తెచ్చుకున్న జ్ఞానంతో, అరువు తెచ్చుకున్న నైతికతతో, నిబంధనలతో నిండి ఉన్నాయి. జరతూస్త్ర తన శిష్యులను విడిచి వెళ్లడం ఇష్టం లేకపోయినా అతను మరల ఏకాంతంలోకి వెళ్లాలనే ఆవశ్యకతను తన శిష్యులకి వివరిస్తాడు.)

జరతూస్త్ర పూర్తిగా నిశ్శబ్దంగా, ఏకాంతంగా ఉన్నప్పుడు తన ఆత్మవాణి విన్నాడు. తన శిష్యులకు అర్థమయ్యేలా అతని ఆత్మవాణి మాటలను ఒక కలగా, ఒక నీతికథ రూపంలో చెప్పడానికి సిద్ధం అయ్యాడు.

నా మిత్రులారా..! నాకేమయ్యింది? మీ నుండి వెళ్లడం ఇష్టం లేకపోయినా, అవిధేయతతో మీ నుండి దూరంగా వెళ్లాలని అనుకుంటున్నాను. జరతూస్త్ర మరల

తన ఏకాంతానికి వెళ్లాలని కోరుకుంటున్నాడు. కానీ ఈసారి వెళ్ళేది ఆనందంతో అయితే కాదు.

నాకేమయ్యింది? అలా వెళ్ళమని నన్నెవరు ఆదేశించారు?

కోపంతో ఉన్న నా ప్రేయసి నన్ను ఆదేశించింది. ఆమె నిన్న రాత్రి నాతో మాట్లాడింది. నేనింకా ఆమె పేరును మీకు చెప్పలేదు కదూ.. 'నిశ్చల ఘడియ'.

నిన్న తను (ఆత్మవాణి / నిశ్చలఘడియ) నాతో మాట్లాడింది. 'నిశ్చల ఘడియ'.. నా ప్రేయసి పేరు. మీరు నాపై ద్వేషం పెంచుకోకుండా ఉండేందుకు, అకస్మాత్తుగా బయలుదేరవలసిన ఆవశ్యకతను నేను మీకు వివరించాలి.

నిన్న రాత్రి నిశ్చల ఘడియల్లో కల ప్రారంభమైంది. ఒక్కసారిగా నా చుట్టూ అంత నిశ్చలత.. అంత నిశ్చలతను నేను ఎప్పుడూ వినలేదు. భయంతో నా గుండె వేగం పెరిగింది.

అప్పుడు స్వరం లేకుండా ఒక శక్తి ( ఆత్మవాణి) నాతో మాట్లాడింది.

"నీకు తెలుసా జరతూస్త్ర!"

నేను ఆ గుసగుసలు వినగానే భయంతో.. నా ముఖం పాలిపోయింది.. కానీ మౌనంగానే ఉండిపోయాను.

"నీకు తెలుసు జరతూస్త్ర.. కానీ నువ్వు మాట్లాడలేవు.." అని పలికింది ఆ శక్తి.

"అవును, నాకు తెలుసు, కానీ నేను చెప్పడానికి ఇష్టపడడం లేదు" అని అన్నాను.

ఆ శక్తి మరల "నీకు అక్కరలేదు.. జరతూస్త్ర.. ఇది నిజంగా నిజమేనా? నీ అలక్ష్యాన్ని దాచొద్దు... బయటపెట్టు" అని అన్నది.

నేను చిన్నపిల్లవానిలా ఏడుస్తూ, అరుస్తూ, వణుకుతూ "అయ్యో, నేను కోరుకుంటున్నాను, కానీ నేను అదెలా చేయగలను? అది నా శక్తికి మించినది" అని అన్నాను.

అప్పుడు అది మరల నాతో "జరతూస్త్ర..! నువ్వేం చెప్పాలనుకుంటున్నావో చెప్పు.. నీ మౌనాన్ని విడనాడు.." అన్నది.

“అయ్యో, ఇది నా మాటేనా? నేనెవరు? నేను విలువైన దానికోసం ఎదురు చూస్తున్నాను. నేను నా మౌనాన్ని విడనాడడానికి కూడా అర్హుడిని కాదు” అని సమాధానం ఇచ్చాను.

ఆ శక్తి మరల “నీకేం అయ్యింది జరతూస్త్ర! నువ్వింకా నాపట్ల వినయంగా లేవు. వినయం కష్టతరమైనవాటిని దాస్తుంది” అని అన్నది.

“నేను చాలా ఎత్తులను చేరుకున్నాను.. కానీ నా ప్రయాణంలో నేను ఎక్కడివరకు వచ్చాననే విషయం నాకెవరూ చెప్పలేదు.. కానీ నా బలహీనతలు నాకు బాగా తెలుసు” అని నేను సమాధానం ఇచ్చాను.

అది మరల “ఓ జరతూస్త్ర! పర్వతాలను అధిరోహించగల శక్తి ఉన్నవాడు లోయలను కూడా ధైర్యంగా దాటగలడు” అన్నది.

“ఇప్పటివరకు నా మాటలు పర్వతాలను కదిలించలేదు, నేను చెప్పినది మనుష్యులను చేరలేదు. నిజమే, నేను మనుష్యుల దగ్గరకు వెళ్లగలిగాను. కానీ వాళ్లని సూపర్ మాన్‌లాగా మార్చలేకపోయాను. నా సొంతమార్గంలో వెళ్ళినప్పుడు వారు నన్ను ఎగతాళి చేసారు. నిజానికి నా అడుగులు వణుకుతున్నాయి” అని అన్నాను నేను.

“నువ్వు మార్గం మాత్రమే కాదు.. ఎలా నడవాలనే విషయం కూడా మర్చిపోయావు జరతూస్త్ర! వారి ఎగతాళికి కారణం ఏంటో తెలుసా? నిన్ను నువ్వెలా అధిగమించాలో మరచిపోయిన వ్యక్తివి నువ్వు.. ఇప్పుడు నువ్వు ప్రజల్ని ఆజ్ఞాపించాలి అంతేనా? ఎందుకంటే వారికి ఆజ్ఞాపించేవాడు కావాలి. గొప్ప పనులు చేయడం కష్టం. కానీ గొప్ప విషయాలను ఆజ్ఞాపించడం చాలా కష్టం. నీలో ఇది చాలా క్షమించరానిది. నీకు శక్తి ఉంది. ఎవరో నిన్ను ఆజ్ఞాపించడానికే నువ్వే ఇష్టపడవు. అలాంటిది నువ్వు వేరేవాళ్ళని ఎందుకు ఆజ్ఞాపించాలని కోరుకుంటున్నావ్?” అని పలికింది ఆ శక్తి.

“ప్రస్తుతం ఆజ్ఞాపించటానికి నాకు గంభీరమైన స్వరం లేదు” అన్నాను నేను.

అప్పుడు అది మరల నాతో “ఓ జరతూస్త్ర! నువ్వు ఆజ్ఞాపించి ఆజ్ఞాపించి బాగా అలిసిపోయినట్టు ఉన్నావ్..” అని చెవిలో గుసగుసలాడింది.

ఆ మాటలకి నేను సిగ్గుతో తల దించుకున్నాను.

ఆ శక్తి మరల నాతో మాట్లాడింది. "నువ్వు సిగ్గు పడకుండా మరల చిన్నపిల్లవాడిగా రూపాంతరం చెందాలి.. యవ్వనం యొక్క అహంకారం నీపై ఇంకా ఉంది. నువ్వు ఆలస్యంగా యువకుడివి అయ్యావు. కానీ మరల నువ్వు చిన్నపిల్లవానిగా రూపాంతరం చెందాలంటే యవ్వనాన్ని కూడా అధిగమించాలి."

తన మాటలకి నేను బిత్తరచూపులు చూస్తూ వణికిపోయాను..

కానీ చివరికి నేను మొదట చెప్పినదాన్నే చెప్పాను "నేను వెళ్లాలని కోరుకోవడం లేదు."

అప్పుడు ఒక నవ్వు నన్ను చుట్టుముట్టింది. ఆ నవ్వు నా లోపాలను నాకు ఎత్తి చూపించింది.. నా కళ్ళు తెరిపించింది..

చివరిసారిగా అది మరల "ఓ జరతూస్త్ర! నువ్వు ఇప్పుడు చాలా బలహీనుడి వయ్యావు. నువ్వు మరల నీ ఏకాంతానికి తిరిగి రావాలి.." అని బిగ్గరగా నవ్వి పారిపోయింది.

అప్పుడు ఆ నవ్వు ద్వంద్వసంకల్పంతో నన్ను చుట్టుముట్టింది. కానీ నేను నేలమీద పడుకున్నాను. నా శరీరమంతా చెమటతో తడిసిపోయింది. ఇప్పుడు నేను ఎందుకు నా ఏకాంతానికి తిరిగి వెళ్ళాలనేది మీరంతా విన్నారు.

నా మిత్రులారా..! నేను మీ దగ్గర ఏమీ దాచలేదు. నేను చెప్పాలనుకున్న దంతా చెప్పేసాను.

అయ్యో.. నా మిత్రులారా.. నేను ఇంకా మీకు ఏదైనా చెప్పగలను.. ఏదైనా ఇవ్వగలను. కానీ నేను ఎందుకు ఇవ్వలేకపోతున్నాను..? నేనెందుకు కంగారు పడుతున్నాను?

జరతూస్త్ర ఈ మాటలు మాట్లాడినప్పుడు అతను తన శిష్యులను విడిచి వెళ్తున్నాననే బాధను అధిగమిస్తున్నాడు.. జరతూస్త్ర బిగ్గరగా ఏడుస్తూ కన్నీళ్లు పెట్టుకున్నాడు. జరతూస్త్రని ఎలా ఓదార్చాలో అక్కడున్న వారెవరికీ తెలియదు. ఆ రాత్రే జరతూస్త్ర తన స్నేహితులను విడిచిపెట్టి దూరంగా వెళ్ళిపోయాడు.

**నోట్:** 'భవిష్యవాణి' యొక్క శూన్యవాదానికి సంబంధించిన మాటలను నిరాశావాది అయిన ఆర్థర్ షోపెన్ హూవర్ యొక్క తత్వసారాంశంగా భావించవచ్చు.

శూన్యవాదం / నిహిలిజం ప్రకారం విలువలన్నీ నిరాధారమైనవి. ఇది తరచూ తీవ్ర నిరాశావాదంతో మరియు ఉనికిని ఖండించే ఆది సంశయవాదంతో ముడిపడి ఉంటుంది. నిజమైన నిహిలిస్ట్ దేన్నీ నమ్మడు. అతనికి దేనిపట్ల విధేయత ఉండదు. నాశనం చేసే ప్రేరణ తప్ప ఉనికికి వేరే ఉద్దేశం లేదు అన్నట్టు ఉంటాడు.

అప్పటివరకు మానవాళికి శక్తి సంకల్పం ఉందని, వారు తమని తాము అధిగమించగలరని, సూపర్ మాన్ ఉద్భవించగలడని నమ్మకంతో ఉన్న జరతూస్త్రని భవిష్యవాణి మాటలు కలవరపెడతాయి. తనకొచ్చిన కలకి తన శిష్యుడు చెప్పిన భాష్యం బట్టి ఇప్పటివరకు అతను వారిని వారు అధిగమించడానికి చేసిన బోధనలన్నీ మరణాన్ని అధిగమించేలా లేవని, అందుకే జరతూస్త్రని అతని శిష్యులు ఒక రక్షకుడిగానే భావిస్తున్నారని, మరణాన్ని అధిగమించలేక వారిలో శక్తి సంకల్పం, వారిని వారు అధిగమించాలన్న ఆశలు బలహీనమవబోతున్నాయని, అతని శిష్యులు తనపట్ల నిబద్ధతగా లేరని, భవిష్యవాణి మాటలే నిజమని తెలుసుకొని బాధపడతాడు.

అలాగే 'విముక్తి' అనే అధ్యాయం శక్తి సంకల్పం యొక్క ఇతివృత్తాన్ని పునఃసమీక్షిస్తుంది. భవిష్యత్తును నిర్దేశించడానికి వర్తమానానికి తగినట్టు నడుచుకోవచ్చు. కానీ వర్తమానం, భవిష్యత్తు మీద గతకాలపు చేదు జ్ఞాపకాల అనుభవాల ప్రభావం ఉంటుంది. అది భవిష్యత్తుని బాధిస్తుంది. గతం మనవుడ్ని ఇంకా శక్తిహీనుడ్ని కూడా చేయగలదు. మనిషికి ఎంత శక్తి సంకల్పం ఉన్నా గతంవల్ల ప్రభావితం అవ్వకుండా ఉండలేడు. అలా అని అతను భవిష్యత్తు కార్యసిద్ధికై గతాన్ని మార్చలేడు. ఈ అడ్డంకిని అధిగమించలేకపోతున్నందుకు సంకల్పం బాధపడుతుంది. ఈ బాధను అధిగమించడానికి ఉన్న రెండే రెండు మార్గాలు.. ఒకటి సంకల్పించాలన్న కోరికని విరమించుకోవడం. అప్పుడు ఆత్మహత్యకు సమానమైన ఆధ్యాత్మికతలో మానవుడు తనని తాను బందీ

చేసుకుంటాడు. ఈ విశ్లేషణలో నీషే ప్రధానంగా బౌద్ధమతం గురించి విశ్లేషిస్తాడు. బౌద్ధధ్యానం ఆత్మను, మనలో ఉన్న శక్తి సంకల్పాన్ని నీరుగార్చే ప్రయత్నం ఇది. ఇది మనిషి తనని అధిగమించడాన్ని నిరాకరిస్తుంది. కోరికలు పాపమని, కోరికలను త్యజించాలని చెప్తుంది. జీవితాన్ని జీవించలేక పారిపోయినవారికి ఆధ్యాత్మికత పేరుతో ప్రజలకి బౌద్ధమతం ఓదార్పుని ఇస్తుంది అంటాడు నీషే. బౌద్ధమతం గురించి నీషే యొక్క అభిప్రాయాలు ఆర్థర్ షోపెన్ హూవర్ ద్వారా ప్రభావితమైనవి.

రెండవ మార్గం.. సంకల్పం గతానికి కూడా బాధ్యత వహించాలి, అంతేగాని దానిని అడ్డంకిగా చూడకూడదు. దీనిని అంగీకరించిన వ్యక్తి “నేను ఇకపై గతాన్ని ప్రభావితం చేయలేకపోవచ్చు, కానీ నా గతం నేను సృష్టించిన గతమే. అది తన నా శక్తి సంకల్పానికి శాశ్వత నిదర్శనం” అని  భావిస్తాడు. దీనిలో భాగంగానే ఈ సమస్య పరిష్కరానికి బదులుగా, జరతూస్త్ర మూడవ భాగం చివరిలో ‘అనంతమైన పునరావృత సిద్ధాంతం’ను కనుగొంటాడు. మూడవ భాగమంతా అంతర్లీనంగా జరతూస్త్ర ‘అనంతమైన పునరావృత సిద్ధాంతాన్ని’ కనుగొనడం చుట్టూ తిరుగుతుంది.

# మూడవ భాగం

# అన్వేషకుడు

అర్ధరాత్రి ద్వీపం యొక్క తీరానున్న ఓడరేవుకి చేరుకున్నాడు జరతూస్త్ర. తరచూ సముద్రం దాటాలనుకునే వారికోసం అక్కడ ఎప్పుడూ ఓడలు సిద్ధంగా ఉంటాయి. జరతూస్త్ర అక్కడి నుండి ఏకాంతంగా తాను నివసించే ప్రాంతానికి బయలుదేరాలనుకున్నాడు. ఇంకా బయలుదేరడానికి సమయం ఉన్నట్లు తన అంతరాత్మతో మాట్లాడ్డం మొదలుపెట్టాడు.

నేను ఇతరులతో మాట్లాడాల్సిన అవసరం వచ్చినప్పుడు చాలా విషయాల్లో రాజీపడాల్సి వచ్చింది. కానీ ఇప్పుడు నాతో నేను మాట్లాడుకుంటున్నాను. ఇటువంటి సమయంలో నాతో నాకు ఎలాంటి రాజీలు కానీ, ఎలాంటి నియమ నిబంధనలకు కానీ, ఎలాంటి అపార్థాలకు కానీ తావుండదు. నాపట్ల నేను పూర్తి నిజాయితీగా ఉంటాను.

నేను అన్వేషకుణ్ని.. పర్వతారోహకుడని.. నేను స్తబ్ధతగా ఉండేవారిని ఇష్టపడను. వారిలాగా నేను ఎక్కువసేపు కూర్చొని ఉండలేను. పుట్టుకతో ప్రతి ఒక్కరు అన్వేషకులే, పర్వతారోహకులే. కానీ ఇప్పటివరకు మానవుడు దానికోసం ఎటువంటి ధైర్యం చేయలేదు. అందుకే అతని జీవితం దయనీయంగా ఉంది. అలా ఉండడం వలన తన జీవితంలో చాలా సౌకర్యవంతంగా, తక్కువ ప్రమాద కరంగా, ఎలాంటి సవాళ్లు లేకుండా సురక్షితంగా ఉండగలనని మానవుడు భావించాడు. కానీ ఆత్మ యొక్క ఆంతరంగిక కోరిక ప్రకారం ధైర్యం ఆకాశంలోని ఎత్తులను ఆస్వాదించాలని, ఇంతకు ముందెన్నడూ అన్వేషించని ప్రదేశాలని, పర్వతాలను అధిరోహించాలని కోరుకుంటుంది. ఆ ధైర్యం మానవునితోపాటే జన్మిస్తుంది. కానీ శతాబ్దాలుగా మానవుడు ఆ ధైర్యాన్నీ అణిచివేస్తూ వస్తున్నాడు. అలాంటివారిని నేను ఇష్టపడను.

లక్ష్యం అనేది అన్వేషకునికి ఒక వంక మాత్రమే. ఎందుకంటే ఒక లక్ష్యాన్ని చేరుకున్నప్పుడల్లా, వెంటనే అతను ఇంకో లక్ష్యం దిశగా కొత్త ప్రయాణనికి సిద్ధమవుతాడు. ఆ లక్ష్యం దాని ప్రయోజనాన్ని అది నెరవేర్చింది. అన్ని లక్ష్యాలు మానవుణ్ని అన్వేషకుడిగా ముందుకు నడిపించడానికి మాత్రమే సహాయపడతాయి.

అన్వేషించడం ఆపివేసిన మరుక్షణం శ్వాస తీసుకుంటున్నప్పటికీ మానసికంగా అతను మరణించినట్టే. అన్వేషకునికి నిజమైన ఆనందం లక్ష్యం యొక్క గమ్యాన్ని చేరడంలో ఉండదు. అతని నిజమైన ఆనందం దానిని ఛేదించడానికి చేసే కఠినమైన, ప్రమాదకరమైన ప్రయత్నంలోనే ఉంటుంది. ఒక్కసారి ఆ లక్ష్యాన్ని ఛేదించాకా అతను ఇంకో లక్ష్యాన్ని కొత్త సాకుగా కనుగొంటాడు. నేను లక్ష్య సాధకుడను కాను. నేను అన్వేషకుడను, పర్వతారోహకుడను. అన్వేషించడమే నా లక్ష్యం. మానవాళికి ఎటువంటి లక్ష్యాలు అవసరం లేదు. అసాధ్యమైన వాటిని ఛేదించడంలో మాత్రమే మానవుడు తనను తానూ కనుగొనగలడు. సాధించడానికి వీలుపడే చిన్న చిన్న విషయాలు సామాన్యులకోసం.. అసాధ్యమైనవి నిజమైన వీరుల కోసం. సూపర్ మాన్ కావాలని ఆశించేవారికోసం. అది ఇప్పటివరకు కనుగొనబడలేదని, కనుగొనాలని, అది చాలా ముఖ్యమని అతను తెలుసుకుంటాడు. అది మాత్రమే అతనికి ఆనందాన్ని ఇస్తుంది. 'అసాధ్యం' మానవచైతన్యాన్ని ఉన్నతశిఖరాలకు తీసుకువెళ్తుంది. మీరేం కనుగొనలేకపోవచ్చు కానీ తప్పక సూపర్ మాన్ అవుతారు.

నాకు ఇప్పుడు అకస్మాత్తుగా సంభవించేవి ఏమీ లేవు ఎందుకంటే నేను ప్రతిదీ అంగీకరిస్తున్నాను.

నేను తిరిగి ఇంటికి వస్తున్నందుకు లోలోతుల్లో చాలా ఆనందంగా ఉన్నాను. నేను తిరిగి ఇంటికి వస్తున్నది విశ్రాంతి కోసం కాదు. అన్వేషించడమే నా ఇల్లు. పర్వతాలని అధిరోహించడం నా ఆనందం. ఇప్పుడు నా ముందున్నది ఒకే ఒక్కటి: నన్ను నేను అధిగమించడం. ఇప్పటివరకు నేను నా శిష్యులతో ఉన్నాను. ఇకపై నేను నా ఏకాంతంలో, నా సొంత సుదీర్ఘ అన్వేషణలో ఉంటాను. నా అన్వేషణకి అంతం లేదు. ఉన్నదల్లా ఆరంభం మాత్రమే. నా లక్షణాలు ఉన్న మనిషి నా ఏకాంతమైన ఈ సుదీర్ఘ అన్వేషణ అంతం కాదని, నేను గొప్ప మార్గంలో నడుస్తున్నానని తెలుసుకుంటాడు.

అన్వేషించడంలో ఎత్తులు పల్లాలు, ఎక్కువ తక్కువలేవీ ఉండవు. ఎత్తైన శిఖరాలకు చేరుకున్నా నేను అన్వేషిస్తూనే ఉంటా.. ఒకవేళ అగాధంలో చిక్కుకున్నా అన్వేషిస్తూనే ఉంటాను. ఈ అనంత అన్వేషణలో లక్ష్యం అంటూ ఏదీ ఉండదు. శిఖరం, అగాధం రెండూ ఒక్కటవుతాయి. దీనిలో ఉన్న ప్రమాదం ఏంటంటే

ఏకాంతంగా ప్రయాణించడం. అది ముగుస్తుందో లేదో ఎవరికీ, ఎప్పటికీ తెలియదు. ప్రజలు ఏకాంతం నుండి తమను తాము తప్పించుకోవడానికి ప్రయత్నిస్తూనే ఉంటారు. అందుకే వారు ఎప్పుడూ మందలోనే ఉంటారు. ఏకాంత అన్వేషణలో మీకెవ్వరూ తారసపడరు. సలహా అడగడానికి అక్కడెవరూ ఉండరు. ఏకాంతంలో వెయ్యి సందేహాలు తలెత్తుతాయి. ఆ సందేహాలకు సమాధానాలివ్వ డానికి అక్కడెవరూ ఉండరు. అందుకే ప్రజలు జనసమూహంలో నివసించడానికి ఎక్కువ ఇష్టపడతారు. అక్కడ వారి సందేహాలకి సలహాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్న వ్యక్తులు ఎల్లప్పుడూ ఉంటారు. అలా సలహాలు ఇవ్వడం వాళ్ళకి ఆనందాన్ని కూడా ఇస్తుంది.

అసాధ్యమైన సవాళ్ళను అంగీకరించకపోతే మానవాళికి వారి గొప్పతనం ఏంటో ఎన్నటికీ తెలియదు. 'అసాధ్యం' మాత్రమే మానవుడ్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుంది. సూపర్ మాన్‌ని చేస్తుంది. ఎవర్ని వారు అధిగమించి ముందుకు వెళ్ళాలి. పాత ఆలోచనల్ని, కల్పిత కథల్ని, ఊహల్ని ఇప్పటివరకు మీ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన సిద్ధాంతాల్ని, పాము తన కుబుసాన్ని విడిచిన విధంగా గతాన్ని విడిచి వెనక్కి తిరిగి చూడకుండా ముందుకు సాగాలి. తనను తాను అధిగమించి ముందుకి వెళ్తే తప్ప అసాధ్యాన్ని, శోధించడంలో ఉన్న స్వచ్ఛమైన ఆనందాన్ని ఆస్వాదించలేడు మానవుడు.

మీరెక్కడున్నా, మిమ్మల్ని మీరు మోసం చేయడానికి ప్రయత్నిస్తున్నా, మీరు అగాధపు అంచున నిలబడి ఉన్నారనే విషయం మరవద్దు.. మీ ఓదార్పులన్నీ అబద్ధం. మీ రక్షణలన్నీ కల్పితమైనవి. మీ జీవితంలోని ప్రతి క్షణం మీరు అగాధం వద్ద నిలబడి ఉన్నారు. మీరు ఎంత ఎక్కువగా ఆ అగాధాలవైపు తొంగిచూస్తారో, మీ చుట్టూ ఉన్న అగాధాలు మీ లోతుల్లోకి అంత ఎక్కువగా తొంగిచూస్తాయి. అంధుడు ఆ అగాధం పక్కన సంతోషంగా నిలబడగలడు. నిజానికి అంధుడు మాత్రమే ఎటువంటి భయం లేకుండా నిలబడగలడు. మీరు మీ శిఖరాలను అధిరోహించాలనుకుంటే అగాధాలను కూడా చూడవలసి ఉంటుంది. మీకు ఎటువంటి లక్ష్యం లేకపోతే, మీరు ఎక్కడికీ చేరుకోవాలనుకోకపోతే, అన్వేషించడమే మీ మతం అయితే ఆనందానికి, బాధకి, అగాధాలకి, శిఖరాలకి ఎటువంటి తేడా ఉండదు. ఆ రెండూ ఒక్కటవుతాయి.

మనిషికి చాలా ధైర్యం ఉంది. అతనిలో ఉన్న ఆ ధైర్యాన్ని మేల్కొల్పాలి. లేదంటే వేగంగా నిద్రపోతుంది. ఒక్కసారి అతని ధైర్యం మేల్కొన్నాక, ఆ ధైర్యం సింహంలా గర్జించిన మరుక్షణం మొదటిసారి అతని జీవితంలో గొప్ప ఆనందాన్ని, జీవిత నృత్యాన్నీ అనుభూతి చెందుతాడు. ఒకవేళ మరణ సమయంలో 'మరణం' అతన్ని "నువ్వు జీవించిన అదే జీవితాన్ని మరోసారి జీవించాలనుకుంటున్నావా?" అని ప్రశ్నిస్తే అతని సమాధానం ఏం అయ్యి ఉండొచ్చు?

ఆ విషాదజీవితాన్ని మరల జీవించడానికి ఏ వ్యక్తీ సిద్ధంగా ఉంటాడని నేను అనుకోను. కానీ జీవితాన్ని దుఃఖంగా కాకుండా, కొత్త అనుభవాల కోసం అన్వేషిస్తూ పూర్తి తీవ్రతతో తనని తాను ఎప్పటికప్పుడు అధిగమించుకుంటూ ముందుకు వెళ్ళేవాడే మరల అలాంటి జీవితాన్ని, అదే జీవితాన్నీ తిరిగి కోరుకుంటాడు. అలాంటి వ్యక్తి అతనిలోని చెత్తను, పాతవాటిని ఎప్పటికప్పుడు నాశనం చేస్తూ, ఉత్తమమైన వాటిని బయటకు తీసుకురావడం, కొత్త ప్రదేశాలను కనుగొనడం, ఎక్కడానికి కొత్త పర్వతాలను కనుగొనడం ద్వారా ఎప్పటికప్పుడు తనను తాను పునఃసృష్టించుకుంటాడు. అతను తనను తాను మాత్రమే విశ్వసించ గలడు. ధైర్యంగా, ప్రమాదకరంగా జీవించడం మాత్రమే అతని మతం అవుతుంది. అదే తన మార్గం అని తెలుసుకుంటాడు. మానవాళి అంతా అసాధ్యమైన అన్వేషకులుగా, పర్వతారోహకులుగా ఉండాలి. ఎప్పుడూ ఎవ్వరూ ప్రయాణించని మార్గాల్లో అన్వేషిస్తూ ఉండాలి. మనిషిగా ఉండటానికి చాలా ధైర్యం కావాలి. ఎందుకంటే మనిషిగా ఉండడం అంటే నిరంతరం తనని తాను అధిగమించే ప్రక్రియలో ఉండడమే.

ప్రతిరోజూ, ప్రతి క్షణం నిన్ను నువ్వు అధిగమించడం. సూర్యాస్తమయం మిమ్మల్ని వదిలిపెట్టిన చోట, సూర్యోదయం మిమ్మల్ని కనుగొనకూడదు... సూర్యోదయం మిమ్మల్ని ఎక్కడ వదిలివేస్తుందో, సూర్యాస్తమయం మిమ్మల్ని అక్కడ కనుగొనకూడదు. ఆత్మ యొక్క నిరంతరసంచారిగా ఉండండి. చైతన్యం యొక్క లోతైన లోతులలో సంచరిస్తూ ఉండండి. జరతూస్త్ర వంటి చాలా కొద్దిమంది మాత్రమే మానవాళికి పరిచయం చేసిన ఏకైక నిజమైన మతం ఇది. కానీ అవి పూర్తిగా విస్మరించబడ్డాయి, తప్పుగా అర్థం చేసుకోబడ్డాయి.

❖ ❖ ❖

# పొడుపు కథ

సుదూర ప్రాంతాల నుండి వచ్చి ఇంకా సుదూర గమ్యస్థానాలకు ప్రయాణించే ఓడను ఎక్కాడు జరతూస్త్ర. ఆ ఓడలో ఉన్న తోటి నావికులు జరతూస్త్రని చూసి ఆనందపడ్డారు. వారు జరతూస్త్రని అనేక ప్రశ్నలు అడిగినప్పటికీ జరతూస్త్ర మౌనంగా ఉండిపోయాడు. తన ప్రయాణంలో మొదటి రెండు రోజులు జరతూస్త్ర ఓడలో ఎవ్వరితోను మాట్లాడలేదు. ఎందుకంటే ఇప్పుడతను తన శిష్యులను వదిలి వచ్చాననే బాధను అధిగమించే పనిలో నిమగ్నమయ్యాడు. రెండవ రోజు సాయంత్రం "తమ సుదూర గమ్యాలలో, తమ జీవితాలలో ఎటువంటి ప్రమాదం సంభవించకూడదు" అని మాట్లాడుకుంటున్న నావికుల మాటలను విని జరతూస్త్ర ఆందోళన చెందాడు. అప్పుడు జరతూస్త్ర వారిని ఉద్దేశించి ఇలా మాట్లాడటం మొదలుపెట్టాడు.

మీరు భయంకరమైన సముద్రం గుండా ప్రయాణం చేస్తున్న ధైర్యమైన అన్వేషకులు. ఎప్పటికప్పుడు సముద్రంలో సంభవించే ఎన్నో చిక్కులను ధైర్యంగా ఎదుర్కోగల సమర్థులు మీరు. అటువంటి మీరు ప్రయాణం సులువుగా సాగాలనుకోవడం విచిత్రం. మీరు పిరికి చేతితో లంగరు పట్టుకోవడానికి ఇష్టపడకూడదు. మీరు విప్పగల ఒక పొడుపుకథ చెప్తాను వినండి.

కొంతకాలం క్రిందట సంధ్యా సమయాన ఆకాశాన మబ్బులు దట్టంగా కమ్ముకున్నాయి. కానీ సూర్యుడు అస్తమించలేదు. నేను ఒంటరిగా, ప్రమాదకరమైన రాళ్లమార్గంగుండా పర్వతాన్ని అధిరోహిస్తున్నాను. కాళ్ళ కింది గులకరాళ్ళను ఎగతాళి చేస్తూ, రాతిని చూర్ణం చేస్తూ, నా పాదాలు ముందుకు కదిలాయి.

అప్పుడు ఆత్మ యొక్క గురుత్వాకర్షణ శక్తి అయిన మరుగుజ్జు దెయ్యం నా మీద కూర్చొని చెవిలో సీసంలాంటి తన మాటలతో నన్ను బలహీనపరచడమే తన లక్ష్యం అన్నట్టు నాతో మాట్లాడ్డం మొదలుపెట్టింది.

"ఓ జరతూస్త్ర.. నిన్ను నువ్వు రాళ్ళని సైతం బంగారంలా మార్చేవానిగా భావిస్తున్నావు. కానీ పైకి విసిరేసిన ప్రతి రాయి కింద పడక తప్పదనే విషయం మరవకు. నువ్వు ఎంతో ఎత్తుకు ఎదిగానని అనుకుంటున్నావు. కానీ ఏదో ఒక రోజు కింద పడక తప్పదు. నా ప్రభావం అనితరమైనది."

ఈ మాటలు మాట్లాడి ఆ మరుగుజ్జు నిశ్శబ్దంగా ఉండిపోయింది. ఆ సమయంలో ఆ నిశ్శబ్దం నన్ను ఇంకా పీడించింది. ఒంటరిగా ఉండటం కంటే ద్విగుణత్వం ఖచ్చితంగా ఎక్కువ బాధిస్తుంది. నేను అధిరోహించాను. కలలు కన్నాను. కానీ ప్రతిదీ నన్ను బాధించింది. నేను దాని హింస ద్వారా నీరసించాను. పిరికితనంతో దానినుండి తప్పించుకోవడానికి ప్రయ్నతించినప్పుడు అది నన్ను ఇంకా పట్టి పీడిస్తుందని నాకు తెలుసు.

నాలో ధైర్యం అని పిలిచే శక్తి ఏదో ఇప్పటివరకు నాకెదురైన ప్రతి నిరుత్సాహాన్ని చంపేసింది.

చివరకు ఆ ధైర్యమే నాతో మాట్లాడించింది.

"ఓ మరుగుజ్జు దెయ్యమా..! ఇది నిజంగా నువ్వేనా..? లేక నేనా?" అని గట్టిగా అరిచాను.

ధైర్యం ఎటువంటి పిరికితనాన్నైనా సులభంగా చంపగలదు. దేన్నైనా ఎదుర్కోగలదు. అది ఉత్తమ హంతకుడు. మనిషి అత్యంత సాహసోపేతమైన జంతువు. అందుకే అతను ప్రతి జంతువును అధిగమించాడు. మొండితనంతో ఆడుతూ పాడుతూ ప్రతి బాధను అధిగమించాడు. ధైర్యం అగాధాల అంచునున్న మానవుని మైకాన్ని, పిరికితనాన్ని కూడా చంపుతుంది. ధైర్యం జాలిని కూడా చంపుతుంది. కానీ జాలి అనేది లోతైన అగాధం. మనిషి జీవితంలోకి ఎంత లోతుగా తొంగిచూస్తాడో.. అంతే బాధల్లోకి కూడా తొంగిచూస్తాడు. ధైర్యం మరణ భయాన్ని కూడా చంపుతుంది. ఆ ధైర్యానికి దేన్నైనా ఎదుర్కునే మొండితనం ఉంది.

❖ ❖ ❖

ఓ మరుగుజ్జు దెయ్యమా ఆగు.. ఇది నువ్వా లేక నేనా? ఏదేమైనా ఒకటి గుర్తుంచుకో మనిద్దరిలో నేనే బలవంతుడను అన్నాను..

ఒక్కసారిగా మరుగుజ్జు దెయ్యం నా భుజం నుండి దూకి దేన్నో ఆసక్తిగా చూస్తూ ఒక బండరాయి మీద కూర్చుంది. నా భుజం మీద భారం తగ్గినట్టు అనుభూతికి లోనయేలోపే నేను కూడా అది దేనివైపు ఆసక్తిగా చూస్తుందో తెలుసుకోవడానికి అటువైపుగా చూసాను. మేము ఇద్దరం ఆగిపోయిన చోట ఒక సింహద్వారాన్ని చూసాం. ఇద్దరం కొన్ని క్షణాలపాటు ఆశ్చర్యానికి గురయ్యాము. వెంటనే తేరుకొని నేను మాట్లాడ్డం మొదలుపెట్టాను.

“ఓ మరుగుజ్జు దెయ్యమా..! అటు చూడు.. ఆ ద్వారానికి రెండు విరుద్ధ మార్గాలున్నాయి. ఆ రెండు మార్గాలు ఇక్కడే కలుస్తాయి.. కానీ ఇప్పటివరకు ఎవరూ ఆ మార్గాల్ని చివరివరకు అనుసరించలేదు. ఈ పొడవైన ఒక మార్గం శాశ్వతత్వం దిశగా విస్తరించి ఉంది. కానీ అవి ఒకదానికొకటి విరుద్ధంగా ఉన్నాయి గమనించావా..? ఆ ద్వారం మీద ‘క్షణం’ అని చెక్కబడి ఉండడం గమనించావా?” అని అడిగాను.

“అంతా అబద్ధం..” అంటూ మరుగుజ్జు దెయ్యం గొణిగింది.

“ఓ ఆత్మ యొక్క గురుత్వాకర్షణ శక్తి! నీ కోసం ప్రతిదాన్ని వక్రీకరించాలని చూడకు...” అని అరిచాను దాన్ని.

నేను మాట్లాడడం కొనసాగించాను,

ఈ ‘క్షణం’ యొక్క ఒక ద్వారం నుండి శాశ్వతమైన మార్గానికి వెనుకకు దారితీస్తుంది. మన వెనుక ఒక శాశ్వతత్వం ఉంది. ఇంతకు ముందు ఈ మార్గం గుండా మనం నడిచామా? ఇది ఇదివరకు జరిగిందా? ఇప్పుడు ఇక్కడ జరుగుతున్నది ఇదివరకే గతంలో జరిగి ఉంటే... ఓ మరుగుజ్జు దెయ్యమా.. ఇప్పుడు ఈ క్షణం గురించి నువ్వేం అనుకుంటున్నావు? ఈ ద్వారం కూడా ఇంతకు ముందు లేకపోతే అన్ని విషయాలు కలిసి గట్టిగా ముడిపడి ఉండవు. అప్పుడు రాబోయే దాని తరువాత క్షణం డ్రా / సమం అవుతుంది. ఈ సాలెపురుగు, మరియు ఈ చంద్రకాంతి, నేను, నువ్వు ఈ ద్వారం కలిసి శాశ్వతమైన విషయాల గురించి గుసగుసలాడుకుంటున్నాము.

ఆ విధంగా నేను మరింత మృదువుగా మాట్లాడాను. నేను నా సొంత ఆలోచనలకు, నా ఆలోచనల వెనుక ఉన్న ఆలోచనలకు భయపడ్డాను. అప్పుడు అకస్మాత్తుగా దగ్గరలో ఒక కుక్క మొరగడం విన్నాను. కుక్క ఎప్పుడైనా ఇలా మొరుగుతుందా అని నాలో నేను అనుకున్నాను. నా ఆలోచనలు నిదానంగా వెనక్కి తగ్గాయి. కుక్కలు కూడా దెయ్యాలను నమ్ముతాయని తెలిసి కొంచెం జాలిపడ్డాను. అది నిండుపౌర్ణమి. మరణం వలె నిశ్శబ్దం మా మీదుగా వెళ్ళింది. కుక్క మరల భయభ్రాంతులకు గురైంది. ఎందుకంటే కుక్కలు దెయ్యాలను నమ్ముతాయి. మరలా అలాంటి అరుపులు విన్నప్పుడు నేను మళ్ళీ జాలిపడ్డాను.

మరుగుజ్జు, ద్వారం, సాలెపురుగు.. వీటి గుసగుసలు అన్నీ ఒక్కసారిగా

మాయం అయ్యాయి. నేను కలగంటున్నానా లేక మేల్కొంటున్నానా? అని ఆలోచించసాగాను. దట్టమైన అడవిలో శిఖరాల మధ్య నేను అకస్మాత్తుగా ఒంటరిగా, చంద్రుని వెలుగులో నిలబడ్డాను. కొంతదూరంలో అక్కడ ఒక మనిషి ఉండడం గమనించాను. అక్కడ ఒక కుక్క అరుస్తూ అతని మీదకి దూకడం చూసాను. నేను అతన్ని చూడడం అతను చూశాడు. సహాయం కోసం అతను ఏడుస్తూ కేకలు వేస్తున్నాడు. సహాయం కోసం అటువంటి ఏడుపు ఇదివరకు ఎప్పుడో విన్నట్టు అనిపించింది నాకు. అతనొక గొర్రెలకాపరి. నోటినుండి సైతం గాలి పీల్చుకోలేని విధంగా మెలికలు తిరుగుతూ గగ్గోలు పెడుతున్నాడు. అతని నోటి నుండి ఒక భయంకరమైన నల్లటి పాము వేలాడుతోంది. అతని మొహం చూడ్డానికి చాలా వికారంగా ఉంది. నాకు భయం వేసింది. పాము అతని గొంతును చుట్టుకొని నిదానంగా అతని నోట్లోకి పాకుతున్నప్పుడు అతను స్పృహ కోల్పోతున్నట్లు అనిపించింది నాకు. నేను దాన్నుండి అతన్ని విడిపించడానికి ప్రయత్నించాను. కానీ నా వల్ల కాలేదు. అప్పుడు నేను అతను బ్రతకాలన్న ఆశతో దాని తలని గట్టిగా కొరుకు.. కొరుకు.. కేకలు పెట్టాను.

నా చుట్టూ ఉన్న శోధకులారా..! పరిశోధకులారా..! మోసపూరితమైన మార్గాలగుండా, ఎన్నో ఇబ్బందులగుండా మీ ప్రయాణాన్ని కొనసాగిస్తున్న ఓ ధైర్యవంతులారా..! ఈ చిక్కుప్రశ్నకి సమాధానం ఇవ్వండి. అప్పుడు నేను చూసిన ఈ చిక్కును ఊహించండి. ఇది మీకొక దృష్టిని ఇస్తుంది. ఆ నీతికథలో నేనేం చేసానో తెలుసా?

ఆ గొర్రెల కాపరిని ఆ పాము తలని గట్టిగా కొరకమని అరిచాను. అతను తన ధైర్యాన్ని అంతా కూడగట్టుకొని ఒక్కసారిగా దాని తలని గట్టిగా కొరికి దూరంగా ఉమ్మాడు. అప్పుడు అతను నాకు గొర్రెలకాపరిలా కనిపించలేదు. అతను ప్రకాశిస్తున్నాడు. ధైర్యంగా ఏదో సాధించాననే నవ్వు అతని ముఖంలో నేను చూసాను. ఇప్పటివరకు అటువంటి నవ్వు నేను చూడలేదు.

ఓ నా సోదరులారా..! మానవమాత్రులు సైతం నవ్వలేని నవ్వును నేను విన్నాను. అటువంటి నవ్వు మానవాళిలో చూడాలన్న ఆశ నాలో అంతకు అంత పెరిగింది. ఆ నవ్వు నాలో కోరికను ఇంకా పెంచింది. ఇప్పుడు నేను జీవిస్తూనే ఎలా ఉండగలను? ఇప్పుడు నేను మరణించాలని ఎలా అనుకోగలను?

**నోట్:** ఈ అధ్యాయంలో నీషే మొదటిసారిగా అనంతమైన పునరావృత సిద్ధాంతాన్ని మన ముందు ఉంచుతాడు. మిగిలిన భాగం అంతా ఈ సిద్ధాంతం యొక్క పూర్తి పరిణామాలకు వ్యతిరేకంగా జరతూస్త్ర ఇప్పటివరకు చేసిన విఫల ప్రయత్నాలను వివరిస్తుంది.

అనంతమైన పునరావృత సిద్ధాంతం ప్రకారం.. సంఘటనలు ఒక్కసారే జరగవు. అవి అనంతమైనసార్లు పునరావృతమవుతూనే ఉంటాయి. అంటే వర్తమానంలోని ఇప్పుడు ఇక్కడ జరుగుతున్న ప్రతి సంఘటనా ఇప్పటికే గతంలో అనంతమైనసార్లు జరిగింది, ఇకపై భవిష్యత్తులో కూడా అనంతమైనసార్లు పునరావృతమవబోతుంది అనేదే ఈ సిద్ధాంతం యొక్క ముఖ్య ఉద్దేశం.

నీషే యొక్క ప్రాథమిక వాదనలలో ఒకటి: నిరంతరం మార్పుకి గురవుతున్న ఈ విశ్వంలో పరిపూర్ణమైనవి, స్థిరమైనవి ఏవీ లేవు. ఏదీ శాశ్వతం కాదు. ప్రతిదీ శక్తి సంకల్పానికి లోబడి ఉంటుంది. అంటే ప్రతిదీ తనను తాను అధిగమించు కుంటూ ముందుకు సాగుతుంది. అటువంటప్పుడు స్థిరమైనవి ఏవీ ఉండవు. విశ్వం దృష్టిలో దేవుడు, స్థిరనైతికత వంటి స్థిరమైన అంశాలనేవి ఏవీ లేవు. అన్నీ మార్పుకి లోనవుతూనే ఉంటాయి. అన్నీ మారుతూనే ఉంటాయి. కానీ ఈ మార్పులు శాశ్వతంగా పునరావృతమవుతాయి. ఈ సిద్ధాంతం ప్రకారం విశ్వాన్ని నడిపించ డానికి ఏదో ఒక కారణం లేదా ఉద్దేశ్యం ఉందనే భావనలను వదిలివేయవలసి ఉంటుంది. ఈ మార్పులను మరేదైనా నియంత్రిస్తుందనే వాస్తవాన్ని అంగీక రించాలి. అలాగే మానవుడు చేసిన సంఘటనలు అనంతమైన సార్లు పునరావృత మవుతాయి అనే విషయాన్నీ కూడా అంగీకరించాలి. సంతోషకరమైన క్షణాలు అనంతంగా పునరావృతం కావడం ఆనందంగా అనిపించినప్పటికీ, బాధలో ఉన్న సంఘటనలు కూడా పునరావృతం అవుతాయి అనే విషయాన్నీ, మరియు అవి ఎప్పటికీ మెరుగుపడవనే వాస్తవాన్ని కూడా గ్రహించాలి అంటాడు నీషే.

జరతూస్త్ర అనంతమైన పునరావృత ఆలోచనను ఈ భాగం చివరి వరకు అంగీకరించడానికి సిద్ధంగా ఉండడు. ఎందుకంటే సామాన్యులు వారి యొక్క సామాన్యతను, వారి యొక్క మూర్ఖత్వాన్ని ఎప్పటికీ పూర్తిగా అధిగమించకపోగా అవే పునరావృతం అవ్వడం అతన్ని బాధిస్తుంది.

❖ ❖ ❖

# అప్రమేయమైన ఆనందం

జరతూస్త్ర నాల్గవ రోజు మధ్యాహ్నం వరకూ కూడా తన స్నేహితులను విడిచి వచ్చాననే హృదయవేదనతో సముద్రం మీదుగా ప్రయాణిస్తున్నాడు. తనను తాను పూర్తిగా అధిగమించడానికే తన శిష్యుల నుండి దూరమయ్యాననే విషయం జరతూస్త్రకి తెలుసు. అలాంటి చర్య నిజానికి తన శిష్యులను ప్రేమించే చర్య. ప్రస్తుతం జరతూస్త్ర శిష్యులను కలిగి ఉండవలసిన అవసరాన్ని కూడా అధిగమిస్తున్నాడు. ఆ మధ్యాహ్నం జరతూస్త్ర మొదటిసారి తన శిష్యులకు బోధించిన సంఘటనని గుర్తుచేసుకొని చాలా ఆనందపడ్డాడు. ఇప్పటివరకు మానవాళిపట్ల ఉన్న ప్రేమ కారణంగా జరతూస్త్ర ఇతరులకు నేర్పించాలని ఆశపడ్డాడు. కానీ ఇప్పుడు అతను సూపర్ మాన్‌గా మారాలని కోరుకుంటున్నాడు. సూపర్ మాన్ కోసం వెతికి వెతికి అతను అలిసిపోయాడు. తనను తాను అధిగమించిన ఒక్క వ్యక్తిని కూడా కనుగొనలేకపోయాడు. సూపర్ మాన్ అనేవాడు అన్వేషించగా అన్వేషించగా ఎక్కడో కనపడేవాడు కాదని అతను తనలోనే ఉంటాడని, అతను తనలోనుండి బయటికి రావడానికి తనకి తాను సహకరించాలని తెలుసుకుంటాడు జరతూస్త్ర.

జరతూస్త్ర తనలో తాను మాట్లాడ్డం మొదలుపెట్టాడు.

'ఇది నా ఒక్కడికి మాత్రమే సంబంధించిన లక్ష్యం కాదు. అది మొత్తం మానవాళికి సంబంధించిన అత్యున్నతమైన లక్ష్యం. సూపర్ మాన్ ఈ ఉనికిలోకి రాకపోతే మానవుడి జీవితం మున్ముందు చాలా దయనీయంగా మారుతుంది. మనిషి యొక్క చైతన్యానికి సంబంధించినంతవరకు వేలాది సంవత్సరాలుగా ఎటువంటి పరిణామం జరగలేదు. ప్రస్తుతం మానవుని ముందు రెండే రెండు ప్రత్యామ్నాయాలు మాత్రమే ఉన్నాయి.

ఒకటి ఆత్మహత్య చేసుకోవడం,

రెండు సూపర్ మాన్‌ని సృష్టించడం.

ఇప్పటివరకు నేను నా బోధనల ద్వారా ఇతరులను సూపర్ మాన్‌లా మార్చాలని ప్రయత్నించాను. నా బోధనల ద్వారా సూపర్ మాన్‌లు అయినవారు ఎవరైనా ఉన్నారేమో అని వెతుకుతూ నా సమయాన్ని వృధా చేశాను. వాళ్ళు ఉనికిలో ఉండుంటే నాకు వెతకడం సులభం అయ్యేది. కానీ నిజానికి సూపర్

మాన్ అనేవాడు ఉనికిలో లేడు. ప్రతి ఒక్కరి లోతులలో సూపర్ మాన్ ఒక విత్తనం వలె నిద్రపోతున్నాడు. అతను పెరగడానికి సారవంతమైన నేల కావాలి. దానికి కావాల్సిన తగు జాగ్రత్తలు తీసుకోవాలి. అపారమైన ప్రేమతో, గొప్ప ఆశతో, సహనంతో వేచి ఉండాలి. ఇప్పుడు ఈ మధ్యాహ్న సమయమున నేను పూర్తిగా భిన్నమైన కోణం నుండి నా పనిని ప్రారంభించవలసి ఉంది.. అదేంటంటే సూపర్ మాన్‌ని అన్వేషించడం కాదు, 'సృష్టించడం'.

నేను సూపర్ మాన్ దిశగా మార్గం మధ్యలో ఉన్నాను. నా గమ్యం ఇంకా పూర్తికాకముందే ప్రేమతో నా శిష్యుల కోసం పరుగులు పెడుతున్నాను. కానీ నా శిష్యులను సూపర్ మాన్‌గా తీర్చిదిద్దాలంటే ముందు నేను పరిపూర్ణత సాధించాలనే విషయం మరిచిపోయాను. సృష్టికర్త స్వయంగా పరిపూర్ణంగా ఉంటే తప్ప సూపర్ మాన్‌ని సృష్టించలేడని తెలుసుకున్నాను.

ఏమీ తెలియని చిలుకల మాదిరిగా పదేపదే గ్రంథాలను ఉచ్ఛరించే తెలివి తక్కువవారికి సూపర్ మాన్ పూర్తిగా విరుద్ధం. అలాంటివారు ప్రపంచవ్యాప్తంగా అన్ని మతాలలో 'మిమ్మల్ని మీరు ప్రేమించవద్దు' అనే విషయాన్ని మాత్రం బాగా నొక్కి చెప్పారు. వారు దానికి 'స్వార్థం' అనే పేరు పెట్టి ఖండించారు. వారు మీ శత్రువును కూడా ప్రేమించండి, మీ పొరుగువారిని కూడా ప్రేమించండి, ఇతరులను ప్రేమించండని చెప్పారే కానీ మిమ్మల్ని మీరు ప్రేమించండి అని ఎప్పుడూ చెప్పలేదు. కానీ మిమ్మల్ని మీరు ప్రేమించకపోతే మీరు సూపర్ మాన్‌ని సృష్టించలేరు.

మతాచార్యులు మిమ్మల్ని పుట్టుకతోనే మీరు 'పాపి' అని సంబోధిస్తూ మీ మనస్సును విషపూరితం చేస్తూ, సూపర్ మాన్‌ని ఈ ప్రపంచంలోకి రాకుండా తెలివిగా వారు పన్నిన వ్యూహం ఇది. వారు మనిషిని తనకి తానే శత్రువుగా చూపించారు. వారు ప్రతిదానిని ఖండించారు. అతని కోరికలన్నీ చంపేశారు. అతని ఆశల్ని చిదిమేశారు. అతని సహజత్వాన్ని తోసిపుచ్చారు. వారి కల్పిత కథల ముందు మానవుడ్ని ఒక బలిపశువుగా నిలబెట్టారు. వారు ఇప్పటివరకు విజయం సాధిస్తూ వచ్చారు. మానవుడు కూడా ఇప్పటివరకు కల్పితమైన దేవుని కోసం తనను తాను త్యాగం చేసుకుంటూ వచ్చాడు. సృష్టికర్తలుగా ఉండటానికి, అతని శక్తి సామర్థ్యాల గురించి, అతని గురించి తెలుసుకోవడానికి వారు ఇప్పటి వరకు ఏ విధంగానూ సహాయపడలేదు.

నేను మందకి వ్యతిరేకం. మంద ఎవర్నీ ఉన్నతస్థాయికి వెళ్ళడానికి అనుమతించదు. వారందరూ ఒకరి కాళ్ళను ఇంకొకరు వెనక్కి లాగే ప్రయత్నంలో ఎప్పుడూ నిమగ్నమై ఉంటారు. ఎవరైనా ఒక వ్యక్తి వారి గుంపునుండి ప్రత్యేకమైన వానిగా మారితే అది వారి అహంకారాన్ని గాయపరుస్తుంది. వారు తమ వ్యక్తిత్వాన్ని, వారిని వారు త్యాగం చేసేవారిని గౌరవిస్తారు, కీర్తిస్తారు. మంద అంచనాలను ఎంత ఎక్కువగా నెరవేరుస్తారో వారికి అంత ఎక్కువ గౌరవాన్ని ఆపాదిస్తుంది. తన బ్రతుకు తాను బ్రతుకుతున్నా, తన వ్యక్తిత్వాన్ని నొక్కి చెప్పినా మంద అతన్ని అసహ్యించుకుంటుంది, వెలేస్తుంది. కానీ మీరు మీ వ్యక్తిత్వాన్ని నొక్కి చెప్పకపోతే మీరు సూపర్ మాన్‌కి గర్భంగా ఉండలేరు.

నా శిష్యులు మొక్కల వంటివారు. ఎక్కడైతే అటువంటి మొక్కలన్నీ కలిసి ఉంటాయో ఆ ప్రదేశం ఆనందకరమైన, ఆహ్లాదకరమైన దీవుల్లా మారుతాయి. కానీ వాటిని వేరు చేయవలసి ఉంటుంది. అప్పుడు మాత్రమే దేనికదే ఆనంద కరమైన దీవుల్లా మారుతాయి. నాటిన విత్తనాలు భూమిని చీల్చుకుంటూ పెరిగే సమయంలో దేనికి దానికి సొంత స్థలం కేటాయిస్తూ, వాటి చుట్టూ ఉన్న చెత్తను తీసివేస్తే, వేటికి అవి భిన్నంగా పెరుగుతాయి. అప్పుడు మాత్రమే వాటికి ఏకాంతత, విధిని ఎదిరించగల ధైర్యం, దూరదృష్టి వస్తాయి. కానీ ఏకాంతం యొక్క గాఢతని తెలుసుకోవడానికి గుంపు ఎప్పుడూ అనుమతించదు. వారు ఎల్లప్పుడూ మిమ్మల్ని చుట్టుముట్టే ఉంటారు. వారు మిమ్మల్ని నిశ్శబ్దంగా ఉండటానికి అనుమతించరు, వారు మిమ్మల్ని ఏకాంతంగా విడిచిపెట్టరు. ఏకాంతాన్ని ప్రేమించే వ్యక్తులపట్ల గుంపు చాలా ఆగ్రహంగా ఉంటుంది. గుంపు వారిని శత్రువులుగా భావిస్తుంది. వారు తమలో ఒకరు కాదని, తమ గుంపుకు చెందినవారు కాదని చాలా కోపంగా ఉంటుంది. గుంపు వలన వచ్చే ఒత్తిడుల కారణంగా మానవుడు తన ఏకాంతాన్ని పూర్తిగా మరచిపోయాడు. ఏకాంతం అవసరం ఉందనే విషయం కూడా నెమ్మది నెమ్మదిగా మర్చిపోయాడు. చివరికి గుంపు చేతిలో ఒక కీలుబొమ్మ అయ్యాడు. ఆ గుంపు మాయలో పడి ఏకాంతం అనేది తన సొంత చైతన్యం యొక్క ఉన్నత శిఖరాలను చేరడానికి అవసరమైన ప్రాథమిక విషయాలలో ఒకటని మానవుడు పూర్తిగా మరిచిపోయాడు.

సూపర్ మాన్ అవ్వాలనుకుంటున్న వ్యక్తికి ఉండాల్సిన దానిలో ముఖ్యమైనది: ఎదిరించే స్వభావం.

మందకి అవిధేయతగా ఉండడం నేర్చుకోవాలి. ఏ నిర్ణయమైనా తనకు తానుగా తీసుకోవాలి. తన మనస్సాక్షికి సరైనది అనిపించినది చెయ్యాలి. తప్పు అని అనిపించింది పక్కకి తోసెయ్యాలి. గుంపు చిన్న చిన్న విషయాలపట్ల కూడా మనిషిని విధేయుడుగా ఉండాలని కోరుకుంటుంది.

సూపర్ మాన్ అవ్వాలనుకుంటున్న వ్యక్తికి ఉండాల్సిన ఇంకో ముఖ్యమైనది: దూరదృష్టి.

మానవుడు స్వతంత్రంగా, స్వేచ్ఛగా ఉండటానికి దూరదృష్టి అవసరం. ఎందుకంటే వెనుకకు చూడటం అనేది అర్థం లేనిది. గతాన్ని మార్చలేము. కానీ రాబోయే సమయానికి తగినట్టు ఇప్పుడు ఏదోకటి చెయ్యొచ్చు. దూరదృష్టి ఉంటే మానవుడు పరిస్థితులకు అనుగుణంగా, మరింత సందర్భోచితంగా, మనోహరంగా స్పందిస్తాడు. సూపర్ మాన్ అత్యంత దయామయుడు. అతని దయ, అతని దూరదృష్టి నుండి వస్తుంది. అతను చాలా ప్రశాంతమైన వ్యక్తి. అతని ప్రశాంతత నుండి అతని దూరదృష్టి వస్తుంది. మున్ముందు ఏం జరుగుతుందో అతనికి తెలుసు. దేనికైనా అతను స్పందించడానికి సిద్ధంగా ఉంటాడు. పరిస్థితులు ఎంత కష్టతరమైనవైనా, ఎంత కఠినమైనవైనా అవి అతనికి ఒక పరీక్ష మాత్రమే అనుకుంటాడు. అతను వాటిని సంతోషంగా ఎదుర్కోగలడు. అతను ఏ ప్రమాదాన్నైనా ఆనందంగా, ధైర్యంతో అంగీకరించగలడు. ఎందుకంటే ప్రమాదం మాత్రమే అతన్ని బలోపేతం చేస్తుంది. ఆ ప్రమాదం మాత్రమే అతనికి గుర్తింపుని ఇస్తుంది. సూపర్ మాన్ ఒక పరిపూర్ణమైన చిత్తశుద్ధి కలవాడు. అతని చైతన్యం అతను మాట్లాడేటప్పుడు మౌనంగా ఉంటుంది. అతని లోలోతుల్లో అతనొక నిశ్శబ్దం తప్ప మరొకటి కాదు. అతని మాటలు అతని నిశ్శబ్దం నుండి వస్తాయి, మెదడు నుండి కాదు. మాటలు రెండు రకాలు.. ఒకటి, హృదయంలోని నిశ్శబ్దత యొక్క అంతరాల నుండి వచ్చేవి. రెండు, మెదడు నుండి వచ్చే శబ్దాలు. పిచ్చి స్వరాలు ఎక్కువగా మెదడు నుండే వస్తాయి, ఎందుకంటే మానవుడు తన సొంత హృదయంలోకి ఎప్పుడూ ప్రవేశించలేదు.

సూపర్ మాన్ అయిన వ్యక్తికి మానవాళికి ఏది ఎలా ఇవ్వాలో తెలుసు. అతను మానవాళిని బిచ్చగాళ్ళని చేసి అవమానించడు. బదులుగా వాళ్ళ దగ్గర నుండి ఏదోకటి తీసుకుంటాడు. అతను మానవుని స్థాయిని, అతని గౌరవాన్ని పెంచుతాడు.

ఒకరు పూర్తిగా స్వార్థపూరితంగా ముందుకు సాగినప్పుడు మాత్రమే సూపర్ మాన్ ఉనికిలోకి వస్తాడు. పాత సంప్రదాయాలు అన్నీ నిస్వార్థంగా ఉండడం గురించి మాత్రమే బోధించాయి.

స్వార్థం అంటే ఏమిటో తెలియకుండా నిస్వార్థంగా ఎలా ఉండగలరు? మొదటి నుండి ప్రారంభించండి. నిస్వార్థానికి సంబంధించిన పాత బోధనలన్నీ అసంపూర్ణమైనవి, అర్థం లేనివి. నిస్వార్థంగా ఉండటానికి ప్రయత్నిస్తున్న ప్రజలది కేవలం నటన మాత్రమే. లోలోతుల్లో వారు కూడా స్వార్థపరులే. నేను మనిషి స్వభావానికి వ్యతిరేకం కాదు. స్వార్థంగా ఉండండి. మీ స్వార్థం దాని అంతిమ సామర్థ్యానికి ఎదగనివ్వండి, దానిని వికసించనివ్వండి. దానినుండి వచ్చే సువాసన అన్ని వైపులకు వెళ్తుంది. అప్పుడు అది నిస్వార్థం అవుతుంది. నేను నిస్వార్థసేవ చేసేవాడిని కాదు. ఇతరులకు సేవ చేయండని తెలివైనవారెవరు చెప్పరు. మొదట మిమ్మల్ని మీరు తెలుసుకోకుండా ఇతరులకు సేవ చెయ్యాలి అనుకోవడం ప్రమాదకరం. మొదట మీకు మీరుగా వీలైనంత ఎత్తుకు ఎదగండి. ఆ తరువాత మీరు పొందినదానిని ఇతరులకు పంచవచ్చు. అప్పుడు మీరు ఎన్నో నేలలపై వర్షించే మేఘం అవుతారు. అప్పుడు మీరు వారికి ఇస్తున్నారన్న ఆలోచనే ఉండదు. దాహం వేసిన భూమిపై వర్షించడం వలన మేఘమే భూమికి కృతజ్ఞత తెలుపుతుంది. ఎందుకంటే మేఘం యొక్క భారాన్ని భూమి తీసుకుంటుంది కాబట్టి. ఇకపై నేను చిన్న చిన్న ఆనందాలపట్ల ఆసక్తి చూపను. నా ఏకైక ఆందోళన ఏమిటంటే నా తుది అగ్నిపరీక్షకి సిద్ధం అవ్వడమే. అది మాత్రమే నా ఉనికికి అర్థాన్ని ఇవ్వగలదు. నా చైతన్యం అమరమైనది. నేను నా విధిని నెరవేర్చ డానికి వచ్చాను. ఇంతవరకు నేను సూపర్ మాన్‌ని గురించి చాలా అన్వేషించాను. కేవలం ఆశ మాత్రమే సహాయం చేయదు. నేను నా శిష్యులకు వారు సూపర్ మాన్‌లు అవ్వాలని బోధించాను. కోరుకున్నాను. ఆశ పడ్డాను. కానీ ప్రస్తుతం నా కోరిక అది కాదు. నేను నాలో సూపర్ మాన్‌ని కలిగి ఉన్నానని నాకు ఖచ్చితంగా తెలుసు. నేను నా ఆత్మను పట్టుకున్నాను. దానిని మార్చబోతున్నాను. అది కోరిక కాదు.. నిశ్చయత. నేను ఖచ్చితంగా, బేషరతుగా ఒకే ఒక విషయాన్నీ చెప్పాలనుకుంటున్నాను: సూపర్ మాన్‌ని సృష్టిస్తాను. ఎందుకంటే సూపర్ మాన్ మాత్రమే ఈ భూమికి పరిపూర్ణతని ఇవ్వగలదు.

సూర్యాస్తమయం కావొచ్చినప్పుడు జరతూస్త్ర తన శిష్యులు తన నిష్క్రమణ కారణంగా వారు విచారంగా ఉండవచ్చని అనుకుంటాడు. మధ్యాహ్నసమయాన తాను ఆస్వాదించిన ఆనందం తనను విడిచిపెట్టి తన శిష్యులలోకి ప్రవేశించాలని కోరుకుంటాడు జరతూస్త్ర.

చీకటి పడుతుండగా జరతూస్త్ర బాధ అతన్ని అధిగమించడం కోసం వేచి చూస్తున్నాడు. కానీ అది ఎప్పటికీ జరగదు. జరతూస్త్ర మరల పరివర్తన చెందగలడు. జరతూస్త్ర తన శిష్యులను విడిచిపెట్టడానికి దారితీసిన సంకేతాలను మరియు పరిస్థితులను గురించి, అతను వారిపట్ల చూపించిన తన నిష్కపటమైన ప్రేమ గురించి ఆలోచించాడు. ఆ ప్రేమే వారితో ఎక్కువ కాలం కలిసి ఉండటానికి కారణమైందని గుర్తించాడు. ఇప్పుడు జరతూస్త్ర తన శిష్యులను విడిచిపెట్టే శక్తివంతమైనదానిని కనుగొన్నాడు. అదే తనను తాను అధిగమించే ప్రక్రియ. అదే అన్నిటికంటే ఇంకా గొప్పది అనుకున్నాడు జరతూస్త్ర.

❖ ❖ ❖

# సూర్యోదయానికి ముందు

'నిన్ను నువ్వు అధిగమించు' అనేది జరతూస్త్ర యొక్క ప్రాథమిక బోధన.

జరతూస్త్ర సూర్యోదయానికి ముందు ఆకాశంలోకి చూస్తూ తన కోరికలను అధిగమించి ముందుకి వెళ్ళడానికి మతపరమైన భాషని ఉపయోగిస్తూ ఆకాశంతో మాట్లాడుతున్నాడు.

నాపై ఎటువంటి పరిమితులు, హద్దులు లేని స్వచ్ఛమైన ఓ గగనమా…! లోకానికి కాంతిని వెదజల్లే సూర్యచంద్రులని నీలో దాచుకున్న ఓ గగనమా..! నీ వైపు చూస్తూ, నేను దైవిక కోరికలతో వణుకుతున్నాను.

ఆకాశం విశాలత్వాన్ని, నిశ్శబ్దాన్ని సూచిస్తుంది. జరతూస్త్ర ఆకాశానికి ఒక రకమైన దైవత్వాన్ని ఆపాదించాడు. ఆకాశం యొక్క అందం, దాని శక్తి, విశాలత, దాని నిశ్శబ్దతలోనే ఉంటుంది. జరతూస్త్ర ఆకాశం యొక్క స్వభావాన్ని అర్థం చేసుకోవడం ద్వారా తనని తాను అర్థం చేసుకుంటూ, మానవాళి తమని తాము అర్థం చేసుకోవడానికి అవకాశం కల్పిస్తున్నాడు.

జరతూస్త్ర యొక్క మొత్తం కోరిక విశాలత కోసం. మానవ చైతన్యానికి, ఎదుగుదలకు ఎటువంటి పరిమితులూ లేవు. అందువల్లనే జరతూస్త్ర నక్షత్రాలను

దాటి వెళ్ళాలనే కోరికకు చిహ్నంగా తనతో డేగను తీసుకువెళ్ళేవాడు. మానవ చైతన్యం యొక్క ఎదుగుదలకు 'అసాధ్యం' మాత్రమే సవాలుగా ఉండాలి. అంతకన్నా తక్కువస్థాయి వాటిని లక్ష్యంగా అంగీకరించడానికి మానవాళి సిద్ధంగా ఉండకూడదు. సాధించదగినది ఏదైనా సాధించడంలో అంత గొప్పేమీ ఉండదు. సాధ్యమయ్యే విషయాలు ఏవైనా వాటి అర్థాన్ని కోల్పోతాయి.

జరతూస్త్రకి 'అసాధ్యం' దేవునితో సమానం. కానీ ఆ అసాధ్యాన్ని మతాలు 'దేవుడు' అనే పదంతో ఎలా దిగజార్చాయో, ఎలా పాడుచేశాయో మనకు తెలుస్తుంది. దేవుడు లేడు. దేవుడ్ని మనం చేరుకోలేము. కనుగొనలేము. అందుకే దేవుడు అసాధ్యానికి మరో పేరు. 'అసాధ్యం' కోసం మీకు మీరుగా ముందుకు సాగలేకపోతే మీరు సూపర్ మాన్ కాలేరు. ఆకాశం ఎటువంటి పరిమితులు లేని స్థలం. జరతూస్త్ర దైవిక కోరిక "మనిషి ఇప్పటివరకు విలువైనవిగా భావించిన వాటన్నిటినీ అధిగమించాలనే కోరిక". ఇప్పటివరకూ మానవుడు ఆభరణాలుగా అనుకున్నవన్నీ సంకెళ్లు తప్ప మరొకటి కావు. ఈ అడ్డంకులన్నింటినీ అధిగమించి, అసాధ్యమైన అన్వేషణలో, హద్దులు లేని ఆకాశంలోకి ఎగరడమే జరతూస్త్ర దైవిక కోరిక.

అసాధ్యమైనవాటిని శోధించడం ద్వారా మాత్రమే ఎవర్ని వారు కనుగొన గలరు. ఎవరి శక్తి సామర్థ్యాలు వారికి తెలుస్తాయి. ఆ గొప్ప కోరిక మాత్రమే మానవాళిని అన్ని మానవపరిమితుల కంటే ఎక్కువ స్థాయిలో ఉంచగలదు. అది మాత్రమే మానవాళిని ఇప్పటివరకు కలుషితం చేసిన అన్నిటినుండి పరిశుద్ధ పరచగలదు.

నీ విస్తీర్ణత ఎంత విశాలమైనదో నా లోతు అంత లోతైనది. అంతకన్నా తక్కువ నాకు సంతృప్తిని ఇవ్వదు. నీలాగే నేను స్వచ్ఛంగా లేకుంటే తప్ప, నా సొంత అమాయకత్వం నాకు తెలియదు. (ఆకాశం మాట్లాడదు. అలా అని అది మూగది కాదు. ఆకాశం యొక్క నిశ్శబ్దం దాని జ్ఞానాన్ని తెలియజేస్తుంది.) మేము మొదటి నుండి స్నేహితులుగా ఉన్నాం. కానీ ఎప్పుడూ ఒకరితో ఒకరం మాట్లాడుకోలేదు. ఎందుకంటే మాకన్నీ తెలుసు, మేము ఒకరి సమక్షంలో ఒకరం నిశ్శబ్దంగా ఉంటాము. కలిసి మాకు మేముగా పైకి ఎదగడం, ధైర్యంగా నవ్వడం, కలిసి డాన్స్ చెయ్యడం అలా ప్రతిదీ కలిసి నేర్చుకున్నాం. మా స్నేహంలో బలవంతంగా ఒకరికోసం ఒకరు చేయవలసిన విధులు కానీ, ప్రయోజనం కోసం

చేసేవి కానీ, అపరాధభావంతో చేసేవి కానీ ఏవీ ఉండవు. అవి గుంపుకు సంబంధించినవి. వారు నిర్బంధజీవితాన్ని గడుపుతారు. వారు బలవంతంగా ఒకరినొకరు ఇష్టపడతారు. ఆ బలవంతం నుండే ఒకరిపై ఒకరు ప్రేమను నటిస్తారు. ఎటువంటి సంతోషం లేకుండా తప్పకుండా చెయ్యాల్సిన ఒక విధిగా ప్రతిదీ చేస్తారు. బలవంతంగా, ఏదైనా ప్రయోజనం కోసం చేయడం అనేది బానిసత్వంతో సమానం. కానీ గుంపు ప్రతిదానికీ ఒక ప్రయోజనం ఉందని, ప్రతిదీ ఒక ప్రయోజనం కోసమే చెయ్యాలనుకుంటుంది. నిజానికి ఒక పనికి దానికంటూ ఒక ప్రయోజనం లేకపోతే వారు దాన్ని పిచ్చి అనుకుంటారు.

నిజం ఏమిటంటే ఎటువంటి ఉద్దేశం, ఎటువంటి ప్రయోజనం కోసం ఏదీ చేయవలసిన అవసరం లేదు. ఎటువంటి చర్యకైనా బయటనుండి దానికి ప్రయోజనం చేకూర్చే అవసరం లేదు. దానికది అంతర్గతంగా పరిపూర్ణంగా ఉంటే చాలు. దాని అర్థం దానిలోనే ఉండాలి. అప్పుడు దానికది సొంత ప్రతిఫలం, దాని సొంత అందం కలిగి ఉంటుంది. అది ఏ ఉద్దేశాన్నీ నెరవేర్చదు, అది ఎటువంటి బహుమతినీ తిరిగివ్వదు. నేను ఎప్పుడూ అపరిమితమైన స్వేచ్ఛను కోరుకుంటాను. నా అన్వేషణలో, నన్ను నేను అధిగమించడం, అంతిమ స్వేచ్ఛను పొందడం, నేను నేనుగా స్వేచ్ఛగా ఉండడమే నా యొక్క కోరిక.

ఓ ఆకాశమా..! ఎటువంటి పరిమితులు, సరిహద్దులు లేని నీతో నేను స్వేచ్ఛగా ఎగరాలని అనుకుంటున్నాను. కానీ అడ్డుగా ఉన్న ఆ మేఘాలను ద్వేషిస్తున్నాను. ఎందుకంటే అవి నీ స్వచ్ఛతను, నీ విశాలతను అపవిత్రం చేస్తున్నాయి. అవి నీ అమాయకత్వాన్ని కలుషితం చేస్తున్నందున నేను వాటిని ద్వేషిస్తున్నాను.

జీవితపు చీకటిలో మరియు చీకటి లోతులలో మాత్రమే తెలుసుకోగలిగే చాలా విషయాలు ఉన్నాయి. ఎందుకంటే జీవితం ఒక రహస్యం.. జీవించగల రహస్యం. మనిషి తనని తాను అధిగమించాలంటే అతడు తన జ్ఞానసంపదని కూడా అధిగమించి పైకి ఎదగాలి. అతను ఎందుకు.. ఏమిటి అని అడగకుండా, సందేహాల్ని సృష్టించకుండా, ఏ ప్రశ్న లేకుండా మొత్తం అంగీకారంతో జీవించే ధైర్యం కలిగి ఉండాలి. మనిషి మర్మమైనవాటికి అంగీకారం తెలపగల సామర్థ్యం లేకపోతే అతను మానవమేధస్సుని అధిగమించి ముందుకు వెళ్లలేడు. మానవ మేధస్సు, మనస్సు నిరంతరం సందేహాలతో నిండిఉంటుంది. అది ఎల్లప్పుడూ

సందేహాల్ని సృష్టిస్తుంది. అందుకే సందేహాలను అణచివేయడానికి అది నమ్మకాలను సృష్టిస్తుంది. కానీ ప్రతి నమ్మకానికి దాని వెనుక ఒక సందేహం దాగి ఉంటుంది. అనుమానాలను దాచి ఉంచడానికే అది విశ్వాసాల్ని సృష్టించింది. కానీ ప్రతి నమ్మకం ఒక పరదా తప్ప మరొకటి కాదు. ఆ పరదా వెనుక అన్ని రకాల అనుమానాలు, ప్రశ్నలు ఉంటాయి. ఆ సందేహాల్ని, అనుమానాల్ని, ప్రశ్నల్ని అధిగమించి వెళ్ళండి. చీకటిలోకి తెలియని రహస్యాలగుండా లోతైన అంగీకారంతో ముందుకు వెళ్ళండి. మీ గురించి మీరు తెలుసుకోవటానికి ఉన్న ఏకైక మార్గం: జీవితం, ఉనికి యొక్క మర్మమైన ఆనందాల్ని తెలుసుకోవడం. ఈ ప్రపంచంలోని సాధారణమైన విలువలకు, మంచి చెడులకు అతీతమైనవాటిని సృష్టించాలి.

నేను ఇప్పుడు ఆనందంలో మునిగిపోయి ఉన్నాను.

నేను నా జ్ఞానంతో ప్రపంచానికి బాప్తిజం ఇవ్వడానికి పరితపిస్తున్నాను. నేనే బాహ్యకారణం లేదా హేతుబద్ధతతో పరిపాలించబడాలని అనుకోవడం లేదు. నాకన్నా గొప్పవాడిగా ఉండటానికి బాధ్యత వహించకూడదని నేను ప్రయత్నిస్తున్నాను. నేను ఆకాశంలా మారడానికి నేను నా ప్రయాణాన్ని మొదలుపెట్టాను.

❖ ❖ ❖

# చిన్నదిగా చేసే ధర్మం

జరతూస్త్ర తన మాతృభూమికి తిరిగి వస్తాడు. కానీ లోపలికి ప్రవేశించటానికి ముందు మానవులు ఎలా ఉన్నారు.. సూపర్ మాన్ దిశగా ఎదిగారా.. లేక ఇంకా దిగజారారా అని తెలుసుకోవాలనుకున్నాడు. దూరం నుండి వాళ్ళు వరుసగా నిర్మించుకున్న ఇళ్లను చూసి ఆశ్చర్యపోయాడు. ఎందుకంటే అవన్నీ ఒకేరకంగా ఉన్నాయి. ఏ ఒక్కటీ భిన్నంగా లేదు. నేను లేనప్పుడు మానవులు చిన్నబోయారని, ఆనందం, ధర్మం వంటి బోధనలవల్ల మానవాళి ఇంకా చిన్నబోయిందని తెలుసుకున్నాడు. ఈ బోధనలు వాస్తవానికి జరతూస్త్ర యొక్క సూపర్ మాన్‌కి సంబంధించిన బోధనలకు అవరోధాలుగా భావించాడు.

జరతూస్త్ర అక్కడి ప్రజలను ఉద్దేశించి మాట్లాడాలని అనుకుంటాడు.

నిజానికి జరతూస్త్ర దగ్గర ఆ ప్రజలకు బోధించడానికి తనకంటూ ఒక ప్రత్యేకమైన సిద్ధాంతం కానీ స్థిరనైతికత కానీ లేదు. అతని నమ్మకం అతని ఆప్రేరణమైన చైతన్యంలో ఉంది. తన సొంత చైతన్యంపై జరతూస్త్రకి ఉన్న నమ్మకం అపారమైనది. అందుకే జరతూస్త్ర ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవుడ్ని తిరస్కరించగలడు.

జరతూస్త్ర అక్కడి ప్రజలను ఉద్దేశించి మాట్లాడడం మొదలుపెడతాడు.

సత్యాన్వేషణలో భాగంగా దేవుణ్ణి తెలుసుకోవాలి లేదా తన సొంత మార్గంలో ముందుకు వెళ్ళాలి. కానీ సత్యాన్వేషణలో మీరు దేవుణ్ణి ఎంచుకుంటే బానిసత్వాన్ని ఎంచుకున్నట్టే. కానీ సొంత మార్గాన్ని ఎంచుకుంటే దేవుడ్ని తిరస్కరించవలసిందే. దేవుడ్ని ఎంచుకుంటే మిమ్మల్ని మీరు తిరస్కరించవలసిందే. సత్యాన్వేషణలో దేవుడిపై భారం వేసిన మరుక్షణం మీరు మీ బాధ్యతలను మరిచిపోవాల్సి ఉంటుంది. ఎందుకంటే మానవాళికి సంబంధించిన ప్రతి విషయాన్నీ దేవుడే చూసుకుంటాడనే అపోహలో మీరు ఉన్నారు కాబట్టి. ఒకవేళ దేవుడు మానవ సృష్టే అయితే మీరు ఇబ్బందుల్లో పడక తప్పదు. ఒకవేళ వాస్తవికతని, మిమ్మల్ని మీరు నమ్ముకున్నట్లైతే మీ చైతన్యం, స్పృహ పెరిగే అవకాశం ఉంది. కానీ మీరు కల్పనకు అనుకూలంగా వాస్తవికతను ఖండించారు. ఎందుకంటే మీకు కల్పన మరింత సౌకర్యవంతంగా అనిపించింది. అది బాధ్యతల నుండి మీకు ఉపశమనం ఇచ్చింది. కానీ అది మీ స్వేచ్ఛను హరించింది. స్వేచ్ఛ, బాధ్యతలు విడివిడిగా ఉండవు. అవి ఎల్లప్పుడూ కలిసే ఉంటాయి.

(జరతూస్త్ర మనిషిని ప్రేమిస్తున్నందున దేవుణ్ణి తిరస్కరించాడు. ఎందుకంటే మానవుడే స్వయంగా దేవుడిగా మారగలడని అతను ఆశించాడు. అతను దేవుడిగా మారడానికి ఉన్న ఏకైక అవరోధం వేరే దేవుడ్ని నమ్మడం. అప్పుడు అతను కేవలం ఒక బానిస మాత్రమే.)

వారు ధర్మం అని భావించిన ఆలోచనలను జరతూస్త్ర విస్మరించినందుకు ప్రజలు అతనిపై కోపంగా ఉన్నారు. అక్కడి ప్రజలకు బోధించడానికి వచ్చిన జరతూస్త్రని, అతను సాధించిన స్వేచ్ఛను చూసి వారు లోలోపల అతన్ని అసహ్యించుకుంటున్నారు.

జరతూస్త్ర ఇంకా మాట్లాడుతూనే ఉన్నాడు.

మీరు చాలా దిగజారిపోయారు. సర్వశక్తిమంతుడైన, క్రూరమైన, నీచమైన దేవుని నీడలో మీరు ఎంతమాత్రం ఎదగలేరు. ఒక పెద్ద చెట్టు నీడలో ఒక చిన్న గులాబీమొక్క పెరగలేదు. మనిషి తాను స్వయంగా కనుగొన్న కల్పితమైనదానిని ఎంచుకున్నప్పుడు అది అతని పతనానికి నాందవుతుంది. అది మీ గౌరవాన్ని ముక్కలు చేస్తుంది. గౌరవప్రదమైన ఏ వ్యక్తయినా తనను తాను నమ్ముతాడు. తన ద్వారానే ఉనికిని నమ్ముతాడు. కానీ 'దేవుడు' వాస్తవికత నుండి మిమ్మల్ని తప్పుదారి పట్టించే పూజారుల సృష్టి మాత్రమే. ఇది మిమ్మల్ని పిరికివాళ్ళుగా మార్చింది. మరణాన్ని ఎదుర్కోవటానికి అవసరమైన ధైర్యాన్ని తీసివేసింది. 'దేవుడు' అనే ఒక కల్పన మీ జీవితాన్నంతా ఒక విషాదంగా మార్చింది.

మీరు పాడటం మర్చిపోయారు, నృత్యం చేయడం మర్చిపోయారు, మిమ్మల్ని మీరు మర్చిపోయారు.. మీ శక్తి సామర్థ్యాలు ఏంటో, ప్రకృతి మీకు ఇచ్చిన హక్కులేంటో, అర్హతలేంటో మరిచిపోయారు. ప్రస్తుతం మీరు అంధకారంలో నివసిస్తున్నారు.

వాస్తవానికి జరతూస్త్ర మాటలు ఎంత మంచివైనప్పటికీ, అతను గుంపుకు విసుగు తెప్పించే ఒక వ్యక్తి తప్ప మరొకటి కాదు. వారు జరతూస్త్ర మాటలు వినదలుచుకోలేదు. మానవుడు తన పవిత్ర గ్రంథాలను, తన మతాన్ని పొగిడితేనే వింటాడు. అంతిమసత్యం అని అతను భావించే కల్పనల భాష మాట్లాడితేనే వింటాడు. అది కూడా అతను వినాలనుకుంటున్నది మాత్రమే వింటాడు. సత్యం ఎల్లప్పుడూ కొత్తది. కొత్తది ఏదైనా మానవాళిని కలవరపెడుతుంది. మానవుడు సత్యాన్ని ఎంచుకుంటే అతని పాత ఆలోచనల్ని, పురాతన పురాణాల్ని, సగం కుళ్ళిన సత్యాల్ని బయటకు విసిరెయ్యాల్సి ఉంటుంది. అది అతనికి చాలా ప్రమాదకరం. అతను జనసమూహంలో భాగం. అతను కొత్తదానిని స్వీకరించిన మరుక్షణం గుంపుకు అపరిచితుడు అవుతాడు. గుంపు అతన్ని చూసి నవ్వుతుంది.. అతన్ని వెలేస్తుంది. అందుకే మందకి అటువంటి అపరిచితులు నచ్చరు. మంద వారి గాఢనిద్రకు భంగం కలిగించేవారిని అస్సలు క్షమించదు. జరతూస్త్రలాంటి వారిని అస్సలు భరించదు.

జరతూస్త్ర మాట్లాడుతున్నప్పుడు వాళ్ళు ఆశ్చర్యపోయారు. ఎందుకంటే ఇతర ప్రవక్తల మాదిరిగానే, అవే పాత బోధనలను చెప్పడానికి లేదా వారి జీవన

విధానాన్ని, వారు ధర్మం అని నమ్ముతున్నవాటిని ప్రశంసించటానికి రాలేదని ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. జరతూస్త్ర రాబోయే నవీనయుగం యొక్క ఎత్తైన కొండపై నిలబడి ఉన్నాడని వారికి అర్థం కాలేదు. అతను 'దైవభక్తి లేనివాడు' అని చెప్పి అక్కడి ప్రజలను తిట్టాడు. అతను ఇతర ప్రవక్తల మాదిరిగా లేడు ఎందుకంటే అతని సందేశం... ధర్మం, నైతికత గురించి కాదు. అతని సందేశం సూపర్ మాన్ గురించి. అందుకే మానవాళి పురోగతిని సాధించనందున జరతూస్త్ర వారిని తిట్టాడు.

మతాచార్యులు, ప్రవక్తలు మనిషి యొక్క అంతర్గత ప్రపంచాన్ని దేనినీ ప్రశంసించరు. కానీ జరతూస్త్ర వారికి పూర్తిగా వ్యతిరేకం. ఎందుకంటే జరతూస్త్ర మానవుని దుర్గుణాలను ఖండించలేదు. వారు జరతూస్త్ర మాటలను వినకపోగా తిరిగి జరతూస్త్రని దుర్భాషలాడడం ప్రారంభించారు. మనిషిలో అభివృద్ధి చెందుతున్న వాటిని జరతూస్త్ర గౌరవిస్తాడు. మనిషి పెరుగుదలకు సంబంధించిన అంశాలకోసం అవసరం అయితే అన్ని దేవుళ్ళను సైతం పక్కన పెట్టేస్తాడు.

అన్ని రకాల విధేయతలను, దేవుళ్లను, పవిత్ర గ్రంథాలను తోసిపుచ్చండి. 'ప్రపంచాన్ని త్యజించండి' అని బోధించేవారిని కూడా పక్కన పెట్టెయ్యండి. వినయ విధేయతలు తిరస్కరించండి, పిరికితనాన్ని త్యజించండి. మీకు మీరుగా ఉండండి. అప్పుడే మీ జీవితం ఒక నృత్యం అవుతుంది. నాకు ప్రజలు వింటున్నారా వినట్లేదా అనేది అనవసరం.. నేను మాట్లాడుతూనే ఉంటాను.. ఎందుకంటే నేను మానవాళిని ప్రేమిస్తున్నాను. మీరు విన్నా, వినకపోయినా నేను మాట్లాడతాను. బహుశా ఈ గాలే నా సందేశాన్ని వినగలిగేవారి చెవులకు చేరవెయ్యొచ్చు.

మీ ధర్మాలు ఏమిటి? మతాలు అని పిలవబడేవి మీకు ధర్మాలను బోధిస్తున్నాయా?

నా దృష్టిలో మీ ధర్మాలు నీచమైనవి. అవి మీకు గొప్పదనాన్ని ఆపాదించ కుండా మిమ్మల్ని ఇంకా నాశనం చేస్తున్నాయి. మిమ్మల్ని మరింత సామాన్యులుగా, బానిసలుగా చేశాయి. సౌకర్యవంతంగా జీవించాలి, విధేయతగా ఉండాలనే అంశాలు మిమ్మల్ని ఇంకా బలహీనుల్ని చేశాయి. మతపరమైన జీవితం మీ ఎదుగుదలకు ఏ విధంగానూ సహకరించదు. ఉపవాసం ఉంటారు. ప్రతిరోజూ ఆలయానికి వెళ్లి ఆ రాతివిగ్రహాల ముందు మోకరిల్లి ప్రార్థిస్తారు. నిజానికి

ప్రార్థించడం బానిసల నీతి. చాలా ముఖ్యమైన విషయం ఏంటంటే సత్యాన్ని అన్వేషించవలసిన అవసరం లేదని, అది ఇప్పటికే దేవుడిచ్చేసాడని అందరూ చెప్తూ ఉంటారు.

నిజానికి మీకు అది ఇవ్వబడదు. మీరే దానిని శోధించి సాధించాలి. మీరు సత్యాన్ని దొంగిలించడానికి సిద్ధంగా లేకుంటే మీకది లభించదు. మీరు దానిని దొంగిలించాలి, అవసరం ఐతే దానికోసం మీ నైతికతని, గౌరవాన్ని, మీ ప్రాణాన్ని సైతం లెక్క చెయ్యొద్దు. ఇవ్వబడిన సత్యం కేవలం అబద్ధం మాత్రమే. ఇప్పటివరకూ మీరు తిరుగులేని సత్యాలుగా భావించబడినవన్నీ ఇవ్వబడినవే. ఒక్కసారి మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. మీ దేవుడ్ని మీకెవరిచ్చారు? మీ నిజం మీకెవరిచ్చారు? మీ మతాన్ని మీకెవరిచ్చారు? ఒక్క విషయం పరిశీలించండి. ఏదైనా మీకు ఇవ్వబడిందా? లేదా మీ అంతటా మీరు తీసుకున్నారా? ఒకవేళ ఇవ్వబడితే దాన్ని విసిరెయ్యండి. దానికెలాంటి అర్థం లేదు. అది కేవలం మీ ఆత్మవంచన మాత్రమే.

ఎల్లప్పుడూ మీరు ఇష్టపడేదాన్ని చేయండి. కానీ దానికి సిద్ధంగా ఉన్నారా, లేదా అని ఒకసారి మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి. ఎందుకంటే అందుకు దేనికీ లొంగని బలమైన స్వతంత్ర వ్యక్తిత్వం ఉండాలి. కానీ ప్రార్థించడానికి, అడుక్కోవడానికి, యాచించడానికి ఇవేమీ అవసరం లేదు. ఎల్లప్పుడూ మీలాగే మీ పొరుగువారిని ప్రేమించండి. కానీ మొదట మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి. మీలాగే మీ పొరుగువారిని ప్రేమించడం అంటే అద్దంలో మీ రూపాన్ని ప్రేమించడమే. ఇదేం గొప్ప ధర్మం కాదు. పొరుగువారు మీకు అనుకూలంగా ఉన్నా లేదా మీకు వ్యతిరేకంగా ఉన్నా, అతను మీకు నైతికంగా కనిపిస్తున్నా, అనైతికంగా ఉన్నా అతను మానవుడు. అతను తనలా తానుగా ఉండటానికి ప్రతి అర్హతను కలిగి ఉన్నాడు. అతన్ని అలాగే ప్రేమించండి. మీ ప్రేమ తప్పక చేయవలసిన ఒక విధిగా ఉండకూడదు. కానీ అంతకంటే ముందు మిమ్మల్ని మీరు ప్రేమించుకోవాలి. కానీ మిమ్మల్ని మీరు ప్రేమించుకుంటున్నారా అని ప్రశ్నించుకోండి. ఎందుకంటే తనను తాను ప్రేమిస్తున్న వ్యక్తిని కనుగొనడం చాలా అరుదు. ప్రజలు తమను తాము ద్వేషిస్తారు. వారు తమలా తాము ఉండటానికి ఎవ్వరూ ఇష్టపడరు. వారు వేరొకరిలా ఉండాలని కోరుకుంటారు.

నేను మీ సమకాలికుడను కాను.. కానీ మీకోసం నేను త్వరగా వచ్చాను. గంట గంటకూ మీరు నా ముందు పేలవంగా, బలహీనంగా, కలుపు మొక్కలుగా మారుతున్నారు. మీ నేల బలహీనమయిపోతుంది. త్వరలో మీరు నా ముందు అలిసిపోయి నిలబడతారు. అప్పటికి మీరు నీటికోసం కాకుండా అగ్నికోసం ప్రాకులాడుతారు. శాంతికోసం కాకుండా యుద్ధానికి ఎక్కువ సిద్ధమవుతున్నారు. మీరు జీవితం కన్నా మరణం కోసం ఎక్కువ సృష్టించుకుంటున్నారు. కానీ అగ్నిని కూడా తన సృజనాత్మకశక్తికి ఉపయోగించుకోవచ్చని మీరు మర్చిపోయారు. అగ్ని ఎప్పుడూ తటస్థంగానే ఉంటుంది. అన్ని శక్తులూ తటస్థంగా ఉంటాయి. వాటిని ఎలా ఉపయోగించుకోవాలో అది మీపైనే ఆధారపడి ఉంటుందని చెప్పి అక్కడి నుండి కోపంగా వెళ్ళిపోయాడు జరతూస్త్ర.

❖ ❖ ❖

# జరతూస్త్ర యొక్క కోతి

జరతూస్త్ర తానుంటున్న గుహకు రావడానికి మధ్యలో ఉన్న అనేక నగరాల గుండా నడుస్తున్నాడు. ఒక పెద్ద నగరం యొక్క పొలిమేరల దగ్గర అక్కడి ప్రజలు 'జరతూస్త్ర యొక్క పెంపుడు కోతి' అని పిలవబడే తన శిష్యుడు జరతూస్త్రకి ఎదురవుతాడు.

జరతూస్త్ర అతని మాటలు వినడానికి నిరాకరిస్తాడు. ఎందుకంటే అవి జరతూస్త్ర బోధనలను పోలి ఉన్నాయి. జరతూస్త్రని అతడు ఆ నగరంలోకి వెళ్ళొద్దని హెచ్చరిస్తాడు. తనను ప్రశంసించనందుకుగాను, తన బోధనలను ఆ నగర ప్రజలు పట్టించుకోనందుకుగాను అక్కడి ప్రజలను ఎగతాళి చేసాడు అతను. అతడు తన శ్రోతలను ఈ నగరంపై ఉమ్మి వేయమని, అక్కడి ప్రజలను తక్కువ చేసి చూడమని వేడుకున్నాడు. అందుకే ప్రజలు ఈ గురువును 'జరతూస్త్ర యొక్క పెంపుడు కోతి' అని పిలుస్తారు. ఎందుకంటే అతను జరతూస్త్ర మాటలను అనుకరిస్తాడు. అయినప్పటికీ అతని బోధన అసంపూర్ణంగా ఉంది. అతను నగరాన్ని దుర్భాషలాడుతున్నప్పటికీ తరువాత ఉద్భవించే సూపర్ మాన్ గురించి అతనికి ఎలాంటి దూరదృష్టి లేదు.

జరతూస్త్ర ఆ నగరం వైపు చూసాడు. దానిపై అతనికి అసహ్యం వేసినప్పటికీ, అతను ఆ కోతికి ఎక్కడైతే ప్రేమ అనేది ఉండదో అక్కడినుండి వెళ్లిపోవడం

ఉత్తమం అని సలహా ఇస్తాడు. తన బోధనలు ఎలా వక్రీకరించబడ్డాయో తెలుసుకున్నాడు. జరతూస్త్రను ఎగతాళి చేసినట్లే ప్రజలు ఈ కోతిని కూడా ఎగతాళి చేసారు. కానీ జరతూస్త్ర ఈ వ్యక్తిపై కోపంగా ఉన్నాడు.

జరతూస్త్ర మరియు అతని శిష్యుడు ఇద్దరూ ప్రజలపై ఏహ్యాభావం చూపించినప్పటికీ, అతని శిష్యుని ఏహ్యాభావం అతని అహంకారం గాయపడడం వల్ల వచ్చిందని జరతూస్త్ర తెలుసుకున్నాడు. జరతూస్త్ర యొక్క ఏహ్యాభావం మనిషిపట్ల ఉన్న ప్రేమ ద్వారా పుట్టింది. ఆ ఏహ్యాభావం ప్రజలు వారి మూర్ఖత్వం, సామాన్యమైన జీవనవిధానాలకు అలవాటు పడకుండా సూపర్ మాన్ దిశగా నడిపించడానికి, వారిలో ఉన్న సూపర్ మాన్‌ని నిద్రలేపడానికి, వారి శక్తి సంకల్పాలను వారికి గుర్తుచేయడానికి మాత్రమే. అతను జరతూస్త్ర యొక్క మాటలనే బోధిస్తున్నప్పటికీ, సూపర్ మాన్ కోసం తనను తాను చేసుకోవాల్సిన అంతిమ త్యాగం గురించి అతను అర్థం చేసుకోలేదని గుర్తిస్తాడు జరతూస్త్ర.

❖ ❖ ❖

# మతప్రబోధకులు

మునుపటి అధ్యాయంలో మూర్ఖగురువు చేసిన ప్రసంగానికి సమాధానంగా జరతూస్త్ర తనను అనుసరించేవారికి మరియు తన నిజమైన శిష్యులకు మధ్య తేడాను వివరిస్తాడు.

ఎవరైతే నాలాంటి సంకల్పం కలిగి ఉంటారో వారు నాలాంటి అనుభవాలను ఎదుర్కోవలసి ఉంటుంది. ఎందుకంటే నా అనుభవాలన్నీ నా చైతన్యంపై ఆధారపడి ఉంటాయి. బయటి విషయాలపై ఆధారపడవు. అవి నా అంతర్గత దృష్టిపై ఆధారపడి ఉంటాయి.

నాలాంటి చైతన్యం కలిగి ఉన్న వ్యక్తికి మొదట సహచరులుగా ఉన్న శిష్యులు మృతకళేబరాల వంటివారు. వారు చాలాకాలం క్రితం చనిపోయారు కానీ ఇంకా ఖననం చేయబడలేదు. వారు ఇప్పటికీ మధ్యలో తిరుగుతున్నారు. పాత అలవాటులో భాగంగా వారు ఇదివరకు చేసిన పనులనే మరల మరల చేస్తుంటారు. వారు ప్రతిదీ అర్థం చేసుకున్నట్లు నటిస్తారు. కానీ వారేమీ అర్థం చేసుకోలేరు. వారు మూర్ఖులు.. కానీ వారు చాలా తెలివైనవారుగా నటిస్తారు. ఇలాంటి మూర్ఖుల

పని ఎప్పటికప్పుడు నేను అందరికంటే తెలివైనవాడిని అని నిరూపించుకోవడం, దానికోసం ప్రతి ఒక్కరినీ ఎగతాళి చెయ్యడం, నవ్వులపాలు చెయ్యడం. ఇది వివేకం అనిపించుకోదు. ఈ రకమైన శిష్యులు మొదటినుండి నా బోధనలు వింటారు. ఇతరులకు బోధిస్తారు. కానీ ఇబ్బందులు ఎదురైనప్పుడు, ఒత్తిడులను స్వీకరించే ధైర్యం లేనప్పుడు తిరిగి తన సాంప్రదాయ బోధనలకు సంబంధించిన దేవుని దగ్గరకు వెళ్తారు. అటువంటి వారిని నేను నా శిష్యులుగా భావించలేను.

రెండవ రకం సహచరులు: విశ్వాసులు.. నిరంతరం మేము నిన్ను నమ్ముతున్నామని నిరూపించే అన్వేషణలో ఉంటారు. ఇటువంటి సహచరులు నమ్మకం లేకుండా జీవించలేరు. వీరి నమ్మకానికి ఎటువంటి నిజాయితీ ఉండదు. అది నిజం అని నమ్మించడానికి నటిస్తారు కూడా. వీరు అజ్ఞానులు, కానీ వారు అజ్ఞానులుగా ఉండటానికి ఇష్టపడరు.

వారి అజ్ఞానాన్ని కప్పిపుచ్చుకోవడానికి ఉన్న సులభమైన మార్గం సాధ్యమైనంత ఎక్కువ నమ్మకాలను కలిగిఉండడం. అటువంటి నమ్మకాలు గుడ్డివానికి అవసరం. ఎందుకంటే అతను గుడ్డివాడు కాదని, కాంతి గురించి తనకంతా తెలుసని ప్రపంచానికి నిరూపించాలనుకుంటాడు. కాంతి గురించి మాట్లాడడం ద్వారా తనకు కళ్ళు ఉన్నాయనే భ్రమలో జీవిస్తూ ఉంటాడు. అతను సత్యం గురించి మాట్లాడుతాడు. అలా మాట్లాడటం ద్వారా ఆ విషయాల గురించి తనకు బాగా తెలుసని తనని తాను ఒప్పించుకుంటాడు. అందుకే సత్యం గురించి వారికేమీ తెలియదు. అవన్నీ వారి నమ్మకాలు. 'నమ్మకం' ప్రపంచంలో భయంకరమైన విషం. అది మనిషిలో ఉన్న సూపర్ మాన్‌ని ఎదగనియ్యకుండా నిరోధిస్తుంది. అది మానవాళి తెలివితేటలను నాశనం చేస్తుంది. మానవాళిని మానసిక వికలాంగులుగా చేస్తుంది.

మానవుడు చాలా పరిజ్ఞానం కలిగి ఉన్నాడు. చాలా నేర్చుకుంటాడు, గౌరవించబడతాడు. కానీ అతని లోతుల్లో అంతా చీకటే. అతని జ్ఞానం అతనికి ఆ గౌరవాన్ని తెచ్చిపెట్టొచ్చు. బహుమతులను తెచ్చిపెట్టొచ్చు. కానీ ఆ జ్ఞానమంతా పైపైనదే అని, అదంతా అరువు తెచ్చుకున్నదేనని అతనికి తెలుసు. కానీ జ్ఞానం అతనికి ఎటువంటి పరివర్తనను తీసుకురాదు. ఇది మానవాళిలో కపటత్వాన్ని సృష్టిస్తుంది. వారు తమ నమ్మకవ్యవస్థ ప్రకారం బ్రతుకుతున్నామని నమ్ముతూ

నటిస్తూ ఉంటారు. కానీ వాస్తవానికి వారు దాని ప్రకారం జీవించలేరు. ఎందుకంటే అవి వారి సొంత అనుభవాలు కాదు కాబట్టి. అటువంటి వారు బహిరంగప్రదేశాల్లో ముసుగుని ధరించి ఉంటారు. ఇటువంటివారు తమ నమ్మకాలని పక్కన పెడితే సత్యాన్ని తెలుసుకున్నవారవుతారు.

ఉల్లాసమైన గొర్రెల మందలో గొర్రెల లాంటివారు వీరు.. కానీ మొదటిరకం సహచరుల్లా మూర్ఖులైతే కారు. ఎందుకంటే వారి నమ్మకం వలన వారు రక్షింపబడతారు అనే చిన్న ఆశ వారిలో ఉంది. వారి ప్రేమ పైపైనే అయినప్పటికీ పూర్తి ప్రేమతో నిండి ఉన్నట్టు నటిస్తారు.

ప్రేమగా ఎలా ఉండాలి, ప్రేమను ఎలా నటించాలి అనే విషయాలు వీరికి బాగా తెలుసు. వీరు పూర్తిగా వివేకంతో నిండి ఉన్నట్టు నటిస్తారు. కానీ నిజానికి వారికేం తెలియదు. కానీ ప్రతిదీ తెలుసు అనుకుంటారు. అందుకే వీరిలో అడుగడుగునా మూర్ఖత్వం కనపడుతుంది. వీరు పూర్తి అపరిపక్వదశలో ఉంటారు. పిల్లల మనస్సు ఎల్లప్పుడూ ఎవరో ఒకరు వారిని రక్షించాలని, వారి ఆలనాపాలనా చూసుకోవాలని కోరుకుంటుంది. అది తండ్రి కావొచ్చు.. తల్లి కావొచ్చు... దేవుడు కావొచ్చు.

గుర్తుంచుకోండి మనస్సాక్షి, పూర్తి చైతన్యం ఉన్న ఏ మనిషీ ప్రార్థించడు.

ఎవరి కోసం ప్రార్థించాలి?

ఎవర్ని ప్రార్థించాలి?

ఎందుకు ప్రార్థించాలి?

చైతన్యం ఉన్న ఏ వ్యక్తయినా తన బాధ్యతలకు, తన జయాపజయాలకు తానే పూర్తిగా బాధ్యత వహిస్తాడు. అంతేగాని ఆ బాధ్యతలను దేవుని భుజాలపై వెయ్యడానికి అతను ఇష్టపడడు. అతను నొప్పితో బాధపడుతున్నా.. దాని బారిన పడకుండా, అప్రమత్తంగా, జాగ్రత్తగా ఎలా ఉండాలనే విషయం అతనికి తెలుసు. ఎందుకంటే ప్రతిదీ గడిచిపోతుంది. ఆనందం గడిచినట్లే, బాధ కూడా గడిచి పోతుందనే విషయం అతనికి తెలుసు. ప్రార్థించడం పిరికితనంతో సమానం. సహాయం కోసం ప్రార్థించడం అంటే మీరు లొంగిపోతున్నారని, మీ శక్తి సామర్థ్యాలను మీరే అవమానపరుస్తున్నారని అర్థం. ప్రార్థించడం చాలా నీచమైనది.

కానీ మీకు మీరుగా రూపాంతరం చెందడం అనేది మనోహరమైనది. కల్పితమైన దేవుళ్ళ నుండి లేదా తాను రక్షకుడని చెప్పే కల్పిత బోధకుల ముందు బిచ్చగాడిలా అర్థించకుండా ఉండడం.. ప్రార్థించకుండా ఉండగలడం ఇంకా మనోహరమైనది. కానీ మీ లోపల 'పిరికితనం' అనే దెయ్యం ఉంది. అది కష్టసమయాల్లో దేవుడు ఉన్నాడనీ మిమ్మల్ని బలవంతపెట్టేలా, తన ముందు మోకరిల్లేలా చేస్తుంది. దెయ్యం మీ పిరికితనానికి చిహ్నం. మీ పిరికితనమే దేవుణ్ణి కనిపెట్టింది. మిమ్మల్ని రక్షించడానికి, మీకు తండ్రిగా ఉండటానికి ఒక దేవుడు అవసరం అయ్యాడు. ఎందుకంటే మీరు పరిణతి చెందినవారు కాదు. అందుకే ప్రభువు అయిన తండ్రి అవసరం ఉందని మిమ్మల్ని మీరు ప్రలోభ పెట్టుకున్నారు. మీ పిరికితనం మిమ్మల్ని జీవితంలో ఉన్న ఆటుపోట్లను చూసి భయపడేలా చేసింది. మీ సౌకర్యవంతమైన ఈ నమ్మకానికి భంగం కలిగించేదేదైనా మిమ్మల్ని భయపెట్టేదే. మీకు తండ్రి అవసరం ఉండకూడదు. మీ పిరికితనాన్ని వదులుకునేంత పరిపక్వతతో మీరుండాలి. కానీ మీ పిరికితనంలో మీ దేవుడు కూడా చీకటిలో నీడలా కనిపించకుండా పోతాడు.

చీకటి కావొస్తుంది.. దూరాన ఉన్న కాంతిని చూసి ప్రజలు భయపడు తున్నారు.. ఎందుకంటే కాంతి వారిని బహిర్గతం చేస్తుంది. వారు దానిని ఎదుర్కొనే, స్వాగతించే సమయం ఆసన్నమైంది. ప్రజలు ఇప్పటివరకు చీకటిలో వారి వారి నమ్మకాలతో ప్రశాంతంగా జీవించారు. కానీ చీకటి వారికి విశ్రాంతి తీసుకునే సమయం కాదు. ఎందుకంటే విశ్రాంతి తీసుకుంటున్న సమయంలోనే ఎక్కువ సందేహాలు తలెత్తుతాయి. అతను ఉద్రిక్తంగా ఉండాల్సిన అవసరం ఉంటుంది. ఎటువంటి సందేహలూ తలెత్తకుండా ఉండటానికి జాగ్రత్త పడాల్సి ఉంటుంది.

ఎందుకంటే అప్పటివంకూ తనలో ఉన్న అన్ని రకాల సందేహాల్ని అణిచివేసి ఉంచాడు. ఏ బలహీనమైన క్షణంలోనైనా ఆ సందేహాలన్నీ బయటికి రావొచ్చు. మీరు జాగారం చేస్తున్నప్పటికీ ఆ సందేహాలు మిమ్మల్ని భయపెట్టక మానవు.

తమ రక్షకుడు వచ్చి తమని రక్షిస్తాడు లాంటి నమ్మకాలతో జీవిస్తున్న ప్రజలు నిద్రకు చాలా భయపడతారు. ఎందుకంటే నిద్రలో కలలు రావచ్చు. ఆ కలలు వారు అణచివేసిన సందేహాల యొక్క సమాధానాలు కావొచ్చు. అప్పుడు వారిలో చాలామంది నిద్రపోకుండా జాగారం చేస్తారు.

గత రాత్రి బాగా బాధల్లో వుండి, జాగారం చేసే ఇద్దరు ముసలివారి మాటలను నేను గోడ చాటునుండి విన్నాను.

అందులో ఒకడు "ప్రభువైన మన తండ్రి అతని బిడ్డలమైన మనల్ని సరిగ్గా చూసుకోవడం లేదు అనిపిస్తుంది. అతని కంటే మానవ తండ్రులే తమ పిల్లల్ని బాగా చూసుకోగలరు.." అన్నాడు.

"దేవుడు చాలా ముసలోడు అయ్యాడు.. అతనికి వయసు అయిపోయింది. తన బిడ్డలను తాను చూసుకోలేనంత బలహీనుడు కూడా అయ్యాడు" అని రెండోవాడు సమాధానమిచ్చాడు.

"నిజంగా దేవునికి పిల్లలు ఉన్నారా అని నా అనుమానం. దానిని నిరూపిస్తే అతనే నిరూపించాలి. అతను నిరూపించలేకపోతే ఎవరూ నిరూపించలేరు.. అతను దానిని ఒకసారి నిరూపిస్తే చూడాలని, చాలాకాలంగా ఎదురుచూస్తున్నాను" అన్నాడు మొదటివాడు.

"నిరూపించడమా..! అతను ఎప్పుడైనా దేన్నైనా నిరూపించడం చూసావా? అతను నిరూపించడం చాలా కష్టం.. కానీ తన బిడ్డలు తనపట్ల పూర్తిగా నమ్మకంతో ఉండాలని మాత్రం అనుకుంటున్నాడు" అన్నాడు రెండోవాడు.

"అవును అవును.. అతన్ని నమ్మడం.. అతనిపై నమ్మకం ఉంచడం అతనికి సంతోషాన్నిస్తుంది, వయస్సు మీద పడ్డవారు అలాగే అనుకుంటారు" అన్నాడు మొదటివాడు.

... అయినా ఇలాంటి సందేహాలన్నిటికీ కాలం తీరిపోయింది కదా..! ఇంకా ఈ నిద్రపోయిన అంధకారాన్ని తిరిగి లేపేదెవరు..? అనుకున్నాడు జరతూస్త్ర.

ముసలి దేవుళ్లందరికి ముగింపు చాలాకాలం క్రితమే వచ్చింది. వాళ్ళంతా ఒక్క జోక్‌కి పగలబడి నవ్వుతూ చనిపోయారు..

ఆ జోక్ వాళ్లలోనే ఒకడైన ఎల్లప్పుడూ అసూయతో రగిలిపోయే, తెల్లగా, బాగా నెరిసిన గడ్డంగల దేవుడు నుండి వచ్చింది.. అదేంటంటే...

"దేవుడు ఒక్కడే.. ఆ దేవుడ్ని కూడా నేనే.. నా ముందు కానీ, నా తరువాత కానీ దేవుళ్ళు లేరు" అని..

అప్పుడు దేవుళ్లందరూ వారు కూర్చున్న కుర్చీలు సైతం ఊగిపోయేలా పగలబడి నవ్వుతూ “దైవభక్తి ఖచ్చితంగా లేదు, కానీ దేవుళ్ళు ఉన్నారు. కానీ నువ్వొక్కడివే దేవుడివైతే కాదు” అని బిగ్గరగా నవ్వుతూ ఆ జోక్‌కి దేవుళ్లందరూ మరణించారు.

మోట్లీ కౌ పట్టణంలో తన ప్రసంగం ముగించాక జరతూస్త్ర తిరిగి తాను ఉంటున్న గుహకి వెళ్లాలని, తన జంతువులను మరొకసారి కలుసుకోవాలని అనుకున్నాడు. అక్కడినుండి తన ఇంటిని చేరుకోవడానికి రెండు రోజులు ప్రయాణించాలి జరతూస్త్ర. అయినప్పటికీ జరతూస్త్ర తిరిగి తన ఇంటికి వెళు తున్నందుకు గాను చాలా సంతోషంగా ఉన్నాడు.

❖ ❖ ❖

# స్వగృహానికి రాక

చిన్నపిల్లవాడు తన తల్లివైపు ఆనందంగా పరుగెత్తుకుంటూ వస్తున్నట్టు, తనకి ప్రపంచానికి ఎటువంటి సంబంధం కానీ, ఇతరుల గురించి పట్టించు కోవాలనే వేదన కానీ లేకుండా పట్టలేని సంతోషంతో జరతూస్త్ర తన ఇంటికి వస్తున్నాడు.

శిశువు తల్లిగర్భంలో సంపూర్ణ భద్రతతో ఎలాంటి బాధలు లేకుండా ప్రశాంతంగా జీవిస్తాడు. అక్కడ అతనికి ఎలాంటి బాధ్యతలు, ఆందోళనలు, బాధలు లేకుండా పూర్తి సంతోషంతో ఉంటాడు. ఎప్పుడైతే అతను జన్మిస్తాడో అప్పుడు తన ఇంటి నుండి తననెవరో గెంటేసినట్టు, ఎలాంటి చీకూ చింతా లేని తన ఆనందమైన జీవితాన్ని ఎవరో లాగేసుకున్నట్టు బాధపడతాడు. అకస్మాత్తుగా తనకేం తెలియని ఒక వింత ప్రపంచంలో, తనకెలాంటి సంబంధం లేని పూర్తి అపరిచిత వ్యక్తుల మధ్యలో, పూర్తి కొత్త విషయాల మధ్యలో, తన జీవితానికి ఎలాంటి రక్షణ కానీ, ప్రశాంతత కానీ లేని ప్రపంచంలోకి నెట్టివేయబడతాడు. కానీ తల్లిగర్భంలో ఆ తొమ్మిది నెలల అనుభవం మనిషికి మరల అలాంటి ఇంటినే కనుగొనాలనే విపరీతమైన కోరికకు ముఖ్య కారణం. నిజమైన ఇల్లు అంటే ఏకాంతంలో తనని తాను తెలుసుకోవడం. మానవుడు బయట ఎక్కడి కెక్కడికో తిరుగుతూ ఉంటాడు. కానీ అతను బయటికి ఎంత ఎక్కువ దూరం

వెళ్తే అతను తననుండి తాను అంత ఎక్కువ దూరం వెళ్తున్నట్టు. అతను ఇంటిని వెతుకుతూ ఉండవచ్చు, కానీ వాస్తవానికి అతను ఇంటి నుండి దూరంగా వెళు తున్నాడు. మీ ఇల్లు ఎక్కడో లేదు. అది మీలోనే ఉంది. మీరు శోధించడం ఆపివేసినప్పుడు పూర్తి ప్రశాంతతతో మీలోకి మీరు తొంగిచూసినప్పుడు మాత్రమే మీ ఇంటిని కనుగొంటారు. మనుషులకు ఇతరులతో ఎలా ఉండాలో తెలుసు. గుంపులో ఎలా ఉండాలో తెలుసు. కానీ తనతో తాను ఎలా ఉండాలో అనే భాషను పూర్తిగా మరిచిపోయాడు. మీకు మీరు ఎప్పుడూ అపరిచితులు కారు. మీ ఏకాంతం, మీరు వేరు వేరు కాదు. రెండు ఒక్కటే. అక్కడ మీలో మీకు ఎలాంటి పరిచయాలు కానీ, ప్రశ్నలు కానీ అవసరం లేదు.

ఇతర విషయాల కోసం తిరిగి తిరిగి అలిసిపోయిన జరతూస్త్రకి తన ఏకాంతంలోకి తిరిగి రావడం తన తల్లిగర్భంలో ఉన్న ప్రశాంతతని, ఆనందాన్ని తెచ్చిపెట్టింది. జరతూస్త్ర తన అంతరాత్మతో మాట్లాడడం మొదలుపెట్టాడు.

నా ఏకాంతం యొక్క లోతులలో ఉనికి నా ద్వారా పాటలు పాడుతుంది. నృత్యం చేస్తుంది. ఉనికి మానవాళి యొక్క 'సృజనాత్మకత' ద్వారా తనని తాను వ్యక్తీకరించాలని కోరుకుంటుంది. ఈ అస్తిత్వానికి నేనొక వాహకం మాత్రమే. పూర్తి ఏకాంతంలో ఉపన్యాసాలు, బోధనలు అసలే ఉండవు. ఎదురుగా వేరొకరు ఉన్నప్పుడే ఏదైనా తెలియజేయడానికి ఉపన్యాసాలు, బోధనలు కనుగొనబడ్డాయి. పూర్తి ఏకాంతంగా ఉన్నప్పుడు బోధనల యొక్క పనితీరు పూర్తిగా అదృశ్య మవుతుంది. వివేకవంతుడైన ఈ జరతూస్త్ర ఉత్తమ లక్షణం ఏంటంటే అన్నీ మర్చిపోయి ముందుకు సాగడం. నేను ప్రజలను ఒప్పించటానికి ప్రయత్నించాను కానీ వారు నన్ను చూసి నవ్వుకున్నారు. నేను ప్రజలతో వాదించడానికి వివిధ మార్గాల్లో ప్రయత్నించాను కానీ వారు నన్ను పిచ్చివాడని భావించారు. వారు నన్ను చూసి వినోదించారు.

వేలాది సంవత్సరాలుగా మనుషులు మాట్లాడుతూనే ఉన్నారు. ప్రతి ఒక్కరికి ఎలా మాట్లాడాలో తెలుసు. కానీ ఆ మాటల్ని అర్థం చేసుకునే వ్యక్తిని కనుగొనడం చాలా అరుదు. ఎవరూ వినరు. వినకపోతే, వారెలా అర్థం చేసుకోగలరు? అపార్థం చేసుకోవడం చాలా సులభం. అర్థం చేసుకోవడం కష్టతరం. నా విషయంలో జరిగింది కూడా ఇదే.

గొప్ప ప్రమాదం ఎల్లప్పుడూ పూర్తి ఆనందం లేదా పూర్తి బాధలో ఉండడంలోనే ఉంటుంది. రెండూ ప్రకృతికి వ్యతిరేకం. ప్రకృతి దాని అన్ని కార్యకలాపాలలో ఎల్లప్పుడూ సమతుల్యంగానే ఉంటుంది. మానవుడు ఉంటే ఏ విషయంలోనైనా అతిగా ఉంటాడు. లేకపోతే అల్పంగా ఉంటాడు. దేంట్లోనైనా ఎక్కువగా మునిగిపోవలసిన అవసరం లేదు. లేకపోతే మీ ఆనందం మిమ్మల్ని ఇంకా నాశనం చేస్తుంది. అలా అని దేనినీ ఎక్కువగా అణచివేయవలసిన అవసరం లేదు. ఎందుకంటే అణచివేత కూడా మిమ్మల్ని నాశనం చేస్తుంది. జీవితంలో ప్రతి విషయంలో సమతుల్యతను కలిగి ఉండాలి. సమతుల్య జీవితం ఆరోగ్యకరమైన జీవితం. జీవితం ఒక బిగుతుగా కట్టబడిన తాడుపై నడవడం లాంటిది. ప్రతి క్షణం సమతుల్యతను పాటించాలి. కుడివైపుకు వాలుతుంటే బ్యాలెన్స్‌గా ఉండడానికి వెంటనే ఎడమవైపు మొగ్గుచూపాలి. ఎడమవైపు ఎక్కువగా వాలుతుంటే బ్యాలెన్స్‌గా ఉండడానికి కుడివైపు మొగ్గుచూపాలి. అసలు విషయం ఏమిటంటే మీరు ఎడమవైపు లేదా కుడివైపు మొగ్గుచూపుతున్నారా అనేది కాదు. అసలు విషయం మీరు తాడుమీద ఉండి సమతుల్యతతో వెళ్తున్నారా లేదా అన్నదే ముఖ్యం.

నేను మనుష్యుల మధ్య నివసించినప్పుడు చాలా సత్యాలను దాచవలసి వచ్చింది. ఎందుకంటే అవి వారికి అర్థం కావు. వారు వాటిని తప్పుగా అర్థం చేసుకోవచ్చు. అవి వారికి చెప్పడంలో ఎటువంటి అర్థం లేదు. కానీ ఏకాంతంలో నేనేం దాచాల్సిన అవసరం లేదు. దేనినీ వెనక్కి తీసుకోవలసిన అవసరం లేదు. నేను పూర్తిగా మరియు స్పష్టంగా ఉన్నాను. నేను జాలి వలన చాలాసార్లు అబద్ధాలు చెప్పవలసి వచ్చింది. నిజాల్ని దాచవలసి వచ్చింది. నిజాయితీగా, చిత్తశుద్ధితో ఉండాలని కోరుకునే ఎవరైనా మానవాళిపట్ల ఉన్న ప్రేమ వలన నలిగిపోతారు. అయినప్పటికీ పరిస్థితులు ఎటువంటివైనా వారు వాటిని వ్యక్తపరచడానికి సిద్ధంగా ఉంటారు.

మంచి వ్యక్తులను కనుగొనడం చాలా అరుదు కూడా. వారి మూర్ఖత్వానికి పరిమితులు ఉండవు. చాలామంది మంచి వ్యక్తులను చూస్తూ, మంచి వ్యక్తులను వదిలించుకోకపోతే మూర్ఖత్వం నుండి బయటపడలేము, అన్ని రకాల మూర్ఖపు

ఆలోచనలను వదిలించుకోలేము అనే నిర్ణయానికి వచ్చారు. మానవాళికి కావాల్సింది మంచి వ్యక్తులు కాదు. తెలివైన వ్యక్తులు కావాలి. మీ తెలివితేటలు మిమ్మల్ని నడిపిస్తే, ఆ జీవితం మంచి జీవితం అవుతుంది. కానీ మంచి జీవితమే లక్ష్యం కాకూడదు. పదునైన గొప్ప తెలివితేటలు ఉండాలి.

నేను మనిషిని ప్రేమిస్తున్నాను. అదే మనిషిని ద్వేషిస్తున్నాను కూడా. మనిషి తనకు మించిన శక్తిసామర్థ్యాలు ఉన్నందున నేను అతన్ని ప్రేమిస్తున్నాను. మనిషి తన శక్తిసామర్థ్యాల్ని ఎప్పుడూ ఉపయోగించుకోలేదు కాబట్టి నేను అతన్ని ద్వేషిస్తున్నాను. ప్రస్తుత మనిషి ఇంకా విత్తనం దశలోనే చిక్కుకున్నాడు. నేను మానవసమూహాన్ని అనుసరించకపోవడానికి కారణం.. వారివద్ద అపారమైన సంపద ఉంది కానీ వాటిని వారు అన్వేషించడం లేదు. నేను మానవాళిని ప్రేమిస్తున్నందున మానవాళిని ద్వేషిస్తున్నాను. ఇందులో ఎటువంటి వైరుధ్యం లేదు.

సూపర్ మాన్ మీనుండి జన్మించాలని కోరుకుంటున్నాను. నేను సూపర్ మాన్‌ని ప్రేమిస్తున్నాను. సామాన్య మానవుడు అదృశ్యం కావడానికి సిద్ధంగా ఉంటే తప్ప సూపర్ మాన్ ఉనికిలోకి రాడు. విత్తనం నేలలో చనిపోవాలి. అప్పుడే అందమైన ఆకుపచ్చ మొలకలు పెరగడం ప్రారంభిస్తాయి. అలాగే సూపర్ మాన్‌కి ఉనికిలో చోటు ఇవ్వడానికి ప్రస్తుత మానవుడు మరణించాలి. అందుకే ఒకవైపు నేను మనిషిని ప్రేమిస్తున్నాను ఎందుకంటే అతను విత్తనం దశలో ఉన్నాడు. అదే మనిషిని ద్వేషిస్తున్నాను ఎందుకంటే ఆ విత్తనం సూపర్ మాన్ పెరగడానికి అనుమతించడం లేదు. విత్తనం సూపర్ మాన్‌కి గర్భంలా మాత్రమే ఉండాలి కానీ ఆ విత్తనం సూపర్ మాన్‌కి జైలులా మారింది. సరైన నేల, సమయం వచ్చినప్పుడు విత్తనం వెంటనే చనిపోవడానికి సిద్ధంగా ఉండాలి. అప్పటివరకు విత్తనం ఒక రక్షణగా మాత్రమే ఉండాలి. సరైన సమయం వచ్చినప్పుడు తాను చనిపోవలసి ఉంటుంది. అప్పుడు విత్తనం తనను తాను ప్రేమించడం ప్రారంభిస్తుంది. సూపర్ మాన్ ఈ భూమిని స్వర్గంగా మార్చగలిగితే సాధారణ మానవజాతి ఈ భూమి నుండి కనుమరుగవుతుంది.

❖ ❖ ❖

# అర్థం చేసుకోవలసిన మూడు గుణాలు

జరతూస్త్ర పడుకొని ఒక అందమైన కలకంటున్న సమయంలో తెల్లవారు జామున సూర్యకిరణాలు అతన్ని అసూయతో నిద్రలేపాయి. ఆ కలలో జరతూస్త్ర భూమిమీద ఉన్న ఎత్తైన ఒక పర్వత శిఖరంపై నిలబడి ఏకాంతంగా, ఎటువంటి భయం కానీ, ఆసక్తి కానీ కనబరచకుండా ఈ ప్రపంచమంతా నాకు అర్థం అయ్యింది అన్నట్లు కిందకి చూస్తున్నాడు.

జరతూస్త్ర మేల్కొన్నప్పుడు, అతను ప్రపంచంలోని అర్థం చేసుకోవలసిన మూడు గుణాల గురించి తనలో తాను మాట్లాడుకుంటాడు.

అన్ని మతగ్రంథాలు మానవాళి నుండి అసహజమైనవాటిని, నెరవేర్చడానికి వీలుకానటువంటి సవాళ్ళను వారి ముందుంచి, మానవుడ్ని తప్పు చేసావన్న అపరాధభావనకు గురిచెయ్యడం వాటి ముఖ్య ఉద్దేశ్యం. అందుకు వారు ఎంచుకున్న ఏకైక మార్గం అతని దగ్గర నుండి అసహజమైనవాటిని ఆశించడం. అతను ఏ విధంగా ప్రయత్నించినా విఫలం అవ్వడమే వారి ప్రధాన ఉద్దేశం. సమస్త మానవాళిని అపరాధభావానికి గురిచెయ్యడం, వైఫల్యాలు, నిరాశ, దయనీయమైన జీవితాన్ని జీవించేలా చేయడం వారి ఉద్దేశం. మనిషి అహంకారాన్ని, అతని గౌరవాన్ని నాశనం చెయ్యాలి అనుకోవడం వారి లక్ష్యం. అతని అహంకారం, గౌరవం ఎంత ఎక్కువగా నాశనం అయితే అంత ఎక్కువగా అతను వారి ముందు ఒంటెలాగా మోకరిల్లుతాడు. అప్పుడు నా తలరాతింతే అని తనని తాను ఓదార్చుకుంటూ జీవితాంతం ఒంటెలా బ్రతికేస్తాడు.

అలా మానవాళిని తమ ముందు మోకరిల్లేలా చేసిన అంశాలు మూడు.

లైంగికవాంఛ..

అధికారవ్యామోహం..

స్వార్థం..

మానవుడు సాధ్యపడని విలువల ద్వారా తనని తాను క్రమశిక్షణగా ఉంచుకోవడానికి ప్రయత్నిస్తాడు. మానవాళి కూడా అటువంటివి తాము చేయలేరనే సాధారణ కారణంతోనే అవి సాధించినవారిని ఒక గొప్ప వ్యక్తిగా, సాధువుగా గౌరవిస్తుంది. కానీ అటువంటి వ్యక్తులకు రెండు ముఖాలు ఉంటాయి.

ఒకటి ప్రపంచానికి తెలిసింది. ఇంకొకటి తనకి మాత్రమే తెలిసిన ఇంకో ముఖం. ఎటువంటి హేతుబద్ధత, షరతులు లేకుండా ప్రతి మతం చేత ఖండించబడిన అంశాల్లో లైంగికవాంఛ మొదటిది.

మానవుడు శరీరాన్ని త్యజించినట్లయితే లైంగికవాంఛల్ని త్యజించినట్లే. అప్పుడు అతని సున్నితత్వం నెమ్మది నెమ్మదిగా చనిపోతుంది. ఆ సున్నితత్వం చనిపోతే అప్పుడు అతనొక శవం మాత్రమే. లైంగికవాంఛలు బలహీనులకు ఒక శాపం లాంటిది. కానీ అటువంటి బలహీనులు బలవంతులను పాలిస్తున్నారు. తెలివితేటలు లేనివారు తెలివైనవారికి జీవనవిధానాలను నిర్ణయిస్తున్నారు. గుంపు నువ్వు మతపరంగా జీవించాలని, వాళ్ళ ఆజ్ఞలు పాటించాలని చూస్తుంది. కానీ నైతికత, విలువలు ఎలాంటి మనోవికాసం లేని బలహీనమైన మూర్ఖుల చేత సృష్టించబడతాయి. అవి వారి జీవనవిధానానికి సుఖంగా ఉండొచ్చు. కానీ ఆ గొర్రెల మధ్యలోనే సింహాలు సంచరిస్తున్నాయనే విషయం వారు పూర్తిగా మర్చిపోయారు. ఆ గొర్రెలు బలవంతపెట్టినంత మాత్రాన సింహాలు గొర్రెలుగా మారవు. మీరు సింహాన్ని చుట్టుముట్టవచ్చు.. దాన్ని బంధించవచ్చు. సామాన్య మానవులచే, బలహీనులచే సింహాలు జైలుపాలవుతాయి, జనసమూహంతో బంధించబడతాయి. గొర్రెలు వాటి సంఖ్యాబలం కారణంగా వారికి అనుకూలంగా ఉండే జీవనశైలిని నిర్ణయించుకున్నాయి. కానీ అది సింహాలకి జైలుశిక్ష లాంటిది. ఒక మరణం లాంటిది.

శారీరకసుఖాలు పవిత్రమైనవి. అవి మిమ్మల్ని నాశనం చేస్తే అప్పుడది మీ బలహీనత అవుతుంది. కానీ మతాచార్యులు అని పిలువబడేవారు ఇంద్రియ సుఖాలను త్యజించమని మానవాళిని ఇంకా బలహీనులుగా మారుస్తున్నారు. ఒకవేళ ఈ సుఖాలు మిమ్మల్ని నాశనం చెయ్యాలని చూస్తే మీరు ఇంకా మరింత బలంగా ఉండాలి. మీరు మరింత బలంగా ఉండటానికిగల ధైర్యాన్ని, క్రమశిక్షణను మీకు మీరుగా ఇచ్చుకోవాలి. లైంగికవాంఛలను త్యజించకూడదు. ఆ బలహీనతను త్యజించాలి. ఈ శారీరకసుఖం ద్వారా ఇంకా గొప్ప ఆనందాలు సాధ్యమేనని గుర్తుంచుకోవాలి.

“అధిగమించండి.. కానీ ఎప్పటికీ త్యజించవద్దు. ఎందుకంటే త్యజించి నట్లయితే అధిగమించడానికి మానవునికి సవాళ్లనేవే ఉండవు.

సుఖాలను ఎన్ని రకాలుగా వీలైతే అన్ని రకాలుగా, సాధ్యమైనంత తీవ్రతతో ఆస్వాదించండి. అవి విరక్తి కలిగేలా ఆస్వాదించండి. అప్పుడు ఇంద్రియసుఖాల ప్రపంచం పూర్తయింది, తరువాత నేను దేనిని అధిగమించాలనే ప్రశ్న మీలో తలెత్తుతుంది.

ఈ ఆనందం మీకు మిగతావాటిని అధిగమించడానికి ప్రేరణగా నిలుస్తుంది. మీరు దానికి కృతజ్ఞతలు తెలుపుతారు. తద్వారా మీరు దానికి వ్యతిరేకంగా ఉండవలసిన అవసరం లేదు. ఇది మీనుండి ఏమీ తీసుకోదు. అదే మీకు ఆనందాన్ని ఇచ్చింది. శారీరకసుఖం స్త్రీ పురుషుల మధ్య వారధి లాంటిది. వారి మధ్య ఎంత ఎక్కువ దూరం ఉంటే అంత ఎక్కువ ఆకర్షణ ఉంటుంది. వారు ఒకరికొకరు ఎంత అపరిచితులైతే ఒకరినొకరు అర్థం చేసుకోవడానికి అంత ఎక్కువ లోతైన అన్వేషణ అవసరం ఉంటుంది. స్త్రీ, పురుషుల కలయిక ఒక అన్వేషణ. భిన్నమైన వ్యతిరేకత ధృవాలు ఒకదానికొకటి పూర్తిగా అర్థం చేసుకునే ఒక ప్రయత్నం. ఇక్కడ సమానత, అసమానత అనే ప్రశ్నే లేదు. వారు ఒకరికొకరు పూర్తిగా అపరిచితులు. వారి మధ్య స్నేహం మాత్రమే సాధ్యమవుతుంది.

రెండవది అధికార వ్యామోహం.

ఇది బానిసత్వాన్ని సృష్టించింది. మానవాళిని అనేక విధాలుగా నాశనం చేసింది. ఇది ప్రతి ఒక్కరి హృదయంలో మండుతూనే ఉంటుంది. జరతూస్త్ర దీనికి పూర్తిగా వ్యతిరేకం. కానీ జరతూస్త్ర 'శక్తి సంకల్పానికి' వ్యతిరేకం కాదు. దాన్నే జరతూస్త్ర 'సృజనాత్మకత' అంటాడు. శక్తి సంకల్పం పూర్తిగా భిన్నమైన విషయం. కానీ మతాలకు అధికార వ్యామోహమే అన్నీ. కానీ ప్రపంచంలో చాలా గొప్ప సృజనాత్మకశక్తిగా మారగల శక్తి చాలామందికి ఉందని జరతూస్త్ర భావిస్తాడు. శక్తి సంకల్పం అంటే ఇతరులపై అధికారం కాదు.

శక్తి సంకల్పం అంటే తనని తాను మరింత శక్తివంతంగా, మరింత ప్రకాశవంతంగా, మరింత బలంగా, మరింతగా సమగ్ర వ్యక్తిగా మలుచుకోవడం. శక్తి సంకల్పానికి ఇతరవాటితో సంబంధం ఉండదు. అది మీ సొంత వ్యాయామం. మీ అత్యున్నత శిఖరానికి చేరుకోవడం కోసం మీకు మీరుగా ఉండాల్సిన క్రమశిక్షణ. ఇది ఎవరికీ వినాశకరమైనది కాకపోగా ఇతరులకు ప్రేరణగా ఉంటుంది.

మూడవది స్వార్థం.

స్వార్థం కేవలం విషయాల స్వభావం అని అంటాడు జరతూస్త్ర. కానీ పిరికివాళ్ళు 'నిస్వార్థత' ధర్మంగా ఉండాలని కోరుకుంటారు. ఎందుకంటే నిస్వార్థంలో పిరికివారు విజేతలు అవుతారు కాబట్టి.

స్వార్థం ఒక్కటే నిజమైన ధర్మం.

నిస్వార్థం పిరికివారి కోరిక – వారికెవరైనా సహాయం చేయాలి, ఎవరైనా వారిని రక్షించాలి, ఎవరో ఒకరు వారి అనారోగ్యాలపట్ల శ్రద్ధ వహించాలి అనుకుంటూ ఉంటారు. కానీ మంచి సమాజం నిస్వార్థసేవ అవసరమయ్యే అన్ని రకాల అంశాలను నిరోధిస్తుంది. ప్రతి ఒక్కరూ తమ తమ బాధ్యతలను తన భుజాలపై వేసుకుంటేనే ఇది సాధ్యమవుతుంది. పంచుకోవడానికి చాలా ఎక్కువ వుండి పంచుకుంటే అది ఆనందం. కానీ తప్పక చెయ్యవలసిన 'విధి' ఎప్పుడూ ధర్మం కాదు. స్వార్థంపట్ల ఈ అభిరుచి తప్పనిసరి. అది జీవితపు లోతుల నుండి ఒక వ్యక్తిని సూపర్ మాన్‌గా ముందుకు నడిపిస్తుంది.

ఈ మూడు గుణాలను అర్థం చేసుకోవడం ద్వారా, నైతికత బోధనల నుండి మానవాళి తమను తాము రక్షించుకుంటూ, అధిగమించుకుంటూ మానవుడు సూపర్ మాన్ స్థితికి చేరుకోవాలి అంటాడు జరతూస్త్ర

❖ ❖ ❖

## ఆత్మ యొక్క గురుత్వాకర్షణ శక్తి

ఈ ఆత్మ యొక్క గురుత్వాకర్షణ శక్తి అంతకుముందు జరతూస్త్ర భుజంపై మరుగుజ్జు దెయ్యంగా కనిపించింది. కానీ జరతూస్త్ర దాని ముందు ఉంచిన పొడుపుకథతో దాని శక్తి తగ్గలేదు. ఈ శక్తి మానవాళికి దెయ్యం లాంటిది. ఎందుకంటే ఇది మానవాళిని వారిని వారు అధిగమించుకునే ప్రయత్నంలో వెనక్కి పట్టి లాగుతుంది. తన శరీరం సమాధిని వ్యతిరేకించడం ద్వారా జరతూస్త్ర ఈ ప్రసంగాన్ని ప్రారంభిస్తాడు. మానవుడు పరిగెత్తుతాడు, మాట్లాడతాడు, వ్రాస్తాడు.. ఇవన్నీ అతనికి జీవించి ఉన్నానని గుర్తుచేస్తాయి. ఆత్మ యొక్క గురుత్వాకర్షణ అనేది సమాధి యొక్క గురువు. ఇది సమాధి గురించి బోధిస్తుంది. ఆత్మ యొక్క గురుత్వాకర్షణ శక్తి దృష్టిలో సమాధి మాత్రమే జీవితానికి అర్థాన్నిస్తుంది.

ఎవర్ని వారు అధిగమించే ప్రక్రియలో నిమగ్నమై ఉన్నవారెవరైనా ఆత్మ యొక్క గురుత్వాకర్షణ శక్తికి శత్రువుగా ఉంటారు. భూమి ద్వారా వస్తువులను క్రిందికి లాగబడడాన్ని 'గురుత్వాకర్షణ శక్తి' అంటారు. అలాగే మనిషిలో ఏదోక శక్తి అతన్ని కిందకి లాగుతుంది దాన్నే జరతూస్త్ర 'స్పిరిట్ ఆఫ్ గ్రావిటీ' అంటాడు. ఈ గురుత్వాకర్షణ శక్తి మనిషి అపస్మారకస్థితిలో ఉంటేనే పనిచేస్తుంది. అతను ఎంత అపస్మారకస్థితిలో ఉంటే అతని మీద ఈ శక్తి అంత ఎక్కువగా పనిచేస్తుంది. అతను ఎంత ఎక్కువ చైతన్యంతో ఉంటే అతను తనని తాను అధిగమించి అంత స్వేచ్ఛగా ఎగరగలడు.

జరతూస్త్ర, నేను ఆత్మ యొక్క గురుత్వాకర్షణ శక్తికి శత్రువుని అంటాడు.

(మానవుడ్ని దిగజార్చే అన్ని విషయాలను ఎత్తిచూపడానికి బదులుగా జరతూస్త్ర 'ఆత్మ యొక్క గురుత్వాకర్షణ శక్తి' అనే పదాన్ని వాడుతున్నాడు.)

నేను పాటలు పాడతాను. వేరొకరిని వినోదింపజెయ్యడానికి కాదు... నా సొంత ఆనందం కోసం పాడతాను. నన్ను అభినందిస్తున్నారా, అవమానిస్తున్నారా అనేది నాకు అనవసరం. నాలాగే ఇతర గొప్పగాయకులు కూడా ఉన్నారు. వాళ్ళు చాలా అనర్గళంగా పాడగలరు. కానీ వారి ఇంటినిండా ప్రేక్షకులు ఉన్నప్పుడు మాత్రమే వారు పాడతారు. వారి పాట అంగడిలో సరుకు లాంటిది. వారికి ప్రేక్షకులు కావాలి. చప్పట్లు కొట్టేవారు కావాలి. కొనుగోలుదారులు కావాలి. కానీ నేను వారిలో ఒకడిని కాదు. నా పాట సంపూర్ణ స్వేచ్ఛ కోసం. నా పాట మనిషి యొక్క స్వేచ్ఛాస్ఫూర్తికి అంకితం. అంతేకానీ నా పాట ఆత్మ యొక్క గురుత్వాకర్షణ శక్తిలో భాగం కాదు. నా పాట భారరహితమైన ఉనికికి నాంది.

ఆస్ట్రిచ్ గుర్రం కంటే వేగంగా పరుగెత్తగలదు. కానీ శత్రువు సమీపించడాన్ని చూసిన మరుక్షణం ఆస్ట్రిచ్ వెంటనే కళ్ళు మూసుకుని తన తలని ఇసుకలో దాచిపెట్టుకొని, తాను శత్రువుని చూడడం లేదు కాబట్టి అక్కడ తన శత్రువు లేదని భావిస్తుంది. దీన్నే 'ఆస్ట్రిచ్ లాజిక్' అంటారు. వేలాది సంవత్సరాలుగా మానవుడు ఆస్ట్రిచ్‌లా ప్రవర్తిస్తున్నాడు. అతని తర్కం ఒకటే, ఇసుకలో ఒక రంధ్రం తవ్వి దాని లోపల అతని తలని దాచి ఉంచడం. కానీ వాస్తవానికి అతను కళ్ళు తెరిచి ఉంటే ఎంతో కొంత శత్రువుతో పోరాడి, తనని తాను రక్షించుకోగలడు. ఇంకా ఎగరలేని మనిషి ఆస్ట్రిచ్‌లాగానే ఉన్నాడు. అతనికి పోరాడగల సామర్థ్యం,

తనని తాను రక్షించుకోగల శక్తి సామర్థ్యం ఉంది. కానీ అతడు భూమిపై జీవించడాన్ని, జీవితాన్ని భారంగా భావించాడు. ఆత్మ యొక్క గురుత్వాకర్షణ శక్తి అతని మీద ఎక్కువగా పనిచేస్తుంది.

ఆ ఆత్మ యొక్క గురుత్వాకర్షణ శక్తితో పోరాడడానికి ఎప్పటికప్పుడు మిమ్మల్ని మీరు అధిగమించుకుంటూ కొత్త కొత్త పర్వతాలను అధిరోహించే సాహసికుడిగా ఉండండి. కానీ మానవుడు ధైర్యంగా, ప్రమాదకరంగా జీవించడం ఎలాగో మరచిపోయాడు. ఇప్పుడు అతను ఎలా జీవించాలో కాదు.. ఎలా మనుగడ సాగించాలో మాత్రమే నేర్చుకుంటున్నాడు. ప్రమాదకరంగా జీవించకపోతే మానవుడు పాట పాడుతూ, డాన్స్ చేయలేడు.. ఆనందంగా జీవించలేడు.

కేవలం మనుగడ సాగిస్తున్న మనిషి ఆనందంగా పాట పాడుతూ నృత్యం చేసేంత శక్తి ఉండదు. అతను ఎటువంటి ఇబ్బందులు లేకుండా బానిసగా ఉండగలడు. ఎందుకంటే అతనికి ఎటువంటి ప్రతిఘటనను ఇచ్చే శక్తి లేదు.

ఆత్మ యొక్క గురుత్వాకర్షణ శక్తి జైలునుండి బయటపడాలనుకునేవారికి నా మొదటి సూచన.

మిమ్మల్ని మీరు ప్రేమించుకోండి. మిమ్మల్ని మీలాగే అంగీకరించండి. అది మీ పెరుగుదలను నిరోధించదు. నిజానికి, మిమ్మల్ని మీరెంత ఎక్కువగా ప్రేమిస్తారో, అంతగా మిమ్మల్ని మీరు మెరుగుపరుచుకోగలరు. వాస్తవానికి, అన్ని మతాలు దీనికి విరుద్ధంగా మిమ్మల్ని మీరు ద్వేషించండి అని బోధిస్తాయి. కానీ వారు అది కూడా అంత స్పష్టంగా చెప్పరు. ఒకవైపు మీరు పాపి అంటూనే మీరు నైతికంగా ఉండటం ద్వారా, వారి మతాన్ని అంగీకరించడం ద్వారా మీ నిజాయితీని నిరూపించుకోవాలి అంటూ కష్టతరమైన సవాళ్ళను మీ ముందు ఉంచుతారు.

మతాలు మీరు రోగులను ప్రేమించండి, పేదలకు సేవ చేయండి అని చెప్తూ ఉంటాయి. అన్ని మతాలు రోగులకు, వ్యాధిగ్రస్తులకు, పేదలకు అనుకూలంగా ఉన్నాయి. కానీ అవి ధనవంతులని, గొప్పవారిని పట్టించుకోవు. ఖచ్చితంగా జబ్బుపడినవారికి, వ్యాధిగ్రస్తులకు సంరక్షణ అవసరమే. కానీ వారికి ప్రేమ అవసరం లేదు. కానీ క్రైస్తవమతం దీనిని విశ్వవ్యాప్తంగా ఆమోదించిన సత్యంగా మార్చింది. జబ్బుపడినవారిని ప్రేమించిన క్షణం మీరు అతని అనారోగ్యం నుండి కోలుకోవడానికి అతనికి సహాయం చేయడం లేదు అన్నట్లే. అతను

ఆరోగ్యంగా ఉన్నప్పుడు అతన్ని ప్రేమించడం మానేస్తారు. ఇతరులను ప్రేమించేలా చేయడానికి అనారోగ్యం ఒక మంచి సాకు మాత్రమే. దురదృష్టవశాత్తు అనారోగ్యం, ప్రేమ ఒకటికొకటి కలిసి ఉన్నాయి. మిమ్మల్ని మీరు ప్రేమించండి. ఆహారం శరీరానికి శక్తినిచ్చినట్లే... ప్రేమ అనేది ఆత్మకు శక్తినిస్తుంది. మీ మీద మీకు ప్రేమ ఉంటేనే మీరు ఇతరులను ప్రేమించగలరు. కానీ ఆరోగ్యవంతులను ప్రేమించండి, బలవంతులను ప్రేమించండి.

జబ్బుపడినవారిని జాగ్రత్తగా చూసుకోండి. సంరక్షణ పూర్తిగా భిన్నమైన విషయం. ప్రేమ, సంరక్షణకి మధ్య వ్యత్యాసం తల్లికి, నర్సుకి మధ్య ఉన్న వ్యత్యాసం వంటిది. నర్సు జాగ్రత్త తీసుకుంటుంది.. తల్లి ప్రేమిస్తుంది. పిల్లవాడు అనారోగ్యంతో ఉన్నప్పుడు తల్లి కేవలం నర్సుగా ఉండటం మంచిది. పిల్లవాడు ఆరోగ్యంగా ఉన్నప్పుడు ప్రేమించాలి.

ప్రేమని ఆరోగ్యం, బలం, తెలివితేటలతో ముడిపడి ఉండనివ్వండి.

'మీ పొరుగువారిని ప్రేమించండి' అని మీకు అందరూ బోధించారు. కానీ 'మిమ్మల్ని మీరు ప్రేమించండి' అని ఎవరూ మీకు చెప్పరు. కానీ మీకు మీరే మొట్టమొదటి పొరుగువారనే విషయం మరవవద్దు. మిమ్మల్ని మీరు ప్రేమించలేకపోతే, మీ పొరుగువారిని ఎలా ప్రేమించగలరు?

యేసు, "నిన్ను నువ్వు ప్రేమిస్తున్నట్లే నీ పొరుగువానిని ప్రేమించు" అంటాడు.

కానీ అతని మొత్తం బోధనలలో తనను తాను ఎలా ప్రేమించుకోవాలో ఎన్నడూ చెప్పలేదు. ఒకవేళ మీ పొరుగువారిని మిమ్మల్ని మీరు ప్రేమించే విధంగా ప్రేమించబోతున్నట్లయితే మీరు అతన్ని ద్వేషిస్తారు. ఎందుకంటే అన్ని మతాలు మీకు చాలా ఏళ్లుగా బోధిస్తున్నది అదే.

యేసు రెండవ ప్రకటన ఏంటంటే "మీ శత్రువును మీలాగే ప్రేమించండి".

ఇది సులభం.. ఎందుకంటే శత్రువు చాలా దూరంలో ఉంటాడు. అతను మీకు ఎప్పుడోకప్పుడు విసుగు తెప్పిస్తాడు. కానీ పొరుగువాడు.. ఎల్లప్పుడూ మీ పక్కనే ఉండి నిరంతరం విసుగు తెప్పిస్తుంటాడు. మొదట మిమ్మల్ని మీరు ప్రేమించగలిగితే, మీరు ఈ ప్రపంచం మొత్తాన్ని ప్రేమించవచ్చు. మిమ్మల్ని మీరు ప్రేమించుకోవడం అనేది ఏ దైవశాసనమో కాదు. అది ఒక కళ. దానిని మీకు మీరే స్వతహాగా నేర్చుకోవాలి. ప్రేమ జీవితంలో గొప్ప కళ. కానీ ప్రతి ఒక్కరూ

మానవుడు ప్రేమించే సామర్థ్యంతో జన్మించాడని అనుకుంటారు. కాబట్టి దానిని పట్టించుకోవడం మానేశాడు.

చాలాకాలంగా మంచిచెడులకు సంబంధించిన కొన్ని విషయాలను బలవంతంగా అంగీకరించవలసి వస్తుంది. వాటిని అంగీకరించకపోతే జీవించడం అసాధ్యం అవుతుంది. పిల్లవాడు చాలా నిస్సహాయస్థితిలో ఉంటాడు. స్వయంగా జీవించలేడు. ఇతరులపై ఆధారపడవలసి ఉంటుంది. కానీ తల్లిదండ్రులు, ఎటువంటి చెడు ఉద్దేశం లేకుండానే ఏది మంచి, ఏది చెడు లాంటి వారి ఆలోచనల్ని అతని మీద బలవంతంగా రుద్దుతారు. నిజానికి ఆ మంచిచెడు యొక్క ఆలోచనలన్నీ కుళ్ళినవి. జీవితం మారుతూ ఉంటుంది. మానవుడు ఎప్పటికప్పుడు పరిణామం చెందుతూ ముందుకు వెళ్తున్నాడు. కానీ మంచిచెడుకి సంబంధించిన మానవుని ఆలోచనలు మాత్రం ఇంకా అలానే ఉన్నాయి. వాటిలో ఎటువంటి మార్పు లేదు. ఈ ఆలోచనల వల్లనే మానవుడు జీవితాన్ని పూర్తిగా జీవించలేకపోతున్నాడు. అవి అతన్ని ఎదగకుండా నిరోధిస్తున్నాయి. శతాబ్దాలుగా అవి మంచి చెడుగా భావించబడి ఉండవచ్చు. కానీ ఈ రోజు జీవించడానికి అవి అనుగుణంగా లేకపోతే అసలు అవి విలువలే కావు. ఒక సందర్భంలో మంచి అనిపించింది మరొక సందర్భంలో చెడు అవ్వొచ్చు. ఒక సందర్భంలో చెడు అనిపించేది మరొక సందర్భంలో మంచి అవ్వొచ్చు. జీవితప్రవాహంలో ప్రతిదీ మారుతున్న చోట మానవుడు కూడా ఆ మార్పుకు అనుగుణంగా జీవించాలి. అప్పుడే అతను పూర్తి ఆనందంతో జీవించగలడు.

తల్లి తన పిల్లవాడితో “నేను నీ తల్లిని.. నన్ను ప్రేమించు” అని అంటుంది.

తల్లిగా ఉండడం ద్వారా అతన్ని ఆ తల్లి ప్రేమించాల్సిన అవసరం ఉంటుంది. కానీ తల్లి ప్రేమతో స్పందిస్తే పిల్లవాడు ప్రేమతో స్పందిస్తాడు. ‘నేను మీ తల్లిని, అందుకే నువ్వు నన్ను ప్రేమించాలి’ అని పిల్లవాడికి చెప్పడం అనేది అతని ప్రేమను చాలా చిన్నదిగా చేస్తుంది. అప్పుడు తన తల్లి కాని మరొకరిని ప్రేమించాల్సిన అవసరం ఆ పిల్లవానికి ఉండదు.

తల్లిదండ్రులు పిల్లవాడిని ‘ప్రేమ’ ద్వారా ప్రేమించడానికి ప్రయత్నించాలి. తద్వారా పిల్లవాడు ప్రేమతో స్పందించడం నేర్చుకుంటాడు. అప్పుడు అతను ఎవరినైనా ప్రేమిస్తున్నప్పుడల్లా ప్రేమతో స్పందిస్తాడు. పిల్లవాడిని ప్రేమించడం

ద్వారా అతను ప్రేమగలవాడని మీరు అతనికి నేర్పుతున్నారు. అతను ప్రేమ గలవాడు అనే ఆలోచన రావడం ప్రారంభించిన తరువాత, అతను తనను తాను ప్రేమిస్తాడు.

కానీ మంచిచెడుల విషయంలో, నైతికత విషయంలో మొదట ఒంటెను మోకరిల్లమని, వినయంగా, సౌమ్యంగా ఉండాలని, బానిసలుగా ఉండటానికి సిద్ధంగా ఉండాలని బలవంతం చేస్తారు, ఆపై ఒంటె తాను మోసుకెళ్ళే దానికంటే ఎక్కువ భారాన్ని దానిపైకి ఎక్కించటానికి మిమ్మల్ని అనుమతిస్తుంది. అందరూ ఆ ఒంటెని ప్రశంసిస్తారు. అప్పుడు ఆ ఒంటె హీరో అవుతుంది. దాని జీవితంలో ఆనందం అంతా మాయమైపోతుంది. ఇక అది నవ్వలేదు, నృత్యం చేయలేదు. చాలా భారాన్ని ఎత్తుకున్న ఒంటె నృత్యం చేస్తుందని మీరు ఆశించలేరు. దేనికి డాన్స్, బానిస అయినందుకా?

అలా సమాజం అతని గౌరవాన్ని, తనలోని అహంకారాన్ని ముక్కలు చేస్తుంది. అప్పుడతనికి డాన్స్ అనే ప్రశ్న లేదు. కానీ "అవును.. జీవితం భరించడం కష్టం" అని మరల మరల చెప్తూ ఇంకా ఆ ఒంటెపై భారాన్ని మోపుతారు.

కానీ జీవితం చాలా అందమైనది.. అది పాటలతో.. డాన్స్‌తో నిండి ఉండాలి.

ప్రేమించడం చాలా సులువైనది.. కానీ వివాహం కష్టాలతో కూడుకున్నది.. వివాహం మానవుని ఆవిష్కరణ.. ప్రేమ కాదు.

❖ ❖ ❖

అన్ని మతాలు, అన్ని తత్వాలు అంతిమ సత్యానికి తమకంటూ ఒక మార్గం ఉందనే ఊహపై ఆధారపడి ఉంటాయి. నిజానికి అలాంటి మార్గమనేది లేదని, నడుస్తూ నడుస్తూ నీ మార్గాన్ని నువ్వే సృష్టించుకోవాలి అంటాడు జరతూస్త్ర.

సత్యం యొక్క అంతిమ సాక్షాత్కారానికి చేరుకోవడం అంత సులువు కాదు.. మీ సొంత మార్గాన్ని మీరే సృష్టించుకోవాలి.. ఆ మార్గం ఎప్పుడూ సిద్ధంగా ఉండదు. అది ఆకాశంలో పక్షులు ఎగరడం లాంటిది. దానిని మానవుడు అనుసరించలేడు. ఎందుకంటే దాని వెనుక ఎటువంటి పాదముద్రలు కానీ అడుగుజాడలు కానీ ఉండవు. మానవుడు తన స్పృహ యొక్క అంతర్గత ఆకాశంలో

తన మార్గాన్ని తానే కనుగొనవలసి ఉంటుంది. అది ధైర్యవంతులకు ఒక సవాలుగా ఉంటుంది. వారికది గొప్ప ఉత్సాహాన్ని ఇస్తుంది. అందుకే సత్యం యొక్క అనుభవం ఎల్లప్పుడూ నూతనంగా ఉంటుంది. సత్యం కోసం అన్వేషణ అంటే తనని తాను ప్రేమించడం. సత్యాన్ని కనుగొనడం అంటే తనని తాను తెలుసుకోవడం.. తన ఆనందం, తన ఉనికి యొక్క శాశ్వతత్వం గురించి తెలుసుకోవడం.

మానవులు వేరొకరికి అనుచరులుగా ఉండవలసిన అవసరం లేదు. కేవలం అనుసరించడం ద్వారా ప్రతి అనుచరుడు తప్పుడు మార్గంలో వెళుతున్నాడు. అతనికి ఎవరి ఆదర్శం అవసరం లేదు. ఆదర్శాన్ని కలిగి ఉండటం అతని ఏకాంతం యొక్క గాఢతని ఆస్వాదించడానికి అడ్డుగా ఉంటుంది. అందుకే రక్షకులు అని పిలవబడేవారిపట్ల జాగ్రత్త వహించండి.. ముఖ్యంగా నాపట్ల చాలా జాగ్రత్త వహించండి.

మీరు నన్ను ప్రేమిస్తే, నన్ను అనుసరిస్తే మిమ్మల్ని మీరు అన్వేషించే మార్గంలో ఆ ప్రేమ అవరోధంగా మారుతుంది. తనని తాను అన్వేషించడంలో మానవునికి అడ్డొచ్చేవాటిలో మొదటిది అప్పటివరకు తాను నేర్చుకున్నవి, మత గ్రంథాలనుండి సేకరించిన, వారి మతాచార్యులు బోధించిన అన్ని రకాల అబద్ధాలతో నిండి ఉన్న అతని మనస్సే. అప్పటికే అరువు తెచ్చుకున్న చెత్తతో, అబద్ధాలతో అతని మనస్సులో సత్యాన్వేషణపట్ల అతనికి తప్పుడు భావనని ఇస్తాయి.

తనని తాను తెలుసుకున్నవాడు ఇది నా మంచిచెడులకు సంబంధించిన నైతికత అని అంటాడు. అతను ఆ విలువలను ఇతరులపై రుద్దడానికి అంగీక రించడు. అందరికీ వర్తింపజేసే చట్టాలు ఇవి అన్నట్లు అతను మాట్లాడడు. ఆ మంచిచెడులు అతనికి మాత్రమే సొంతం. ఎవరికి వారు ప్రత్యేకమైనవారు. ప్రతి వ్యక్తికి తనదైన నైతికత, తనదైన మంచిచెడు ఉండాలి. ప్రపంచం యొక్క అన్ని విషయాలపట్ల సంతృప్తిగా ఉన్నవారు మానవులు కాదు.. వారు గేదెలు. గేదెలు అన్నింటికి సంతృప్తికరంగా ఉంటాయి. గేదెలు అసంతృప్తిగా, విచారంగా, నిరాశతో ఉండవు.. అవి ఎప్పుడూ సంతృప్తికరంగానే ఉంటాయి. ఆ గేదెలే సాధువులుగా జన్మించారు.

నిజమైన మానవుడే ప్రతిదానిపట్ల విపరీతమైన అసంతృప్తితో ఉంటాడు. అసంతృప్తి లేకుండా పురోగతి లేదు. అసంతృప్తి లేకుండా పెరుగుదల లేదు.

అసంతృప్తి లేకుండా నక్షత్రాలకు చేరుకోవడం కుదరదు. సూపర్ మాన్ అవ్వడం సాధ్యపడదు. సంతృప్తి అత్యల్పమైనది. ప్రతిదీ మంచిదే అని భావించేవారిని నేను ఇష్టపడను.

యుగాలుగా మతాలు బోధిస్తున్నది కూడా అదే.. ప్రతిదీ మంచిదే.. మీ జీవితంపట్ల సంతృప్తిగా ఉండండి. మీపట్ల మీరు సంతృప్తిగా ఉండండి. అప్పు డప్పుడు బాధలు వచ్చినప్పటికీ అది కొంతకాలం వరకే.. అది మీ నమ్మకానికి ఒక పరీక్ష మాత్రమే.. అసంతృప్తి చెందకండి అంటూ మానవాళిని ఒంటెల దశలోనే ఉంచాయి. ఈ బోధనలవల్ల మానవుడు మానసిక వికలాంగుడు అయ్యాడు.. జీవితం యొక్క ప్రాథమిక నియమం.. ఎప్పటికప్పుడు తనని తాను అధిగమిస్తూ ముందుకు కదలడం. మానవుడిని ముందుకు నడిపించేది 'అసంతృప్తి'. అది అతన్ని అసాధ్యం కోసం పరిగెత్తేలా చేస్తుంది. అది మాత్రమే మనిషిని సూపర్ మాన్ చేస్తుంది. అతనికి చాలా సామర్థ్యం ఉంది. కానీ మానవుడు తనని తాను మోసం చేసుకుంటున్నాడు. నక్షత్రాలకు జన్మనిచ్చే సామర్థ్యం అతనిలో ఇంకా ఉంది. అతనికి కావలసిందల్లా తనని సంతృప్తిపరచలేనటువంటి కోరికలతో రెచ్చగొట్టడం. ప్రస్తుత మానవుడు తనపట్ల తాను అసంతృప్తి ఉండగలిగితే అతను సూపర్ మాన్‌కి జన్మనివ్వడానికి తాను చనిపోవడానికి సిద్ధంగా ఉంటాడు.

❖ ❖ ❖

## పాత విలువలు.. కొత్త విలువలు

జరతూస్త్ర పాత నైతికవిలువలు, కొత్త నైతికవిలువలు మరియు సగం రాయబడి ఉన్న నైతిక విలువల మధ్యలో కూర్చొని మరోసారి మనుష్యుల మధ్యకు వెళ్లే సమయం కోసం ఎదురుచూస్తున్నాడు. ఎప్పుడైతే పావురాల మందతో కలిసి సింహం నవ్వుతుందో అదే జరతూస్త్ర మరల మానవుల మధ్యలోకి వెళ్ళడానికి సంకేతం. ఇంతలో ఇంకా వెళ్ళడానికి సమయం ఉన్న వ్యక్తిగా తనలో తాను మాట్లాడుకుంటున్నాడు. అతనొక్కడే ఏకాంతంగా కొండల్లో ఉన్నాడు. తన చుట్టూ ఎవ్వరూ లేరు. మనుషులు తన మాటలను స్పష్టంగా వినగలిగేలా వాటికి ఇంకా తుదిమెరుగులు దిద్దడానికి సిద్ధమయ్యాడు.

❖ ❖ ❖

నేను నమ్మే మతం, అనుసరించే మతం ఒక్కటే: పరిణామం.

అన్ని మతాలు శాశ్వతవిలువలపై ఆధారపడి ఉన్నాయి. స్థిరమని భావించే ఆ విలువలను రాబోవు తరాల వారికోసం కూడా ఎప్పుడో సృష్టించబడ్డాయి. జీవితం మారుతూ ఉంటుంది. కానీ విలువలు స్థిరంగా ఉంటాయి. అవి మనిషి మనస్సులో భయంకరమైన ఒత్తిడిని కలుగజేస్తాయి. కానీ అతను ఆ విలువలను అనుసరిస్తే ప్రస్తుత కాలానికి సమకాలీనుడు అవ్వడు. అప్పుడు మానవుడు ఉనికితో తనకున్న సంబంధాన్ని కోల్పోతాడు. ఒకవేళ అనుసరించకపోతే అతను నేరం చేసినట్లు అపరాధభావానికి గురవుతాడు. మానవుడి జీవితం ఈ శాశ్వత విలువల మధ్య బిక్కుబిక్కుమంటూ, భయం భయంగా తిరుగుతూ ఉంటుంది. అతను ఎక్కడున్నా, ఏం చేస్తున్నా అర్ధహృదయంతో చేస్తాడు.

ఇక్కడ ఎన్ని మారుకుంటూ వచ్చినా మారనిది ఒక్కటే: మార్పు..

మార్పు తప్ప ఇక్కడ ప్రతిదీ మారుతూనే ఉంటుంది. చైతన్యం ఉన్న వ్యక్తి చురుకుతనంగా ప్రతి మార్పుకు అనుగుణంగా స్వేచ్ఛగా ప్రతిస్పందిస్తాడు. అది అతని సహజత్వం.

నేను చురుకుతనానికి ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాను. విలువలు అస్థిరమైన చోట విలువలను పొందగల ఏకైక మార్గం వాస్తవికతకు అనుగుణంగా పూర్తి చైతన్యంతో, తెలివిగా ప్రతిస్పందించడం. అప్పుడు ప్రతిదీ కొత్తగా ఉంటుంది. ఎటువంటి అపరాధభావనకు గురవ్వాల్సిన అవసరం కూడా ఉండదు. ఈ క్షణం మీది అన్నట్టు జీవించండి. ఐదువేల సంవత్సరాల క్రితం జీవించిన ప్రజలకు భవిష్యత్తులో జీవితం ఎలా ఉంటుందో తెలియదు. వారు వారి విలువలను వారి సమయానికి అనుగుణంగా మాత్రమే నిర్ణయించుకున్నారు. గత విలువల ప్రకారం భవిష్యత్తు మానవుడు ఏమాత్రం మనుగడ సాగించలేడు. భవిష్యత్తు మనుగడ సాగించాలి అంటే గతం మరణించాలి.

వర్తమానంలో ఇప్పుడు ఇక్కడ ఈ క్షణం భవిష్యత్తుకి అనుగుణంగా జీవించడమే ముఖ్యం. ఇక్కడ ప్రతి ఒక్కరు గుర్తుంచుకోవాల్సిన విషయం ఏంటంటే ఇప్పుడు ఇక్కడ ఒకరికి నిజం అనిపించింది ఇంకొకరికి నిజం అనిపించవలసిన అవసరం లేదు. అలాగే ఈ రోజు ఒకరికి నిజం అనిపించింది రేపు ఇంకొకరికి

అది నిజం అయ్యి ఉండవలసిన అవసరం లేదు. విలువలు అనేవి జీవితానికి అనుగుణంగా ఉండాలి. విలువలు స్థిరమైనవి కావు. కానీ ఎప్పుడైతే విలువలకు అనుగుణంగా మానవుడు మనుగడ సాగించాలని కోరుకుంటాడో అప్పుడు అతను తన జీవితాన్ని చేజేతులా తాను నాశనం చేసుకుంటున్నట్టే.

❖ ❖ ❖

నేను మనుష్యుల్ని సందర్శించినప్పుడు వారు తమకి మంచిచెడు ఏంటో చాలాకాలంగా తెలుసన్నట్టు కూర్చొని ఉన్నారు. ఏది సరైనది, ఏది తప్పు, ఏది మంచి, ఏది చెడు అని తనకు ఇప్పటికే తెలుసునని అందరూ అనుకుంటారు. ప్రతి ఒక్కరూ మంచి చెడుల విషయంలో ఎటువంటి సందేహాలు లేకుండా తమని తాము తెలివైనవారము అనుకుంటూ ఉంటారు. ఎందుకంటే తరతరాలుగా మంచిచెడు అని పిలువబడుతున్న ఆ పాత విలువలు అతనికి వారసత్వంగా ఇవ్వబడ్డాయి. ప్రతి తరం తన వ్యాధులను కొత్త తరానికి ఇస్తూనే ఉంటుంది. వారు దానిని 'జ్ఞానం' అని పిలుస్తారు. కానీ నిన్న జ్ఞానం అని పిలవబడేది రేపు అర్థం లేనిది కావొచ్చు. ఈ ప్రపంచమంతా సమాధానాలతో నిండి ఉంది. ప్రతి ఒక్కరి మెదడు తమకు సంబంధం లేని ప్రశ్నల యొక్క సమాధానాలతో నిండి ఉంది. అందుకే నేను మనుషుల యొక్క జ్ఞానాన్ని చెత్తగా భావిస్తాను. మొదట మీలో ఒక ప్రశ్న తలెత్తాలి. మీ ప్రశ్నకు మరెవరూ సమాధానం ఇవ్వలేరు. ఆ సమాధానాన్ని మీకు మీరుగా అన్వేషించాలి. ఆ సమాధానం మీది అయినప్పుడే అది సత్యం అవుతుంది. ఒకవేళ అది మీకు వేరొకరు ఇచ్చినది ఐతే అది పాతది, కుళ్ళినది, అసహ్యకరమైనది. మీ సొంత శోధన మిమ్మల్ని క్రొత్త సమాధానాల వైపుకు తీసుకెళ్తుంది. మానవుడు తనకి మంచిచెడు అంటే ఏమిటో చాలా కాలంగా తెలుసు అన్నట్టు వాటి గురించి మాట్లాడటానికి ఎక్కువ ఇష్టపడతాడు. మానవుడు వేరొకరి కళ్ళతో, వేరొకరి చెవులతో సత్యాన్ని చూడడం కానీ, వినడం కానీ చేయలేడు. కానీ సత్యం, మంచి, నైతికత వంటి పేర్లతో, ఇతరులను షరతులతో మానవుడు తనపై ఇంకెవరినో పెత్తనం చేయడానికి అనుమతించాడు. మానవుడు తన జీవితంలో చాలా ముఖ్యమైన విషయాలన్నీ అరువు తెచ్చుకున్నవే. అరువు తెచ్చుకున్న ఏదైనా అబద్ధం అవుతుంది. ఎందుకంటే సత్యం అనేది మనిషి తనకు తానుగా తెలుసుకోవాల్సినది. అన్వేషించవలసినది. కానీ సత్యం విషయానికి

వచ్చేపాటికి పాతవిలువలతో ప్రశాంతంగా తన నిద్రని ఎవ్వరూ భంగం కలిగించ కూడదు అనుకుంటాడు. శోధించడం, వెతకడం, విచారించడం అతని నిద్రకు భంగం కలిగించే అంశాలు. అవి అతనికి మరింత తెలివిని, చైతన్యాన్ని ఇస్తాయి. ఆ తరువాత అతను ఏమాత్రం నిద్రపోలేడు. నేను ప్రజలను, వారి నిద్రను భంగపరిచాను. ఎందుకంటే మానవుడు ఒక సృష్టికర్తగా ఉంటే తప్ప అతనికి మంచిచెడుల గురించి అవగాహన ఉండదు. అతని సృజనాత్మకతకు ఏది సహాయ పడుతుందో అది మంచిది.. పవిత్రమైనది. అతని సృజనాత్మకతకు ఏదైతే ఆటంకం కలిగిస్తుందో అది చెడు. దీనికి ఇంతకంటే వేరే ప్రమాణం లేదు.. ఎవరైతే మానవాళి కోసం లక్ష్యాన్ని సృష్టించి వారి భవిష్యత్తుని నిర్దేశిస్తాడో అతను ఈ భూమికి అర్థాన్ని, భవిష్యత్తును ఇస్తాడు. అతనే మంచిచెడులను నిర్ణయిస్తాడు. సృష్టిస్తాడు.

ఎవరికివారు తమ ఉన్నత లక్ష్యాన్ని సృష్టించడం, నెరవేర్చుకోవడం ద్వారా మాత్రమే మానవజాతి కోసం ఒక లక్ష్యాన్ని సృష్టించగలరు. కానీ సాధువులు దిగులుగా, విచారంగా ఉంటూ మానవాళిని కూడా అలా మార్చడానికి ప్రయత్నిస్తున్నారు. వారు పాడటం మర్చిపోయారు. నవ్వడం మర్చిపోయారు. నాట్యం చెయ్యడం మర్చిపోయారు. వారు మానవాళిని ద్వేషిస్తారు, ఎందుకంటే వారు ఇంకా పాడగలరు. నవ్వుతూ నాట్యం చెయ్యగలరు. వారు మానవాళిని పాపులుగా ఖండిస్తున్నారు. వారు జీవితాన్ని త్యజించారు. వారు ఇప్పటికీ మానవాళిలో కొంతమంది జీవిస్తున్నారని అసూయపడుతున్నారు. వారు మానవాళిని పాపులని పిలవడమే కాదు అవసరం ఐతే మానవాళిని శాశ్వతంగా నరకంలో ఉండేలా చేయగలరు. వాళ్ళు నల్లటి దిష్టిబొమ్మలా జీవితం అనే వృక్షంపై కూర్చుని “మీరు జీవించవద్దు, ప్రేమించవద్దు, పాడొద్దు, ఆనందించవద్దు, నృత్యం చేయవద్దు” అంటూ హెచ్చరిస్తూ ఉంటారు. మానవాళి నిజంగా మతపరంగా జీవించాలి అనుకుంటే శ్వాస తీసుకుంటున్నప్పటికిని వారు మరణించినట్టే. జీవిస్తున్నామని చెప్పుకోవడానికి వారి దగ్గర ఎటువంటి ఆనవాళ్లు ఉండవు.

సాధువులలో ఉన్న గొప్ప ఏమిటో మీరెప్పుడైనా ఆలోచించారా?

ముప్పై రోజులు ఎలా ఉపవాసం చేయాలో తెలియడం వారి గొప్ప. ముళ్ళ మంచం మీద గంట వరకు పడుకొని ఉండడం వారిలో ఉన్న గొప్ప. జీవితపు

సవాళ్ళని ఎదుర్కోలేక ప్రజలకు, ప్రపంచానికి దూరంగా గుహలలోకి, పర్వతాలలోకి పారిపోవడం వారి గొప్ప. ఈ పిరికివారు.. మీ జీవితాన్ని నిర్దేశించేవారు.. వారు మీరు ఆరాధించేవారు..! అన్ని మతాలకు చెందిన మీ సాధువులు భూమిపై అనవసరమైన భారం మాత్రమే. వారు మానవాళిపై ఆధారపడి ఉన్న పరాన్న జీవులు. మానవుడు సమాజం నుండి, దాని సంకెళ్ళ నుండి పూర్తిగా విముక్తి పొందాలి. ఎందుకంటే అది మానవుని గౌరవాన్ని నాశనం చేసింది. అతనికి అన్ని రకాల హాని చేసింది. అది జీవితాన్ని జీవించనీయకుండా చేసింది. జ్ఞానం భారమైనది. అది గురుత్వాకర్షణ నియమాన్ని అనుసరిస్తుంది. వివేకం తేలికగా చేస్తుంది. అది మనిషిని ఆకాశంలో తేలికగా ఎగరగలిగేలా చేస్తుంది. నిజమైన తెలివైన మానవజాతి దేన్నైనా దాచడానికి సిగ్గుపడుతుంది. ప్రతి మానవుడు బహిరంగ పుస్తకంగా ఉండాలి, దేనిని దాచాల్సిన అవసరం లేదు.

నేను ఇంకా కవిగా ఉండటానికి సిగ్గుపడుతున్నాను.

ఎందుకంటే కవిత్వం, గద్యం కంటే అందంగా ఉంటుంది. కానీ దాని అందం అబద్ధాలపై ఆధారపడి ఉంటుంది. కవులు ఎక్కువగా అబద్ధాలు ఆడతారు. నిజానికి, అబద్ధాలు లేని కవిత్వం గద్యంగా మారుతుంది. గద్య విషయాలు వ్యక్తీకరించే విధంగా నిజం చెప్పలేము. గద్యం చాలా ప్రాపంచికమైనది. కానీ సత్యం గురించి మాట్లాడటం, అందం గురించి మాట్లాడటం, పారవశ్యం గురించి మాట్లాడటం, పవిత్రమైనదాని గురించి మాట్లాడటం అనేది కవిత్వం ద్వారా మాత్రమే వీలవుతుంది. మూడవ ప్రత్యామ్నాయం లేదు. కానీ ప్రజలు మూడవ ప్రత్యామ్నాయాన్ని కూడా ప్రయత్నించారు. కానీ ఇది నిజంగా మూడవ ప్రత్యామ్నాయం కాదు. అది వారి మౌనం.. ప్రజలు మౌనంగా ఉన్నారు. వారు మౌనం ద్వారా సంభాషించడానికి ప్రయత్నించారు. కానీ దురదృష్టవశాత్తు మౌనాన్ని అర్థం చేసుకోగలిగే వ్యక్తిని కనుగొనడం చాలా కష్టం. కానీ మౌనాన్ని అర్థం చేసుకోగల వ్యక్తికి మీ అవసరం ఉండదు. అతను తన సొంతజ్ఞానాన్ని కనుగొంటాడు.

కవిత్వం అనేది నిశ్శబ్దానికి, గద్యానికి మధ్యన ఉన్నది. నేను సిగ్గుపడు తున్నాను. ఎందుకంటే నేను నా సంపూర్ణ స్వచ్ఛతతో నిజం చెప్పలేక పోతున్నాను. అది కవితా రూపాల ద్వారా కలుషితం అవుతుందేమోనని నా భయం. ఇవి

ఆత్మని వెనక్కి లాగే గురుత్వాకర్షణ శక్తి యొక్క రూపాలు. మానవుడు ఆత్మ యొక్క గురుత్వాకర్షణ శక్తి కింద జీవిస్తున్నానని భ్రమపడుతూ, తనని తాను అత్యల్ప విలువలకు, గతానికి అంటిపెట్టుకొని ఉన్నాడు. నేను మరొకసారి మనుషుల దగ్గరికి వెళ్లాలనుకుంటున్నాను. నేను చనిపోవడానికి ముందు వారికి విలువైన బహుమతిని ఇవ్వాలని అనుకుంటున్నాను. అదే నా జ్ఞానం.

❖ ❖ ❖

జీవితం ఒక ప్రవాహం వంటిది. ప్రతిదీ నిరంతరం మారుతూ ఉంటుంది. మారనిది ఏదైనా మరణిస్తుంది. మార్పు అంటే జీవం ఉన్నది. శాశ్వతత్వం అంటే మరణం. కానీ మార్పు అనేది పాత సంప్రదాయాలన్నిటికీ వ్యతిరేకం. వారంతా శాశ్వతంగా ఉండేవాటిని నమ్ముతారు. మనిషి ప్రతిదీ శాశ్వతంగా ఉండాలని కోరుకుంటాడు. అతను మార్పుకు భయపడతాడు. ఎందుకంటే మార్పు ఎక్కడ తన జీవితాన్ని తలకిందులు చేస్తుందోనని అతని భయం. శాశ్వతమైన దానితో అతనికి ఎప్పటినుండో పరిచయం ఉంది. దాన్ని ఎలా ఎదుర్కోవాలి అనే దాని గురించి ప్రతిదీ నేర్చుకున్నాడు. దానితో సుఖంగా ఉన్నాడు. కానీ జీవితం ఒక నదీప్రవాహంలా, ప్రతి క్షణం మార్పుకి లోనవుతూనే ఉంటుంది. ఎప్పుడూ తెలియని వాటిని ఎదుర్కోబోతున్నారని తెలియజేస్తుంది. అది భయాన్ని కూడా సృష్టిస్తుంది. ఎందుకంటే వాటిని ఎదుర్కోవడానికి మానవుడు సిద్ధంగా ఉండడం లేదు. అతను ఆకస్మికంగా అప్పటికప్పుడు స్పందించాలి. అదే అతని సమస్య. దానికి తెలివి, చాకచక్యం, చైతన్యం అవసరం. అప్పుడు అతనికి రేపు ఏం జరగబోతుందో తెలియదు కాబట్టి దేనికోసం సిద్ధంగా ఉండవలసిన అవసరం లేదు. రిహార్సల్స్ ఉండవు. ఎందుకంటే ఇది నాటకం కాదు.

అబద్ధాలు చాలా తియ్యగా ఉంటాయి. చాలా అనుకూలంగా, చాలా సౌకర్యంగా ఉంటాయి. కానీ సత్యానికి రాజీపడడం తెలియదు. ఎవరైనా సత్యం ప్రకారం మారవలసి ఉంటుంది. ఎవరో సౌలభ్యం కోసం సత్యం మారదు. అబద్ధాలు సౌలభ్యం ప్రకారం మార్చడానికి సిద్ధంగా ఉంటాయి. అందువల్ల అబద్ధాలు మానవాళిని అధిగమించాయి.. వారిపై ఆధిపత్యం చెలాయించాయి. నిజం సిలువ వేయబడింది. అబద్ధాలు పట్టాభిషేకం చేయబడ్డాయి.. సత్యానికి మరణశిక్ష విధించబడింది. అబద్ధాలలో చాలా సుఖంగా నిద్రపోతున్న ప్రజల్ని,

సత్యం వారి నిద్రకి భంగం కలిగిస్తుంది. వారి మధురమైన కలలను చెరిపేస్తుంది.

ప్రతిదీ మారుతుంటే శాశ్వతమైన మంచిచెడు అనే భావనలే ఉండవు. ఎప్పటికీ మనవాళిపై శాశ్వతమైన విలువలు అనేవి రుద్దబడవు. అప్పుడు మానవాళి స్వేచ్ఛగా, పరిస్థితులకు అనుకూలంగా దేనికైనా ఆకస్మికంగా స్పందించడానికి పూర్తి చైతన్యంతో సిద్ధంగా ఉంటుంది. అప్పుడు స్థిరభావజాలాలు అనేవే ఉండవు. అన్ని మతగ్రంథాలు అర్థరహితం అవుతాయి.. ఎందుకంటే అవి మారవు. తత్వాలన్నీ నిరుపయోగంగా మారతాయి. ఎందుకంటే జీవితం ప్రతి క్షణం మారుతూ ఉంటుంది. మారకుండా ఉన్నదేదైనా దాని ప్రాముఖ్యతను కోల్పోతుంది. అవి జీవించడానికి ఏ మాత్రం ఉపయోగపడవు. వాటిని మార్గంనుండి తొలగించాలి. అప్పుడు మానవుడు తన అవగాహన, తెలివి, సమయస్ఫూర్తి మీద మాత్రమే ఆధారపడవలసి ఉంటుంది. అప్పుడు అతని చుట్టూ జరుగుతున్న ప్రతి మార్పుకి స్పందించడానికి అనుకూలంగా ఎప్పటికప్పుడు అతను తెలివిగా ఉండాలి. అతనిక ఏ మాత్రం వెనుకబడి ఉండడు.

పూర్తి అవగాహనతో ప్రతి మార్పుకి అనుగుణంగా మానవుడు ఎప్పటికప్పుడు పరిణామం చెందుతూనే ఉంటాడు. ఇక స్థిరఆదర్శాలకు అనుగుణంగా వ్యవహరించవలసిన అవసరం అతనికి ఉండదు. ఇప్పుడు ఈ క్షణం గురించి మాత్రమే అతను ఆలోచిస్తాడు. అప్పుడు ప్రతిరోజూ కొత్త అంతర్దృష్టులను, కొత్త విలువలను తెలుసుకుంటాడు. అది మానవుడ్ని తన చివరి శ్వాసవరకు యవ్వనంగా ఉంచుతుంది.

అతని శరీరం పాతది అయ్యి ఉండొచ్చు. కానీ అతని చైతన్యం పరవళ్లు తొక్కుతున్న నదిలాగా ఎప్పటికప్పుడు కొత్తదనాన్ని, అందాన్ని సంతరించు కుంటుంది.

❖ ❖ ❖

ప్రతిదీ మార్పుకి లోనవుతుంది సరే.. నది కూడా ఎప్పటికప్పుడు మార్పుకి లోనవుతుంది.. కానీ ఆ నదిపై నిర్మించిన ఆ వంతెన మాటేంటి అని మూర్ఖులు మాత్రమే ప్రశ్నిస్తారు.

పూజారులు, తత్వవేత్తలు చెప్పేది ఒక్కటే ఈ నైతికత, మంచిచెడు అనే భావనలు నదిలాంటివి కావు, అవి వంతెన లాంటివి, స్థిరమైనవి.. దృఢమైనవి..

శాశ్వతమైనవి అంటారు. వంతెన చాలా దృఢంగా, స్థిరంగా ఉంటుంది అంటుంటారు. కానీ అది కూడా నిరంతరం మార్పుకి లోనవుతూనే ఉంటుంది. ఆ మార్పుని గమనించకపోవడానికి కారణం..అందులోని అణువులు వాటి వేగాన్ని చూడలేని వేగంతో కదులుతున్నందున. అందుకే అది చాలా స్థిరమైనదిగా కనిపించడం. గోడలో కదులుతున్న ఎలక్ట్రాన్ల వేగాన్ని ఊహించలేము. ఎలక్ట్రాన్ సెకనుకు 186 మైళ్ల వేగంతో దాని మధ్యలో కదులుతోంది. అది చాలా చిన్నది, దానిని కళ్ళతో చూడలేము. వాస్తవానికి శాస్త్రీయ పరికరాలతో కూడా ఎలక్ట్రాన్‌ను ఇంకా ఎవరూ చూడలేదు. ఇది ఒక ఊహ మాత్రమే.

గోడ దృఢంగా కనిపిస్తుంది ఎందుకంటే దానిలోని ప్రతి కణం చాలా వేగంగా కదులుతుంది. అందువలన మీరు ఆ కదలికను చూడలేరు. ప్రపంచంలో ప్రతిదీ మార్పుకి గురవుతూనే ఉంటుంది. ఏదీ శాశ్వతం కాదు.

జరతూస్త్ర ఈ వాస్తవాన్ని నొక్కి చెప్పడానికి ప్రధాన కారణం ఏంటంటే ఇది నైతికతపట్ల, మతంపట్ల, మానవ సంబంధాలపట్ల, జీవనవిధానంపట్ల మనకున్న నమ్మకాల్ని విచ్ఛిన్నం చేస్తుంది. చిక్కులన్నీ దూరమవుతాయి. ప్రతిదీ మార్పుకి గురవుతుంటే శాశ్వతమైన మంచిచెడు అనే ఆలోచనలే ఉండవు. పూజారులు, తత్వవేత్తలు చెప్పేది ఒక్కటే ఈ నైతికత, మంచిచెడు భావనలు నదిలాంటివి కావు.. అవి వంతెన లాంటివి స్థిరమైనవి.. దృఢమైనవి అంటారు. అవి శాశ్వతంగా, స్థిరంగా ఉంటాయి అంటారు. ఒకానొక సమయంలో ఒకానొక సందర్భంలో వారు అనుకున్న మంచిచెడులు గొప్పవయ్యి ఉండొచ్చు. బహుశా వారు రాబోవు తరాలకి ఎటువంటి ప్రాముఖ్యత లేని కాల్పనిక కథల నుండి తీసుకున్న మంచి చెడు అవ్వొచ్చు. ప్రతిదీ మారుతున్నప్పుడు ప్రతి క్షణం గతం అవుతున్నప్పుడు దైవం పేరిట చెలామణిలో ఉన్న మంచి చెడులకి కూడా కాలం చెల్లినట్లే.

ఇప్పుడు మానవుడ్ని ఒంటరిగా విడిచిపెట్టవలసిన సమయం ఆసన్నమైంది. వారిని ఒంటరిగా వదిలెయ్యండి. వారిని పూర్తిగా వర్తమానంలో ఉండనివ్వండి. వారి చర్యలకు వారిని పూర్తి బాధ్యతతో స్వేచ్ఛగా కాలానుగుణంగా, మార్పుకి అనుగుణంగా జీవించడానికి వదిలెయ్యండి.. కలిసి జీవిత నదితో పరవళ్లు తొక్కడానికి వారిని పూర్తి చైతన్యంతో ఉండనివ్వండి.

❖ ❖ ❖

ప్రపంచంలోని దాదాపు అన్ని మతగ్రంథాలలో "మీరు దొంగిలించకూడదు. చంపకూడదు" అని ఉంటుంది. కానీ ఈ భూమ్మీద మతం పేరిట జరిగినంత ఉన్మాదం, మారణహోమం ఇంకే పేరు మీద అంత ఎక్కువ జరిగి ఉండదు. ఒక చేయిలో ఆయుధం, ఇంకో చేతిలో వారి పవిత్రగ్రంథాన్ని పట్టుకొని ఆ మారణహోమానికి దిగేవారు మీకు శాంతి గురించి బోధించేవారు.. వారు మిమ్మల్ని దొంగిలించకూడదు, చంపకూడదు అని చెప్పేవారు.

ఇది మానవుడు జీవిస్తున్న ప్రపంచం. వారు మనిషిని చంపొచ్చు.. శిలువెయ్యొచ్చు. కానీ వారు సత్యాన్ని సిలువ వేయలేరు. పవిత్రగ్రంథాలు అని పిలవబడేవన్నీ జీవితానికి అనుకూలంగా లేవు. అవి మరణ ఉపన్యాసాలు. వారు వాటిని పవిత్రమైనవని పిలుస్తున్నారు. గుర్తుంచుకోవలసిన ముఖ్య విషయం ఏంటంటే జీవితాన్ని వ్యతిరేకించేది ఏదైనా అపవిత్రమైనది. జీవితాన్ని ప్రశంసించేది, జీవితాన్ని ప్రేమగా, మరింత అందంగా, మరింత ఆనంద దాయకంగా చేసేది ఏదైనా పవిత్రమైనది. జీవితాన్ని దాని సంపూర్ణతతో జీవించడం మాత్రమే పవిత్రమైనది.

❖ ❖ ❖

ఇదిగో.. ఇక్కడేదో కొత్త విలువ ఉంది. దీన్ని నాతోపాటు మీ హృదయాంతరాల్లోకి తీసుకెళ్లడానికి మీరందరూ సిద్ధంగా ఉన్నారా?

మీపట్ల నాకున్న అపారమైన ప్రేమతో మిమ్మల్ని కోరుకుంటున్నాను.

మనిషి తప్పక అధిగమించవలసిన విషయం. ఈ విషయం మీ పొరుగు వారికి కూడా గుర్తుచెయ్యండి. పొరుగువారిని విడిచిపెట్టవద్దు. అధిగమించడానికి అనేక మార్గాలు ఉన్నాయి. ఒకసారి ఇప్పటివరకు మీరు ప్రయాణించిన మార్గాలని, ఛేదించిన లక్ష్యాల్ని చూడండి. మూర్ఖుడు మాత్రమే దీనికి విరుద్ధంగా ఆలోచిస్తాడు.

మీ పొరుగువారిని కూడా అధిగమించండి. శక్తి సంకల్పం మీ హక్కు. అంతేగాని వేరేవాళ్ళ నుండి బహుమతిగా అంగీకరించవలసింది కాదు ఇది.

❖ ❖ ❖

జరతూస్త్ర చెప్పేది ఒక్కటే..

మానవుడు గతాన్ని వదిలించుకున్న క్షణం అతని మనస్సు చాలా తేలిక అవుతుంది. గతాన్ని విడిచిపెట్టిన ఆ మరుక్షణం అతను తన భవిష్యత్తును

ఊహించలేదు.. ఎందుకంటే భవిష్యత్తు అనేది అతనిచే చక్కదిద్దబడిన మెరుగైన గతం మాత్రమే. గతం లేకపోతే భవిష్యత్తు దానంతట అదే మాయమయిపోతుంది. గతాన్ని వదిలించుకోవాలి అనుకోవడం మిమ్మల్ని గతంనుండే కాదు, అది భవిష్యత్తు నుండి కూడా విముక్తి చేస్తుంది. ఇక మిగిలి ఉన్నది ఇప్పుడు ఇక్కడ ఈ క్షణం మాత్రమే.

మీ చైతన్యం, గతకాలపు జ్ఞాపకాలతో, భవిష్యత్తు కలలతో భారం కాకూడదు. అప్పుడు జీవితం ప్రస్తుత క్షణాన్ని ఆనందకరమైన అనుభవంగా మారుస్తుంది. మానవుడు గతకాలపు జ్ఞాపకాలతో, భవిష్యత్తు కలలతో సంచరించవచ్చు కానీ అటువంటి వారికి ఉనికిలో చోటు లేదు. ఉనికికి ఒక విషయం మాత్రమే తెలుసు అది 'ఇప్పుడు', 'ఇక్కడ', 'ఈ క్షణం'. గత, వర్తమాన, భవిష్యత్తు కాలాలు మానవుని సృష్టి. వాస్తవానికి ఇవి కాలవిభజనలు కావు, మనస్సు యొక్క విభజనలు మాత్రమే. ఎందుకంటే గతం అనేది మన జ్ఞాపకాలలో తప్ప ఇంక ఎక్కడా ఉండదు. భవిష్యత్తు మన ఊహల్లో తప్ప ఇంక ఎక్కడా ఉండదు. కాలానికి సంబంధించినంతవరకూ ఎల్లప్పుడూ ఉండేది ఒక్కటే: ఈ క్షణం.

❖ ❖ ❖

నా సోదరులారా..! మొదటివాడు ఎప్పుడూ బలి అవ్వక తప్పదు. మనమంతా మొదటివాళ్ళం.

సోదరులారా..! మొదటివారి త్యాగాలు ఎలా విఫలమవుతాయి అనుకుంటారు?

మనలాంటివారు తమను తాము కాపాడుకోవటానికి ఇష్టపడనివారిని మాత్రమే ప్రేమిస్తారు. అలాంటివారే వంతెనని ధైర్యంగా దాటగలరు.

❖ ❖ ❖

నేను బిత్తరబిత్తరగా గతంవైపు చూసేవాళ్ళని చూసి జాలి పడుతున్నాను.. ఎందుకంటే అది వాళ్ళకి బహూకరించబడింది. అది మీ పూర్వీకుల నుండి, మీ తల్లిదండ్రులచే, మీ విద్యావ్యవస్థ ద్వారా, మీ మతాచార్యుల నుండి, మీ గ్రంథాల ద్వారా మీకు అప్పగించబడింది. అంతేగాని అది మీ అన్వేషణ ద్వారా కానీ, మీ అనుభవం నుండి కానీ పొందినది కాదు. అనుభవపూర్వకంగా తెచ్చుకోనిది ఏదైనా మిమ్మల్ని వినీలగగనంలో ఎగరనివ్వకుండా వెనక్కి లాగుతుంది.

ప్రతి తరం తన పిచ్చిని కొత్తతరానికి ఇస్తూనే ఉంటుంది. అందుకే మనిషి నిరంతరం కిందకు జారిపోతున్నాడు. తరతరానికి ఆ పిచ్చి పెరుగుతూనే ఉంది. ప్రతి తరం మనిషి జీవితానికి ఆ పిచ్చిని జోడిస్తూనే ఉంది. తరాలు గడిచి పోతున్నాయి.. ముందు తరం ఆ తరువాత తరానికి ఆ పిచ్చిని ఇస్తూనే ఉంది. తరువాతి తరం దానిపై మెరుగుపడుతూ వస్తుంది. మరల అది తరువాత రాబోయే తరానికి అప్పగిస్తుంది. శతాబ్దాలుగా మానవుడు చేస్తున్నది ఒక్కటే: పూర్వం నుండి తనకి వారసత్వంగా అప్పగించిన పిచ్చిపై ఇంకా ఇంకా మెరుగుపడాలని ఆశించడం.

అది పిచ్చి అనే నిజాన్ని దాచడానికి అతను దానికి అందమైన పేర్లు పెడుతూ వస్తున్నాడు.

దానిని పవిత్రంగా ఆరాధించాలని తనని తాను ఒప్పించుకుంటూ, ఇతరులను ఒప్పించడానికి ప్రయత్నిస్తూనే ఉన్నాడు. గుంపు ఎప్పుడూ బంగారు గతం గురించి ఆలోచిస్తూ ఉంటుంది. దాన్ని స్వర్ణయుగం అని పిలుస్తుంది. అదేంటో అది ఎప్పుడూ గతంలోనే ఉంటుంది.

ఇప్పటివరకు మానవుడు పూర్తిగా క్రూరత్వంతో, అజ్ఞానంలో ఆది మానవుడిగా జీవించాడు. అతనికి ఉన్నతమైన జీవితం అవసరం. కొత్త నైతికతతో, కొత్త విలువలతో నూతన జీవనవిధానాన్ని సృష్టించడం అవసరం.. మొత్తంగా సూపర్ మాన్‌ని సృష్టించడం అవసరం. అటువంటి లక్షలమంది సూపర్ మాన్‌లతో ఈ ప్రపంచం నిండి ఉండడం అవసరం.

❖ ❖ ❖

మంచిచెడులపట్ల మనకి చాలా భ్రమలే ఉన్నాయి.

ఇప్పటివరకు ఈ భ్రమ యొక్క చక్రం భవిష్యవాణి మాటల చుట్టూ తిరిగింది.

ఆ మనిషి కూడా ఆ భవిష్యవాణి మాటలను బలంగా విశ్వసించాడు అందువల్లే మానవుడు తనను తాను ఒక నిమిత్తమాత్రుడే అని భావించాడు. కానీ ఇప్పుడు మనిషి భవిష్యవాణి మాటలను అపహాస్యం చేస్తూ, తనకి శక్తి సంకల్పం ఉందని, తనని తాను అధిగమించగల స్వేచ్ఛ ఉందని విశ్వసించాడు.

❖ ❖ ❖

ఓ నా సోదరులారా..! నేను మీయొక్క శక్తి సంకల్పాన్ని గుర్తుచేస్తున్నాను.

మీరు దానికి అనుగుణంగా నడవాలని కోరుకుంటున్నాను. మీరు సూపర్ మాన్‌కి ఒక ధర్మపరిపాలకుడిగా, తండ్రిలా, అతను ఉద్భవించడానికి ఒక విత్తనంలా ఉండాలని కోరుకుంటున్నాను. మీ గతం, మీ పూర్వీకులు మీరు గౌరవప్రదంగా జీవించడానికి ఎటువంటి అవకాశం మీకు ఇవ్వలేదు. మీరు వెళ్లే చోట మాత్రమే మీకు గౌరవం దక్కుతుంది. మంచి భవిష్యత్తును సృష్టించడం, మంచి మానవాళిని సృష్టించడం, సూపర్ మాన్‌ని సృష్టించడం మీ లక్ష్యం అవ్వాలి. ఆ శక్తి మీలోనే ఉంది. మిమ్మల్ని మీరు అధిగమించి ముందుకు వెళ్లడం అంటే మీ వెంట తెచ్చుకున్న గతవైభవపు పిచ్చిని దూరం పెట్టి ముందుకు సాగడమే. అది మీకు గౌరవాన్ని ఇస్తుంది. మీరు ఎల్లప్పుడూ మీ పూర్వీకులను గౌరవిస్తూ వచ్చారు. కానీ మీరెప్పుడైనా మీ పిల్లవాడిని గౌరవించారా? మీరు మీ గతాన్ని గౌరవిస్తూ వచ్చారు. కానీ ఎప్పుడైనా మీ పిల్లల భవిష్యత్తును గౌరవించారా? గతం నుండి విమోచనం పొందడం ద్వారా మిమ్మల్ని మీరు భూమిపై ఉన్నతంగా తీర్చిదిద్దుకోగలరు.

గతం నుండి విముక్తి పొందండి.

సూపర్ మాన్ ఆవిర్భావానికి గతం ఒక్కటే అడ్డంకి. దానినుండి విముక్తి పొందడం కష్టమైన విషయం కాదు, ఎందుకంటే గతం అనేది మీ జ్ఞాపకాలు, గతకాలపు నైతికత మాత్రమే. అది మీ మనస్సులోనే ఉంది. గతం మనస్సుపై వదిలిపెట్టిన దుమ్ము, ధూళిని శుభ్రపరచడం ద్వారా మీ చైతన్యాన్ని అద్దంలా మెరిసేలా చేస్తుంది. అప్పుడు అది మీ నూతన భవిష్యత్తుని, నూతన విలువల్ని, సూపర్ మాన్‌ని ప్రతిబింబించే అద్దంలా శుభ్రంగా ఉంటుంది.

❖ ❖ ❖

సోదరులారా...! నేను క్రూరంగా కనపడుతున్నానా మీకు?

ఏది పడిపోవడానికి సిద్ధంగా ఉందో.. దాన్ని పడగొట్టాలి.. కిందకి తోసెయ్యాలి.

ప్రతిదీ పడిపోతుంది మరియు క్షీణిస్తుంది. ఐతే దాన్నెవరు తనిఖీ చేస్తారు?

నేనే దాన్ని తనిఖీ చేస్తాను. నేనే దాన్ని నెట్టేస్తాను.

నిటారుగా లోతుల్లోకి పడిపోతున్న రాళ్లను చూసేటప్పుడు కలిగే ఆనందం ఎలా ఉంటుందో మీకు తెలుసా? నేటి ఈ మానవులను చూడండి. వారు సూపర్ మాన్ ఎత్తులను చేరుకోవడానికి వారంతటవారు అస్తమించడంలో ఉన్న అందాలని ఆస్వాదించండి.

❖ ❖ ❖

ఒకసారి బొగ్గు "ఎంతైనా మనం దగ్గర బంధువులం కదా నీకెందుకు అంతటి కాఠిన్యం..?" అని వజ్రాన్ని అడిగింది.

అప్పుడు వజ్రం "నువ్వు నా సోదరుడివే కదా..! మరి నీలో అంత మెతకదనం, అంత విచారం, సౌమ్యత, ప్రతిఘటన లేమి, ఆత్మవంచన, లొంగుబాటుతనం, ఎందుకు అంత చిన్నతనం అని నేను నిన్ను అడగొచ్చు.

నీ గమ్యమేంటో నీకే తెలియకపోతే నన్నెలా ఓడించగలవు నువ్వు?

నీలో కాఠిన్యం వికసించకపోతే నువ్వేదైనా ఎలా సృష్టించగలవు?

ఒక్కటి గుర్తుంచుకో.. సృష్టించేవాళ్ళంతా నాలా కాఠిన్యం కలవారే. అయితే నీకు మాత్రం మైనపుముద్దను మెత్తగా వత్తినట్లు లక్షలాదిమందితో కరచాలనం ఇవ్వడం పరమానందంగా ఉంటుంది కదూ.." అని అన్నది వజ్రం.

అయితే నేను సరికొత్త నీతినియమాన్ని మీ ముందుంచుతున్నాను..

ఓ నా సోదరులారా ! కఠినులు కండి. కఠినంగా ఉండండి. అది సృష్టించేవారి లక్షణం. సూపర్ మాన్ లక్ష్యం.

❖ ❖ ❖

# స్వస్థత పొందడం

ఒక రోజు సూర్యోదయం సమయంలో జరతూస్త్ర తన గుహ నుండి పిచ్చివాడిలా ఎగురుకుంటూ బయటికి దూకి భయంకరమైన భీతిగొలిపే స్వరంతో తన విశ్రాంతి స్థలంలో లేవటానికి నిరాకరించిన మరెవరో పడుకున్నట్లుగా లే.. లే.. నిద్ర లే.. అని గట్టి గట్టిగా అరుస్తున్నాడు. జరతూస్త్ర స్వరం ఆ కొండల్లో ప్రతిధ్వనిస్తూ ఉంది. అతని జంతువులు భయంతో జరతూస్త్ర దగ్గరికొచ్చాయి. తన గుహ దగ్గర, చుట్టుపక్కల ఉన్న మిగతా జంతువులన్నీ భయంతో పరుగులు పెడుతున్నాయి. పక్షులన్నీ చెల్లాచెదురుగా దూరంగా ఎగిరిపోతున్నాయి.

నిద్రలే.. నిన్ను నిద్ర లేపే కోడిపుంజుని నేనే..

మీ చెవులను తెరవండి. నేను మీ మాటలు వినాలనుకుంటున్నాను. లెండి.. సమాధుల్లో నిద్రపోతున్నవారు కూడా విని నేర్చుకునేలా ఉరుముల్లా ఉన్నాయి నా మాటలు. నిద్రమత్తుని వదలండి. మీ కళ్ళతో కూడా నా మాట వినండి. గుడ్డిగా జన్మించినవారిని కూడా నా స్వరం నయం చేస్తుంది. మీరు మేల్కొన్న తరువాత, శాశ్వతంగా మేల్కొనే ఉంటారు. మీ ముత్తాతలను నిద్రనుండి మేల్కొలపడం నా మార్గం కాదు. లెండి.. జరతూస్త్ర మిమ్మల్ని పిలుస్తున్నాడు.

మాట్లాడుతూ మాట్లాడుతూ ఉన్నట్టుండి ఒక్కసారిగా కూలబడిపోయాడు జరతూస్త్ర. ఒక శవంలా అలానే ఉన్నాడు. కొద్దిసేపటికి కోలుకున్నాడు.. కానీ కొంచెం నలతగా, నీరసంగా ఉన్నాడు. పెద్దగా ఆకలిగా కూడా లేదు. జరతూస్త్ర తాను విశ్రాంతి తీసుకుంటున్న మంచం మీద నుండి పైకి లేచి చేతిలోకి ఆపిల్ పండు తీసుకున్నాడు. దాని వాసన అతనికి చాలా ఆహ్లాదకరంగా అనిపించింది

నిజానికి జరతూస్త్ర ఏడు రోజుల తరువాత ఇప్పుడే స్పృహలోకి వచ్చాడు. అప్పటివరకు జరతూస్త్ర జంతువులైన సర్పం, డేగ అతనికి తోడుగా, రక్షణగా ఉండి ఆహారాన్ని అందించాయి. డేగ జరతూస్త్రకి కాపలాగా గొర్రెలకాపరుల నుండి రెండు గొర్రెపిల్లలను దొంగిలించి తీసుకొచ్చింది. జరతూస్త్ర స్పృహలోకి వచ్చాడని తెలుసుకొని అతని జంతువులు అతనితో మాట్లాడడానికి సిద్ధం అయ్యాయి.

“ఓ జరతూస్త్ర.. నీవు ఏడు రోజులుగా తరువాత ఇప్పుడే మేల్కొన్నావు.. నీవు మళ్ళీ నీ కాళ్ళ మీద నిలబడగలవా? గుహ నుండి బయటికిరా.. ప్రపంచం నీ కోసం ఒక తోటలాగా వేచి ఉంది.

నీవు ఏడు రోజులు ఒంటరిగా గుహలోనే ఉన్నావు. గుహ నుండి బయటికిరా. నీకు క్రొత్తజ్ఞానం వచ్చింది. పులియబెట్టిన పిండిలా నువ్వు ఏడు రోజులు అలాగే పడుకొని ఉన్నావు.. నువ్వు ఇప్పుడు పూర్తిగా కొత్తజ్ఞానంతో నిండి ఉన్నావు.

ఓ జరతూస్త్ర.. మనలాగే ఆలోచించేవారికి విషయాలన్నీ తమకు తాముగా నృత్యం చేస్తాయి. అవి వచ్చి మన చేయి పట్టుకుని నవ్వుతాయి.. మనతో కలిసి నృత్యం చేస్తాయి.. పారిపోతాయి.. మరల తిరిగి వస్తాయి.

వేసవి తరువాత వర్షాకాలం, వర్షాకాలం తరువాత శీతాకాలం, శీతాకాలం తరువాత వేసవి వస్తుంది. అలా ఒకదానికొకటి వృత్తాకారంలో తిరుగుతూ ఉంటాయి. భూమి సూర్యుని చుట్టూ వృత్తాకారంలో తిరుగుతుంది. అలాగే భూమి తనచుట్టూ తాను తిరుగుతుంది. హేమంత ఋతువులో చెట్లనుండి ఆకులు రాలుతాయి. మరల వాటి స్థానంలో కొత్త ఆకులు చిగురిస్తాయి. మరల హేమంత ఋతువు వస్తుంది. అదే మరల మరల జరుగుతుంది.

ప్రతి ఉదయం సూర్యుడు ఉదయిస్తాడు. ప్రతి సాయంత్రం అస్తమిస్తాడు. లక్షల సంవత్సరాల తరువాత ఇప్పుడు జరిగినవే మరల పునరావృతం అవుతాయి. ఈ రోజు మనం చూసేది లక్షలసార్లు ఇదివరకు ఉన్నదే.. మరల లక్షలసార్లు ఉంటుంది.

“జరతూస్త్ర.. ఇప్పుడు నువ్వు మరల మానవుల వద్దకు వెళ్ళవలసిన సమయం ఆసన్నమైంది. వారికి ఈ ‘అనంతమైన ఈ పునరావృతతత్వాన్ని’ బోధించు. ఈ ఏడు రోజుల్లో నువ్వు కనుగొన్న సత్యం ఇదే. చైతన్యం, జీవితం, ప్రతిదీ ఒక వృత్తంలో కదులుతుంది. ఇప్పుడు జరిగినవి, జరుగుతున్నవి మరలా మరలా పునరావృతమవుతాయి. మనం మరల కలుసుకుంటాము. మాట్లాడుకుంటాం.. నవ్వుకుంటాం.. కలిసి పాడుతాం.. ఈ సిద్ధాంతాన్ని బోధించడమే నీ విధి. కానీ ఇది మీకు గొప్ప ప్రమాదాన్ని కూడా తెచ్చిపెడుతుంది. ఎందుకంటే ఎవరూ దీన్ని ఇష్టపడరు. వినడానికి కూడా ఎవ్వరూ సిద్ధంగా ఉండరు. ఇది వారి జీవిత పునాదులను కదిలిస్తుంది అని అన్నాయి.

జరతూస్త్ర బదులుగా ఈ ఏడు రోజుల్లో నాకేమైందో మీకు బాగా తెలుసు.

ఆ రాక్షసుడు నాకు ఊపిరాడకుండా చేసాడు. కానీ నేను వాడి తలను కొరికి ఉమ్మాను. అలా కొరకడం వలన నేను అప్పటికే బాగా అలసిపోయాను. నా సొంతశక్తినుండి నేను మేల్కొన్నాను. కానీ ఇంకా అనారోగ్యంతోనే ఉన్నాను. అయినా మీరు ఇవన్నీ చూస్తూ నిలబడ్డారా?

మీరు కూడా మనుషుల మాదిరిగా క్రూరంగా మారిపోయారా..? మనిషి క్రూరమైన జంతువు.

ఇతరులు బాధలో ఉంటే మానవులకి చూస్తూ ఉండడం చాలా ఇష్టం. అలా చూస్తూ అయ్యో అని జాలి చూపడం కూడా ఇంకా ఇష్టం. ప్రతిదీ శాశ్వతంగా పునరావృతమవుతుంది అంటే సామాన్య మానవులు, వారి జీవితం, వారి మూర్ఖత్వంలో కూడా ఎటువంటి మార్పు లేకుండా మళ్ళీ పునరావృతం అవుతుంది కదా అన్నాడు జరతూస్త్ర.

జరతూస్త్ర దిగులుతో, ఉద్రేకంతో బాధపడ్డాడు. తక్కువస్థాయిలో ఉన్నవారికి సహాయం అవసరం అనుకున్నాడు.

సమాజం గొప్ప అడ్డంకిని సృష్టించింది. సమాజం కొంతమంది మానవులను ఇతరులకన్న గొప్పగా భావిస్తుంది, కానీ ఈ 'గొప్ప మానవులు' కూడా దేవతలు ఆక్రమించే అధికారం యొక్క అత్యున్నతస్థానాలను పొందలేరు. ఇది మానవాళిని క్రూరమైన జాతిగా మార్చింది. మానవజాతి యొక్క దిగువ శ్రేణుల అవసరం లేని సమాజాన్ని నేను కోరుకుంటున్నాను.

మరల మరల పునరావృతమయ్యే దానిలో మానవుడు కష్టాలు పడకూడదు. మానవాళి దానిని అర్థం చేసుకుని, వారి జీవితాన్ని యాంత్రికత నుండి మరింత చేతనతో, అప్రమత్తమైన అవగాహనతో జీవించడం ప్రారంభిస్తే శాశ్వత పునరావృతం కూడా గొప్ప ఆశీర్వాదం అవుతుంది. ధైర్యాన్ని కూడగట్టుకోవడం, సవాళ్ళను అంగీకరించడం మాత్రమే తన ముందున్న ఒకే ఒక సవాలు. ప్రస్తుతం జరతూస్త్ర ముందున్న పెద్ద సవాలు ఏంటంటే మానవాళి ఉనికిలోకి 'చిన్న మనిషి / సామాన్య మానవుడ్ని' కూడా అనుమతించాలి.

జరతూస్త్ర ఉన్నట్లుండి మౌనం వహించాడు. జరతూస్త్ర ఇంకా ఏమైనా మాట్లాడుతాడేమో అన్నట్లు అతని జంతువులు ఎదురుచూస్తున్నాయి. కానీ జరతూస్త్ర అదేం పట్టించుకోకుండా నిద్రిస్తున్న వ్యక్తిలా కళ్ళు మూసుకుని నిశ్శబ్దంగా ఉన్నాడు. అతను అప్పుడే తన అంతరాత్మతో సంభాషించాడు. పాము, డేగ అతన్ని అంత తెలివిగా, నిశ్శబ్దంగా గుర్తించినప్పుడు, అతని చుట్టూ ఉన్న గొప్ప నిశ్చలతను గౌరవించి వివేకంతో వినాలనే మాటలని విరమించుకున్నాయి.

❖ ❖ ❖

# తనకు తాను ఇచ్చుకున్న బహుమతులు

అనంతమైన పునరావృతం యొక్క స్వభావాన్ని అర్థం చేసుకొని దానిని అంగీకరించడం వలన జరతూస్త్ర యొక్క మనస్సు తేలికైంది. జరతూస్త్ర ఇప్పుడు అన్నిటి నుండి విమోచించబడ్డాడు. తన ఆత్మకి కూడా అన్నిటి నుండి మోక్షం కల్పించాడు.

అతని మనస్సు చాలా తేలికగా, హాయిగా ఉంది. ఆనందంతో పొంగి పోతున్నాడు.

తన ఆత్మకు ఇచ్చిన బహుమతులను గుర్తుచేసుకుంటూ ఆనందంతో నృత్యం చేస్తుంటాడు జరతూస్త్ర.

ఓ నా ఆత్మ..! నిన్ను అన్ని మూలల నుండి విడుదల చేశాను. దుమ్ముని, సాలీళ్లను, సంధ్యాసమయాలను నీ నుండి తీసివేశాను.

నీకు తుఫానులాంటి స్వరంతో 'వద్దు' అనగలిగే హక్కుని ఇచ్చాను.

నిర్మలాకాశంతో 'అంగీకారం' తెలపగలిగే హక్కుని ఇచ్చాను.

నువ్వు ఇప్పుడు నిల్చున్నా, నడచినా... తుఫానులాంటి అడ్డంకులు ఎదురైనా కాంతిలా స్థిరంగా ఉండగలవు.

నేను అన్నిటినీ హతమార్చే పాపాన్ని కూడా హతమార్చాను.

సూర్యుడు తన ఎత్తులకు సముద్రాన్ని ఆకర్షించుకునేటటువంటి వశపరుచుకో గల శక్తిని నీకు ఇచ్చాను.

నీ నేలకు తాగే జ్ఞానాన్ని ఇచ్చాను.

ఓ నా ఆత్మ..! నీకు నేను అన్నీ ఇచ్చాను. ఇప్పుడు నా చేతులు ఖాళీ అయిపోయాయి.

నేను నీకు ప్రతిదీ ఇచ్చాను. అన్నిటి నుండి మోక్షం కల్పించాను. జగత్తు యొక్క నిజమైన ప్రతీకారస్వభావమైన అనంతమైన పునరావృతాన్ని అంగీకరించ గలిగే ధైర్యాన్ని ఇచ్చాను.

కానీ మనిద్దరిలో (తన ఆత్మ, తాను) ఎవరు ఎవరిపట్ల కృతజ్ఞతతో ఉండాలి? ఇచ్చేవాడిగానా? లేక దానిని స్వీకరించిన ఆత్మగానా?

❖ ❖ ❖

# జీవితంతో మచ్చిక

ఓ జీవితమా...! నిన్ను ద్వేషించకుండా ఎవరు ఉండగలరు...?

నువ్వు మలిచేదానివి.. వంచించేదానివి.. కోరుకునేదానివి.. దక్కించుకునే దానివి..

నిన్ను ప్రేమించకుండా ఎవరూ ఉండగలరు చెప్పు!

నువ్వు అమాయకురాలివి..అసహనమూర్తివి..

చిన్నపిల్లల కళ్ళతో ఉన్న పాపివి...

నేను నీతోపాటే నాట్యం చేస్తుంటాను.. నీ అడుగులు ముద్ర పడిన చోటల్లా నిన్ను వెంబడిస్తూ ఉంటాను.

నువ్వు ఎక్కడున్నావో..! నీ చెయ్యి అందివ్వు.. కనీసం నీ వేలునైనా అందివ్వు.. నువ్విప్పుడు బాగా అలిసిపోయినట్టు ఉన్నావు. అక్కడ సూర్యాస్తమయాలు ఉన్నాయి. గొఱ్ఱెలకాపరులు వేణువు ఊదుతున్నప్పుడు నిద్రపోవడం ఎంత మనోహరంగా ఉంటుందో కదా.. నువ్వు బాగా అలిసిపోయావు. నేను నిన్ను అక్కడికి తీసుకెళ్తాను పదా. నీకు దాహం వేస్తే, నేను నీ దాహం కూడా తీర్చగలను. కానీ నీ నోరు తాగాలనుకోదు. నేను నీకు గొఱ్ఱెలకాపరిలా ఉండి ఉండి బాగా అలిసిపోయాను.

ఓ మంత్రగత్తె...! నేను ఇప్పటివరకు నీకోసం పాటలు పాడాను. ఇప్పుడు నువ్వు శోకించవలసిన సమయం వచ్చింది.

నా కొరడాకి అనుగుణంగా నువ్విప్పుడు నాట్యం చెయ్యక తప్పదు. శోకించక తప్పదు.

నేను కొరడాని మరిచిపోయానా? లేదనుకుంటా..!

దానికి జీవితం తన మృదువైన చెవులను మూసుకుంటూ...

ఓ జరతూస్త్ర...! నీ కొరడాను మరీ అంత భయంకరంగా ఝళిపించకు.. నీకు తెలుసు కదా.. విపరీతమైన ధ్వనులు ఆలోచనలను హత్య చేస్తాయి. ఇప్పుడిప్పుడే కొత్త ఆలోచనలు వస్తున్నాయి నాకు. మనమిద్దరం మంచివాళ్ళము కాదు.. చెడ్డవాళ్ళమూ కాదు. మంచిచెడులకు అతీతంగా ఇప్పుడే ఒక దీవిని, పచ్చిక మైదానాన్ని కనుగొన్నాము. మనమిద్దరం ఒకరినొకరం ప్రేమించుకోక

పోయినా, ఒకరిపట్ల ఒకరం కక్ష పెంచుకోవడం అవసరమా...? నీకు తెలుసు.. నువ్వంటే నాకిష్టమని. ఎందుకంటే నీ జ్ఞానంపట్ల నాకు అసూయ.. కానీ ఎప్పుడైతే నీ నుండి జ్ఞానం పారిపోతుందో అప్పుడు నేను కూడా నిన్ను వదిలి వెళ్ళిపోతాను.

జరతూస్త్ర...! నువ్వు మరీ అంత నమ్మకస్తుడిలా ఏం లేవు. నాకు చెప్పినంతగా నువ్వు నన్ను ప్రేమించడం లేదు. నాకు తెలుసు.. నువ్వు త్వరలోనే నా నుండి దూరంగా వెళ్ళిపోతున్నావని.

దానికి జరతూస్త్ర సందేహిస్తునే "అవును" అని సమాధానం ఇచ్చాడు.

జరతూస్త్ర యొక్క 'జ్ఞానం' తన 'జీవితానికి' వ్యతిరేకం కాదని జీవితానికి జ్ఞానంపట్ల ఉన్న అసూయను శాంతింపజేస్తాడు.

అతని జ్ఞానం ఇప్పుడు అన్నింటికన్నా 'జీవితాన్ని' ఎక్కువగా ప్రేమిస్తుందని తెలుసుకున్నాడు. జరతూస్త్ర కూడా జీవితాన్ని పూర్తిగా ప్రేమించడం నేర్చుకున్నాడు. చివరికి ఒక అడవి జంతువుని మచ్చిక చేసుకున్నట్టు జరతూస్త్ర తన శక్తి ద్వారా ఆమెను / జీవితాన్ని లొంగదీసుకున్నాడు. వారిద్దరూ ప్రేమికులు అయ్యారు.

ఆ ఆనందంలో ఇద్దరూ తన గుహలో ఆనందంగా పాటలు పాడుకుంటూ నృత్యం చేస్తూ ఉంటారు.

ఆ నృత్యం చివరిలో అర్ధరాత్రి అవ్వడానికి కొన్ని గంటల ముందు..

కానీ నీకు ఈ విషయం కూడా తెలుసు అంటూ జీవితం యొక్క చిక్కుపడిన జుట్టు వెనక ఉన్న చెవిలో ఒక విషయం గుసగుసగా చెప్పాడు జరతూస్త్ర..

ఓ.. జరతూస్త్ర... నీకు ఆ విషయం తెలుసా...! అని జీవితం అడిగింది.

ఆ తరువాత వారిద్దరూ ఒకరినొకరు చూసుకుంటూ చాలాసేపు ఏడ్చారు. ఆ క్షణంలో జరతూస్త్రకి జ్ఞానం కన్నా జీవితం చాలా దగ్గరయినట్టు తోచింది.

**నోట్:** జరతూస్త్ర జీవితం యొక్క చెవిలో ఏం చెప్పాడు అనేది ఎక్కడా కూడా ఇన్ఫర్మేషన్ లేదు.. కానీ వాల్టర్ కాఫ్మాన్ అనే ఫిలాసఫర్ అనాలసిస్ ప్రకారం జరతూస్త్ర 'జీవితం' యొక్క చెవిలో తాను అర్ధరాత్రి పన్నెండు గంటలకు 'ఆనందం' యొక్క శాశ్వతమైన స్థితికి చేరుకుంటానని, ఒకవేళ మరణించినా ఆ మరణం తరువాత మరల నీకోసం తిరిగి వస్తానని చెప్పి ఉండొచ్చని అన్నాడు.

❖ ❖ ❖

# ఏడు ముద్రలు

(ఈ చివరి అధ్యాయం కొత్త నిబంధనలోని ప్రకటన గ్రంథానికి చాలా దగ్గరిగా ఉంటుంది. ప్రకటన గ్రంథంలో ఏడు ముద్రలను విచ్ఛిన్నం చేయడం ద్వారా భూమిపై రాబోయే బీభత్సాన్ని, ఆ బీభత్సం ద్వారా జరగబోయే మానవాళి అంతం గురించి తెలియజేస్తుంది. కానీ ఈ అధ్యాయంలో ఏడు ముద్రలను విచ్ఛిన్నం చేయడం భూమి అంతరించిపోవడానికి బదులుగా జీవితాన్నీ అనంతమైన పునరావృతం సమక్షంలో వివాహం చేసుకోవడంతోపాటు నూతన మానవాళికి నూతన జీవనవిధానాలను తెలియజేయడం, జరతూస్త్ర దైవత్వం యొక్క ఎత్తైన స్థానానికి చేరుకొని సూపర్ మాన్ అవ్వడాన్ని తెలియజేస్తుంది)

## 1

ఎవరైతే తమ గాఢాంధకార లోతుల్లో వెలుగు ద్వారా విమోచించబడడానికి వేచి చూస్తున్నారో వారు ధన్యులు.

అలాంటి వెలుగు తమని తాకడం కోసం వాళ్ళు మరింత బలంగా ఆ శిఖరాలను పట్టుకు వేలాడవలసి ఉంటుంది. ఎవరైతే ఆ వెలుగును చిరునవ్వుతో స్వీకరిస్తారో వారు ధన్యులు. వారే ఏదో ఒక రోజున భవిష్యత్తుపై వెలుగును ప్రసరింపచేయువారు.

అటువంటప్పుడు నేను అనంతమైన పునరావృతాన్ని మోహించకుండా ఎలా ఉండగలను?

నేను ప్రేమించే ఈ స్త్రీనుండి తప్ప ఇంకే స్త్రీ నుండి కూడా పిల్లల్ని కనాలని కోరుకోవడం లేదు.

ఎందుకంటే నేను ప్రేమించేది శాశ్వతత్వాన్ని..

ఓ శాశ్వతత్వమా..! నేను నిన్ను ప్రేమిస్తున్నాను..

## 2

ఒకవేళ నా కోపం సమాధులను పేల్చివేసి, సరిహద్దులను కదిలించి, పాతవిలువల్ని తలక్రిందులు చేసి విరగ్గొడితే..

నా అపహాస్యం పాతబడ్డ పదాలను గాలిలోకి ఊదిపడేస్తే.. సిలువ గుర్తున్న సాలీళ్లను ఊడ్చిపారెయ్యడానికి నేనే చీపురు అయితే.. నేను పాత దేవుళ్ళను

ఖననం చేసిన దగ్గర ప్రపంచాన్ని దీవించే, ప్రపంచాన్ని ప్రేమించే వాటిపక్కన కూర్చుంటాను.

అటువంటప్పుడు నేను అనంతమైన పునరావృతాన్ని మోహించకుండా ఎలా ఉండగలను?

నేను ప్రేమించే ఈ స్త్రీ నుండి తప్ప ఇంకే స్త్రీనుండి కూడా పిల్లల్ని కనాలని కోరుకోవడంలేదు.

ఎందుకంటే నేను ప్రేమించేది శాశ్వతత్వాన్ని..

ఓ శాశ్వతత్వమా..! నేను నిన్ను ప్రేమిస్తున్నాను..

## 3

ఒకవేళ భూమి బద్దలయ్యి, నిప్పుల వరదను పీల్చుకునేంతవరకు దేవుడితో దేవుని బల్ల (భూమి)పై పాచికలు ఆడే అవకాశం నాకు వస్తే..

ఒకవేళ ప్రమాదాన్ని నాట్యంగా మార్చగలిగే సృజనాత్మకమైన శక్తి నాకు ఉంటే...

నేను అనంతమైన పునరావృతాన్ని మోహించకుండా ఎలా ఉండగలను?

నేను ప్రేమించే ఈ స్త్రీనుండి తప్ప ఇంకే స్త్రీనుండి కూడా పిల్లల్ని కనాలని కోరుకోవడం లేదు.

ఎందుకంటే నేను ప్రేమించేది శాశ్వతత్వాన్ని..

ఓ శాశ్వతత్వమా..! నేను నిన్ను ప్రేమిస్తున్నాను..

## 4

ఒకవేళ నా చెయ్యి దూరంగా ఉన్నవాటిని దగ్గర చేస్తే, ఆత్మకి అగ్నిని ఇస్తే, నొప్పికి అనందాన్ని ఇస్తే, హుందాతనానికి కొంటెతనాన్ని ఇస్తే..

నేను అనంతమైన పునరావృతాన్ని మోహించకుండా ఎలా ఉండగలను?

నేను ప్రేమించే ఈ స్త్రీనుండి తప్ప ఇంకే స్త్రీనుండి కూడా పిల్లల్ని కనాలని కోరుకోవడం లేదు.

ఎందుకంటే నేను ప్రేమించేది శాశ్వతత్వాన్ని..

ఓ శాశ్వతత్వమా..! నేను నిన్ను ప్రేమిస్తున్నాను..

## 5

ఒకవేళ నేనే కనుక సముద్రాన్ని ఇష్టపడితే, అది కోపంతో నన్ను విభేదించి నప్పుడు నన్ను ఇంకా మరింతగా ఇష్టపడితే, నాలో తెలియనివాటి దిశగా తెరచాపలను చాపి, వెతకడంలో ఆనందం దానికి ఉంటే, అప్పుడు ఎల్లలు లేనితనం నా చుట్టూ గర్జిస్తుంది అంటూ పట్టరాని ఆనందంతో కేకలు వేస్తే...

నేను అనంతమైన పునరావృతాన్ని మోహించకుండా ఎలా ఉండగలను?

నేను ప్రేమించే ఈ స్త్రీనుండి తప్ప ఇంకే స్త్రీనుండి కూడా పిల్లల్ని కనాలని కోరుకోవడం లేదు.

ఎందుకంటే నేను ప్రేమించేది శాశ్వతత్వాన్ని..

ఓ శాశ్వతత్వమా..! నేను నిన్ను ప్రేమిస్తున్నాను..

## 6

ఒకవేళ నాకు ఆది, అంతం అనేది ఉందంటే అది ఎలాంటి ఆది అంతాలు కావాలని అనుకుంటానంటే శరీరం యొక్క అంతిమదశ డ్యాన్సర్‌లా, ఆత్మ యొక్క అంతిమదశ పక్షిలా మారాలని కోరుకుంటాను. అదే నా ఆది, అదే నా అంతం..

అలాంటప్పుడు నేను అనంతమైన పునరావృతాన్ని మోహించకుండా ఎలా ఉండగలను?

నేను ప్రేమించే ఈ స్త్రీనుండి తప్ప ఇంకే స్త్రీనుండి కూడా పిల్లల్ని కనాలని కోరుకోవడం లేదు.

ఎందుకంటే నేను ప్రేమించేది శాశ్వతత్వాన్ని..

ఓ శాశ్వతత్వమా..! నేను నిన్ను ప్రేమిస్తున్నాను..

## 7

నిశ్చలమైన ఆకాశాన్ని నా మీద పరుచుకొని, ఆకాశంలో నా సొంత రెక్కలతో నా సొంత ఆకాశంలో నేను ఎగిరినప్పుడు నా స్వేచ్ఛ నుండి పక్షి జ్ఞానం పుట్టింది. ఆ పక్షి జ్ఞానం నాకేం చెప్తుంది అంటే నా కన్నా ఎత్తులో కానీ కింద కానీ ఎవ్వరూ లేరని. నిన్ను నువ్వు విసిరేసుకో అన్నివైపులా.. నువ్వే కాంతివి, పాట

పాడు ఇక నువ్వేం మాట్లాడకు.. మాటలన్నీ భారమైన మనుషుల కోసం మాత్రమే. కాంతి ముందు మాటలన్నీ అబద్ధాలే కదా! ఏదైనా పాట పాడు. ఇంకేం మాట్లాడకు..

నేను అనంతమైన పునరావృతాన్ని మోహించకుండా ఎలా ఉండగలను?

నేను ప్రేమించే ఈ స్త్రీనుండి తప్ప ఇంకే స్త్రీనుండి కూడా పిల్లల్ని కనాలని కోరుకోవడం లేదు.

ఎందుకంటే నేను ప్రేమించేది శాశ్వతత్వాన్ని..

ఓ శాశ్వతత్వమా..! నేను నిన్ను ప్రేమిస్తున్నాను..

# ఫ్రెడ్రిక్ నీషే పరిచయం

**కుటుంబం & విద్యాభ్యాసం:**

కార్ల్ లుడ్విగ్, ఫ్రాంజిస్క దంపతులకు 1844 అక్టోబర్ 15న జర్మనీలోని ఆధునిక లీప్జిగ్‌కు నైరుతిదిశలోని ప్రష్యన్ గ్రామమైన రూకెన్‌లో నీషే జన్మించాడు. నీషే తండ్రి లూథరన్ చర్చి పాస్టర్. నీషేకి ఐదు సంవత్సరాల వయసులోనే అతని తండ్రి మరణించాడు. మరికొద్ది నెలలకే అతని తమ్ముడైన 'లుడ్విగ్ జోసెఫ్' కూడా మరణించాడు. నీషే తండ్రి మరణం తరువాత, అతని కుటుంబం చర్చి పాస్టర్ ఇంటిని వదిలి సాక్సోనీలోని సాలే నదిపైనున్న నౌంబర్గ్ అనే పట్టణానికి వలస వెళ్ళింది. ఆ రెండు మరణాలు నీషే పసిహృదయంపై జీవితచరమాంకం వరకు చెరగని ముద్ర వేశాయి. నీషే అతని తల్లి, అమ్మమ్మ, ఇద్దరు అత్తయ్యలు, చెల్లెలు మధ్య పెరిగాడు. 1858లో ప్రతిష్ఠాత్మక ప్రొటెస్టంట్ బోర్డింగ్ పాఠశాల అయిన షుల్ఫోర్టాలో చేరాడు. అక్కడే నీషే తన జీవితకాల మిత్రుడైన 'పాల్ డ్యూసెన్'ను కలుసుకున్నాడు. పాల్, స్వామి వివేకానందకి స్నేహితుడు మరియు జర్మన్ తత్వవేత్త అయిన ఆర్థర్ షోపెన్ హూవర్ ఫిలాసఫీపట్ల బాగా ప్రభావితం అవ్వబడినవాడు. నీషేకి షోపెన్ హూవర్‌ని పరిచయం చేసింది కూడా ఇతనే. ఆర్థర్ షోపెన్ హూవర్ యొక్క ఫిలాసఫీపట్ల ఆకర్షితుడయిన నీషేకి ఒక సెకండ్ హ్యాండ్‌బుక్ స్టోర్‌లో షోపెన్ హూవర్ యొక్క 'ది వరల్డ్ ఇజ్ విల్ అండ్ రిప్రజెంటేషన్' కనపడింది. దానిని కొని చదివి ఆకళింపు చేసుకున్నాడు నీషే. కానీ మానవుడిలో మనుగడ సాగించాలన్న కోరికే దుఃఖానికి కారణమన్న షోపెన్ హూవర్ నిరాశావాదాన్ని నీషే తీవ్రంగా విభేదించాడు. కోరికవల్ల దుఃఖం కలుగుతుందని షోపెన్ హూవర్ నిరాశావాది అయ్యాడు. కోరిక వలనే శక్తి కలుగుతుందని నీషే ఆశావాది అయ్యాడు. ఆ ఆశలో నుండి పుట్టుకొచ్చినదే 'శక్తి సంకల్పం'.

1864లో షుల్ఫోర్టా నుండి పట్టభద్రుడయ్యాడు నీషే. పాస్టర్ కావాలనుకున్న తన తల్లి ఆశలను వమ్ముచేస్తూ ప్రతి సంవత్సరం కుటుంబమంతా కలిసి ఆనందంగా జరుపుకునే ఈస్టర్ పండగకి ఆ సంవత్సరం హాజరు కాలేదు. ఆ తరువాత క్రైస్తవ ధర్మశాస్త్రం, శాస్త్రీయ భాషాశాస్త్రంలో ప్రఖ్యాతిగాంచిన బాన్

విశ్వవిద్యాలయంలో ప్రవేశించాడు. అక్కడే గ్రీకు, లాటిన్ భాషలను, బైబిల్‌ను విమర్శనాత్మకంగా అభ్యసించే విధానాన్ని అలవరుచుకున్నాడు. 1865లో నీషే లీప్జిగ్ విశ్వవిద్యాలయానికి బదిలీ అయ్యాడు. అక్టోబర్ 1867 లో నిర్బంధ సైనిక సేవ విభాగంలో భాగంగా వేగంగా పరిగెత్తుతున్న గుర్రాన్ని ఎక్కడానికి ప్రయత్నిస్తున్నప్పుడు అదుపు తప్పి తీవ్రంగా గాయపడడం వలన నీషే ఛాతీకి గాయం అయ్యింది. 1868లో తిరిగి విద్యాలయానికి వచ్చాడు. అదే సంవత్సరంలో జర్మన్ స్వరకర్త రిచర్డ్ వాగ్నెర్‌ను కలిశాడు. అతని వయస్సు తన తండ్రి వయస్సుకి సమానం అయినప్పటికీ, ఆర్థర్ షోపెన్ హూవర్ యొక్క రచనలపట్ల వారిద్దరికీ ఉన్న ఆసక్తి అతిత్వరలోనే వారిని మంచి స్నేహితులను చేసింది. నీషే కూడా ఒక మంచి అభిరుచి కల స్వరకర్త.

**ప్రొఫెసర్‌గా నీషే:**

1869లో నీషే యొక్క ప్రొఫెసర్ అయిన ఫ్రెడరిక్ విల్హెల్మ్ రిట్ష్ల్, నీషేని స్విట్జర్లాండ్‌లోని బాసెల్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా సిఫారసు చేశాడు. నీషేని ప్రొఫెసర్‌గా నియమించడానికి బాసెల్ విశ్వవిద్యాలయం తన ప్రష్యన్ పౌరసత్వాన్ని వదులుకోమని కోరడంతో నీషే తన పౌరసత్వాన్ని వదులుకున్నాడు. కానీ స్విస్ పౌరసత్వం కూడా పొందలేకపోయాడు. అలా 1869 నుండి తన జీవితాంతం వరకూ ఏ దేశ పౌరసత్వం లేకుండా జీవించాడు. అదే సంవత్సరం అతను ప్రచురించిన వ్యాసాల ఆధారంగా తన డాక్టరేట్ పూర్తి చెయ్యక పోయినప్పటికీ లీప్జిగ్ విశ్వవిద్యాలయం నుండి పిహెచ్.డి. పొందాడు. శాస్త్రీయ భాషాశాస్త్రంలో ప్రొఫెసర్‌గా బాసెల్ విశ్వవిద్యాలయానికి నియమించబడ్డాడు. తన ప్రష్యన్ పౌరసత్వాన్ని వదులుకున్నప్పటికీ, ఫ్రాంకో–ప్రష్యన్ యుద్ధం (1870––71) ప్రారంభమైనప్పుడు నీషే నిర్బంధ సైనికసేవలో కొంతకాలం పనిచేశాడు. కానీ విరేచనాలు, తలనొప్పి మరియు డిఫ్తీరియాకి గురవ్వడంతో ఆర్మీ నీషేని తిరిగి బాసెల్‌కు పంపించింది. ఆ అనారోగ్య సమస్యలు నీషేని జీవితాంతం బాధించాయి. 1879 వరకు అక్కడే ప్రొఫెసర్‌గా పనిచేశాడు. నీషే అక్కడే చరిత్ర మీద అధ్యయనం చేస్తున్న ఫ్రాంజ్ ఓవర్బెక్ (1837–1905)ను కలుసుకున్నాడు. అతను నీషేకి జీవితకాల మిత్రుడయ్యాడు. నీషే అద్భుతమైన ఉపాధ్యాయుడు అయినప్పటికీ, భాషాశాస్త్రం మరియు విశ్వవిద్యాలయ జీవితంతో బాగా విసిగి పోవడం వలన తన దృష్టిని తత్వశాస్త్రం వైపు మరల్చాడు.

1871 నుండి నీషే తీవ్రమైన అనారోగ్యంతో బాధపడ్డాడు. అతని చిన్నతనం నుండి బాధించే తలనొప్పి ఇంకా తీవ్రమయ్యి అతన్ని మరింత బాధించింది. ఆ అనారోగ్యం కారణంగా, రోజుల తరబడి విశ్రాంతి తీసుకోవడం వలన విశ్వ విద్యాలయానికి కూడా సరిగా వెళ్ళేవాడు కాదు. నిరంతరం తీవ్రమైన తలనొప్పి, నిద్రలేమి, అజీర్ణంతో బాధపడేవాడు. వీటివలన రోజుకి కొన్ని గంటలు మాత్రమే చదవడం, రాయడం చేసేవాడు. అప్పుడే తన దృష్టినంతా రచనలపై కేంద్రీకరించాలని అనుకున్నాడు. కంటి చూపు బాగా తగ్గిపోయింది. పాక్షికంగా అంధుడు కూడా అయ్యాడు. అయినప్పటికీ 1872లో ప్రచురించబడిన తన మొదటి ప్రధాన రచన 'The Birth of Tragedy' ని పూర్తి చేశాడు. కానీ అది ఎటువంటి సాంప్రదాయక విద్యా ప్రమాణాలను, శైలిని పాటించలేదని అప్పటి భాషాశాస్త్ర నిపుణులు దానిని ఖండించారు. మరికొందరు అభినందించారు కూడా. ఇది రచయితగా, ఉపాధ్యాయుడిగా నీషే వృత్తికి ఏవిధంగానూ ఉపయోగపడలేదు. అదే సమయంలో అనారోగ్యం కారణంగా నీషే తన ఉద్యోగానికి ఎక్కువ సమయాన్ని కేటాయించలేకపోయేవాడు. 1873–76 మధ్యలో 'Untimely Meditations' అనే పేరుతో అనేక వ్యాసాలను ప్రచురించాడు. 1876 నాటికి వాగ్నెర్‌లో క్రైస్తవంపట్ల, జర్మన్ జాతీయవాదంపట్ల పెరుగుతున్న ఆసక్తి, యూదులపట్ల వ్యతిరేకత వలన నీషే వాగ్నర్ స్నేహానికి స్వస్తి చెప్పాడు.

**దశాబ్దపు మేధావి:**

1877లో తీవ్ర అనారోగ్యం కారణంగా నీషే విశ్వవిద్యాలయం నుండి సెలవులు తీసుకున్నాడు. రోజురోజుకీ ఆరోగ్యం క్షీణిస్తూ ఉండడంతో 1879లో విశ్వవిద్యాలయంలో తన పదవికి రాజీనామా చేశాడు. తద్వారా వచ్చే నెలసరి పింఛనుతో జీవితం వెళ్లదీసేవాడు. తరువాత దశాబ్దంపాటు వివిధ రకాల అనారోగ్య కారణాలవల్ల నిరంతర నొప్పితో బాధపడేవాడు నీషే. ప్రశాంతమైన వాతావరణం కోసం స్విట్జర్లాండ్, దక్షిణ ఫ్రాన్స్ మరియు ఇటలీలలో ఒక చోటు నుండి మరొక చోటుకి తన నివాసాన్ని మార్చేవాడు. స్నేహితులు ఉన్నప్పటికీ ఒంటరిగా నివసించడానికే ఎక్కువ ఇష్టపడేవాడు. అదే సమయంలో అతని స్విస్ స్నేహితుడు అయిన పాల్ రీ, నీషేకి సైకో అనలిస్ట్ అయిన 'లూ ఆంద్రియాస్–సలోమే' అనే ఒక రష్యన్ రచయిత్రిని పరిచయం చేసాడు. నీషే ఆమెతో ప్రేమలో పడ్డాడు. అతని ప్రేమని వ్యక్తపరిచాడు. కానీ ఆమె అతని ప్రేమని నిరాకరిస్తూ నీ రచనల్ని,

నీ తాత్విక ఆలోచనల్ని ప్రేమించినంతగా నిన్ను ప్రేమించలేను అని చెప్పి... చివరకు ఫిలాసఫీలో ఓనమాలు కూడా తెలియని వ్యక్తిని పెళ్లి చేసుకొని వెళ్ళిపోయింది.

అదే దశాబ్దంలో నీషే 'The Dawn of the Day', 'The Gay Science', 'Thus Spoke Zarathustra', 'Beyond Good and Evil', 'The Genealogy of Morality' పుస్తకాలను రాసాడు. కానీ ఏ రచనలు తన జీవితకాలంలో ఎక్కువగా ప్రశంసించబడలేదు. 1889 లో మతిభ్రమించడానికి ముందు 'Twilight of the Idols', 'The Antichrist', 'The Case of Wagner', 'Contra Wagner' మరియు మేధో ఆత్మకథ అయిన 'Ecce Homo' లను రాశాడు.

**ఉన్మాదం:**

జనవరి 1889లో, టురిన్‌లోని వీధిలో ఒక వ్యక్తి తన గుర్రాన్ని కొట్టడాన్ని చూసి దాన్ని ఆపడానికి పరుగెత్తి అక్కడే వీధిలో కూలిపోయాడు నీషే. అప్పుడే అతని బుద్ధి మందగించింది. ఉన్మాదం ఆవహించింది. అతని స్నేహితుడు అయిన ఓవర్బెక్ అతన్ని తిరిగి బాసెల్‌కు తీసుకువెళ్ళాడు. నీషే మొదట మానసికరోగులకు సంబంధించిన ఒక శరణాలయంలో నివసించాడు. తరువాత అతని తల్లి అతన్ని నౌంబర్గ్‌కు తీసుకెళ్లింది. 1897లో ఆమె మరణం తరువాత, అతని సోదరి అయిన ఎలిజిబెత్ నీషే బాధ్యతలను తీసుకుంది. నీషే తన జీవితంలో చివరి 11 సంవత్సరాలలో తన తెలివిని కోల్పోవటానికి కారణం అతనిలో నిద్రాణమై ఉన్న సిఫిలిస్ రోగం యొక్క మూలాలేనని చాలామంది అంటారు. దానివలనే నీషే విలక్షణమైన పక్షవాతానికి కూడా గురయ్యాడు. అతని విద్యార్థి రోజుల్లో ఒక వేశ్యాగృహంలోని వేశ్య నుండి ఈ లైంగికవ్యాధి సంక్రమించింది. అది అతని ఇతర అనారోగ్య సమస్యలకు ఆజ్యం పోసింది. కొంతమంది అతని కుడికన్ను వెనుక, మెదడు ఉపరితలంపై నెమ్మదిగా పెరుగుతున్న కణితిని అతని పాక్షిక అంధత్వం మరియు విపరీతమైన తలనొప్పికి కారణం అయ్యి ఉండొచ్చు అని వాదించారు.

అటువంటి ఉన్మాదస్థితిలో కూడా నీషే తన రచనలపై నుండి తన దృష్టిని మరల్చలేదు. ఆ సమయంలోనే నీషే 'Anti Christ', 'Will to Power' రాసాడు. కానీ ఆ సమయంలో తనేం రాసినా ఒక రకమైన ఉద్రేకంతో, ఉన్మాదంతో

‘యాంటీ క్రిస్ట్’, ‘శపించబడినవాడు’ అని సంతకం చెయ్యడం మాత్రం మరిచేవాడు కాదు.

నీషే సోదరి ఎలిజిబెత్ తన సోదరుని సంరక్షణలో భాగంగా, అతని రచనలపై నియంత్రణ సాధించింది. నీషే ప్రచురించని ‘విల్ టూ పవర్’ యొక్క డ్రాఫ్ట్‌ని ప్రచురించడం ప్రారంభించింది. నిజానికి ఆమె ఒక ప్రముఖ జర్మన్ జాతీయవాది మరియు యూదులకు వ్యతిరేకి అయిన బెర్నార్డ్ యొక్క భార్య. తర్వాతి కాలంలో అతను ఆత్మహత్య చేసుకొని మరణించాడు. ఆమె అతని రాజకీయ అభిప్రాయాలను విస్తరించే భాగంలో నీషే రచనలను తనకు అనుకూలంగా మార్చుకుంది. ఆ రచనల ద్వారానే ఆమె నీషేని నాజీల దృష్టిలో దేవుణ్ని చెయ్యడానికి ప్రయత్నించి విజయం సాధించింది. నౌంబర్గ్‌లో నీషే చేసిన రచనలతో ఒక గ్రంథాలయాన్ని స్థాపించింది. ఆ ప్రదేశం ఒక రకమైన మ్యూజియంగా మారింది. నీషేకి దీని గురించి ఏమీ తెలియకపోయినా, 1890లో మరణించే సమయానికి నీషే ఒక జాతీయ ప్రముఖుడు. నాజీల దృష్టిలో దేవుడు అయ్యాడు.

ఫిలాసఫీ, సైకాలజీ మరియు కళలపై నీషే యొక్క ప్రభావం అపారమైనది. నీషే ప్రత్యక్షంగానో, పరోక్షంగానో 20, 21వ శతాబ్దాలలోని ముఖ్యమైన చాలామంది తత్వవేత్తలను, కళాకారులను ప్రభావితం చేశాడని చెప్పడంలో అతిశయోక్తి లేదు. అతని ఆలోచనలచే ప్రభావితమైన ముఖ్యమైన ప్రముఖ దిగ్గజాలలో అయాన్ రాండ్, సిగ్మండ్ ఫ్రాయిడ్, కాఫ్కా, కార్ల్ జంగ్, మార్టిన్ హైడెగర్, జీన్–పాల్ సార్త్రే, ఆల్బర్ట్ కామస్, జాక్వెస్ డెరిడా, మార్టిన్, థామస్ మన్ మరియు రైనర్ మరియా రిల్కే వంటివారు ఎందరో ఉన్నారు.

# ముఖ్య పదబంధాలు

'Thus spoke Zarathustra'లో చాలా తరుచుగా వాడే పదబంధాల్లో ముఖ్యమైనవి.

- సూపర్ మాన్
- నిహిలిజం (శూన్యవాదం)
- దేవుడు మరణించాడు
- అధిగమించడం, శక్తి సంకల్పం (విల్ టూ పవర్)
- అనంతమైన పునరావృతం
- డ్యాన్స్ మరియు నవ్వు

**సూపర్ మాన్:**

సమస్త మానవాళి చేరుకోవాల్సిన గమ్యం సూపర్ మాన్ స్థితి. జరతూస్త్ర బోధనలలోని సూపర్ మాన్‌కు, కామిక్ బుక్ సూపర్ హీరో అయిన సూపర్ మాన్‌కి ఎటువంటి సంబంధం లేదు. పరిణామక్రమంలో కోతి నుండి మనిషి వచ్చాడు. కానీ మనిషి ఇంకా మనిషి దగ్గరే ఆగిపోయాడు.. శారీరకంగా కాకుండా తాత్వికంగా మనిషి తనని తాను అధిగమించి ఇంకా ముందుకు వెళ్లి పరిణామక్రమంలో ఉన్నతదశకి చేరుకోవాల్సిన స్థితిని సూపర్ మాన్ అంటాడు నీషే. సూపర్ మాన్ అంటే మనిషి తన మీద తాను పూర్తి అధికారాన్ని సాధించగల అంతిమ స్థితి. మానవాళి దేవుడు వంటి భావనలతో వారిలోని శక్తి సామర్థ్యాలను పక్కనపెట్టింది. విలువల వలన మానవుడు అంతకు అంత దిగజారిపోతున్నాడు. అందువలన విలువలకు చక్రవర్తి అయిన దేవుడు మరణించి, తనకు తానుగా కొత్త విలువలు సృష్టించుకోగల సూపర్ మాన్ ఉనికిలోకి రావాలి అంటాడు నీషే. సూపర్ మాన్ తనను తాను పూర్తిగా అధిగమించిన వ్యక్తి. అతను తనను తానుగా నిర్ణయించుకున్న మంచిచెడులు, నైతికత, విలువలు తప్ప ఇంక వేటికి కట్టుబడి ఉండడు.

**నిహిలిజం:**

ఎటువంటి మత, నైతిక విలువలకు అర్థం లేని నమ్మకాన్ని నిహిలిజం అంటారు.

నీషే సమకాలీనులలో చాలామంది పద్దెనిమిదో శతాబ్దం నుండి పంతొమ్మిదవ శతాబ్దపు కాలాన్ని సైన్స్ మరియు ఇతర రంగాలలో అత్యంత ఎక్కువ పురోగతి సాధిస్తున్న దేశంగా గుర్తించారు. కానీ నీషే మాత్రం తన కాలాన్ని విలువల్లో సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నట్లు చూశాడు. తన కాలాన్ని ఎటువంటి బలమైన, సానుకూల లక్ష్యాలు లేని శూన్యవాదంగా పేర్కొన్నాడు. 'అంతిమ మానవుడు' నిహిలిజం యొక్క ఫలితం.

దేవుడు మన జీవితాలకు అర్థం ఇస్తాడని అనుకోకూడదు. అలా అని మన జీవితాలకి అర్థాన్ని ఇచ్చేదానిని మానవుడు కూడా ఇప్పటివరకు ఏమీ కనుగొనలేదు. అప్పుడు మానవుడి జీవితం అర్థరహితంగా కనపడుతుంది. అప్పుడు దేన్నైనా క్రొత్తదాన్ని సృష్టించడం కూడా అర్థం లేనిదిగా కనపడుతుంది. అప్పుడు ఎటువంటి ఒక ప్రయోజనం లేకుండా మానవుడు సామాన్యతకి, సౌకర్యవంతమైన మనుగడకి అలవాటు పడిపోతాడేమోనని భయపడ్డాడు నీషే.

ఎటువంటి సానుకూల నమ్మకాలు, లక్ష్యాలు లేకుండా సాధ్యమైనంత తక్కువ ప్రమాదకరంగా సౌకర్యవంతంగా మనుగడ సాగిస్తున్నాడు నేటి మానవుడు. త్వరలో అందరూ ఒకేలా ఉంటారు. జీవితాల్లో పరిణామక్రమం చెందడానికి కావాల్సిన ఎలాంటి అలజడులు లేకుండా అందరూ మధ్యస్థంగా, సంతృప్తికరంగా మనుగడ సాగిస్తూ మేము ఆనందాన్ని కనుగొన్నాం అని చెప్పి మురిసిపోతారు.

సూపర్ మాన్ అంటే నిహిలిజానికి పరిష్కారం.

సూపర్ మాన్ దేవుడు లేని ప్రపంచాన్ని ఎదుర్కొంటాడు, అర్థరహితమైన దానిని కనుగొనడం కంటే, దానికి తన సొంత అర్థాన్ని ఇచ్చుకోవడానికి సిద్ధమవుతాడు. విజ్ఞానశాస్త్రం యొక్క పెరుగుదలతో, క్రైస్తవ ప్రపంచ దృష్టికోణం ప్రజల జీవితాలలో మార్పులు తేవడానికి ఎటువంటి పాత్రనూ పోషించలేదు, నీషే ఈ నిహిలిజం అనేదానిని 'దేవుడు మరణించాడు' అనే భావనలో సంక్షిప్తీకరించాడు.

**దేవుడు మరణించాడు:**

నీషే యొక్క తత్వశాస్త్రంలో చాలా తప్పుగా అర్థం చేసుకోబడిన వాటిలో ఇదొకటి.

నీషే మొదట ఈ పదబంధాన్ని 'The Gay Science' అనే బుక్‌లో సెక్షన్ 108లో ఉపయోగించాడు. అయినప్పటికీ ఇది 'Thus Spoke Zarathustra' లోనే చాలా ప్రసిద్ధి చెందింది. దేవుడు భౌతికంగా మరణించాడని నీషే ఉద్దేశం కాదు. ఏదైతే మన జీవితానికి అర్థాన్ని ఇవ్వకుండా అడ్డుపడుతుందో దాన్ని మనం చంపెయ్యాలి అంటాడు నీషే. క్రైస్తవ నైతికతని నాశనం చేయడం ద్వారా మానవాళిని తిరిగి పునరుజ్జీవింపజేయడానికి అతను ఈ మార్గాన్ని రూపొందించినట్టుగా చెప్తాడు. మంచి చెడు, స్వర్గం నరకం వంటి భావనలు ప్రజలు తమను తాము అధిగమించే క్రమంలో అడ్డుగా నిలుస్తున్నాయని అందువలన దేవుడు మరణించాడనే నిజాన్ని నమ్మనిదే మానవుడు తనని తాను అధిగమించి సూపర్ మాన్ స్థితికి చేరుకోలేడు అంటాడు నీషే. దేవుడు మరణించాడనే ప్రకటన ఒక వ్యక్తి యొక్క నిజమైన స్వేచ్ఛకు చాలా అవసరం. ఈ భావన యొక్క అంగీకారం మనిషిలో నిద్రాణమై ఉన్న శక్తి సంకల్పాన్ని కనుగొనడానికి, సూపర్ మాన్ ఎత్తులను ఆస్వాదించడానికి అనుమతిస్తుంది అంటాడు నీషే.

**అధిగమించడం మరియు శక్తి సంకల్పం:**

నీషే యొక్క 'శక్తి సంకల్పం' అనే భావనను తన ఇతర భావనలన్నీ అంతర్లీనంగా అనుసరిస్తాయి. అధిగమించడం అనే భావన శక్తి సంకల్పానికి కేంద్రంగా ఉంటుంది. నిజమైన శక్తి నిన్ను నువ్వు అధిగమించడంలోనే ఉంటుంది అంటాడు నీషే. తమను తాము అనుసరించని వారెవరైన వేరొకరిని అనుసరించ వలసి ఉంటుంది అది బానిసత్వంతో సమానం. నిజమైన శక్తి ఎవర్ని వారు అధిగమించడం ద్వారా, స్వీయ నైపుణ్యం ద్వారా మాత్రమే సాధించగలుగుతారు. సూపర్ మాన్ గురించి నీషే యొక్క భావన మొత్తం స్వేచ్ఛపైనే ఆధారపడి ఉంటుంది. సూపర్ మాన్‌ని ఏ శక్తీ నిరోధించలేదు. అతను సృష్టికర్త. అతను సృజనాత్మకశక్తి యొక్క ఉన్నతమైన శక్తి.

మనిషిలో ఉన్న సృజనాత్మకశక్తి, స్వేచ్ఛ నిరంతరం మార్పుకోసం ప్రయత్నిస్తూనే ఉంటాయి. మనల్ని మనం అధిగమించడానికి మనం మారాలి. ఎందుకంటే శక్తి సంకల్పం అన్ని జీవుల్ని నడిపించే ఏకైక శక్తి. అది మానవునిలో నిద్రాణమై ఉన్న అత్యంత గొప్పశక్తి. అది మార్పును ప్రేరేపిస్తుంది. మార్పు అనేది అన్ని జీవితాల యొక్క ప్రాథమిక లక్షణం. నీషే ప్రకారం ప్రతిదీ మార్పుకి గురవుతూనే ఉంటుంది. శాశ్వతమైనవి అంటూ ఏవీ ఉండవు. పదార్థంలాగే, ఆలోచనలు, జ్ఞానం, నైతికత అన్నీ నిరంతరం మార్పుకి లోనవుతూ ఉంటాయి. శక్తి సంకల్పం ఈ మార్పుకి మూలం వంటిది. విశ్వం ప్రధానంగా వాస్తవాలు లేదా వస్తువులతో కాకుండా సంకల్పాలతో రూపొందించబడి ఉంది అంటాడు నీషే. నీషే ప్రకారం, మనిషిలో 'నేను' అనేది ఒకదానినొకటి అధిగమించాలని చూసే సంకల్పాల యొక్క సమూహం తప్ప ఇంకోటి కాదు. మార్పు అనేది జీవితంలో ఒక ప్రాథమిక అంశం కనుక, మతపరమైన, శాస్త్రీయమైన లేదా తాత్వికమైనా దేన్నైనా జీవితం తిరస్కరించేదిగా భావిస్తుంది. ఆనందంగా జీవించడాన్ని ధృవీకరించే ఏ తత్వశాస్త్రమైన మార్పును అంగీకరిస్తుంది. స్వీకరిస్తుంది.

ఈ శక్తి సంకల్పం, మనుగడ సాగించాలనే సంకల్పం కంటే శక్తివంతమైనది. మానవుడు తమ సంకల్పాన్ని ఇతరులపై అధికారం చెలాయించడానికి కాకుండా తమ నైపుణ్యాన్ని, సృజనాత్మకశక్తిని పెంచుకోవడానికి ఉపయోగించుకోవాలి అంటాడు నీషే.

**అనంతమైన పునరావృతం:**

మూడవ భాగం చివరి వరకు జరతూస్త్ర అనంతమైన పునరావృత సిద్ధాంతం యొక్క పర్యవసానాలతో కుస్తీ పడుతూ ఉంటాడు. 'స్వస్థత పొందడం' ముందు చాప్టర్ వరకు జరతూస్త్ర పునరావృతాన్ని అంగీకరించడానికి సిద్ధంగా ఉండడు. ఎందుకంటే అతను సామాన్య మానవుడు ఆ సిద్ధాంతం ద్వారా ఇంకా ఎక్కువ గడ్డుపరిస్థితులు ఎదుర్కొనకూడదని, దాని ద్వారా నష్టపడకూడదని అతని ఉద్దేశం.

జరతూస్త్ర (లేదా నీషే) మానవాళిలో అసహ్యించుకునేది, విమర్శించేది ప్రతి క్షణం మార్పుకి గురవుతున్నదానికి స్పందించలేని మనిషి యొక్క అసమర్థతని,

నిస్సహాయతని. ఈ మార్పు అనేది శక్తి సంకల్పం ద్వారా ప్రేరేపించబడుతుంది. శక్తి సంకల్పం మనిషికి ఉండవలసిన ముఖ్య లక్షణం. కాబట్టి మార్పును తిరస్కరించడం అంటే జీవితాన్ని తిరస్కరించడమే. అన్నీ స్థిరమైనవి అనే నమ్మకంతో జీవించవలసి వస్తే ఇప్పటివరకు ఉన్న విలువలు కూడా స్థిరమైనవి అని విశ్వసించవలసి ఉంటుంది. ఈ రకమైన స్థిరనైతిక నియమావళి మనిషి తనని తాను అధిగమించి సూపర్ మాన్ అయ్యే దశలో 'ఆత్మ యొక్క గురుత్వాకర్షణ' రూపంలో అతన్ని ఇంకా ఇంకా కిందకి లాగుతుంది. దీనివలన మానవుడు స్థిరమైన విలువలకు అతుక్కుపోయి ఎటువంటి నవ్వు, నృత్యం లేకుండా పరిణామక్రమంలో అక్కడే ఉండిపోతాడు. ఒకవేళ ఈ ప్రపంచాన్ని అర్థం చేసుకోవడానికి ఒక్కటే సరైన మార్గం ఉంటే మానవుడు తన సొంత దృక్పథాన్ని సృష్టించడానికి ఎప్పటికీ ప్రేరణ ఉండదు.

మార్పుని అంగీకరిస్తూ, మానవాళిని వెనక్కి పట్టి లాగే ఈ ఆత్మ యొక్క గురుత్వాకర్షణ శక్తిని వ్యతిరేకిస్తూ జరతూస్త్ర అనంతమైన పునరావృతానికి మార్గాన్ని సూచిస్తాడు. అనంతమైన పునరావృత సిద్ధాంతాన్ని స్వీకరించడం అంటే మనల్ని వెనక్కి పట్టి లాగే ఆత్మ యొక్క గురుత్వాకర్షణ శక్తిని తిరస్కరిస్తూ, అన్నీ మారుతున్నాయని అంగీకరించడమే. ఈ మార్పు యొక్క స్వభావం పునరావృతం. జరతూస్త్ర జీవితానికి నవ్వు, ఆనందం, నృత్యాలను కలిగి ఉండాలని అంటాడు. ఎందుకంటే సంపూర్ణమైనవి, స్థిరమైనవి లేని ఈ ప్రపంచంలో దేన్నీ సీరియస్‌గా తీసుకోవలసిన అవసరం లేదు. జరతూస్త్ర శాశ్వత పునరావృతాన్ని మూడవ భాగం చివరిలో అంగీకరిస్తాడు. జీవితంలో ఇప్పుడు ఇక్కడ ఈ క్షణం ఇక్కడితో ముగిసిపోదని.. ఇవే సంఘటనలు మరలా మరలా పునరావృతం అవుతాయని చెప్పడమే దీని ముఖ్య ఉద్దేశం. ఇది ఇప్పుడు ఇక్కడ వర్తమానంలో ఆనందంగా, తీవ్రతతో జీవించడానికి ఉపయోగపడుతుంది. ఇక్కడ ఏదీ స్థిరమైనవి కానీ, శాశ్వతమైనవి కానీ లేవు. అంటే సంపూర్ణ స్థిరమైన సత్యాలు కానీ, దేవుడు కానీ, దేవుడికి సంబంధించిన నైతికవిలువలు కానీ ఏవీ లేవని నమ్మాలి. స్థిరమైనవి, శాశ్వతమైనవి అంటే ఇప్పుడు ఇక్కడ మనం మార్చడానికి ఏం లేదని అర్థం. ప్రతి క్షణం శాశ్వతంగా పునరావృతమవుతుంది, కానీ ఈ క్షణాలకి దేనికీ అంతిమ అర్థం కానీ, ఉద్దేశ్యం కానీ లేదు. జీవితం అంటే మనం ఏం చేయగలం అనేది అంతకంటే ఏం కాదు. ప్రతి క్షణానికి మనం బాధ్యత వహించగలిగితే, అది

మనకు జరుగుతున్నది కాదు, మనం చేసిన ఏదో ఒకటిగా చూస్తే, ప్రతి క్షణం అన్నీ శాశ్వతత్వానికి విస్తరించే శక్తి భావనగా మనం ఆనందించవచ్చు.

**డ్యాన్స్ మరియు నవ్వు:**

ఎప్పుడూ సీరియస్‌గా దేవుడు, నైతికత, విలువలు వంటి అస్థిర భావాలకు అంటిపెట్టుకోకుండా జీవితాన్ని పూర్తిగా ఆస్వాదిస్తున్నామనే విషయాన్ని ఒంట్లో ప్రతి భాగాన్ని ప్రతిబింబించేలా చేయడం డ్యాన్స్ అంటే. నీషే తరచుగా మనస్సు యొక్క తేలికత్వానికి రూపకంగా డ్యాన్స్‌ని ఉపయోగిస్తాడు. డ్యాన్స్ ఏ మార్పునైనా అంగీకరించే మనస్తత్వం, చురుకుదనం సృజనాత్మకంగా ఆలోచించడానికి స్వేచ్ఛగా అనుమతిస్తుంది.

డ్యాన్స్ మాదిరిగా, నవ్వు అనేది సూపర్ మాన్ యొక్క సాధారణ లక్షణం. నవ్వు అనేది ఎవరినైనా లేదా దేన్నైనా తక్కువగా చూసే చర్యగా నీషే భావిస్తాడు. సూపర్ మాన్ అందరికంటే ఎక్కువ ఎత్తులో ఉన్నాడు. అక్కడ ఎవ్వరూ లేరు.. తనతో సహా.. ఉన్నదల్లా నవ్వు మాత్రమే.

# అయాన్ రాండ్ యొక్క ఫౌంటైన్ హెడ్‌పై నీషే ప్రభావం

అయాన్ రాండ్ కెరీర్ ప్రారంభంలో ఫ్రెడరిక్ నీషే రచనలు ఆమెను చాలా ప్రభావితం చేసాయి. రష్యా నుండి అమెరికాకి వలస వచ్చేటప్పుడు అయాన్ రాండ్ తనతోపాటు తెచ్చుకున్న పుస్తకం నీషే యొక్క 'Thus Spoke Zarathustra'. ఆమె ప్రచురించిన తన రచనలలో (The Early Ayn Rand Book) నీషే యొక్క సూపర్ మాన్‌ని అనుకరించేలాంటి హీరో పాత్రలను మనం చూడొచ్చు. రాండ్ 1930 నుండి 1943 మధ్య ఫౌంటెన్ హెడ్ రాస్తున్న సమయంలో నీషే యొక్క ప్రభావం ఆమె మీద ఎక్కువే.

Laster Hunt అనే ఫిలాసఫర్, అయాన్ రాండ్ యొక్క ఫౌంటెన్ హెడ్‌ని నీషే ఫిలాసఫీకి సంబంధించిన ఒక గౌరవప్రదమైన విమర్శగా చదవవచ్చు అన్నాడు.

ముఖ్యంగా ఫౌంటైన్ హెడ్‌లోని వైనాండ్ పాత్ర నీషే ఫిలాసఫీపై అయాన్ రాండ్ యొక్క విమర్శనాత్మక ప్రయోగంగా చెప్పుకోవచ్చు.

వైనాండ్ పోలికలను వివరించడంలో భాగంగా… "వైనాండ్‌కి జన్యుపరంగా అతనికి అతని తల్లి పోలికలు కానీ, తండ్రి పోలికలు కానీ రాలేదు. అతని పోలికలు అతని పూర్వీకుల నుండి వచ్చినవి. దాన్ని దశాబ్దాల్లో కాదు శతాబ్దాలలో కొలవాలి" అంటుంది అయాన్ రాండ్. నీషే యొక్క సమకాలికులు చాలామంది నీషేని, నీషే యొక్క ఆలోచనల్ని, తత్వాన్ని మరియు అతని భాషాశైలిని సోక్రటీస్ కంటే ముందు వాడిగా ఉంటుంది అంటారు. వైనాండ్ పాత్రని తీర్చిదిద్దడంలో భాగంగా అతను ప్రేరణ పొందిన అంశాలను నీషే ఫిలాసఫీకి చాలా దగ్గరగా ఉండేలా చూసుకుంది అయాన్ రాండ్.

వైనాండ్ చిన్నప్పుడే చర్చిలో బోధించే వినయవిధేయతలు, సహనం, అణుకువ గొప్పవనే బోధనలపట్ల విరక్తి కలిగి బయటికి రావడం, చిన్నప్పుడే సెక్స్‌కి సంబంధించిన అన్ని విషయాలు తెలియడం, ప్రేమించక ప్రేమించక

ఒక అందమైన అమ్మాయిని ప్రేమించి ఆ తరువాత ప్రేమ జోలికి వెళ్లకపోవడం, హెర్బర్ట్ స్పెన్సర్ ఫిలాసఫీని చదవడం, ముల్లిగాన్‌పట్ల ఉన్న ఇష్టాన్ని అధిగమించడం, ఎండిన చెట్టు మీద పిడుగు పడి కూలిపోతే తప్పు పిడుగుది కాదు అని వైనాండ్‌తో పలికించడం లాంటివి ఎన్నో నీషే ఫిలాసఫీకి దగ్గరగా ఉండే అంశాలు.

అయాన్ రాండ్ నీషే ఫిలాసఫీని విమర్శించినప్పటికీ, వ్యక్తి యొక్క గర్వించదగిన అంతర్గత, భావోద్వేగస్థితిని సంగ్రహించే అతని కవితాపటిమంటే ఆమెకు ఎంతో ఇష్టం. నీషే "మనిషి గొప్పతనం, అతని సృజనాత్మకశక్తిపట్ల ఇష్టంతో తన భావాలను హేతుబద్ధంగా కాక చాలా ఉద్వేగపూరితంగా వ్యక్తపరిచాడు" అంటుంది అయాన్ రాండ్. ఫౌంటెన్ హెడ్‌లోని కొన్ని నీషే భావాలకు రోర్క్ పాత్ర ద్వారా అయాన్ రాండ్ హేతుబద్ధమైన తాత్విక ఆధారాన్ని చూపించింది.

వర్జీనియా టెక్ యూనివర్సిటీలోని ఇంగ్లీష్ అసోసియేట్ ప్రొఫెసర్ అయిన శోషనా మిల్గ్రామ్ అనే ఆమె తాను రాయాలనుకుంటున్న ఒక బుక్‌లో

'Fountainhead from notebook to novel:
The composition of Ayn Rand Ideal man'

అనే వ్యాసం కోసం అయాన్ రాండ్ ఫౌంటెన్ హెడ్‌కి సంబంధించిన నోట్స్, డ్రాఫ్టులను సేకరించడం వలన ఆమె ఫౌంటెన్ హెడ్‌కి సంబంధించిన కొన్ని విషయాలను బయటపెట్టింది.

"అయాన్ రాండ్ తాను ఫౌంటెన్ హెడ్ కోసం రాసుకున్న నోట్ బుక్‌లలో నీషేకి సంబంధించిన అంశాలు చాలా ఎక్కువగా కనిపించాయి. డ్రాఫ్టుకి వచ్చేసరికి చాలా తక్కువ, తుది నవలలో ఇంకా తక్కువ. అయాన్ రాండ్ తన నవలని పూర్తి చేసి, ఎడిట్ చేసేటప్పుడు ఫౌంటెన్ హెడ్‌లోని తాను ప్రతి చాప్టర్‌కి పెట్టిన నీషే కొటేషన్లను కూడా తీయడమే కాక, నీషే ఫిలాసఫీకి సంబంధించిన ఇతర అంశాలను తొలగించింది."

నీషే అప్పటివరకు మనిషి మీద నైతికత పేరిట మతాలు చెలాయించే ఆధిపత్యానికి వ్యతిరేకంగా తన విలువలను తానే రాసుకునే 'సూపర్ మాన్'ని

సృష్టిస్తే అయాన్ రాండ్ దానినుండి ప్రభావితమై పరోపకార నీతికి విరుద్ధంగా తన కోసం తానే బ్రతికే స్వార్థపూరితమైన ఐడియల్ మాన్‌ని సృష్టించింది. కానీ ఒక వ్యక్తి సృజనాత్మకమైన వ్యక్తి అయ్యి ఉంటేగాని తన విలువలు తాను రాసుకోలేడన్న నీషే మాటల్ని అయాన్ రాండ్ వదలలేదు.. అందుకే రోర్కని ఆర్కిటెక్చర్ బ్యాగ్రౌండ్‌లో పెట్టింది. ఇద్దరూ మనిషిలోని సృజనాత్మకత ద్వారా వారి వారి సొంత విలువలను సృష్టించాలని ప్రోత్సహించినవారే.

# హిట్లర్ పై నీషే యొక్క ప్రభావం

**1938**లో ఇటలీలోని బ్రెన్నర్ పాస్‌లో, ఫాసిజం వ్యవస్థాపకుడైన ముస్సోలినీతో జరిగిన సమావేశంలో హిట్లర్ అతనికి నీషే యొక్క రచనలను బహుమతిగా ఇచ్చాడు. నాజీలు తమ ప్రచారంలో నీషే యొక్క 'Super Man' మరియు 'Will to Power' వంటి పదాలకు పర్యాయ పదాలను చాలానే వాడారు.

అందులో ముఖ్యమైనది 'Thrump of Will'. హిట్లర్‌పై నీషే ప్రభావం ఎంతలా ఉంది అంటే రెండవ ప్రపంచయుద్ధంలో నీషే యొక్క 'Thus Spoke Zarathustra' బుక్‌ని లక్ష కాపీలు పంచి, అది చదివి యుద్ధానికి సిద్ధం కావాల్సింది అని తన సైన్యాన్ని ఆదేశించేదాకా.

నిజానికి ఒక మేధావిని తప్పుగా అర్థం చేసుకోకపోతే, అసలతను మేధావే కాదు. ఒకవేళ అతని మాటలు సాధారణ ప్రజలకు కూడా అర్థం అవ్వగలిగేలా ఉన్నాయంటే ఆ వ్యక్తి సాధారణ తెలివితేటలు ఉన్న స్థాయిలోనే మాట్లాడుతున్నాడని అర్థం. ఫ్రెడరిక్ నీషే చాలా తప్పుగా అర్థం చేసుకోబడ్డాడు. ఆ అపార్థం నుండి సంభవించిన నష్టం కూడా చాలా ఎక్కువే. ఆ నష్టానికి కారకుడు 'అడాల్ఫ్ హిట్లర్'.

అడాల్ఫ్ హిట్లర్ లాంటి ఒక నియంత నీషే ఫిలాసఫీని అర్థం చేసుకోగలడని అనుకోవడం అసాధ్యం. కానీ దురదృష్టవశాత్తూ అతను నీషే ఫిలాసఫీ యొక్క ప్రవక్త అయ్యాడు. నీషేని నాజీల దృష్టిలో దేవుడ్ని చేశాడు.

ప్రజలు వారి వారి ఆలోచనాపరిధుల యొక్క స్థాయిని బట్టి అర్థం చేసుకోవడం, అపార్థం చేసుకోవడం జరుగుతుంది. హిట్లర్‌కి ఉన్న జ్ఞానపరిధుల్ని బట్టి అతడు దానిని అపార్థం చేసుకున్నాడు. అపార్థం చేసుకోవడమే కాదు. ఆ ప్రకారం నడుచుకున్నాడు. అతని సైన్యాన్ని కూడా నడిపించాడు. దాని ఫలితమే రెండవ ప్రపంచ యుద్ధంలో యూదులపైన జరిగిన మారణహోమం.

నీషే నాజీల చేతుల్లోకి రావడం యాదృచ్ఛికం. ఆ సమయంలో వారికి యుద్ధానికి సంబంధించిన ఒక ఫిలాసఫీ అవసరం ఏర్పడింది. అప్పుడే వారికి

నీషే యోధునిగా ఉండడంలో ఉన్న అందాన్ని మెచ్చుకోవడం చూశారు. అప్పటికే యూదులపట్ల వ్యతిరేకత ఉన్న నాజీలకి నీషే యొక్క చెల్లి ఎలిజిబెత్ వారికి ఇంకొంచెం సాయం చేసింది. నీషే ప్రచురించకుండా ఉంచిన రచనలను డబ్బుకోసం కావొచ్చు లేక తన భర్తకి యూదులపట్ల ఉన్న తీవ్ర వ్యతిరేకతను నాజీలకు అనుకూలంగా తనదైన భాష్యం చెప్పింది. నీషే మతిభ్రమించినప్పుడు అతని రచనల కోసం ఒక మ్యూజియంనే తయారుచేసింది. దానికి హిట్లర్‌ని ఆహ్వానించింది. నీషే యొక్క ఊతకర్రని హిట్లర్‌కి బహూకరించింది. నాజీల దృష్టిలో నీషేని దేవుడ్ని చేసింది.

జర్మన్ ఆర్యన్లు వారిని వారు నీషే యొక్క సూపర్ మాన్‌లు వారే అన్నట్టు తమను తాము ప్రకటించుకున్నారు. వారు ప్రపంచంపై ఆధిపత్యం చెలాయించాలనుకున్నారు. ఒక సూపర్ వరల్డ్ క్రియేట్ చేద్దాం అనుకున్నారు. నీషే వారికి సహాయంగా ఉన్నాడనుకున్నారు. ఎందుకంటే మనిషి యొక్క లోతైన కోరిక 'Will to Power' గురించి నీషే చెప్పాడు. హిట్లర్ దానికి తనదైన భాష్యం చెప్పాడు. అదే 'Will to Dominate'. అడాల్ఫ్ హిట్లర్ మరియు అతని అనుచరులైన నాజీలు ప్రపంచానికి చాలా హాని చేశారు. వారు ప్రపంచాన్ని ఫ్రెడరిక్ నీషే ఫిలాసఫీ యొక్క నిజమైన అర్థాన్ని అర్థం చేసుకోకుండా నిరోధించారు. అంతక ముందెన్నడూ ఎవ్వరూ అపార్థం చేసుకోని విధంగా నీషే అపార్థం చేసుకోబడ్డాడు. హిట్లర్ నీషే మరియు అతని తత్వశాస్త్రం పేరిట ఎనిమిది మిలియన్లకు పైగా యూదులను చంపాడు. నిజానికి నీషే యూదులకు వ్యతిరేకం కాదు.

అతని అందమైన సూపర్ మాన్ అనే భావన మరీ ఇంత ప్రమాదకరంగా అర్థం చేసుకుంటారని బహుశా నీషే కలలో కూడా ఎప్పుడూ ఊహించి ఉండడు. నిజానికి 'Will to Dominate' అనేది 'Will to Power'కి పూర్తిగా వ్యతిరేకం. Domination / ఆధిపత్యం చెలాయించాలనే కోరిక ఒక రకమైన ఆత్మన్యూనత నుండి వస్తుంది. అందుకే అతను న్యూనతాభావంతో బాధపడడం లేదని నిరూపించుకోవటానికి, దానిని కప్పిపుచ్చుకోవడానికి అతను ఎక్కడలేని రుజువులు తెచ్చిపెట్టుకుంటాడు. ఆధిపత్యం చెలాయించడానికి ఎదురుగా ఇతరులు ఉండాలి. కానీ Will to Power వ్యక్తికి సంబంధించినది.

సూపర్ మాన్‌కి ఎటువంటి రుజువులు అవసరం లేదు. అతనికి ఎటువంటి రుజువు అవసరం లేదు. తన శక్తి సామర్థ్యాల గురించి తనకి తెలుసు. తన సృజనాత్మకశక్తి ద్వారా తనని తాను ఎలా వ్యక్తపరుచుకోవాలో తనకి తెలుసు. అతనికి ఇతరులతో పోటీ కానీ, పోలిక కానీ, పోల్చి చూసుకోవడం కానీ తెలియదు. అతనికి మరెవరితోను సంబంధం లేదు. అతని దృష్టంతా ఎప్పటికప్పుడు తనని తాను అధిగమించి ముందుకు వెళ్ళడమే. అదే అతనికి తెలిసిన మతం. అతని మతం.

# Quotations

- ప్రజలు 'సత్యం' తెలుసుకోవాలని అనుకోరు. ఎందుకంటే అది అప్పటివరకు వారు నమ్ముతున్న కల్పితకథల్ని, నమ్మకాలను పటాపంచలు చేస్తుంది కాబట్టి.
- మీ మార్గం మీకుంది. నా మార్గం నాకుంది. కానీ సరైన మార్గం, నిజమైన మార్గం అనేది ఈ ఉనికిలోనే లేదు.
- యువతను భ్రష్టు పట్టించడానికి ఖచ్చితమైన మార్గం ఏంటంటే... భిన్నంగా ఆలోచించేవారిని కాకుండా ఒకేలా  ఆలోచించేవారిని అనుసరించమని సూచించడం.
- గర్వంగా జీవించడం చేతకానప్పుడు గర్వంగా చనిపోవడం మంచిది.
- మొత్తం ఉనికిలో అత్యంత వికారమైన జంతువు 'ఒంటె'. అది బానిసగా ఉండాలని కోరుకుంటుంది. స్వేచ్ఛగా బ్రతకడానికి భయపడుతుంది. ఎందుకంటే దానికి బాధ్యతలు అంటే భయం. ఒంటె సాధ్యమైనంత ఎక్కువ బరువులు ఎత్తడానికి ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది. బరువులు మోయడంలోనే అది దాని ఆనందాన్ని వెతుక్కుంటుంది.
- మీకు మనశ్శాంతి, ఆనందం కావాలనుకుంటే అప్పటివరకు ఉన్న నమ్మకాలను గుడ్డిగా అనుసరిస్తే సరిపోతుంది. ఒకవేళ సత్యం తెలుసు కోవాలంటే శోధించండి.
- వివాహితుల మధ్య ప్రేమ లేకపోవడం వల్ల కాదు.. స్నేహం లేకపోవడం వలనే అసంతృప్తితో జీవిస్తారు.
- గెలుపు ఎప్పుడూ పెద్ద అబద్ధంతోనే సాధ్యం అవుతుంది.
- జ్ఞానం ఉన్న మనిషి తన శత్రువులను ప్రేమించడమే కాదు, తన మిత్రులను సైతం ద్వేషించగలగాలి.

- ఎక్కువమంది పురుషులు మాయని ఇష్టపడతారు. ఆ కారణంగానే అతను స్త్రీలను ప్రేమిస్తాడు.
- నైతికంగా, స్వార్థరహితంగా జీవించాలనుకోవడం.. నీ జీవితంపై నీకున్న కక్ష సాధింపు చర్యే తప్ప ఇంకోటి కాదు. అందుకే జీవితంలోని ప్రతికూల పరిస్థతుల్లో నీ ముందున్న విలువలన్నిటికీ తిరిగి విలువ కట్టవలసిన పరిస్థితులను ఎదుర్కోవడం జరుగుతుంది.
- ఈ పుస్తకం చాలా అరుదైనది. బహుశా దీన్ని అర్థం చేసుకునే మనుషులు ఇంకా పుట్టలేదు. కానీ రేపటి రోజున నా కోసం తప్పక పుడతారు.
- చాలామంది ముప్పై సంవత్సరాలకే మరణిస్తారు. కానీ డెబ్బై సంవత్సరాల తరువాత ఖననం చేయబడతారు.
- ఏదైతే నిన్ను చంపలేదో.. అదే నిన్ను శక్తివంతుడ్ని చేస్తుంది.
- మనం ఎంత ఎత్తులకు ఎగురుతామో.. అలా ఎగరలేనివారికి మనం అంత చిన్నగా కనపడతాము.
- ఒంటరిగా ఉన్న మనిషే ఇతరులకు సహాయం చేయడానికి ముందు వరుసలో ఉంటాడు.
- 'ప్రమాదకరంగా జీవించండి.' గగనతలంలో దూరంగా ఎత్తులను ఆస్వాదిస్తున్న డేగను అనుసరించండి. దేనికీ భయపడవద్దు. మీ అంతరంగ ధైర్యానికి ఎటువంటి మరణం లేదు. ప్రమాదాలకు భయపడేవారు వారి అమరత్వం గురించి తెలియనివారు. వారి భయం వారి అజ్ఞానాన్ని తప్ప ఇంకేం తెలియజేయదు. ప్రమాదపుటంచుల మీద ఇంటిని నిర్మించుకునే ఆనందం చాలా కొద్దిమంది ధైర్యవంతులకి మాత్రమే దక్కుతుంది. ప్రమాదకరంగా జీవించడానికి సిద్ధంగా ఉన్నవారు మాత్రమే సత్యాన్ని కనుగొనగలరు. వారు మాత్రమే జీవితానికి అర్థాన్ని ఇచ్చుకోగలరు.
- మనిషి ఒంటరిగా ఎందుకు నవ్వుతాడో నాకు బాగా తెలుసు.. ఎందుకంటే అతను ఒంటరిగా చాలా లోతుగా బాధపడతాడు.
- నువ్వు నాతో అబద్ధం చెప్పినందుకు నేను బాధపడడం లేదు. ఇప్పటినుండి నిన్ను నమ్మలేకపోతున్నాను చూడు... అందుకు బాధపడుతున్నాను.

- ప్రపంచం నాశనం అయినప్పుడు మాత్రమే మీకు నేను గుర్తొస్తాను. అప్పటివరకు నేనెవరో మీకు తెలియదు.
- నాకు తెలిసి ఒకేఒక్క క్రైస్తవుడు ఉండేవాడు. కానీ దురదృష్టవశాత్తు అతను సిలువ మీదే మరణించాడు.
- మంచిచెడులన్నీ ఎప్పుడో వందల సంవత్సరాల క్రితం చనిపోయినవారు సజీవంగా ఉన్నవారికి ఇచ్చినవి. ఒక రకంగా అది జీవించి ఉన్నవారిపై చనిపోయినవారి ఆధిపత్యం. గౌరవప్రదమైన ఏ వ్యక్తయినా చనిపోయినవారి చేత పరిపాలించబడడానికి తనని తాను అనుమతించడు.
- అత్యవసర పరిస్థితులకు సిద్ధంగా ఉన్న జీవితం, ఎటువంటి భయం లేకుండా ప్రమాదకరంగా జీవించగల జీవితమే నిజమైన జీవితం.
- అసూయ నుండి పుట్టిందే 'సమానత్వం'. బలవంతుడిపై బలహీనుడికి అసూయ. తెలివైనవాడిపై తెలివితక్కువవాడి అసూయ..
- నన్నొదిలేసి మిమ్మల్ని మీరు వెతుక్కోండి.. మీరంతా నన్ను కాదన్నప్పుడే నేను తిరిగి మీ ముందు ఉండేది.
- దేహాన్ని ఖండించడం అనాగరికం. ఎందుకంటే దేహాన్ని ఖండించిన వారందరూ దేహం నుండి జన్మించినవారే. వారు దేహం ద్వారా జన్మించి, దేహం ద్వారా తమ జీవితాన్ని గడుపుతూ దేహాన్ని ఖండిస్తున్నారు.
- ప్రపంచవ్యాప్తంగా శాంతిని స్థాపిస్తే అప్పుడు యుద్ధం అనేది ఉండదు. సవాళ్లు ఉండవు. మానవులు ఇంకా దుర్బలులు అవుతారు.
- బలహీనులు రాజ్యం ముసుగున బలవంతులపై మోసపూరిత మార్గాల్లో వారికంటే బలంగా ఉండటానికి ప్రయత్నిస్తూ ఉంటారు. బలహీనులు ఎప్పుడూ కపటబుద్ధితో ఉంటారు. జిత్తులమారితనం వారి రక్షణ. కపట బుద్ధితో గొప్ప చాకచక్యంతో బలహీనులు సృష్టించినదే ఈ రాజ్యం.
- రాజ్యం మందని, మనోవికాసం లేనివారిని, బలహీనులని, జీవచ్ఛవంలా జీవించేవారిని రక్షిస్తూ ఉంటుంది. రాజ్యం మనిషి యొక్క బానిసత్వానికి చిహ్నం.

- ‘ఒంటెలు పర్వతాల దగ్గరకు వెళ్లడానికి ఇష్టపడవు’ అనే సామెత ఉంది. అందువల్ల అవి పర్వతాలు ఉన్న ఎడారులలో నివసించడానికి ఇష్టపడతాయి. అందుకే పర్వతం పక్కన ఒంటెలు ఆత్మన్యూనతాభావానికి గురవుతాయి.
- నిజమైన మగాడు రెండు విషయాలు కోరుకుంటాడు: ప్రమాదం మరియు ఆట. ఆ కారణంగానే అతను స్త్రీని కోరుకుంటాడు.
- ఏకాంతంగా ఉండటానికి చేతకానివాడికే స్నేహితులు అవసరం. తన మీద నమ్మకంలేనివాడే ఇతరులని బలంగా నమ్ముతాడు. అందుకే మనిషి తనను నమ్మినవారినే ఎక్కువ నమ్ముతాడు.
- నీ ఒంటరితనాన్ని పోగొట్టుకోవడానికి నీకో స్నేహితుడు కావాలి. అలాగే అతని ఒంటరితనం పోగొట్టడానికి అతనికి నీతో స్నేహం కావాలి. ఎందుకంటే మీకు ఏకాంతంగా జీవించడమంటే భయం.
- ఒకరిపై విశ్వాసం కలిగి ఉండాలనే కోరిక నీలో ఉండే డొల్లతనాన్ని, ఎరుకలేనితనాన్ని బహిర్గతం చేస్తుంది.
- మీరు బానిస అయితే గనుక మీలో బానిస లక్షణాలు ఉంటే మరొకరికి స్నేహితుడిగా ఉండాలనే విషయం మరచిపోండి. ఒక బానిసగా ఉంటూ మీరు మీ స్నేహితుడికి విమోచకుడిగా నటించలేరు. రక్షకులు అని పిలవబడే వారి విషయంలో కూడా ఇదే వర్తిస్తుంది. వారు రక్షించబడరు. కానీ వారు మొత్తం ప్రపంచాన్ని రక్షించడానికి సిద్ధంగా ఉన్నామని ప్రగల్భాలు పలుకుతారు.
- మనిషి గతానికి చెందినవాడు కాదు. అతను భవిష్యత్తుకి చెందినవాడు. ఒకసారి మిమ్మల్ని కలుషితం చేసే, మతపరం చేసే విలువలని చూడండి. గతంలోని చదువురానివారు, నాగరికత తెలియనివారిచే ఈ కుళ్ళిన గ్రంథాలు వ్రాయబడినవి. అవే ఇప్పుడు విలువలు అనే పేరిట మీ మీద ఆధిపత్యం చెలాయిస్తున్నాయి.
- మానవుడు తనను తాను వ్యక్తపరుచుకోవడానికి మాత్రమే విలువలను సృష్టించాడు. వాటికి అర్థాన్ని ఇచ్చాడు. వాటిని తనకు ఆపాదించుకున్నాడు. అతనికి ‘మనిషి’ అని పేరు పెట్టుకున్నాడు.

- మీరు మీ పొరుగువారి కోసం పరుగెడతారు. వివాహం చేసుకుంటారు. పిల్లల్ని కంటారు. స్నేహితులను కోరుకుంటారు. ఎలాగైనా మీనుండి మిమ్మల్ని తప్పించుకోవటానికి, మీతో మీరు సంబంధాలు పెట్టుకోకుండా ఏదో ఒక పనిలో నిమగ్నమై ఉండడం కోసం ఎంత తెలివితక్కువ పనైనా చేస్తారు.
- మీరు మీ పొరుగువారి కోసం పరుగెడతారు. ఎందుకంటే మీ పొరుగువారు మిమ్మల్ని ప్రశంసిస్తారు. అలా అందరూ ఒకరినొకరు ప్రశంసించుకోవడానికి అలవాటుపడ్డారు. ప్రతి ఒక్కరూ మీరు చాలా అందంగా, చాలా ఉదారంగా, తెలివిగా, నిబద్ధతగా, ధర్మంగా ఉన్నారని స్తుతిస్తూ అదే అభినందనలు మీకు తిరిగి వస్తాయని ఆశిస్తూ ఉంటారు. ఆ ఆనందంతో ప్రతి ఒక్కరూ చాలా సంతోషంగా ఇంటికి వెళతారు.
- ఏకాంతంగా ఉండగలిగే వారికి మాత్రమే స్వేచ్ఛ అవసరం.
- లక్ష్యం అనేది అన్వేషకునికి ఒక వంక మాత్రమే. ఎందుకంటే ఒక లక్ష్యాన్ని చేరుకున్నప్పుడల్లా, వెంటనే అతను ఇంకో లక్ష్యం దిశగా కొత్త ప్రయాణానికి సిద్ధమవుతాడు. అన్ని లక్ష్యాలు మానవుడ్ని అన్వేషకుడిగా ముందుకు నడిపించడానికి మాత్రమే సహాయపడతాయి.
- అన్వేషకునికి నిజమైన ఆనందం లక్ష్యం యొక్క గమ్యాన్ని చేరడంలో ఉండదు. అతని నిజమైన ఆనందం దానిని ఛేదించడానికి చేసే కఠినమైన, ప్రమాదకరమైన ప్రయత్నంలోనే ఉంటుంది. ఒక్కసారి ఆ లక్ష్యాన్ని ఛేదించాకా అతను ఇంకో లక్ష్యాన్ని కొత్త సాకుగా కనుగొంటాడు.
- సరైన సమయంలో మరణించండి.
- పూర్తి తీవ్రతతో ఆనందంగా, ముఖం మీద చెరగని చిరునవ్వుతో, జీవితాన్ని అనుక్షణం ప్రేమిస్తూ, వారి సొంత జీవనవనరుల ప్రకారం తనలోని సృజనాత్మకతశక్తిని ఉపయోగించుకుంటూ ఆనందంగా జీవించేవాడు మాత్రమే సరైన సమయంలో చనిపోవడానికి అర్హుడు.
- 'దేవుడు' అనే ఆలోచన మనిషి నుండి విలువైన ప్రతిదాన్ని తీసివేసింది. అది స్వేచ్ఛ అనే ఎంతో గొప్ప విలువను మానవాళి నుండి తీసివేసింది. కేవలం ఒక కల్పితమైన దానికోసం మానవుడు తన జీవితంలో అందంగా ఉన్నవన్నీ నాశనం చేసుకున్నాడు.

- మానవుడు ఉన్నతమైన దానికోసం తనలో ఉన్న పాతవాటిని త్యాగం చేయనివ్వండి. అతను ఉన్నతంగా మార్పు చెందడానికి మాత్రమే అతను తనలో ఉన్న పాతవాటిని చంపేస్తాడు.
- ఉయ్యాల నుండి సమాధి వరకు మానవుడు నేర్చుకున్నది కేవలం ఎలా సురక్షితంగా మనుగడ సాగించాలని మాత్రమే. సమాధికి చేరుకోక ముందే ఆనందంతో పాడండి. నృత్యం చేయండి. ప్రమాదకరంగా జీవించండి. జీవితాన్ని పండుగగా చేసుకోండి. మీరు ప్రమాదకరంగా జీవిస్తున్నా లేదా మోస్తరుగా మనుగడ సాగిస్తున్నా వచ్చే మరణం రాక తప్పదు.
- ప్రజలు స్వేచ్ఛ గురించి మాట్లాడుతారు. వాదోపవాదాలకు దిగుతారు. కానీ స్వేచ్ఛను మాత్రం కోరుకోరు. ఎందుకంటే స్వేచ్ఛ ప్రమాదాలను తెచ్చి పెడుతుంది. బానిసత్వం చాలా సౌకర్యవంతంగా ఉంటుంది. ఎందుకంటే మీ జీవితానికి సంబంధించిన పూర్తి బాధ్యతలు మరొకరు తీసుకుంటారు కాబట్టి.
- అసాధ్యమైన సవాళ్ళను అంగీకరించకపోతే మానవాళికి వారి గొప్పతనం ఏంటో ఎన్నటికీ తెలియదు. 'అసాధ్యం' మాత్రమే మానవుడ్ని ఉన్నత శిఖరాలకు తీసుకెళ్తుంది. సూపర్ మాన్‌ని చేస్తుంది. ఎవర్ని వారు అధిగమించి ముందుకు వెళ్ళాలి. పాత ఆలోచనల్ని, కల్పిత కథల్ని, ఊహల్ని ఇప్పటివరకు మీ వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దిన సిద్ధాంతాల్ని, పాము తన కుబుసాన్ని విడిచిన విధంగా గతాన్ని విడిచి వెనక్కి తిరిగి చూడకుండా ముందుకు సాగాలి. తనను తాను అధిగమించి ముందుకి వెళ్తే తప్ప అసాధ్యాన్ని, శోధించడంలో ఉన్న స్వచ్ఛమైన ఆనందాన్ని ఆస్వాదించలేడు మానవుడు.
- మీరు ఎంత ఎక్కువగా ఆ అగాధాలవైపు తొంగిచూస్తారో, మీ చుట్టూ ఉన్న అగాధాలు మీ లోతుల్లోకి అంత ఎక్కువగా తొంగిచూస్తాయి.
- మీకు ఎటువంటి లక్ష్యం లేకపోతే, మీరు ఎక్కడికీ చేరుకోవాలనుకోకపోతే, అన్వేషించడమే మీ మతం అయితే ఆనందానికి–బాధకి, అగాధాలకి–శిఖరాలకి ఎటువంటి తేడా ఉండదు. ఆ రెండూ ఒక్కటవుతాయి.
- మనిషిగా ఉండటానికి చాలా ధైర్యం కావాలి. ఎందుకంటే మనిషిగా ఉండడం అంటే నిరంతరం తనని తాను అధిగమించే ప్రక్రియలో ఉండడమే.

- ధైర్యం ఎటువంటి పిరికితనాన్నైనా సులభంగా చంపగలదు. దేన్నైనా ఎదుర్కోగలదు. అది ఉత్తమ హంతకుడు. మనిషి అత్యంత సాహసోపేతమైన జంతువు. అందుకే అతను ప్రతి జంతువును అధిగమించాడు. మొండి తనంతో ఆడుతూ పాడుతూ ప్రతి బాధను అధిగమించాడు. ధైర్యం.. అగాధాల అంచునున్న మానవుని మైకాన్ని, పిరికితనాన్ని కూడా చంపుతుంది. ధైర్యం జాలిని కూడా చంపుతుంది. కానీ జాలి అనేది లోతైన అగాధం. మనిషి జీవితంలోకి ఎంత లోతుగా తొంగిచూస్తాడో.. అతను బాధల్లోకి కూడా అంతే తొంగిచూస్తాడు. ధైర్యం మరణభయాన్ని కూడా చంపుతుంది. ఆ ధైర్యానికి దేన్నైనా ఎదుర్కొనే మొండితనం ఉంది.
- అసాధ్యమైనవాటిని శోధించడం ద్వారా మాత్రమే ఎవర్ని వారు కనుగొన గలరు. ఎవరి శక్తి సామర్థ్యాలు వారికి తెలుస్తాయి. ఆ గొప్ప కోరిక మాత్రమే మానవాళిని అన్ని మానవపరిమితుల కంటే ఎక్కువ స్థాయిలో ఉంచగలదు. అది మాత్రమే మానవాళిని ఇప్పటివరకు కలుషితం చేసిన అన్నిటి నుండి పరిశుద్ధపరచగలదు.
- ప్రార్థించడం పిరికితనంతో సమానం. సహాయం కోసం ప్రార్థించడం అంటే మీరు లొంగిపోతున్నారని, మీ శక్తి సామర్థ్యాలను మీరే అవమాన పరుస్తున్నారని అర్థం. ప్రార్థించడం చాలా నీచమైనది.
- మీ లోపల 'పిరికితనం' అనే దెయ్యం ఉంది. అది కష్టసమయాల్లో దేవుడు ఉన్నాడని మిమ్మల్ని బలవంతపెట్టేలా, తన ముందు మోకరిల్లేలా చేస్తుంది. దెయ్యం మీ పిరికితనానికి చిహ్నం. మీ పిరికితనమే దేవుణ్ణి కనిపెట్టింది. మిమ్మల్ని రక్షించడానికి, మీకు తండ్రిగా ఉండటానికి ఒక దేవుడు అవసరం అయ్యాడు.
- నేను మనిషిని ప్రేమిస్తున్నాను. అదే మనిషిని ద్వేషిస్తున్నాను కూడా. మనిషి తనకు మించిన శక్తి సామర్థ్యాలు ఉన్నందున నేను అతన్ని ప్రేమిస్తున్నాను. మనిషి తన శక్తి సామర్థ్యాల్ని ఎప్పుడూ ఉపయోగించుకోలేదు కాబట్టి నేను అతన్ని ద్వేషిస్తున్నాను.
- 'అధిగమించండి.. కానీ ఎప్పటికీ త్యజించవద్దు. ఎందుకంటే త్యజించి నట్లయితే అధిగమించడానికి మానవునికి సవాళ్లనేవే ఉండవు.'

- ‘శక్తి సంకల్పం’ అంటే తనని తాను మరింత శక్తివంతంగా, మరింత ప్రకాశవంతంగా, మరింత బలంగా, మరింత సమగ్రవ్యక్తిగా మలుచు కోవడమే.
- పిరికివాళ్ళు ‘నిస్వార్థత’ ని గొప్ప ధర్మంగా ఉండాలని భావిస్తారు. ఎందుకంటే నిస్వార్థంలో పిరికివారే విజేతలు అవుతారు కాబట్టి.
- ఆత్మ యొక్క గురుత్వాకర్షణ శక్తితో పోరాడడానికి ఎప్పటికప్పుడు మిమ్మల్ని మీరు అధిగమించుకుంటూ కొత్త కొత్త పర్వతాలను అధిరోహించే సాహసికుడిగా ఉండండి. కానీ మానవుడు ధైర్యంగా, ప్రమాదకరంగా జీవించడం ఎలాగో మరచిపోయాడు. ఇప్పుడు అతను ఎలా జీవించాలో కాదు.. ఎలా మనుగడ సాగించాలో మాత్రమే నేర్చుకుంటున్నాడు.
- మీ పొరుగువారిని మిమ్మల్ని మీరు ప్రేమించే విధంగా ప్రేమించ బోతున్నట్లయితే మీరు అతన్ని ద్వేషిస్తారు. ఎందుకంటే చాలా ఏళ్లుగా మీ మతాలు మీకు బోధిస్తున్నది అదే.
- నిజమైన మానవుడే ప్రతిదానిపట్ల విపరీతమైన అసంతృప్తితో ఉంటాడు. అసంతృప్తి లేకుండా పురోగతి లేదు. అసంతృప్తి లేకుండా పెరుగుదల లేదు.
- అన్ని మతాలు శాశ్వత విలువలపై ఆధారపడి ఉన్నాయి. స్థిరమని భావించే ఆ విలువలు రాబోవు తరాల వారికోసం కూడా ఎప్పుడో సృష్టించబడ్డాయి. జీవితం మారుతూ ఉంటుంది. కానీ విలువలు స్థిరంగా ఉంటాయి. అవి మనిషి మనస్సులో భయంకరమైన ఒత్తిడిని కలుగజేస్తాయి. కానీ అతను ఆ విలువలను అనుసరిస్తే ప్రస్తుత కాలానికి సమకాలీనుడు అవ్వడు. అప్పుడు మానవుడు ఉనికితో తనకున్న సంబంధాన్ని కోల్పోతాడు. ఒకవేళ అనుసరించకపోతే అతను నేరం చేసినట్లు అపరాధభావానికి గురవుతాడు. మానవుడి జీవితం ఈ శాశ్వతవిలువల మధ్య బిక్కుబిక్కుమంటూ, భయం భయంగా తిరుగుతూ ఉంటుంది. అతను ఎక్కడున్నా, ఏం చేస్తున్నా అర్థ హృదయంతో చేస్తాడు. ఇక్కడ ఎన్ని మారుకుంటూ వచ్చినా మారనిది ఒక్కటే: ‘మార్పు..’.

- చాలా సంవత్సరాల క్రితం జీవించిన ప్రజలకు భవిష్యత్తులో జీవితం ఎలా ఉంటుందో తెలియదు. వారు వారి విలువలను వారి సమయానికి అనుగుణంగా మాత్రమే నిర్ణయించుకున్నారు. గత విలువల ప్రకారం భవిష్యత్తు మానవుడు ఏమాత్రం మనుగడ సాగించలేడు. భవిష్యత్తు మనుగడ సాగించాలి అంటే గతం మరణించాలి.
- సాధువులలో ఉన్న గొప్ప ఏమిటో మీరెప్పుడైనా ఆలోచించారా? ముప్పై రోజులు ఎలా ఉపవాసం చేయాలో తెలియడం వారి గొప్ప. ముళ్ళమంచం మీద గంటవరకు పడుకొని ఉండడం వారిలో ఉన్న గొప్ప. జీవితపు సవాళ్ళని ఎదుర్కోలేక ప్రజలకు, ప్రపంచానికి దూరంగా గుహలలోకి, పర్వతాలలోకి పారిపోవడం వారి గొప్ప. ఈ పిరికివారు.. మీ జీవితాన్ని నిర్దేశించేవారు.. వారు మీరు ఆరాధించేవారు..!
- జీవితం ఒక ప్రవాహం వంటిది. ప్రతిదీ నిరంతరం మారుతూ ఉంటుంది. మారనిది ఏదైనా మరణిస్తుంది. మార్పు అంటే జీవం ఉన్నది. శాశ్వతత్వం అంటే మరణం.
- అబద్ధాలు చాలా తియ్యగా, చాలా అనుకూలంగా, చాలా సౌకర్యంగా ఉంటాయి. కానీ సత్యానికి రాజీపడడం తెలియదు. ఎవరైనా సత్యం ప్రకారం మారవలసి ఉంటుంది. ఎవరి సౌలభ్యం కోసమో సత్యం మారదు. అబద్ధాలు సౌలభ్యం ప్రకారం మార్చడానికి సిద్ధంగా ఉంటాయి. అందువల్ల అబద్ధాలు మానవాళిని అధిగమించాయి.. వారిపై ఆధిపత్యం చెలాయించాయి.
- ఒక్కసారి మిమ్మల్ని మీరు తెలుసుకున్న తరువాత మీరిక శాశ్వతంగా మేల్కొనే ఉంటారు.
- అది ఇప్పటికీ ప్రపంచంలో అతి పెద్ద మతంగా గుర్తించబడుతుందంటే అది కేవలం మానవాళి యొక్క దురదృష్టం మాత్రమే.
- చాలా సాధారణమైన అబద్ధం ఏమిటంటే... మనిషి తనను తాను మోసం చేసుకోవడం.
- మీరు నా అభిప్రాయాలను అంగీకరించడం చాలా కష్టం. అలాగే ఆ అభిప్రాయాలకు గల కారణాలను తెలుసుకోవడం ఇంకా కష్టం..

- అన్ని సమయాలలో ప్రశంసలు మాత్రమే పొందాలనుకునే దేవుడ్ని నేను నమ్మలేను.
- ఒకరు ఎలా బలపడతారు? సంకల్పించడం ద్వారా.... సంకల్పించిన తర్వాత దానిని గట్టిగా పట్టుకోవడం ద్వారా.. మిగతావన్నీ వాటంతట అవే వాళ్ళని అనుసరిస్తాయి..
- మీ కోసం వంతెనను ఎవరూ నిర్మించలేరు.
- మీరే దానిని నిర్మించుకుని దానిపై మీ జీవితప్రవాహాన్ని కొనసాగించాలని...
- భీతిగొలిపే అగాధాలు లేకుండా అందమైన ఉపరితలాలనేవి ఉండవు..
- ఏదో ఒక రోజు ఎగరడం నేర్చుకోవాలి అనుకునేవారు మొదటగా నిలబడటం నేర్చుకోవాలి, నడవడం నేర్చుకోవాలి, పరిగెత్తడం నేర్చుకోవాలి, పర్వతాలని అధిరోహించడం నేర్చుకోవాలి, నృత్యం చేయడం నేర్చుకోవాలి.
- వివాహం చేసుకునేటప్పుడు వృద్ధాప్యంలో కూడా మీరు మీ భాగస్వామితో బాగా సంభాషించగలరని నమ్ముతున్నారా అని మిమ్మల్ని మీరు ఒకసారి ప్రశ్నించుకోండి..
- వ్యక్తులలో పిచ్చి చాలా అరుదు.  కానీ సమూహాల్లో అదొక నియమం.
- నేను ఇంకా జీవిస్తున్నాను. నేను ఇంకా ఆలోచిస్తున్నాను. నేను ఇంకా జీవించాలి. ఎందుకంటే నేనింకా ఆలోచించాలి.
- ఇతరులు మొత్తం పుస్తకాలలో చెప్పాలనుకున్న దానిని పది వాక్యాలలో చెప్పడమే నా ఆశయం.
- డాన్స్ ఎలా చేయాలో తెలిసిన దేవుడ్ని మాత్రమే నేను నమ్ముతాను.
- ఆత్మహత్య గురించి ఆలోచించడం వల్ల ఓదార్పు దొరుకుతుంది..
- ఒక మత వ్యక్తితో పరిచయం ఏర్పడిన తరువాత నేను వెంటనే చేతులు శుభ్రం చేసుకుంటాను..
- వాగ్నేర్ అసలు మనిషా..? లేక రోగగ్రస్థుడా? అతను తాకిన ప్రతిదాన్ని కలుషితం చేసాడు. సంగీతాన్ని కూడా అనారోగ్యానికి గురిచేశాడు.
- నైతికత అనేది వ్యక్తిలో మంద–స్వభావం.

- ❖ భయం నైతికతకు తల్లి.
- ❖ ఉన్నతస్థాయి విలువలెప్పుడు మంచి చెడులకు అతీతంగా ఉంటాయి.
- ❖ సుఖాలను ఎన్ని రకాలుగా వీలైతే అన్ని రకాలుగా, సాధ్యమైనంత తీవ్రతతో ఆస్వాదించండి. అవి విరక్తి కలిగేలా ఆస్వాదించండి. అప్పుడు ఇంద్రియ సుఖాల ప్రపంచం పూర్తయింది తరువాత నేను దేనిని అధిగమించాలనే ప్రశ్న మీలో తలెత్తుతుంది.
- ❖ విలువలు స్థిరమైనవి కావు. కానీ ఎప్పుడైతే విలువలకు అనుగుణంగా మానవుడు మనుగడ సాగించాలని కోరుకుంటాడో అప్పుడు అతను తన జీవితాన్ని చేజేతులా తాను నాశనం చేసుకుంటున్నట్టే.
- ❖ ప్రతి వ్యక్తికి తనదైన నైతికత, తనదైన మంచిచెడు ఉండాలి. ప్రపంచం యొక్క అన్ని విషయాలపట్ల సంతృప్తిగా ఉన్నవారు మానవులు కాదు.. వారు గేదెలు. గేదెలు అన్నింటికి సంతృప్తికరంగా ఉంటాయి. గేదెలు అసంతృప్తిగా, విచారంగా, నిరాశతో ఉండవు.. అవి ఎప్పుడూ సంతృప్తికరం గానే ఉంటాయి. ఆ గేదెలే సాధువులుగా జన్మించారు.



ఫ్రెడ్రిక్ నీషే విగ్రహం వైపు తీక్షణంగా చూస్తున్న అడాల్ఫ్ హిట్లర్ యొక్క ఈ ఫోటో నాజీలకు పరోక్షంగా తమ నాయకుడి యొక్క భయానక భావజాలాల వెనుక ఎటువంటి రాజీలు లేని అసాధారణమైన నీషే వంటి గొప్ప తాత్వికుడి ప్రేరణ ఉందని బలంగా విశ్వసించిన క్షణానికి తార్కాణం ఇది.

**అడాల్ఫ్ హిట్లర్ చేతిలో మారణాయుధమై..**

**అయాన్ రాండ్ చేతిలో అమృతభాండమైన..**

**ఫ్రెడ్రిక్ నీషే ఫిలాసఫీ... తెలుగులో.. "సూపర్ మాన్"**

"ఒంటెలాంటోడు మనిషి. తనకుతానే మోకరిల్లి తన భుజాలపై అనవసరమైన బరువులు ఎక్కించుకుని ఆ తరువాత బతుకు భారమైపోయిందని ఏడుస్తాడు"

–ఫ్రెడ్రిక్ నీషే